భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

డిశంబరు 1962

సంపుటము 39 : : సంచిక 12

విడిప్రతిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

డిశంబరు 1962


చైనా దురాక్రమణ గాథ

పరిశీలక్

భారతదేశంమీద కమ్యూనిస్టు చైనా దురాక్రమణ కొనసాగించడమనేది ఇరవయ్యోశతాబ్దం చరిత్రలో ప్రధానఘట్టం, చైనాలో బలమైన కేంద్రప్రభుత్వం ఏర్పడినప్పుడు, సామ్రాజ్య విస్తరణకు అది ప్రయత్నించడమనేది దానిచారిత్రక సంప్రదాయంగా వుంది. అయినప్పటికి చైనాసైన్యాలు ఇంతవరకు ఏనాడూ హిమాలయ హద్దులనుదాటి భారత భూభాగంలోకి అడుగుపెట్టిన సందర్భంలేదు. కాని ఇప్పుడు కమ్యూనిస్టు ప్రభుత్వం అధ్వర్యాన చైనాసైన్యాలు భారత భూభాగంలో ప్రవేశించాయి. చైనా— భారతదేశాలమధ్య కొన్ని వేలసంవత్సరాలుగా సాంస్కృతికమైన సన్నిహిత సంబంధంవుంది. ఈ రెండింటిమధ్య ఏనాడూ యుద్ధం అనేది సంభవించలేదు. కాని ప్రపంచంమొత్తంమీద జన బాహుళ్యం కలిగిన, ఆసియాఖండంలో విశాల దేశాలుగావున్న భారత— చైనాలమధ్య యుద్ధమనేది ఇప్పుడు జరిగింది. భారతదేశం ఒక సమైక్య జాతిగా మరొక పొరుగుదేశంతో పోరాడిన సందర్భాలు దానిసుదీర్ఘ చరిత్రలో కానరావు. కాని ఈనాడు, అది స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న పదిహేను సంవత్సరాలకే, ప్రజాస్వామిక వ్యవస్థ శైశవదశలో వుండగానే, ఆర్థికాభివృద్ధికినాంది ప్రస్తావన జరుగుతున్నసమయంలో, పొరుగునవున్న కమ్యూనిస్టు చైనాతో సరిహద్దులకు సంబంధించిన యుద్ధం తప్పనిసరి అయింది. ఇలాంటి యుద్ధాన్ని నివారించాలని కమ్యూనిస్టుచైనాతో భారతదేశం ఆదినుంచి స్నేహంగావుంటూవచ్చింది. శాంతి, సుహృద్భావాలను కాంక్షించింది. బ్రిటిష్ ప్రభుత్వంద్వారా చైనా సరిహద్దుల్లోని హిమాలయరాజ్యం టిబెట్‌లో తనకు సంక్రమించిన హక్కులను వదులుకున్నది. ప్రపంచ ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఐక్యరాజ్యసమితిలో కమ్యూనిస్టుచైనాకు ప్రాతినిధ్య మివ్వాలని కోరుతూవచ్చింది. చైనాతో వర్తక వాణిజ్యాభివృద్ధి ఒడంబడికను "పంచశీల" సూత్రాలు ఆధారంగా కుదుర్చుకున్నది. చివరకు అయిదేళ్ళుగా సరిహద్దుల్లో కమ్యూనిస్టుచైనా చేస్తూవచ్చిన ఆక్రమణల సంగతిని భారతప్రభుత్వం రహస్యంగా వుంచింది. సరిహద్దుల్లోని గస్తీదళాలమధ్య సంఘర్షణలు జరిగినప్పుడుకాని కమ్యూనిస్టుచైనా నిజస్వరూపం బయటపడలేదు. దానిమిత్రద్రోహ విధానం భారతప్రజలకు పూర్తిగా తెలియలేదు. స్నేహ సుహృద్భావాలు నటిస్తూ ఒక కమ్యూనిస్టుదేశం ఎంతగా నమ్మకద్రోహం చేయగలదో ఆసియా చరిత్రలో ప్రథమంగా నిరూపించింది కమ్యూనిస్టుచైనా.

చైనా భారతదేశాలమధ్య సుమారు 2500 మైళ్ల పొడవు సరిహద్దువుంది: ఇందులో పశ్చిమమున జమ్మూ-కాశ్మీర్‌కు చెందిన లడక్‌కు— చైనాకు చెందిన సింకియాంగ్—టిబెట్‌లకు మధ్యవున్న సరిహద్దుపొడవు 1100 మైళ్ళు. తూర్పున అస్సాం— ఈశాన్య ఏజెన్సీ (నీఫా)కి, చైనాకుమధ్య వున్న సరిహద్దుపొడవు సుమారు 800 మైళ్లు. మధ్యలో పంజాబు, యు. పి. నేపాల్, భూటాన్, సిక్కింలకు చైనాకు మధ్యవున్న సరిహద్దుపొడవు సుమారు 600 మైళ్ళు. ఈ సరిహద్దులు ఈనాడు ఏర్పడినవికావు. చారిత్రకంగాను, సాంప్రదాయం రీత్యాను, వాడకంవల్లను నిర్దిష్టంగా రూపొందినవి :

చారిత్రకంగా చూస్తే, చిరకాలంగా హిమాలయాలు భారత ఉత్తర సరిహద్దుగా వున్నాయి: ప్రాచీన భారత పురాణాలలోను, సాహిత్యంలోను హిమాలయాలు, దానివర్ణన వుండడాన్నిబట్టి, ఈ ప్రాంతాలతో భారతదేశం సన్నిహితత్వం ధృవపడుతున్నది. లడక్‌ను పాలించిన రాజులు హిందువులు. తాము శాక్య వంశజులమని చెప్పుకున్నారు. పంజాబులోని స్పితీలోయను పాలించిన హిందూరాజులవంశ నామము "సేనులు". అస్సాం, నీఫా ప్రాంతాలలో కామరూప సామ్రాజ్యం కలదని, అది హిందూ రాజ్యమని ఆనాడు భారతదేశానికివచ్చిన చైనాయాత్రీకుడు హ్యూయాన్ త్స్యాంగ్‌కూడా అంగీకరించాడు. సరిహద్దులలో నివసించే ఆదివాసులైన మూంబా, ఆకా, దాఫ్లా, మిరి, అబోర్, మిష్మితెగలవారు అస్సాంలోని కొండతెగలకు సన్నిహితులుగా వున్నారు. వాడకం, సాంప్రదాయం రీత్యాచూచినా, ఈ సరిహద్దు ప్రాంతాలమీద చిరకాలంనుంచి భారతప్రభుత్వాధికారమే చెల్లుతున్నది. టిబెట్‌కాని, చైనాకాని ఏనాడు ఈ ప్రాంతాలలో తన అధికారాన్ని చెలాయించలేదు. కనుకనే చైనా— భారత దేశాలమధ్య వున్నసరిహద్దు సాంప్రదాయకమైనది, శాశ్వతమైనది.



చైనాదురాక్రమణగాథ

శతాబ్దాలుగా సుప్రసిద్ధమైన ఈ సాంప్రదాయిక సరిహద్దులకు నిర్దుష్టమైన కొన్నిరేఖలున్నాయి. ఆయా ప్రాంతాలనుబట్టి కొన్నిచోట్ల హిమాలయ శిఖరాలు, మరి కొన్నిచోట్ల జలాశయాలు, ఇంకాకొన్నిచోట్ల ఖచ్చితమైన అంతర్జాతీయ ఒడంబడికలు ఆధారంగా వున్నాయి.

ఈశాన్య ప్రాంతాలలోని సాంప్రదాయిక సరిహద్దులను గురించి 1913 అక్టోబరునుంచి 1914 జులై వరకు సిమ్లాలో చర్చలు జరిగాయి : చైనా, టిబెట్, భారతప్రభుత్వాల సర్వాధికార ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ త్రైపాక్షిక సమావేశంలో కొన్నితుదినిర్ణయాలు జరిగాయి. భూటాన్‌కు తూర్పుగా టిబెట్— భారతదేశాలమధ్య సరిహద్దును గురించి 1914 మార్చినెలలో టిబెట్— భారత ప్రతినిధులు కొన్ని అధికార పత్రాలను మార్చుకొని ధృవపరచుకున్నారు. సరిహద్దులకు సంబంధించిన చిత్రపటాలను సిద్ధంచేసి, వానిమీద సరిహద్దు రేఖలను గుర్తుపెట్టి సంతకాలుచేసి, అధికారముద్రలువేశారు. ఆ తర్వాత అధికార పూర్వకమైన లాంఛనాలతో ధృవపత్రాలుఇచ్చి పుచ్చుకున్నారు. ఈ చర్చలలో చైనా, టిబెట్ ప్రతినిధులు సమానహోదాతో సర్వాధికార ప్రతినిధులుగా వ్యవహరించారనేది గమనార్హం. (ఈనాటి వివాదంలో టిబెట్‌ను కబళించిన కమ్యూనిస్టు చైనా తానే టిబెట్ ప్రతినిధిగా వ్యవహరిస్తూ తగాదా చేస్తున్నది.) ఈ సమావేశాలలో పాల్గొన్న బ్రిటిష్ ప్రతినిధిపేరు మెక్‌మాహన్. ఆయనద్వారా సరిహద్దుల చిత్రపటాల్ని తయారైనందున ఈశాన్య సరిహద్దు రేఖకు మెక్‌మాహన్‌రేఖ అనే పేరు వచ్చింది. ఈ సరిహద్దులకు సంబంధించిన ఒడంబడికను సిమ్లా ఒప్పందం అన్నారు.

ఈ ఒప్పందం ప్రకారం నిర్ణయమైన మెక్‌మాహన్‌రేఖ అనేది హిమాలయ పర్వత శిఖరాలమీదఉంది. ఉత్తరానఉన్న టిబెట్ పీఠభూమిని, దక్షిణానఉన్న భారత భూభాగాన్ని వేరు చేస్తున్నది. అయితే ఈ మెక్‌మాహన్‌రేఖ "చట్టవిరుద్ధమని" ఆనాటి భారత పాలకులైన బ్రిటిష్ సామ్రాజ్యవాదులు బలవంతంగా ఈ రేఖను నిర్ణయించారని కమ్యూనిస్టు చైనా ఇప్పుడు వాదిస్తున్నది. తమ నిర్వచనం ప్రకారం ఈ మెక్‌మాహన్‌రేఖ భారత భూభాగంలో ఇంకా కిందగా ఉండాలని చెబుతున్నది.

భారత—చైనా సరిహద్దులకు సంబంధించిన మధ్య రంగంలో పంజాబు, హిమాచల్‌ప్రదేశ్ సరిహద్దులు ఉన్నాయి. యు. పి. టిబెట్‌లమధ్య సట్లెజ్ నది జలస్థావరాలు ఒక వైపున, గంగానది జల స్థావరాలు (కాళి, అలకనందా, జడ్‌గంగా) మరొకవంక ఆధారంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఉన్నత హిమాలయ శిఖరాలు 17,000 అడుగుల ఎత్తున, అక్కడక్కడా కనుమలతో ఉన్నాయి. ఇక్కడ జలాధారాల ననుసరించి ఈ సరిహద్దు కూడా సాంప్రదాయికము, సుప్రసిద్ధము. ఇక్కడ ఉన్న గార్వాల్ జిల్లా రెవెన్యూ రికార్డులనుబట్టి చూస్తే 1850 నుంచి కూడా దీనిలో మార్పులేదు. చివరకు 1958 వరకు ఉన్న చైనా దేశ పటాలు కూడా ఈ చిరకాల సరిహద్దునే చూపుతున్నాయి. కాని, ఇక్కడ జలాధారాలు, వాటి ఉనికి, వానికి సంబంధించిన ప్రాంతాల పేర్లను గురించి కమ్యూనిస్టు చైనా ఇప్పుడు తగాదా తెచ్చింది. నిలాంగ్, జాదాంగ్, బారాహోతి, లోప్సాన్, సంఘామల్లా అనే ప్రాంతాలు తమకు చెందాలన్న వాదన చేస్తున్నది.

హిమాచల్‌ప్రదేశ్—చైనాల మధ్య సరిహద్దు సట్లెజ్ నదికి తూర్పున, పడమటఉన్న ఉపనదుల జల స్థావరాలను బట్టి ఏర్పడుతున్నది. పంజాబు—చైనాలమధ్య సరిహద్దుకు పారుచు, స్పితిలోయ జలస్థావరాలు ఆధారంగా వున్నాయి. ఇక్కడకూడా జలస్థావరాల నిర్వచనం, ఉనికి, అందుకు సంబంధించిన ప్రాంతాల పేర్లు వివాదాస్పదంగా ఉన్నాయి.

లడక్—టిబెట్‌ల మధ్య సరిహద్దు 1842 లో నిర్ణయమైంది. కాశ్మీర్, టిబెట్, చైనా ప్రతినిధులు కలిసి దీనిని నిర్ణయించుకున్నారు. ఒప్పందం చేసుకున్నారు. తమ మధ్య అందరికీ తెలిసిన సరిహద్దులు ఉన్నందున "పూర్వంనుండీ వస్తున్న సరిహద్దులు" అని దానిలో పేర్కొన్నారు. కాని, లాంఛనప్రాయంగా సరిహద్దు రేఖను గీయలేదు. సరిహద్దులు సరిగ్గా, స్పష్టంగా ఉన్నందున ఇక అదనపు చర్యలు అవసరంలేదని 1847 లో చైనా ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వానికి తెలియజేసింది. ఆ తర్వాత ఈ ప్రాంతాన్ని భారతీయ అధికారులు సర్వే చేశారు. అలా సేకరించిన సమాచారంతో 1893 లో 1917 లో 1919 లో అధికార పూర్వకమైన దేశ పటాలను ప్రకటించారు. ఈనాడు అధికారపూర్వకంగా భారత ప్రభుత్వం ప్రకటించే పటాలకు వీనికి తేడా లేదు.

ఈ పటాల ప్రకారం లడక్—సింకియాంగ్—టిబెట్‌ల మధ్య సరిహద్దు పొడవు 1100 మైళ్ళు. ఈ సరిహద్దు లడక్‌లో ఉత్తరంగా ముస్తాగ్, అఘిల్‌కు అవతలగా వస్తూ, దక్షిణంగా తిరిగి సెంకియాంగ్ సరస్సులలోకి ప్రవహించే పెక్కు నదుల జల స్థావరాలకు మీదుగా వచ్చింది. లోనక్‌గుండా వెడుతూ, చాంగ్‌చెన్మో నీటి స్థావరాలకు తూర్పు, దక్షిణ దిశలుగాను, ఛుమెసాంగ్ జల స్థావరానికి దక్షిణంగాను పోయింది. అటుపైన ఛుమెసాంగ్ నది దక్షిణ ఒడ్డుకు, చాంక్‌యింగ్ లుంగ్పా

తూర్పు హద్దుకు, పాంగోంగ్ సరస్సు తూర్పు, పడమటికొనకు అనుకుంటూ ఆంగ్‌నదీ జలస్థావరాలను బట్టిపోతూ స్పాంగుర్ సరస్సు మధ్యగాపోయి సింధునది స్థావరాలకు ఉత్తరంగాను, వాయవ్యంగాను వెళ్లింది. ఛాంగ్లానుండి కైలాసశ్రేణిమీదుగాను, సట్లెజ్, పారాచూనదీ జలాల స్థావరాలకు ఉత్తర హద్దుగాను పోయిన ఈ సరిహద్దురేఖ ఈశాన్యకొనకంటాపోయి, మెక్‌మాహన్‌రేఖను అందుకుంటున్నది. ఇది చిరకాలంగా చైనా—భారత దేశాలమధ్యఉన్న సాంప్రదాయసిద్ధమైన సరిహద్దు. ఈ సరిహద్దులనే కాదంటూ, కమ్యూనిస్టుచైనా ఇప్పుడు రక రకాల వాదనలు చేస్తూ, చివరకు యుద్ధం ప్రారంభించింది.

1949 అక్టోబరులో ఏర్పడిన కమ్యూనిస్టు చైనా ప్రభుత్వాన్ని 1949 డిశంబరు 30 వ తేదీన భారత ప్రభుత్వం గుర్తించింది. 1954 జులైవరకు చైనా, భారత ప్రభుత్వాల మధ్య రక రకాల సమాలోచనలు, ఒప్పందాలు జరిగాయి. చైనా ప్రధాని భారత దేశానికి వచ్చాడు. భారత ప్రధాని చైనాను సందర్శించారు. కాని, సరిహద్దులకు సంబంధించిన వివాదమనేది ఉన్నట్టుగా ఈ అయిదేళ్ళలోను పైకి కనిపించలేదు. కాని, చైనా—టిబెట్‌ల మధ్య సంబంధాలు సరిగ్గాలేక, సంఘర్షణలకు దారి తీయడంతో చైనా—భారత దేశాలమధ్య సరిహద్దులకు సంబంధించిన వివాదానికి నాంది ప్రస్తావన జరిగింది.

1950 ఆగస్టులో టిబెట్ సమస్యను శాంతియుతంగాను, స్నేహ మార్గాలలోను పరిష్కరించుకొనడానికి సిద్ధంగా ఉన్నట్టు, తద్వారా "చైనా—భారత సరిహద్దులను స్థిరం చేయదలుస్తున్నట్టు" కమ్యూనిస్టు చైనా భారత ప్రభుత్వానికి తెలియజేసింది. "టిబెట్—భారత దేశాలమధ్య గుర్తింపబడి ఉన్న సరిహద్దులు యథాతథంగా ఉండేటట్టు చూడాలి" అని ఆ సంవత్సరంలోనే భారత ప్రభుత్వం కోరింది. 1950 అక్టోబరు 7 వ కమ్యూనిస్టు చైనా సైన్యాలు టిబెట్టును ఆక్రమించాయి. ఇది మంచిపనికాదని, సరిహద్దులో కల్లోల్లాన్ని తెచ్చి పెడుతుందని భారతదేశం హెచ్చరించింది. దీనికి కమ్యూనిస్టు చైనా సమాధానం చెబుతూ, ఇది "విదేశస్థుల పలుకుబడితో భారతదేశం చేస్తున్న విమర్శ", అని ఆరోపించింది. దానికి భారత దేశం తన ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ, తాను శాంతియుతంగా పరిష్కారాన్ని కోరుతున్నట్టు వివరించింది.

1954 ఏప్రిల్‌లో భారత్—టిబెట్‌ల మధ్య ఎనిమిది సంవత్సరాల వ్యాపార ఒడంబడిక జరిగింది. దాని ప్రకారం భారతదేశం టిబెట్‌లో తనకుగల అధికారాలను, హక్కులను వదులకున్నది. టిబెట్ కమ్యూనిస్టు చైనాలో అంతర్భాగంగా గుర్తించింది. పరస్పరం భౌగోళిక సమైక్యతను కాపాడుకోవాలని, సార్వభౌమాధికారాలను గౌరవించుకోవాలని, ఒకరి విషయాలలో ఒకరు జోక్యం కలిగించుకొనరాదని, పరస్పరం దురాక్రమణ జరుపుకొనరాదన్న సూత్రాలు (ఇవే పంచశీల సూత్రాలు) ఈ ఒడంబడికలో ఉదాహరించబడి ధృవపరచబడ్డాయి. టిబెట్‌ను ఇలా కమ్యూనిస్టు చైనాకు అప్పగించడం భారత శ్రేయస్సుకు భంగమని, కమ్యూనిస్టు చైనాను విశ్వసించడానికి వీలులేదని ఆచార్య కృపలానీ, పండిట్ కుంజ్రూ, శ్రీ జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు భారత ప్రభుత్వాన్ని నిశితంగా హెచ్చరించారు. 1962 నాటికిగాని వారి హెచ్చరికలు నిజమని ధృవపడలేదు. 1954 జూన్ 28 న కమ్యూనిస్టు చైనా ప్రధాని న్యూఢిల్లీ వచ్చాడు. పంచశీల సూత్రాలను, పరస్పర స్నేహాన్ని ధృవపరుస్తూ, చైనా—భారత ప్రధానులు సంయుక్త ప్రకటనలు కూడా చేశారు. ఆ సంవత్సరం జూలై 17 వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని బారాహోతీలో భారత సైన్యాలు ఉన్నందుకు కమ్యూనిస్టు చైనా తన నిరశనను ఢిల్లీకి తెలియజేసింది. భారత భూభాగంలో కొంత తనకు రావాలని కమ్యూనిస్టు చైనా చేసిన ప్రథమ సూచన ఇది. "ఇది తెలియనితనంతో చేసిన వాదన" అని భారత ప్రభుత్వం భావించింది. ఆ సంవత్సరం అక్టోబరు 18 వ తేదీన ప్రధాని శ్రీ నెహ్రూ కమ్యూనిస్టు చైనాలో పర్యటనకు వెళ్లారు. అప్పటికే కమ్యూనిస్టు చైనా ప్రకటించిన కొన్ని సరిహద్దు చిత్రపటాలలో భారత భూభాగం 50,000 చదరపు మైళ్ల తనకు రావాలని చూపింది. దీనిని గురించి ప్రధాని నెహ్రూ పెకింగ్‌లో చైనా ప్రధాని శ్రీ చౌ—ఎన్—లై ని ప్రశ్నించగా, "అవన్నీ కుమింటాంగ్ చైనానాటి పాత చిత్ర పటాలు. వానిని సవరించే తీరిక ప్రభుత్వానికి లేకపోయింది" అని సమాధానమిచ్చాడు.

1955 జూన్‌లో కమ్యూనిస్టు చైనావారు బారాహోతీలో మకాం వేసినందుకు భారత ప్రభుత్వం తన నిరసన తెలియజేసింది. సెప్టెంబరు 15 నాటికి కమ్యూనిస్టు సాయుధ సైనికులు ఉత్తర ప్రదేశ్‌లో పదిమైళ్లవరకు చొచ్చుకువచ్చి, దమ్‌జాన్‌లో మకాం వేశారు. 1956 ఏప్రిల్ 28 నాటికి యు. పి. లోనే నిలాంగ్‌కు తూర్పుగా అరమైలు దూరంవరకు చైనా సైనికులు వచ్చారు. 1956 జులై 26 నాటికి బారాహోతి తమదేనని, తున్‌జున్‌లా అనేది సరిహద్దు కనుమ అని తెలియజేశారు. ఆ నెలలోనే షిప్‌కిన్ కనుమవద్ద, హాన్‌సాంగ్ ఖుద్‌వద్ద కూడా కమ్యూనిస్టు చైనా సైనికులు కనిపించారు. ఆ ఏడాది నవంబరు 28 న తిరిగి చౌ—ఎన్—లై ఢిల్లీకివచ్చి, ఈశాన్య

సరిహద్దులో మెక్‌మాహన్‌రేఖను, బర్మాలో గుర్తించినట్లుగానే, భారతదేశంలో కూడా తాము గుర్తించదలచామని చెప్పాడు. 1957 జూన్‌లో భారతదేశం యాతుంగ్‌వద్ద తనకిందఉన్న భాగాలన్నింటిని చైనాకు అప్పగించింది. ఆ సంవత్సరం అక్టోబరులో నీఫాలోని లోహిత్ డివిజన్‌లో వలాంగ్ వద్ద కూడా చైనా సైనికులు కనిపించారు. దీనిని గురించి భారత ప్రభుత్వం తన నిరసనను చైనాకు తెలియజేసింది. బారాహెూతీని గురించి ఉభయుల మధ్య చర్చలు జరగాలని, పరిష్కారం జరిగేలోగా ఉభయులు తమ సైనికులను గాని, సివిల్ ఉద్యోగులను గాని పంపరాదని ప్రతిపాదించింది. దీనిని గురించి కొంత చర్చ జరిగింది. సైనికులను పంపరాదని చైనా అంగీకరించింది కాని సివిల్ ఉద్యోగులను గురించి అంగీకరించలేదు. తనకు రావాలని కోరుతున్న ప్రాంతాలను గురించి కమ్యూనిస్టు చైనా వద్ద స్పష్టమైన సమాచారం లేదని ఈ చర్చలవల్ల వెల్లడైంది.

1958 కి పూర్వంనుంచి లడక్‌లో కమ్యూనిస్టు చైనా దురాక్రమణ ఆరంభమైంది. ఖురనక్ కోటను ఆక్రమించినందుకు తన నిరసనను జులై 2 వ తేదీన భారత ప్రభుత్వం తెలియజేసింది. అక్సాయ్‌చిన్ ప్రాంతంలో తిరుగుతున్న భారత గస్తీ దళాన్ని సెప్టెంబరు నెలలో చైనా సైనికులు అరెస్టు చేసి, డిటెన్షనులో వుంచి, అయిదు వారాలు తమ అధీనంలో ఉంచుకున్నారు. సెప్టెంబరు నెలలోనే పెద్ద చైనా దళం ఒకటి భవన నిర్మాణ పరికరాలతో బారాహెూతీ ప్రాంతంలో పర్యటించింది. ఆ నెలలోనే మరొక చైనా దళం, నీఫాలోని లోహిత్ డివిజనులో ప్రవేశించి, చివరకు బర్మాకు చేరుకుంది. అక్టోబరునాటికి ఉత్తరప్రదేష్‌లోని లాప్తల్, సంగ్ చమల్లాలలో చైనా గస్తీ కేంద్రాలు నిర్మించారు. టిబెట్ నుంచి బయలుదేరిన విమానాలు హిమాచల్ ప్రదేశ్‌లోను, పంజాబ్‌లోని స్పితీలోయలోను తిరగడం ప్రారంభించాయి. మరొకవైపున కమ్యూనిస్టు చైనా పత్రికలలో చైనా కొత్త సరిహద్దులను చూపుతున్న చిత్రపటాలు ప్రకటించారు. ఈవిధంగా సరిహద్దుల్లో తమకు రావలసిన భూభాగాలను గురించి ఒక నిర్ణయానికి కమ్యూనిస్టు చైనా వచ్చింది. 1958 వరకు రకరకాల సమాధానాలు చెబుతూ భారత దేశాన్ని నమ్మిస్తూ వచ్చింది. 1958 నుంచి కొత్త పరిణామాలు ప్రారంభమైనాయి.

సరిహద్దులను గురించి చైనా ప్రచురిస్తున్న చిత్రపటాలు సరైనవి కావని ప్రధాని నెహ్రూ చైనా ప్రధానికి వ్రాశారు. తప్పుడు చిత్రపటాలను అధికార పత్రికలలో ప్రచురించడం భారతదేశానికి చికాకు కలిగిస్తున్నదని, కనుక ఇందుకు సంబంధించినవి విభిన్నాభిప్రాయాలను త్వరగా తొలగించడం మంచిదని సూచించారు.. దానికి 1959 జనవరి 23 వ తేదీన చైనా ప్రధాని సమాధానం వ్రాస్తూ, చైనా—భారత సరిహద్దులను అధికారపూర్వకంగా ఎన్నడూ విభజించలేదని, ఉభయదేశాల మధ్య సరిహద్దుల విభజనను గురించి విభిన్నాభిప్రాయాలు కల మాట నిజమని స్పష్టం చేశారు. అయితే 1954 లో ఈ సంగతి చెప్పకపోవడానికి కారణం, పరిష్కారానికి తేసువగు పరిస్థితులు అప్పటివరకు లేకపోవడమే నన్నారు. నీఫాలోని మెక్‌మాహన్‌రేఖను చైనా ప్రభుత్వం ఏనాడూ గుర్తించలేదని, ఇప్పటి చైనా చిత్రపటాలలో చూపుతున్న సరిహద్దులు, పూర్వంనుంచి వస్తున్న చిత్రపటాలతో సమానంగా ఉన్నాయని కూడా చెప్పారు. పాత సరిహద్దులను గుర్తించమని, సరిహద్దు వివాదం కలదని కమ్యూనిస్టు చైనా స్పష్టంగా చెప్పడానికి సుమారు ఎనిమిది సంవత్సరాలు పట్టింది.

కమ్యూనిస్టు చైనా వైఖరిని భారత ప్రభుత్వం నిరసించింది. అనేక శతాబ్దాలుగా, చారిత్రకంగాను, భౌగోళికంగాను సాంప్రదాయకంగాను, వాడకం రీత్యాను నిర్ణయించిఉన్న భారత దేశపు ఉత్తర సరిహద్దు మొత్తాన్ని గురించి కొత్తగా చర్చించడమనే సమస్య లేనేలేదని సెప్టెంబరు 26 వ తేదీన ప్రధాని శ్రీ నెహ్రూ చైనా ప్రధానికి లేఖ వ్రాశారు. అయితే సరిహద్దుల్లో కొన్నిచోట్ల గుర్తులు పెట్టడమనేది అసాధ్యమనే సంగతి దృష్టిలో ఉంచుకొని, అక్కడక్కడా చిన్న చిన్న సర్దుబాట్లు చేసుకొనవలసిన అవసరం ఉన్నమాట నిజమని, దానికి భారతదేశం సిద్ధంగా ఉందని తెలియజేశారు. అంతేకాని చైనా కోరుతున్న విధంగా సుమారు 50,000 చదరపు మైళ్ల కట్టబెట్టడానికి భారతదేశం ఎన్నటికీ అంగీకరించదని ఆ ప్రాతిపదికపై చర్చలు కొనసాగించడానికి ఇష్టపడదని కూడా వివరించింది. నాటికి నేటికి భారతప్రభుత్వం ఇదే వైఖరిలో ఉంది. అయినా 1959 సెప్టెంబరులో ప్రధాని నెహ్రూ వ్రాసిన ఈ లేఖకు సరైన సమాధానాన్ని కమ్యూనిస్టు చైనా ఇవ్వలేదు. కాని మరికొన్ని కొత్త పరిణామాలు సరిహద్దుల్లో సంభవించాయి.

1959 మార్చి 31 వ తేదీన టిబెట్ అధినేత దలైలామా భారతదేశానికి ప్రవాసం వచ్చారు. భారత ప్రభుత్వం ఆయనకు ఆశ్రయ మిచ్చింది. దీనిని కమ్యూనిస్టు చైనా తీవ్రంగా విమర్శించింది. అందుకు భారతదేశం తన నిరసనను తెలియజేసింది. పరిస్థితులనుబట్టి పంచశీల సూత్రాలకు తాను కట్టుబడి ఉండగలనని చైనా సమాధాన మివ్వగా, అది

అవకాశవాదంగా కాక మూల సిద్ధాంతంగా అనుసరించాలని భారత ప్రభుత్వం కోరింది.

ఇందుకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఒక వైపున నడుస్తూవుండగానే, మరొకవైపున చైనా దురాక్రమణ సాగుతూవచ్చింది. 1959 జులై 28న చైనాసాయుధ దళం ఒకటి లడక్‌లోని పశ్చిమ పాంగాంగ్ సరస్సుప్రాంతంలో ప్రవేశించి అక్కడ గస్తీవున్న ఆరుగురు భారతపోలీసులను అరెస్టు చేసింది. స్పాంగుర్ అనేచోట సైనిక శిబిరాన్ని నెలకొల్పింది. ఆగస్టు 7వ తేదీన చైనాసైనికులు మెక్‌మాహన్ రేఖవద్దవున్న ఖింజిమాన్‌ను దాటివచ్చి భారతగస్తీ దళాన్ని వెనక్కునెట్టారు. సుబన్‌సిరీ డివిజనుకో మరొకదళం ప్రవేశించి, అక్కడవున్న భారతగస్తీదళంమీద కాల్పుచేసి లాంగ్జూను ఆక్రమించారు. అక్టోబరు 20 నాటికి చైనా సైనికులు దక్షిణ లడక్‌లోని చాంగ్ చెన్‌మో లోయలోని భారత భూభాగంలో 40 మైళ్ళు ముందుకు చొచ్చుకువచ్చి, అక్కడవున్న భారతగస్తీదళంపై కాల్పులు జరిపి, తొమ్మిదిమందిని చంపివేశారు. పదిమందిని ఖైదీలుగా చేసి, నానా హింసలుపెట్టి విడిచిపెట్టారు. దీనికిభారత ప్రభుత్వం తన నిరసన తెలియజేసింది. ఈ సంఘటనజరిగిన కాంగ్‌కా కనుమ ప్రాంతం తనదేనని నిరూపించింది. కాని దీనిని చైనా ప్రభుత్వం నిరాకరిస్తూ, ఈ ప్రాంతం తనభూభాగంలోనిదేనని వాదించింది. లడక్ సరిహద్దుల్లో ఇంతవరకు తనభూభాగం కలదని చైనాచెప్పడం ఇదేప్రథమం.

అప్పుడు భారతప్రభుత్వం తాత్కాలిక ప్రతిపాదన ఒకటి చేసింది. దానిలక్ష్యం సంఘర్షణలను వారించడం. దాని ప్రకారం లడక్‌లోని చైనా తనదని చెప్పేసరిహద్దు రేఖవరకు భారతదేశం తన సైన్యాలను ఉపసంహరిస్తుంది. ఇక చైనా కూడా భారతదేశం పాతచిత్రపటాలలో చూపించిన సాంప్రదాయ సిద్ధమైన సరిహద్దు రేఖవరకు దాని సైన్యాలను ఉపసంహరించాలి. కాని భారతదేశంచేసిన ఈ ప్రతిపాదనను కమ్యూనిస్టుచైనా నిరాకరించింది. లడక్‌లోని అక్సాయ్‌చిన్‌కు ఇంకా పశ్చిమంగాను, దక్షిణంగాను తనసైన్యాలను ముందుకు నడిపించింది. టిబెట్ నుంచి సింకియాంగ్‌కు ప్రయాణాలకు వీలుగా ఆక్సాయ్‌చిన్‌లో రోడ్డును నిర్మించింది.

ఈ విధంగా కమ్యూనిస్టు చైనాసరిహద్దుల్లో చొచ్చుకు రావడం భారతప్రజలకు ఆందోళన కలిగించింది. పార్లమెంటులో తీవ్రమైన చర్చలు జరిగాయి. పండిట్ కుంజ్రూ, ఆచార్య కృపలానీ, శ్రీ వాజపేయి ప్రభృతులు నిశితమైన విమర్శలు చేశారు. వీనికి ప్రధానినెహ్రూ సమాధానంచెబుతూ చైనాతో స్నేహం భారతదేశానికి అవసరమని, అందుకు అనువుగా శాంతియుతమైన వాతావరణాన్ని సృష్టించాలని వాదించారు. చైనా ఆక్రమించిన ప్రాంతాలలో "గడ్డిపరకకూడా మొలకెత్తదు" అని, ఉన్నతమైన కొండప్రాంతాలలో కాలుపెట్టడం కష్టమని చెప్పారు. కమ్యూనిస్టుచైనా మిత్రద్రోహాన్ని, దురాక్రమణ వాంఛను శ్రీ నెహ్రూ గుర్తించకపోవడం భారతప్రజానీకానికి ఆశ్చర్యాన్ని, ఆందోళనను కలిగించింది.

1960 లో కూడా భారతప్రభుత్వం గట్టివైఖరిని అవలంబించలేదు. సరిహద్దుల్లో చైనాసైనికులు చొచ్చుకు రావడాన్ని పట్టుదలతో నిరోధించలేదు. కాగా శాంతియుత పరిష్కారాన్ని కోరుతూ చైనాప్రధాని చౌ—ఎన్—లై ని న్యూఢిల్లీకి రావలసిందిగా ప్రధాని నెహ్రూ ఫిబ్రవరినెలలో ఆహ్వానించారు. ఏప్రిల్ 19 న చౌ — నెహ్రూ సమావేశం ఢిల్లీలో జరిగింది. సుదీర్ఘచర్చల అనంతరం ఉభయుల మధ్య సమాధానం కుదరలేదని, కాగా ఉభయదేశాల అధికారులు సమావేశమై చర్చలు జరపాలన్న నిర్ణయానికి వచ్చామని అధికారప్రకటన చేశారు. ఈ ప్రకారం చైనా—భారతప్రభుత్వాధికారుల సమావేశం పికింగ్‌లోను, ఢిల్లీలోను, రంగూన్‌లోను జరిగింది. సరిహద్దులకు సంబంధించిన అధికారపత్రాలు, ఉభయులవద్ద వున్నవి ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నివేదికను 1961 ఫిబ్రవరి 14న భారతప్రభుత్వం సమగ్రంగా ప్రకటించగా, కమ్యూనిస్టుచైనా ప్రభుత్వం 1962 ఏప్రిల్‌లో పాక్షికమైన, తన వాదనకు అనుకూలమైన భాగాలతోకూడిన నివేదికను ప్రచురించింది. ఈ నివేదికనుబట్టి కమ్యూనిస్టు చైనావాదనలు నిరాధారమని, ఆధారపూర్వకమైన అధికారపత్రాలు దానివద్ద లేవని, తన ఇష్టంవచ్చినట్టు కొత్తగా గీసిన చిత్రపటాల ఆధారంతో భారత భూభాగాలను కోరుతున్నదని ధృవపడింది. అంతేకాదు. తనకు రావాలని కోరుతున్న 50,000 చదరపుమైళ్ళ భూభాగంలోను 12,000 చదరపు మైళ్లను ఆక్రమించుకున్నదని కూడా తెలియవచ్చింది.

1960 లోను చైనా ప్రధాని ఢిల్లీకి వచ్చి వెళ్లిన తర్వాత కూడా చైనా దురాక్రమణ సాగుతూ వచ్చింది. జూన్ 3 వ తేదీన నీఫాలోని కామెంగ్ డివిజన్‌లోని తసాంగ్ గోంపా అనేచోట అయిదు మైళ్ల వరకు చైనా సైనికులు చొచ్చుకు వచ్చారు. సెప్టెంబరు 22 వ సిక్కిం సమీపంలో జీలా కనుమను దాటి వచ్చారు. లడక్‌లోని హాట్ స్ప్రింగ్స్ అనేచోటికి చైనా సైన్యాలు వచ్చాయి. 1960 మార్చి నుంచి ఆగస్టు 22 నాటికి చైనా విమానాలు 52 దఫాలు భారత గగన సరిహద్దులను అతిక్రమించాయి. 1961 మే నెలలో లడక్‌లోని ఛుసూల్ దగ్గరకు చైనా సైనికులు చేరుకున్నారు. జులై రెండు నాటికి నీఫాలో మరొకమైలు ముందుకు వచ్చారు. ఆగస్టు నాటికి లడక్‌లో కొత్తగా మూడు గస్తీ కేంద్రాలు ఏర్పరచి, వాని వద్దకు రాకపోకలకు వీలుగా రోడ్లు నిర్మించారు. కారకోరం కనుమనుంచి కోంగ్‌కా కనుమ వరకుఉన్న ప్రాంతంలో తాను గస్తీ ఏర్పాట్లు చేస్తున్నట్లుగా 1962 ఏప్రిల్ 30 వ తేదీన చైనా ప్రకటించింది. ఈ ప్రాంతాలలోని భారత గస్తీ స్థావరాలను ఖాళీచేయాలని హెచ్చరించింది. చిప్‌చాప్ లోయలో కూడా కాపలా ఏర్పాట్లు చేసింది. ఇందుకు భారత ప్రభుత్వం చేసిన నిరసనను చైనా నిరాకరించింది. 1962 జులై 21 న భారత—చైనా సేనల

చైనాదురాక్రమణగాథ

మధ్య లడక్‌లోని చిప్‌చాప్ లోయలోను, పాంగాంగ్ సరస్సు ప్రాంతంలోను సంఘర్షణలు జరిగాయి. భారత గస్తీ స్థావరాలు కూడా క్రమక్రమంగా ఏర్పడుతూ వచ్చాయి. 1962 సెప్టెంబరు వరకు లడక్‌లో చెదురుగా సంఘర్షణలు జరుగుతూ వచ్చాయి. ఇక నీఫాలో కూడా చైనా సైన్యాలు లాంగ్జూను దాటి భారత భూభాగంలో అరమైలు వరకు వచ్చాయి. 1962 సెప్టెంబరు 8 న మెక్‌మాహన్ రేఖను దాటి తాంగ్లా కనుమను పట్టుకున్నాయి. ఈవిధంగా 1962 సెప్టెంబరు 8 వ తేదీ అనేది చైనా సాయుధ దురాక్రమణకు కీలకమైనదిగా భారత ప్రభుత్వం పరిగణిస్తున్నది. ఆ తేదీనాటికి నీఫా రంగంలో చైనా సైనికులు మెక్‌మాహన్ రేఖను అతిక్రమించలేదు. యు. పి. పంజాబుల లోని మధ్య రంగంలో బారాహోతీ వద్ద చైనా సైన్యాలు లేవు. లడక్‌లో కోంగ్‌కా కనుమ, చిప్‌చాప్ నదీ ప్రాంతం, పాంగాంగ్ ప్రాంతాలలో ఉన్నారు. అంటే నీఫాలో తనకు రావాలని కోరే భాగాలను చైనా ఆక్రమించలేదు. లడక్‌లో మాత్రం తనకు రావాలని కోరే సుమారు 15000 చదరపు మైళ్లలోను దాదాపు 12000 చదరపు మైళ్లు ఆక్రమించింది. ఈ దురాక్రమణ దాదాపు పది సంవత్సరాలుగా, చాటుగా, స్నేహభావం నటిస్తూ, శాంతి సమాలోచనలు సాగిస్తూనే కమ్యూనిస్టు చైనా కొనసాగించింది. 1962 అక్టోబరు 20 నుండి అటు నీఫాలోను, ఇటు లడక్‌లోను కమ్యూనిస్టు సైన్యాలు భారీఎత్తున దాడిచేసి సాయుధ దురాక్రమణను ప్రారంభించాయి. చైనా భారతదేశాల మధ్య "అప్రకటిత యుద్ధం" 1962 నవంబరు 20 వరకు జరిగింది. ఈ యుద్ధంలో లడక్‌లోని దౌలత్‌బేగ్‌వోల్డి నుంచి ఛుసుల్ సమీపం వరకు ఉన్న భారత భాగాలను చైనా ఆక్రమించింది. అంటే లడక్‌లో తనకు రావాలని కోరుతున్న 15,000 చదరపుమైళ్లను స్వాధీనపరచుకుంది. నీఫాలో బొమిదిలా కనుమను, తవాంగ్‌ను కూడా పట్టుకున్నది. అంటే నీఫాలో తనకు రావాలని కోరుతున్న సుమారు 13,000 చదరపు మైళ్లను బలప్రయోగం ద్వారా స్వాధీనపరచుకుంది. అవిధంగా 1962 నవంబరు 20 నాటికి తనకు రావలసిన భారత భూభాగాలను కమ్యూనిస్టు చైనా కబళించి, తనకు తానుగా యుద్ధ విరమణ షరతులను మరునాడు ప్రకటించింది.

1962 అక్టోబరు 20 నుంచి నవంబరునాటికి భారత దేశంలో పెక్కుపరిణామాలు సంభవించాయి. ప్రధాని నెహ్రూ ఇంతవరకూ అనుసరిస్తూవచ్చిన తటస్థవిధానం దేశభద్రతకు తోడ్పడలేదని ఆచరణలో ధృవపడింది. ఈ విధానం ఇక లాభం లేదన్ననమ్మకం అందరికీ కలిగింది. కమ్యూనిస్టుచైనా 12 సంవత్సరాల కుతంత్రాన్ని, నమ్మకద్రోహాన్ని గుర్తించి భారత రక్షణమంత్రి శ్రీ కృష్ణ మీనన్ సరిహద్దుల్లో సైనికమైన కట్టుదిట్టాలు చేయనందుకు భారతజాతి యావత్తు నిరసన తెలియజేసింది. చివరకు కాంగ్రెసుపార్లమెంటు పార్టీవత్తిడి మీద రక్షణమంత్రి పదవికి శ్రీ మీనన్ చేసిన రాజీనామాను శ్రీ నెహ్రూ అంగీకరించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చవన్‌ను కొత్తరక్షణ మంత్రిగా నియమించారు. రాజ్యాంగ నిబంధనలప్రకారం దేశంలో అసాధారణ పరిస్థితులు ఏర్పడినట్టు రాష్ట్రపతి అధికారప్రకటన చేశారు. భారతరక్షణ నిబంధనలు ప్రకటించారు. దేశరక్షణకు అవసరమైన ధనకనక వస్తువాహనాలు విరివిగా విరాళాలివ్వాలని ప్రజానీకానికి విజ్ఞప్తిచేశారు. సామాన్య ప్రజానీకం విరివిగా ధనం, బంగారంమాత్రమేకాక తమకుగల పశువులనుకూడా విరాళంగాఇచ్చారు. జాతి యావత్తు ఒక్కమాటమీద నిలిచి చైనాదురాక్రమణను నిరోధించాలనే కృతనిశ్చయాన్ని ప్రకటించింది. కాని సరిహద్దులో భారతసైనికుల తిరోగమనం ప్రజలను ఆశ్చర్యపరచింది. నీఫాలో తాగ్లాకొండమొదలు జంగ్, తవాంగ్, సేలాకనుమ, బొమిడిలా, వలాంగ్ వగైరా ప్రాంతాలు శత్రు వశం కావడం లడక్‌లో ఛుసూల్‌వరకు, దౌలత్‌బేగ్ ఓల్డీవరకు శత్రువు చొచ్చుకు రావడం భారతసైన్యం బలహీనతను బయట పెట్టింది. శత్రుమూకలు అశేషంగా చొచ్చుకురావడంతో భారతసైనికులకు సంఖ్యాబలం లోపమేకాక, ఆధునికమైన ఆయుధాల కొరత కూడా ఏర్పడింది. హిమాలయ ప్రాంతాలలో, ఎత్తగు కొండలలో శీతకాలంలో యుద్ధానికి అనువుగా ఉన్ని దుస్తులు కూడా భారత సైనికులకు తగినన్ని లేవని తెలియవచ్చింది. ఈ శోచనీయస్థితికి భారత ప్రజలు దిగ్భ్రమ చెందారు. చైనా నమ్మకద్రోహంకంటే భారత రక్షణశాఖ బలహీన స్థితి కనువిప్పు కలిగించింది.

ఈ ఆపత్సమయంలోనే పశ్చిమ రాజ్యాలు ముఖ్యంగా బ్రిటన్, అమెరికాలు భారత్‌కు అండగా నిలిచాయి. ప్రధాని నెహ్రూ అభ్యర్థనమీద ప్రత్యేక విమానాలమీద, నౌకల మీద హుటాహుటిని ఆయుధాల సప్లయి జరిగింది. అమెరికా, కెనడాలనుంచి రవాణా విమానాలు వచ్చాయి. పశ్చిమ జర్మనీ నుంచి ఉన్ని దుస్తుల సప్లయి జరిగింది. అమెరికానుంచి శ్రీ హారిమన్ నాయకత్వాన నిపుణుల ప్రతినిధివర్గం, బ్రిటన్ నుంచి శ్రీ శాండీస్ నాయకత్వాన బ్రిటిష్ నిపుణులవర్గం భారత దేశానికి వచ్చాయి. ఈవిధంగా అమెరికా, బ్రిటన్‌లుచేసిన సహాయం భారత ప్రజల ధైర్యాన్ని పెంచింది, ఆందోళనను తగ్గించింది. అవసరమైన ఆయుధ సహాయాన్ని పూర్తిగా చేయగలమని అమెరికా, బ్రిటన్‌లు వాగ్దానం చేయడంతోను, బ్రిటన్‌తో ఆయుధాల సప్లయి ఒడంబడిక జరగడంతోను భారత సైనిక పాటవానికి సంబంధించిన లోపం చాలవరకు సర్దుబాటు అయింది. అయితే ఆసియాలో కమ్యూనిస్టు చైనా దురాక్రమణను బహుముఖంగా నిరోధించవలసిన అవసరం ఉన్నదనేది అమెరికా, బ్రిటన్‌లు గుర్తించాయి. అందుకు పాకిస్తాన్, భారత దేశాల స్నేహం అవసరమని అందరూ అంగీకరించారు. అందుకు అనువగు వాతావరణాన్ని కూడా అమెరికా, బ్రిటిష్ ప్రతినిధి వర్గాలు కలిగించాయి. భారత, పాకిస్తాన్ ప్రభుత్వాధినేతల సమావేశానికి రంగం సిద్ధమైంది. ఈ పరిణామం కూడా భారత ప్రజానీకానికి ఆనందాన్ని కలిగించింది.

(మిగతా 73-వ పేజీ చూడుడు)

పగ

శ్రీ పి. జి. రామారావు

అంత పెద్దపామును నేనంతకుముందెప్పుడూ చూడలేదు. హరికెన్‌లాంతరు వెల్తురులో సుమారు రెండు గజాల పొడవున మిల మిల మెరుస్తూ, ఎంత అందంగాఉందో అంత భయంకరంగా బతికున్న పామేమోనన్న భ్రమకొల్పుతూవుంది. ఎక్కడా దెబ్బతిన్న జాడే లేదు. 'ఎవడో మంచి పనివాడు చంపాడు' అనుకొన్నాను కళాకారుడికోసం క్రింద గుమిగూడిన జనంలో వెతుకుతూ.

అంతా కోలాహలంగా ఒరియా భాషలో మాట్లాడు కుంటున్నారు క్రింద.

'తాచుపామా?' అని అడిగాను ఇంగ్లీషులో, డాబా పిట్ట గోడమీద నా ప్రక్కనే కూర్చున్న సాహూని.

క్రింద జనంతో మాట్లాడుతున్న సాహూ నా వైపు తిరిగి, 'చాలా ప్రమాదకరమైన తాచు. సంకరజాతి నాగు' అన్నాడు.

సాహూ మా ఇంటి యజమాని. నేను నా ఉద్యోగధర్మంలో ఈ వూరువచ్చి అప్పటికి రెండురోజు లయింది. ఆ రెండురోజులూ సాహూ ఎంతో సాయంగా ఉండేవాడు. నా కీ వూరు కొత్త. భాష కొత్త.

క్రింద జనంతో హడావుడిగా ఏమిటేమిటో మాట్లా డేస్తున్నాడు సాహూ.

విజృంభిస్తున్న ఆసక్తిని అణచలేక "ఎవరు చంపారు? ఎక్కడ?" అని అడిగాను.

"అదిగో, ఎడంచేతివైపు నాలుగో ఇల్లు లేదూ? ఆ ఇంట్లో కొచ్చిందట. వంట చెరకు పెట్టుకొనే గదిలో ఉందట. ఇంటావిడ చూచి బయటికివచ్చి, కేకలువేసింది. ప్రక్కఇంటికి ఏదో పనిమీద వచ్చిన పరీడా విని పరుగెత్తుకు వెళ్లిదాన్ని చంపే శాడు" అన్నాడు సాహూ, పాముని చంపడమంటే ఏదో ఆట ఆడినంత తేలికైన విషయమైనట్లు.

"అడుగో, అతనే పీతాంబర్ పరీడా" అని క్రింద జనంలో ఒక వ్యక్తిని చూపించాడు.

బట్టతల, నీలంరంగు లుంగీపంచ, నల్లగా, సన్నగా, పొడుగ్గా, నడివయస్సులోవున్న పీతాంబర్‌పరీడాని చూశాను. ఒక చేతిలో సన్నటి పొడుగాటి ఈటె, రెండవ చేతిలో లావుపాటి కర్ర. ఈటె అందరికీ చూపిస్తున్నాడు, పాముని ఎలా చంపినదీ వర్ణిస్తూ.

చుట్టూ ఉన్న పూరికొంపల్లోనుండి జనం బిలబిలమంటూ వచ్చి పరీడా చుట్టూ గుమిగూడి ఆశ్చర్యంగా చూస్తున్నారు. ఏవో ఇతర పాములని గురించి కూడా చర్చిస్తున్నారంతా. ఆ ప్రాంతంలో పాములు బాగా ఎక్కువ అని సాహూ చెప్పాడు.

'ఎలా చంపాడు? ఆ ఈటె ఏమిటి?' అని అడిగాను. సాహూ ఇలా చెప్పాడు.

"పాముని కొట్టడంలో పీతాంబర్‌పరీడాని మించిన వాడు ఈ చుట్టు ప్రక్కలలేడు. ఎంత పామునైనా ఒక్కడూ అవలీలగా చంపగలడు. అది ఒక విద్యగా అభ్యాసం చేశాడు. అదుగో ఆ ఈటే, ఆ కర్రా ఎప్పుడూ కూడా ఉంటాయి అతనికి. ఆ ఈటెతో పాము తలమీదకాని, మెడమీదకాని ముందు పొడు స్తాడు. అలా పాముని అణచిపెట్టి రెండో చేతిలోని దుడ్డు కర్రతో ఒక్క దెబ్బకొట్టి చంపేస్తాడు. అలా వందలకొద్దీ పాముల్ని చంపేడు" అన్నాడు ఉత్సాహంగా.

ఒక్కక్షణంఆగి, గొంతు తగ్గించి, "పాముల్ని చంపడం కోసమే జీవిస్తున్నానంటాడు. అంత పగ!" అన్నాడు గాఢమైన నిట్టూర్పుతో.

జనమేజయుడి సర్పయాగం జ్ఞాపకం వచ్చింది నాకు.

క్రింద పరీడా పాముని కసిగా అటూ, ఇటూ పొర్లిస్తు న్నాడు. బతికున్నపాములాగే మెలికలు తిరుగుతూందది.

ఆ దృశ్యం ఇంకా కళ్ళకు కట్టినట్లుగాఉంది. పరీడాని నేను అదే మొదటిసారి చూడడం. తర్వాత కొద్ది రోజుల్లోనే ఇద్దరమూ చాలా దగ్గరగా వచ్చాము. ఇక అతన్ని చూడలేనంటే ఏమిటో బాధగావుంది.

"అతనికథ చాలా విచిత్రమైనది. ఇప్పటికే చాలా రాత్రయింది. టూకీగా చెబుతాను వినండి"—వాచీ చూసుకుంటూ ఇలా మొదలెట్టాడు సాహూ.

"ఊరిచివర తోటలో పూరింట్లో పీతాంబర్ పరీడా నివాసం. రెండేళ్లక్రితంవరకూ అందులో అతడూ, పదహారేళ్ల కొడుకూ ఉండేవారు. పరీడా భార్య కొడుకు అయిదవఏటనే కన్ను మూసింది. ప్రాణాలన్నీ కొడుకుమీదనే పెట్టుకుని అల్లారు ముద్దుగా పెంచాడు పరీడా. కొడుకు చేతికందొచ్చి వ్యవసాయపు పనిలోనూ, తోటపనిలోనూ సాయపడేవాడు. ఈడైనపిల్ల నెవరి నైనాచూసి, అతడికి పెళ్ళి చేసేద్దామన్న ఆలోచనలో ఉండగా ఒకనాడు రాత్రి ఆ కుర్రవాణ్ణి నిద్రలో ఉన్నవాడిని నాగుపాము కాటేసింది. పరీడా లేచేసరికి పాము తూములో దూరిపోతూ కని

పించింది. కొడుకు నురగలు కక్కుతూ, గిలగిలలాడుతున్నాడు. ఇంకో అరగంటలో అంతా అయిపోయింది. కుప్పకూలిపోయాడు పరీడా. ఆ తోటలో పెద్ద తాచుపాము తిరుగుతున్నదని అతనికి తెలుసు. ఆ పాము అతనికి గుర్తే. అయితే అది పని గట్టుకుని ఇంట్లోకి వచ్చి కొడుకుని పొట్టబెట్టుకుంటుందని అతడు కలలో కూడా అనుకోలేదు. 'జాతైన నాగుకదా! దాని జోలికి మేం పోనప్పుడు మా జోలికిమాత్రం అది ఎందుకు వస్తుంది?' అంటూ అశ్రద్ధ చేసేడు.. ఆ అర్ధరాత్రి దుఃఖంతోనూ, ఆవేశంతోనూ వూగిపోతూ కొడుకు శవంమీద ప్రతిజ్ఞ చేశాడు పరీడా, 'తన కొడుకుని చంపిన పాముని హతమారుస్తాననీ, నాటినుండీ పాముల్ని నాశనం చేయడమే తన జీవిత పరమావధి అనీనూ. అప్పటినుండి పాములకు ప్రబల శత్రువయ్యాడు పరీడా. ఈటే, కర్రా పట్టుకుని అతను తిరుగుతుంటే గరుడుని అపరావతారంలాగే ఉంది ఈ ప్రాంతం జనానికి. అతని ఇంటికి వెడితే వందలకొద్దీ పాము చర్మాలు చూడొచ్చు. మీ భాషకూడా బాగా మాట్లాడుతాడు'' అని ముగించాడు సాహూ.

తెనుగొచ్చిన వాడొకడు ఈ వూళ్లో ఉన్నాడంటే ప్రాణం లేచి వచ్చింది. ఇక్కడ సాహూలాటి వాళ్లిద్దరు ముగ్గురు ఇంగ్లీషు వచ్చినవారున్నారు. వాళ్లతోనే నాకు కాలక్షేపం. మర్నాడే సాహూతో కలిసి పరీడా ఇంటికి వెళ్లాను. పరీడా తెలుగు—తెలుగువాడిలాగే మాట్లాడేవాడు. తన చిన్నతనమంతా బరంపురంలోనే గడచిందని చెప్పాడు. తోటంతా తిప్పిచూపించాడు. తరచుగా వస్తూ ఉండమని ఆహ్వానించాడు. నవ్వుతూ ఎంతో ఆప్యాయంగా మాట్లాడాడు. ఇంట్లోకి తీసుకువెళ్ళి ఏవో పళ్లూ, కాయలూతెచ్చి ఆతిథ్యమిచ్చాడు. మేము కూర్చున్న గది గోడలనిండా రక రకాల పాము చర్మాలు వందలకొద్దీ వ్రేలాడుతున్నాయ్. అందులో కొన్ని ఎంత అందంగా ఉన్నాయని! నేను వాటికేసి ఆసక్తితో చూడడం గమనించి, ఇది తెల్లతాచు, ఇది నల్లతాచు, ఇది గోధుంతాచు, ఇది పొడపాము అంటూ ఒక్కొక్కటే చూపించసాగాడు. ''వీటిలో మీకు నచ్చినవి తీసుకు వెళ్ళవచ్చు బాబూ'' అన్నాడు.

''నాకెందుకు, నేనేం చేసుకుంటాను వీటిని'' అన్నాను. సాహూ రెండు చర్మాలు తీసుకున్నాడు. ఇప్పుడనిపిస్తుంది నేనూ ఏదో ఒకటి తీసుకుంటే పరీడా పేరున జ్ఞాపకచిహ్నంగా ఉండునే అని.

* * * *

మనిషిమీద పాముపగ ఎరుగుదును. కాని, పాముమీద మనిషిపగ ఎప్పుడూ వినలేదు. ఆవేళ సాయంత్రం షికారుగా పొలాల్లోంచి వెడుతుంటే పరీడా వెంబడించాడు. అతడికథ కొంత కొంత అతడి నోట కూడా విన్నాను. ''ఆ మాయదారి పాముమీద పగబట్టాను బాబూ. అదేనా చావాలి నేనేనా చావాలి'' అన్నాడు చేతిలో ఈటె ఝళిపిస్తూ. ఆ మాట అంటుంటే ఎప్పుడూ నవ్వుతూ, సౌమ్యంగా ఉండే పరీడా ఒక్కమారుగా బుసలుకొడుతున్న మహానాగంలా కనిపించేడు.

నేను రోజూ సాయంత్రం అదే ప్రదేశానికి నడిచేవాడిని. అక్కడ ప్రకృతి చాలా రమ్యంగా ఉండేది. గుబురు గుబురుగా పెరిగిన పొదలూ, కొమ్మలు కనపడనంత దట్టమైన ఆకులతో పెద్ద పెద్ద చెట్లూ, నీరేమోనని భ్రాంతి కలిగించే సరుగుడు తోటలూ, చెట్ల ప్రతిబింబాలతో తోటేమోనని భ్రమ గొల్పే నదీ, చల్లనిగాలీ, అన్నిటికన్నా నాకెంతో ఇష్టమైన 'పీకహో' అనే పిట్టపాట, ఇవన్నీ ఉండేవి. అక్కడికి ఏ రోజైనా వెళ్ళకపోతే ఏదో వెల్తిగా ఉండేది. పరీడా తోటనానుకొనిఉన్న ఎత్తైన గట్టు నా మార్గము. ఆ దారిని ఎప్పుడు వెడుతున్నా పరీడావచ్చి ''బాబుగారు ఒక్కరూ వెళ్ళకూడదు. అన్నీ పొడుపాములు'' అంటూ నాకూడా నడిచేవాడు. తిరుగు ప్రయాణంలో నన్ను తోట దాటించి మరీ ఇంటికి వెళ్లేవాడు. దారి పొడుగునా ఎన్నో కబుర్లు చెప్పేవాడు. తాను ఏ పాముని ఎలా చంపినదీ, అభినయయుక్తంగా వర్ణించేవాడు. అయితే ఎన్ని కబుర్లు చెప్పినా, సంభాషణ చివరికి తాను పగబట్టిన పాము దగ్గరకే వచ్చేది. దానికోసం ఆరోజు తాను ఏ యే ప్రదేశాలు వెదకినదీ చూపించేవాడు.

ఒకరోజున గట్టు వెంబడి నడుస్తుంటే హఠాత్తుగా ఒకచోట ఆగిపోయి, ఎంతో ఆవేశంతో 'అదిగోబాబూ, అదిగో' అని అరిచాడు పరీడా. పామేమో అని హడలిపోయాను నేను. అయితే అతని ఈటె పైకి లేవకపోవడం గమనించి నిల్ద్రొక్కుకుని తాపీగా పరిశీలించాను. మెలికలు తిరుగుతూ గట్టుకి అడ్డంగా కనిపించింది పాముజాడ. గట్టుకి ఇటు పొదలు, అటు పొదలు. ఒక పొదలోనుంచి ఇంకో పొదలోనికి వెళ్ళిందన్నమాట పాము. అయితే ఎటునుంచి ఎటు వెళ్ళిందో మాత్రం తెలియలేదు. పరీడా గట్టుదిగి అటూ ఇటూ కూడా జాగ్రత్తగా పరిశీలించాడు. ముందురోజు వర్షం పడడంచేత ఇంకా తడి తడిగా కొద్దిగా జారుగావున్న గట్టుమీద మాత్రమే రెండు మూడు అడుగుల మేర ఉంది ఆ జాడ. ఆపైన అటూ ఇటూ కూడా ఏ ఆనవాలూ లేదు. నా కిక అడుగు ముందుకు సాగలేదు. 'లాభంలేదు పరీడా. అది మనకోసం ఇంకా అక్కడ కూర్చుంటుందా. పద, వెనక్కి పోదాం' అన్నాను.

తర్వాత ఒకవారం రోజులవరకు అటు వెళ్లాలని అనిపించలేదు. ఒకరోజున వెడదామా వద్దా అని తటపటాయిస్తుంటే, పరీడాయే వచ్చాడు. ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ సంతోషంగా ఉన్నాడు. 'ఒకవేళ్ల పామునిగాని చంపేడా ఏమిటి చెప్మా' అనుకుంటూ ''రా, రా, పరీడా, ఇలా కూర్చో'' అన్నాను బల్ల చూపిస్తూ. ఈటే కర్రా గోడకి జేర్లవేసి కూర్చున్నాడు.

ఒక్క నిమిషం గోడలకున్న పటాలూ, అవీ చూస్తూ కూర్చుని 'నిన్న చూశాను బాబూ, ఆ ఎదవని' అన్నాడు.

ఎవరిని గురించి మాట్లాడుతున్నాడో తెలుసుకోవడం పెద్ద కష్టంకాలేదు నాకు.

''ఏం, ఎక్కడ కనిపించింది?'' అన్నాను ఆసక్తి కనబరుస్తూ.

''నిన్న గట్టుప్రక్క గడ్డి కోస్తుంటే పొదల్లోకి దూరి పోతున్నదానితోక కనిపించింది బాబూ. ఈటె పుచ్చుకుని లేచే

సరికి అప్పటికే దాటిపోయింది. ఆవేళ మనం జాడ చూశామే అక్కడికి దగ్గరే బాబూ.'' అన్నాడు.

ఏమిటీ మనిషి? పాము తోక కనిపిస్తేనే ఇంత సంబర పడుతున్నాడే తప్పిపోయిన ఏకైక పుత్రుడు దొరికితే తల్లి తండ్రుల లాగ. ఏమిటీ అనుబంధం? అనుకొన్నాను.

''దానిజాడ దొరికింది బాబూ. దాని ఆనుపానులు తెలిశాయి. ఇక అక్కడే మాటువేస్తాను'' అన్నాడు.

''నువ్వక్కడవుంటే అది అలా వస్తుందా'' అన్నాను.

''అంటే అక్కడ కూర్చుంటానా బాబూ? ఆ గట్టుమీద ఒక కన్నేసి తిరుగుతూంటా నన్నమాట'' అన్నాడు పరీడా నా అమాయకత్వానికి జాలి పడుతున్నట్లు.

నాలుగైదు రోజుల తర్వాత ఒక రోజున బజార్లో హఠాత్తుగా కనిపించాడు. ''ఏం పరీడా, బొత్తిగా నల్లపూసైపోయావు' అన్నాను.

''ఆ ఎదవతో చచ్చి చావుగాఉంది బాబూ. ఏడిపించుకు తింటూంది'' అన్నాడు.

''ఏం చేసిందేమిటి?'' అని అడిగాను.

''కనిపించినట్లే కనిపించి మాయమౌతుంది బాబూ. ఈవాళ చూసినచోట రేపుండదు. మా దొంగ నాగు బాబూ'' అన్నాడు.

అసలు ఎక్కడ కనిపించిందని నే నడిగేలోగానే మళ్లీ అందుకున్నాడు.

''మొన్న తమ ఇంటిదగ్గరనుంచి వెడుతుంటే గట్టుమీద నాకు మూడు గజాలదూరంలో నా దారి కడ్డుగా పాకిపోయింది బాబూ. ఒక్క ఉరుకులో ముందుకువెళ్ళి చూశాను. ఎక్కడా దాని జాడే లేదు. ఈమధ్య రోజూ కనిపిస్తూంది. ఏ పొదలోనో దూరిపోతూనో, దారి కడ్డుగా పాకి మాయమయిపోతూనో, కోరడుదాటి ప్రక్కతోటలోకి పోతూనో ఏదోవిధంగా కళ్లపడుతూంది. కాని దొరకటంలేదు బాబూ'' అన్నాడు.

చిరునవ్వుతో ''అస్తమానమూ అదే ధ్యాసలో ఉండడం వల్ల భ్రమపడుతున్నావేమో పరీడా'' అన్నాను.

పరీడా నవ్వాడు.

*　　*　　*　　*

మరునాడు తోట ప్రక్క గట్టుమీద నా కూడా నడుస్తూ ''ఒక మంచి పథకం తయారు చేశాను బాబూ. ఈ దెబ్బతో ఆ యెదవ నా చేతిలో చిక్కాలిసిందే'' అన్నాడు పరీడా దండయాత్ర పథకం సిద్ధంచేసిన నెపోలియన్‌లా మొఖం పెట్టి. నాకు కూడా ఈ విషయంలో ఆసక్తి నానాటికి ఎక్కువౌతున్నది.

అతని సాహచర్యంవల్లనో ఏమో ఆ పాము నాకుకూడా శత్రువులా కనిపించసాగింది. దానిమీద పరీడాతోపాటు నేను కూడా కక్షకట్టినట్లుగా అనిపిస్తున్నది. ఇప్పుడు మేమిద్దరమీ కలిసి సాధించవలసిన విరోధిఅన్నమాట ఆ పాము. అయితే సంఘర్షణ ఏదన్నా జరిగితే పరీడాకు నేనివ్వగలిగినదంతా నైతిక సహాయం మాత్రమే. పరీడా ఇంకా వ్యూహరచనలో మునిగిపోయిన సేనానాయకుడి భంగిమలోనే ఇలాఅన్నాడు.

''దాన్ని పట్టుకోవాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా అది దొరకటంలేదు బాబూ. ఇది పనిగాదన్న నమ్మకంలోకొచ్చాను. ఈమారు అదేనన్ను వెదుక్కుంటూ వచ్చేలా చేస్తాను. నేను ఎక్కడున్నా చచ్చినట్లుగా నా కాళ్ళదగ్గరకు రావాలి. ఈ దెబ్బతో అదేనా పోవాలి. నేనైనాపోవాలి.'' అన్నాడు.

టాల్‌స్టాయ్ వ్రాసిన 'వార్ అండ్ పీస్' అనే నవలలో శత్రువుమీద దెబ్బతీయకుండా శత్రువునే మీది మీదికిరానిచ్చి దెబ్బతీసే 'కుటుజోవ్' అనే రష్యన్ సేనాని గుర్తుకొచ్చాడు.

''అంటే ఏం చేద్దామని ?'' అని అడిగాను.

''తమరు చూస్తారుగా తమాషా'' అన్నాడు గారడీ చేయబోతున్నవాడిలా.

చీకట్లు అన్నివేపులనుంచి వేలకొద్దీ నల్లతాచుల్లా మీది మీదికి వస్తున్నాయి. వెనక్కితిరిగి ఇంటివేపు నడువసాగాము. కొద్దిదూరంలో నక్కలు బృందగానం చేస్తున్నాయి. నా టార్చిలైటు సహాయంతో తొందరతొందరగా అడుగులు వేస్తున్నాము.

గట్టుప్రక్కగా ఏదో మిల మిలా మెరిసినట్లయింది. టార్చిలైటు అటు బాగా ఫోకస్‌చేశాను. వడివడిగా గట్టుక్రిందకు జారిపోతున్నది పాము.

''అదే బాబూ, అదే,'' అంటూ అరిచాడు పరీడా. మరుక్షణం చేతిలో ఈటె గురిచూసి దానిపైకి విసిరేడు. అప్పటికే పాము పొదల్లో దూరిపోయింది. పొదప్రక్కగా పడింది ఈటె. అది పాముకు తగిలిందన్నాడు పరీడా. నాకూ అలాగే అనిపించింది. నెమ్మదిగా గట్టుదిగి టార్చిలైటు సహాయంతో ఈటె తెచ్చుకున్నాడు.

తోట దాటేవరకు మౌనంగా నడిచాము. నాకు వీడ్కోలు చెపుతూ ''ఈ రాత్రితో తేలిపోతుంది బాబూ'' అన్నాడు పరీడా.

''జాగ్రత్త, పరీడా. పగబట్టిన తాచు. ఎంతో మెలకువ అవసరం.'' అని హెచ్చరించి ఇంటివైపు నడిచాను.

తెల్లవారగానే దంతధావన చేసుకుంటూంటే పరీడా ప్రత్యక్షమయ్యాడు.

''రాత్రల్లా నిద్ర పాడయింది బాబూ. ఎంత ఎదురు చూసినా ఆ యెదవ రాలేదు. ఈటె తగల్లేదో ఏమోమరి. లేకపోతే పగబట్టకూడ దనుకుందో.'' అన్నాడు.

''పూర్వజన్మలో ఎవరో గొప్పజ్ఞానియై వుంటాడు నీ మిత్రుడు. పగను పగతో జయించలేము అనేమో ఆయన వుద్దేశం.'' అన్నాను ఛలోక్తిగా.

పరీడా మొహం ఎర్రగా చేసేకుని ఇలా అన్నాడు.

"అవునుబాబూ. నిద్రపోతున్న పసివాడిని కాటేసి దొంగ లాగ మొహం చాటుచేసుకుని తప్పుకు తిరగడమేకాబోలు జ్ఞానమంటే. చేవవుంటే ఎదరకువచ్చి నిలబడాలి."

నేనేదో తమాషాగా మాట్లాడితే ఇలా సీరియస్‌గా తీసుకుంటాడనుకోలేదు. తన శత్రువు పాము అన్నమాటమరచి ఎవరో మనిషినిగురించి మాట్లాడినట్లుగావుంది అతని ధోరణి. 'ఈ పగ మూలంగా ఇతనికి పిచ్చిగాని ఎత్తడంలేదుగదా' అన్న ఆలోచన ఒక లిప్తసేపు మనసులో మెరసింది. అయినా "అది మనిషి కనకనా పరీడా, ఇలాటి ఆలోచనలన్నీ వుండడానికి— కాటేయడమే దానికి తెలుసుకాని, కావాలని తప్పుకు తిరగడం, ఎదుటబడి సవాలు చేయడం, ఇవన్నీ ఏం తెలుస్తాయి చెప్పు." అన్నాను అనునయంగా.

పరీడా కొద్దిగా చిరాకుతో "తమరికి తెలీదుబాబూ. అన్ని పాములలాటిదికాదు ఇది. దీని తరహాయేవేరు. నేను వందల కొద్దీ పాముల్ని ఎరుగుదును. వాటిసంగతి నాకు తెలుసు" అన్నాడు చివరి రెండుమాటల్ని నొక్కిపలుకుతూ.

ఇలాటి విషయాల్లో అభిప్రాయాలు ప్రకటించడానికి నాకు అర్హతలేదన్నధ్వని అందులోవుంది.

నేనిక నోరెత్తలేదు.

అసలు పరీడా ఈ పాముని ఎలా గుర్తుపట్టగలుగుతున్నాడో అప్పటికీ ఇప్పటికీ నాకు అవగాహన కాలేదు. నాకు అన్ని తాచుపాములు ఒక్కలాగే కనిపిస్తాయి. అందులో తోటల్లోనూ పొలాల్లోనూ ఎన్నోపాములు తిరుగుతుంటాయి. వాటిలో తనకు కావలసిన పాముని అతడు దూరంనించే ఎలాగుర్తుపట్ట గలుగుతున్నాడోమాత్రం అర్థంకాని విషయమే. ద్వేషంలోనూ పగలోనూవుందేమో ఆ శక్తి. పగవల్ల మేధ పదునెక్కి లైట్ ఫోకస్‌లా సర్వశక్తులూ ఒక్క విషయంమీద కేంద్రీకరించుకుంటాయి కాబోలు.

తాను ఎన్ని పాములనో చంపాడు. అయినా తనకు కావలసినపాము దొరకదు. ఎండమావులలాగ అతన్ని కవ్వించి కవ్వించి మాయ మయిపోతుంది.

పరీడా ఓపిక రోజు రోజుకి క్షీణించిపోతుంది. మనిషి కూడా మునుపటిలాగ ఇప్పుడు చిరునవ్వుతో కనపడటంలేదు. ఎప్పుడూ ఏదో మబ్బు కమ్మినట్లు బరువుగా ఉంటున్నాడు.

ఒకరోజున తోటలో కలుసుకున్నపుడు ఇలా అన్నాను. "ఇలా ఎన్నాళ్లు పరీడా? ఒక పాములవాడిని తీసుకువచ్చి ప్రయోగించకూడదా? నాగస్వరానికీ, మంత్రానికీ లొంగని పాము ఉండదు కదా!" అని సలహా ఇచ్చాను.

పరీడా తల అడ్డంగా వూపుతూ, మొహం ఒక ప్రక్కకు తిప్పుకొని ఒక చేయి పైకెత్తి మేనక దగ్గర విశ్వామిత్రుడి పోజులో "అలా వీల్లేదు బాబూ. ఆ యెదవని ఈ చేత్తో నేనే చంపాలి. ఈ వ్యవహారం మా ఇద్దరి మధ్యనే తేలిపోవాలి. పాములవాడూ, మంత్రగాడూ ఇందులో చొరపడ్డం నేను సహించను" అన్నాడు. ఖండాయత్ (క్షత్రియకులం) బిడ్డ పరీడా, ఇంకో విధంగా ఎలా మాట్లాడతాడు?

నాగస్వరం పాముని బయటికి తీసుకు రావడానికేననీ, అది ఎదుటికి వచ్చాక, దానితో తానే పోరాడి చంపవచ్చునని నచ్చ చెప్పడానికి ప్రయత్నించినా లాభంలేకపోయింది. అసలు ఈ వ్యవహారంలో ఇంకో మనిషి జోక్యం సహించ డతను. ఇదేమి పూర్వజన్మ సంబంధమోమరి.

ఆవేళ వాహ్యాళి పూర్తిచేసుకుని తిరిగివస్తున్నాం. దూరంగా మామిడి గుబురుల్లో 'పీకహా పిట్ట పీకహా (ప్రియుడు ఎక్కడ), పీకహా అంటూ తన ఆవేదన అంతా వలకబోస్తూ, మధురంగా గానం చేస్తోంది. గుండెలు పిండుతూ ఎంత విషాదం ఆ ఆక్రందనంలో! గడచిన రెండు మూడు రోజులు పడ్డ వర్షంవల్ల నేల అక్కడక్కడ చాలా జారుడుగావుంది. గట్టుకి ఒక ప్రక్క ఎత్తుగా దైవజ్ఞుల్లా తలలు పంకిస్తున్న వెదుళ్లతో పెద్ద వేణువనం. రెండవ ప్రక్క అరటితోట. ఆకాశంలో అక్కడక్కడ మబ్బులు. చల్లగా తేమగాలి, ఎవళ్ల ఆలోచనల్లో వాళ్లం ముడుచుకుపోయి నడుస్తున్నాము. జారకుండా జాగ్రత్తగా రాళ్లమీద అడుగులేస్తూ నడుస్తున్నాము. హఠాత్తుగా ప్రక్కన ఏదో అలికిడైంది. నేను ప్రక్కకు తిరిగి చూచేసరికి పరీడా నా ప్రక్కలేడు. మెరుపు మెరిసినట్లు గట్టుదిగి వేణువనంవైపు పరిగెత్తాడు అప్పుడే. నేను సర్దుకొని చూచేసరి కప్పుడే అతని ఈటె పైకి లేవడం, బుస్సుమన్న శబ్దంతో క్రిందకు దిగిపోవడం జరిగిపోయింది. కంగారుగా ఏం చేస్తున్నానో తెలియకుండా నేనూ కిందకి పరిగెత్తాను. పరీడా క్షేమంగానే ఉన్నాడు. ఒక ఎత్తైన పెద్ద రాతి బండమీద నిలబడ్డాడు. ఎవడో రాక్షసుడి నిట్టూర్పులలాగ పాము బుసలు ఎడతెరిపి లేకుండా వినిపిస్తున్నాయి. రాతిమీదెక్కి క్రిందకి చూచాను. గొడుగులాటి పెద్ద పడగతో పైకిలేచి బుస కొడుతున్నది పెద్దతాచు. మేము దానికి ఒక అడుగుపైన ఉన్నాము. శివమెత్తినట్లుగా వూగిపోతున్నది నాగు. విలవిలలాడిపోతున్నది, రాతిని కాటేస్తున్నది. పరీడా ఈటె దాని తలకు తగలవలసినది. కొద్దిగా గురితప్పి నడుముకు కొంచెం ప్రక్కగా గుచ్చుకొంది. అందుకనే పాము విజృంభించింది. అయితే ఈటెతో నొక్కిపెట్టి ఉంచడంవల్ల అంతకన్న పైకి లేవలేకుండా ఉన్నది. ఈటెచుట్టూ చుట్టుకుపోతున్నది ఒకమారు. మరుక్షణంలో కొరడాలా బయటికిపడి పడగతో లేస్తున్నది. పరీడాకి కూడా పరిస్థితి వీలుగా లేదు. రెండో చేతిలోని కర్ర ఉపయోగించడానికి వీలు చిక్కడం లేదు. వగరుస్తూ, "దొరికిందిబాబూ, దొంగ యెదవ" అన్నాడు. అదే అనుకుంటూ అతడు నాతో మాట్లాడిన ఆఖరిమాట. పాముని పరికించి చూచాను. చాలా గొప్ప తాచు. నేను పరీడాని మొట్ట మొదటగా చూచినప్పటిపాముకన్న పెద్దపామే. కాలసర్పంలా విషం కక్కుతూ అది విజృంభిస్తుంటే నాకు కాళ్లు వణికేయ్. పరీడా రొప్పుతూ కర్రపట్టిన రెండవ చేతితో కూడా ఈటెనుపట్టి

యావచ్ఛక్తి ఉపయోగించి, దానిని నొక్కిపెడుతున్నాడు. ఈటెను చుట్టపెట్టుకుని, దానిని కిందకు లాగేస్తున్నది పాము. పరీడా చేతులు వణకడం గమనించాను. అతని శక్తి క్రమేపీ క్షీణిస్తున్నట్లనిపించింది. అయినా సహాయం చేద్దామన్నా చివరకు సమీపిద్దామన్నా ధైర్యం చాలలేదు నాకు. అతనూ ఒక మహా సర్పంలా కనిపించాడు ఆ క్షణంలో. ఆ సమయంలో పరీడా మానుషాతీతమైన శక్తిని ప్రదర్శించాడు. చేతిలో కర్ర జారవిడిచి, ఈటెను రెండు చేతులతోను గునపంలా పట్టుకొని పాముని హింసించసాగాడు. దృశ్యం మహాభీకరంగావుంది. గిలగిలలాడుతూ, చిత్రంగా మెలికలు తిరిగిపోతూ, రెండు మూడుమార్లు పరీడా మీదికి ఉవ్వెత్తుగా లేచింది నాగు. నాలుగయిదు అంగుళాల తేడాలో ప్రమాదం తప్పింది. ఆ రెండు మూడు పర్యాయాలూ అది రాతిని కాటేసింది. కాసేపు భయంకరంగా మృత్యుతాండవంచేసి, ఆ పాము చివరకు అంత ఎత్తునుంచీ ప్రక్కనేవున్న రాతిమీద పడగ వేసి కొట్టుకుంది. అలా ముమ్మారు కొట్టుకుని మరి లేవలేదు. తల పూర్తిగా చితికిపోయింది. జాతైన తాచు శత్రువుచేతిలో చావడం ఇష్టంలేక ఆత్మహత్య చేసికొన్నది.

పరీడా ఈటె కర్రా రెండూ దూరంగాగిరవాటేసేడు. రెండు చేతులతో తలపట్టుకొని, జుట్టు పీక్కుని వెనక్కు తిరిగేడు. సర్వస్వమూ కోల్పోయినవాడిలా, పిచ్చివాడిలా, నన్నేనా గమనించకుండా నడచిపోసాగాడు. నా కంతా దిగ్భ్రమగాఉంది. అసలీ పాము పోరాటంతోనే నాకు సగం మతిపోయింది. దానినుండి ఇంకా కోలుకోకుండానే పరీడా వింత ప్రవర్తనవల్ల నాకు పూర్తిగా మతిపోయినట్లనిపించింది.

తన చిరకాల వాంఛితం నెరవేరింది. ప్రబల శత్రువు మరణం కళ్ల చూశాడు. మరి ఈ అస్త్రసన్యాసమేమిటి? ఈ నిస్పృహ ఎందుకు వచ్చింది? అంతా అగమ్య గోచరంగావుంది.

వెనుకనుంచి అతని జబ్బ పట్టుకొని, "ఏం పరీడా, ఏం జరిగింది?" అని అడిగాను కంపిస్తున్న కంఠంతో.

పరీడా బదులు పలకలేదు. పైగా నే నెన్నడూ అనుకోని విధంగా ప్రవర్తించాడు. నా చేతిని మోటుగా విసరికొట్టి, విసవిస నడచిపోయాడు. ఖిన్నుడనయ్యాను. "పోనీలే. ఆవేశంనుండి ఇంకా తేరుకోలేదన్నమాట. నెమ్మదిగా అతనే సర్దుకొంటాడు" అనుకొని మా ఇంటివైపు నడిచాను.

* * * *

మర్నాడు స్నానాదికాలు ముగించుకొని బయటికి వెళ్లేదుస్తులు వేసుకుంటుంటే సాహూ ఆదరా బాదరాగా పరుగెత్తుకొనివచ్చి, "ఈ సంగతి విన్నారా, పాపం! పరీడా చచ్చిపోయాడట" అని కేకేశాడు. పిడుగు పడ్డట్టుగా అయి ప్రాన్పడిపోయాను. "మా పాలికాపు ఇప్పుడే మోసుకొచ్చాడు ఈ వార్త. గట్టుమీద నడుస్తూ కాలుజారి పడిపోయాడట. కింద రాతిబండ తగిలి తలపగిలిపోయిందట. తెల్లవారేటప్పటికి శవం కనిపించిందట" అన్నాడు.

"అరే, చిన్న సాయంత్రమే ఆ పాముని చంపేడే. పదండి చూద్దాం" అంటూ బయలుదేరాను. సాహూ, అతని పాలికాపు కూడా వచ్చారు. గట్టు అక్కడక్కడ చాలా జారుగా ఉన్నమాట నిజమే. కాని, పరీడా జారిపడ్డాడంటే నాకు నమ్మకం కలగలేదు. ఎన్నో సంవత్సరాలు ఆ గట్టుమీద నడిచిన పరీడా, ఇప్పుడు జారి పడ్డాడంటే అంత తేలికగా నమ్మలేకపోయాను. వేణువనం దగ్గర కొచ్చాము. గట్టుకింద దూరంగా పరీడా పారేసిన ఈటే కర్రా అలాగే ఉన్నాయి. అక్కడికివెళ్ళి బండమీదెక్కిచూశాము. కింద రాతిమీద పగిలిన తలతో బ్రహ్మాండమైన ఆ తాచు నిర్జీవంగా పడిఉంది. ఇప్పుడు కొద్దిగా తాపీగా చూడగలిగాను. రెంచు గజాలు మించిన పొడవు. వర్ణించడానికి వీల్లేని చిత్రమైన రంగు. ఈ రకం తాచుని ఇంతకుముందు నేను చూడలేదు. పరీడా ఇంట్లో ఉన్న చర్మాలలో కూడా ఇటువంటిది లేదు. నడుంమీద పరీడా ఈటె గుచ్చుకొన్నచోట గాయం స్పష్టంగా కనిపిస్తున్నది.

మళ్లీ గట్టెక్కి ముందుకు నడిచాము. మూడు ఫర్లాంగుల కవతల పరీడా శవం కనిపించింది. బాగా నిటారుగాఉన్న గట్టుకింద రాతిమీద పగిలిన తలతో బోరగిలాపడి ఉన్నాడు. పరీడా. ఎందుకనో చటుక్కున పరీడాకు బదులు ఆ పామే అక్కడ పడి ఉన్నట్లనిపించింది. కన్నులు నులుముకొని చూశాను. పరీడా తలపెట్టిన సర్పయాగం చివరికి ఆత్మ బలిదానంతో సమాప్తమయింది. అతని పగతీరిపోయింది. ఇక విశ్రాంతి తీసుకొంటాడు. నా కన్నులు చెమ్మగిలాయి.

గుండెల్లో ఎవరో చెయ్యిపెట్టి కెలికినట్లయింది. నేను ముందురోజు ఇంటికి వచ్చెయ్యకుండా పరీడాతో ఉన్నట్లయితే ఇలా జరిగేది కాదేమో అనిపించింది.

అయినా పరీడా ఎందుకిలా చేశాడు?

నాగు ఆత్మహత్య చేసికొని, తన్ను పరాభవించిన అవమానం భరించలేక, తానూ ఆత్మహత్య చేసికొన్నాడా? లేక తాను ఏ పగ కోసం ఇన్నాళ్లు జీవించాడో ఆ పగ తీరిన పిదప ఇక బతక నక్కర లేదనుకొన్నాడా? లేకపోతే నిజంగానే ప్రమాదవశాత్తూ కాలుజారి పడ్డాడా? ఇవేమీకాక, కథల్లోలాగ ఇదేమైనా సర్పశాపమా?

సమాధానం నాటికీ, నేటికీ దొరకలేదు.

కాని, రాతిమీద పగిలిన తలతో ఆనాగుపామూ, అల్లంత దూరంలో ఇంకో రాతిమీద పగిలిన తలతో పాములాగే బోరగిలా పడి ఉన్న పరీడా తరచుగా జ్ఞాపకం వస్తూనే ఉంటారు.

పాల్కురికి సోమనాథుని లఘుకృతులు

శ్రీ నిడుదవోలు వేంకటరావు

పాల్కురికి సోమనాథ మహాకవి[1] చతుర్వేదసారమును పునర్ముద్రణముచేసి, ఆంధ్ర విద్వల్లోకమున కందించిన శివశ్రీ బండారు తమ్మయ్యగారు నేడు సోమనాథుని లఘుకృతులను నొక్కచో సంగ్రహించి గ్రంథరూపమున వెలయించినారు. సారస్వత పరిశోధకు లెల్లరు వారికి కృతజ్ఞతాబద్ధులు.

ప్రస్తుతము ప్రకటితములైన పాల్కురికి సోమనాథుని లఘుకృతులన్నియు, స్వరూపమున లఘుకృతులేకాని, సాహిత్య ప్రక్రియా వైవిధ్య దృష్ట్యా పరిశీలించిన నివి ''అలఘుకృతులు''. సోమనాథుడు తెలుగు వాఙ్మయమున, ద్విపదశాఖకేగాక, శతక, ఉదాహరణ, రఘుట (రగడ) ముక్తక, అంతాది రచనల కన్నింటికి మూల పురుషుడు. వీనిలో ద్విపద శాఖలో ప్రాథమికములు, ప్రౌఢతరములగు బసవ పురాణ పండితారాధ్య చరిత్రము లీ వఱకే ఆంధ్ర గ్రంథమాలాధిపతుల మూలమున నందరకు సుపరిచితములైనవి. శతకశాఖ కాద్యమగు వృషాధిప శతకమును, శతకమంజరిలో నాంధ్ర గ్రంథమాలాధిపతులే ప్రకటించిరి. ఇంక మిగిలిన ఉదాహరణాది గద్యకృతు లిందు ప్రకటితములైనవి. ఈ రచనలలో సంస్కృతాంధ్ర కర్నాట భాషా రచనములు మూడును గలవు.

వాని వివరణము:

1. గద్య (రగడ) కృతులు:—
   1. పంచప్రకార గద్య, 2. నమస్కార గద్య, 3. అక్షరాంక గద్య, 4. శరణు బసవ రగడ.
2. పద్యములు. ౧. అక్షరాంక పద్యములు[2],
   ౨. చెన్నమల్లు సీసములు.
3. ద్విపదలు:—1. సోమనాథస్తవము.
   2. సహస్ర గణమాలిక.
4. ఉదాహరణము (తెలుగు)
5. ముక్తకములు. బసవ పంచరత్నములు.

సంస్కృతము

1. సంస్కృత బసవోదాహరణము.
2. వృషభాష్టకము.
3. త్రివిధ లింగాష్టకము.

కన్నడము

బసవలింగ నామావళి.

గద్య (రగడ) కృతులు

తెలుగున రగడ ఛందస్సును మొదట ప్రచారములోనికి దెచ్చినది సోమనాథుడే. రగడ దేశిచ్ఛందోభేదము. మాత్రాగణ బద్ధము. తాళ లయాన్వితము. సోమనాథుని రగడలు, గద్య కృతులని వ్యవహరింప బడుచున్నవి. దీనికి కారణము ఛందస్సంప్రదాయము ననుసరించి, ఇవి రగడలు. కాని, రచనా సంప్రదాయమున ననుసరించి ఓజోగుణయుక్తమగు సమాసపద బంధుర రచనలు.

తెలుగు ఛందో గ్రంథములలో ప్రాథమికమగు కవిజనాశ్రయమున 'రగడ' ల లక్షణములులేవు. కావ్యాలంకార చూడామణిలో నసమగ్రముగ నొక్క రగడకు మాత్రమే లక్షణము గలదు.[3] అనంతుని ఛందమున రగడలను గూర్చిన లక్షణము సమగ్రముగ గలదు. కన్నడభాషలో, మందానిల, లలిత, ఉత్సాహ అను మూడు విధములగు రగడలు కలవు. కాని, కన్నడ రగడలలో ప్రాసయేకాని, యతి నియమములేదు. కన్నడమున పంప మహాకవి రగడలను చంపూ కావ్యమున ప్రవేశపెట్టినను, ప్రత్యేకముగ 'రగడ' కృతులను వెలయించిన కీర్తి హరీశ్వరునిది. ఈతడు 'రగళెకవి' యని వ్యవహృతుడైనాడు. ఈతనికృతి 'శివగణదరగళె' హరీశ్వరుని కాలము క్రీ. శ. 1165[4] సోమనాథుడు క్రీ. శ. 1160—1240 ప్రాంతమువాడుగావున నీ రగడ రచనను హరీశ్వరుని రచననుండి గ్రహించినాడనుట కాధారములేదు.

పంచప్రకార గద్య

ఈ గద్యనుగూర్చి పీఠిక (8 వ పుట) లో నిట్లు గలదు. ''సోమనాథుని గద్య కృతులలో నిదియే కొంత పెద్దది. అయిదు విధములగు గద్య లిందు గూర్పబడుటచే దీనికీ పేరు పెట్టినట్లు తోచుచున్నది. మల్లికార్జున పండితారాధ్యుడు చెప్పినట్లుగా

---

1. దీనినిగూర్చి భారతి ఆగస్టునెల సంచికయందు నా వ్యాసము గలదు.

2. పై వానిని శ్రీ తమ్మయ్యగారు ఆంధ్రపత్రిక, ప్రజోత్పత్తి (1931—32) అంగీరస (1932—33) శ్రీముఖ (1933—34) భావ (1934—35,) యువ (1935—36) సంవత్సరాది సంచికలయందింతకుముందే ప్రకటించియున్నారు.

3. క. సరియౌ పది రేకులచే
బరఁగుడి నుత్సాహ వృత్త పద యుగళముచే
నిరవుగవడి ప్రాసంబుల
నరుదుగ రచియింప 'రగడ' యగు తగు వృత్తిన్
చతుర్థోల్లాసము 40 వ పద్యము.

4. కర్నాట కవిచరిత్ర—ప్రథమ సంపుటము—
పుటలు 224—233.

"పాంచ భౌతిక పంచ పంచేంద్రియ ప్ర
పంచదూరు నుతించు పంచ గద్యలను"

అని పండితారాధ్య చరిత్రములో నుదాహృతములైన పంచ గద్యలు కూడ నిట్టివే కావచ్చును.''

పై వాక్యములో పండితారాధ్య చరిత్రమున నుదాహృతములైన "పంచగద్యలు" పంచ ప్రకార గద్యలని గ్రంథ సంపాదకులూహించిరి. కాని, యది సరికాదు. పండితారాధ్యుడు చెప్పిన గద్యలు, పంచగద్యలు—అనగా నైదు గద్యకృతులు. ఆ యైదింటిలో

1. శ్రీ ముఖదర్శన గద్య[1]
2. అక్షరాంకగద్య[2]
అనునవి లభించినవి.
3. లింగోద్భవ దేవు గద్య

పండితారాధ్యుడు-చందవోలులో, బౌద్ధ, జైనాదిమతముల ఖండించిన వెనుక నచ్చటి లింగోద్భవదేవుని యాలయమున 'లింగోద్భవ దేవు గద్యము చెప్పినట్లుగా మహిమ ప్రకరణమున[3] నిట్లు గలదు.

"నరి భక్తతతికి విస్మయమాచరించి
యుద్యత్ప్రసక్తి లింగోద్భవ దేవు
గద్యంబు నా నొక్క గద్యంబు చెప్పి"

లింగోద్భవ దేవు గద్య—గద్యకృతియని పై పంక్తులవలన దెలియ గలదు. కాని, ఇది లభింపలేదు. శ్రీనాథమహాకవి హర విలాసమున ప్రస్తుతము గ్రంథాంతముననున్న, దారుకావన విహార సందర్భమునగల 'లింగోద్భవ గద్య' పండితారాధ్యకృతి యగు నా సందియము గలుగుచున్నది. శ్రీనాథమహాకవి పండితారాధ్య చరిత్ర పద్య ప్రబంధముగా రచించెనుగదా. పండితునియందలి భక్తి గౌరవములచేత నాతని కృతి నిందు సంధానించి యుండవచ్చునుగదా.

తక్కిన గద్యల వివరము తెలియుటలేదు. దీనినిబట్టి పండితుని కృతులైదు గద్యలని చెప్పవచ్చును.

పంచ ప్రకారగద్య ఛందస్సు

ఈ గద్యయందు నూరుపాదములు గలవు. అవి యైదు విధములు.

1

జయ జయ బసవ శ్రీమన్మహావృష భేంద్రావతార!
సమంచిత వీర మహేశ్వరాచార
ప్రమథ గణాలంకార! జగత్త్రయా
ధారా దేవ బసవా! (చూర్ణిక).

ఇట్లనుప్రాసలతో 33 పాదములుగల 8 భాగము లిందు గలవు.

2

"అపిచ మ హామహి మోన్నత విభవా
భవపాశోత్కర శాత లవిత్రా
విత్రాసిత"

ఇది నాలుగేసి మాత్రలకు విఱుగును. చతురస్రగతి, మధురగతి రగడ, ఏకతాళము. ఈరగడ 16 పాదములు. ముక్తపదగ్రస్తము.

3

జయ జయ నిరవధి నిర్మల గాత్రా
జయ జయ దురిత లతాచయదాత్రా

ఇదియు చతురస్రగతి—మధురగతి రగడ—పై దానిని పోలినదే. 31 పాదములు. ఇందంత్యానుప్రాసము పాటింపబడినది.

4

జయ దురిత పరిహరణ
జయ సుకృత పరిచరణ

ఇది యైదేసి మాత్రలకు విఱుగునది. ద్విరదగతి రగడ. ఖండగతి. జంపెతాళము. 12 పాదములు.

5

జయశివ రంజన
జయభవ భంజన

ఇదియు మధురగతి రగడయేకాని, యర్ధ భాగము. 8 పాదములు. చూర్ణికలో 'దేవ బసవా' అను 8 మకుటములను పాదములుగా లెక్కించిన 108 పాదములగును.

నమస్కార గద్య

అపిచ శ్రీప్రమథేంద్రా యనమో
వ్యసగత హృద్గత తంద్రా యనమః

ఇది మధురగతి రగడ చతురస్రగతి—ఏకతాళము. ఇది నాల్గేసి మాత్రలుగా విరుగును. మొదటి పాదమున అపిచ—చ గురువుగావ రెండు మాత్రలు, 'అపి' రెండు మాత్రలు మొత్తము నాలుగు మాత్రలు. 'యనమో'-యన రెండు మాత్రలు 'మో' దీర్ఘము గాన రెండు మాత్రలు. మొత్తము 4 మాత్రలు. రెండవ పాదమున నమః అనుచోట విసర్గతోగల యక్షరము గురువు కావున ఛందస్సు కుదురుచున్నది. ఇట్లు నమోవాకముతో 118 పంక్తులైన వెనుక నీ క్రిందిభిన్నరగడ పాదము లాఱు గలవు.

మంగళ ప్రసంగ సంగన బసవలింగాయ
తే నమస్తే నమస్తే నమస్తే నమః
మఘవత్ప్రణుత పదాబ్జాతాయ పూతాయ
విఘన త్రితయ సుఖోద్ధరణాయ శరణాయ
కుసుమశర రిపు భక్త వృషభాయ వృషభాయ
బసవాయతే నమస్తే నమస్తే నమః

ఈ యాఱును జయభద్ర రగడ పాదములు.

---

1. శ్రీముఖదర్శనగద్య—ఆద్యంతములు ఆంధ్రగ్రంథమాల బసవ పురాణ పీఠికలో నీయబడినది.

2. అక్షరాంక గద్య—(పండితారాధ్య కృతము)—భారతి రజతోత్సవ సంపుటము "ఆంధ్ర వీర శైవ వాఙ్మయము" అను వ్యాసమున నీయబడినది.

3. పండితారాధ్యచరిత్ర. మహిమా ప్రకరణము పుట 23.

ఇది 5 మాత్రలకు విఱుగును. ఖండగతి, జంపె తాళము.

మంగళప్ర సంగసం గనబసవ లింగాయ

తేవమ స్తేనమ స్తేనమ స్తేనమః (హ)

ఈ నమస్కార గద్యపాద సంఖ్యనుగూర్చి ఇంకను పరిశోధన జరుగ వలసియున్నది.

అ క్ష రాం క గ ద్య

అఫిచ శివ శృంగార ఓం

ఆది పద విస్తార ఓం

ఇది య్యెదు మాత్రలకు విఱుగునది. ద్విరదగతి రగడ, ఖండగతి, జంపె తాళము. అక్షరములన్నియు ప్రణవము (ఓం) నుండి పుట్టినవి గావున ప్రతిపాదము చివర 'ఓం' కలదు.

శరణు బసవ రగడ

శ్రీ కృష్ణాధి నాయ కప్ర సిద్ధ భావ శరణు బసవ

తావకాంఘ్రిసేవ కాఘ—దావ (దావ) శరణు బసవ

ఇది తురగవల్గన రగడ—మూడేసి మాత్రలకు విఱుగునది. త్రిస గతి, రూపకతాళము.[1]

అం తా ది ర చ న లు

అక్షరాంక గద్య పద్యములు, తెనుగున 'అంతాది' రచనలు అను శాఖకు జెందినవి. అట్టి రచనలలో సోమనాథునివే ప్రథమములు. తమిళమున, కన్నడ భాషలో సోమనాథునికి ముందిట్టివియున్నవి. కన్నడ రత్నత్రయమున [2]'పొన్నకవి 'జినాక్షరమాల' యను పేర జినస్తుతిని కందపద్యములతో నిట్టి రచన కావించి యున్నాడు.

పాల్కురికి సోమనాథుడు, మంత్రశాస్త్ర సిద్ధమగు అక్షమాలా సంప్రదాయము ననుసరించి అకారాది క్షకారాంతముగా నీ గద్య పద్యములను సమకూర్చినాడు. ఇది సోమన భక్తి తత్త్వము ననుసరించి బసవస్తోత్ర రచనయే కావచ్చును. కాని, సోమనాథుడు కేవలము మహాకవి బహు భాషా కోవిదుడు నగుటయే గాక, భాషా శాస్త్ర సంప్రదాయ ప్రవర్తకుడని ఈ రచనలు నిరూపింపగలవు.

అక్షర సమామ్నాయమున ఆంధ్ర భాషా సంప్రదాయము సంస్కృత వర్ణసమామ్నాయమును సంపూర్ణముగ తెలుగుభాషలో గ్రహించినది. తెలుగు వ్యాకరణములలో ప్రాథమికమగు నాంధ్ర భాషాభూషణమునందును, నా వెనుకలక్షణ గ్రంథము లన్నింటి యందును అకారాది హకారాంతము వఱకు వర్ణక్రమము గలదు. ప్రాచీన లాక్షణికులలో అనంతు డొక్కడు మాత్రము 'క్ష కారము ప్రత్యేక వర్ణముగా పరిగణించి యున్నాడు.[3] అనంతుడు 'క్ష' కారమును చేర్చి పంచాశద్వర్ణములను (ఏబది) నిరూపించుటకు సోమనాథుని అక్షరాంక గద్య పద్యములే కారణమని నా యభిప్రాయము.

ఇట్లే 'ౡ' అను దీర్ఘ వర్ణమును పాణినీ యాది వ్యాకరణ కారు లంగీపకున్నను నితర సంస్కృత వైయాకరుణు లంగీకరించి యే యున్నారు. పాల్కురికి సోమనాథుడు 'ౡ' వర్ణమును వర్ణమాలలో పరిగణించియున్నాడు అనంతుడు. తదితర లాక్షణికు లీయని 'ౡ' కారయతిని పరిగణించి యున్నారు.[4]

ఆంధ్ర భాషా సంప్రదాయము ననుసరించి యతిప్రాసలలో ఋ—ౠ, ఌ, ౡ అనునవి తెనుగువారి యుచ్చారణ ననుసరించి రు, రూ, లు, లూ లెట్లయినవి — క్షకారమునకు సంయుక్తాక్షరయతి ఎప్పుడు మొదలిడినది మున్నగు వ్యాకరణ చ్ఛందోవిషయము లెన్నో పై యక్షరాంక గద్య పద్య మూలమున తెలియగలవు. పై వానిలో ఌ ౡ, ఙ, ఞ, ణ అను వర్ణమ్ములను సోమనాథుడు ఏకాక్షర పదములుగా గ్రహించియున్నాడు. వాని కన్నింటికి యర్థము లున్నవి. అట్టి వివరణముతో నీగద్యములు ముద్రితములైనచో సోమనాథునికి గల సంస్కృత భాషా పాండిత్య మింకను విశదముగా విద్వల్లోక మెరుగగలదు. ఈ విషయమును గూర్చి విపులముగా వేరొకచో తెలుపబడును.

సో మ నా థ స్త వ ము

ఈ స్తవము సోమనాథుని కవితా రచనలలో మొదటిది. ద్విపదకృతి. ఈ తరువాతి విమర్శకులు దీనిని సోమనాథుని కృతిగా పరిగణింపలేదు. దీనిని నా జనకులు కీర్తిశేషులు సుందరమ్య పంతులవారు ప్రతినిత్యము పఠియించెడివారు. దీనిని సోమనాథ కృతిగా ముప్పదేడేండ్లక్రిందట నిరూపించితిని.[5] ఈ కృతిలోని పంక్తులకు గొన్నింటికి పండితారాధ్య చరిత్రమున ననువాదము లున్నవి. శివకవుల భాషా లక్షణము లిందు స్ఫుటముగా నున్నవి.

---

1. ఈ పొన్నకవియే తెలుగున 'సర్వదేవకవి' యని ప్రసిద్ధుడైనాడు. ఈతడు 'వేంగి' యందలి పుంగనూరు నివాసి. ఈతనిగూర్చి నా 'కవుల చరిత్ర' చూడుడు.

2. పై రగడల ఛందో లక్షణములన్నియు, పరిశోధన పత్రిక, పాల్కురికి సోమనాథుని సంచికయందు నీయబడియున్నవి. (9—10 ఆగస్టు—నవంబరు 1955)

3. అప్పకవి అనంతుని మతము ఖండించియున్నాడు (2.52)

4. వర్ణక్రమమున నీ రెండేకాక మరికొన్ని విషయములయందు ననంతుడు సోమనాథుని రచనలను పరిశీలించినట్లు స్పష్టముగా తెలియుచున్నది. వానిని వేరే వ్యాసమున నిరూపింతును.

'ౡ' కారమును గూర్చి శ్రీ రావూరి దొరస్వామిశర్మగారు శ్రీ బులుసు వెంకట రమణయ్యగారు శ్రీ నచ. వరదాచార్యులుగారు వ్రాసియే యున్నారు.

5. సోమనాథుని గురుప్రశంస' అను వ్యాసము భారతి 2 సం. సం. 1 (1925)

ఇది ఈ వరకు రెండుసారులు ముద్రితమైనది.[1] ఈ గ్రంథమున గలది మూడవది.

చెన్నమల్లు సీసములు

సీసపద్యములను మకుటముతో చిన్నవిగాను, పెద్దవిగాను రచించుటకు సోమనాథుడే ప్రథముడు. ఇది శివతత్త్వసారము నాధారముగ జేసికొని రచితమైనది. 'చెన్నమల్లు' అనునది శ్రీశైల మల్లికార్జునునికి పేరు. ''చెన్న మల్లేశ శివలింగ శరణు శరణు' అను మకుటముతో గంగాధరకవి యొక సీసపద్య శతకము రచియించియున్నాడు.[2] ఇది శైవులకు ప్రీతిపాత్రమైన శతకమని, శ్రీశైలము మెక్కినపుడు దీనిని పఠింతురని శతక కవుల చరిత్రలో నున్నది. చెన్నమల్లు పదములో సోమనాథుడు సరిగా—చేర్పవేల నన్ను చెన్నమల్లు' అని 'చె' లోని 'ఎ'త్వమునకు యతి గూర్చినాడుకాని, గంగాధరకవి ''చన్న మల్లేశ శివలింగ శరణు శరణు'' అని 'చ' కారమునకు యతి గూర్చినాడు.[3] ఇట్టివి తెనుగున నున్నవి. ఈ కృతిలో షట్స్థలముల వివరణము కలదు.

సహస్రగణమాలిక

ఈ గణమాలికలో, ప్రమథ గణ రుద్రగణయోగాచార్య పురాతన భక్తగణముల పేళ్ళు మాలికగా రచితములైనవి. ఇది సంస్కృత, కన్నడ, తెలుగు భాషలలో నున్నది. తెలుగు భాషలో నీ కృతి పండితారాధ్య చరిత్ర చతుర్థ ప్రకరణమున నున్నది. కావున తెలుగు కృతి సోమనాథునిదే. ఇక కన్నడముననున్న మాలిక కూడ సోమనాథుని కృతియే యని తెలియుచున్నది. సంస్కృతముననున్న గణమాలిక మాత్రము పండితారాధ్యకృతమని కర్ణాటకవి చరిత్ర తెలుపుచున్నది.[4] ఈ గ్రంథ పీఠికలో శ్రీ తమ్మయ్యగారు సంస్కృత గణమాలిక కూడ సోమనాథకృతమేయని వ్రాసియున్నారు. (పుట 14, 15) ఈ గణమాలికలో పండితారాధ్యుల సమకాలికులు గూడ నున్నందున నది పండితకృతము కాదని వారి యభిప్రాయము. కాని, పండితారాధ్య చరిత్రను పరిశీలించుచో, నీ సహస్రగణమాలిక ఇంచుమించుగ నాతని చివర కృతులలో నొకటియని చెప్పవచ్చును.

వెలనాటిచోడుని సభలో బౌద్ధులను జయించిన వెనుక చోడునితో భాషించిన పాపము, శివనిందవిన్న పాపమును పోవుటకు నీ గణ సహస్రనామములు పఠించెను. అప్పటికి తన సమకాలికులగు భక్తులందరును లింగైక్యము జెందిరి. కావుననే యా భక్తుల నందరను, నామాలికయందు జేర్చి పఠించియున్నాడు.

సహస్రగణమాలిక చెప్పిన వెనుక యాతడు, బసవనిచూడ నేగుట, వీని పురమున నుండగా బసవన లింగైక్యము జెందుట, పండితుడు శ్రీశైలమునకేగదలచి, వెల్లటూరువఱకువచ్చి, తా నచటనేయుండి, దోనయ్యకు, పర్వత వర్ణనచెప్పి, అతని నక్కడకు బంపెను. అతడును శ్రీశైలమున శివరాత్రి వ్రతము చెల్లించినవెనుక పండితారాధ్యుడు లింగైక్యము జెందెను. ఆ సమయమునకు ముందుగా, తన్ను కూడ నాసహస్ర గణములలో జేర్పుమని ప్రార్థించుటయే పండితారాధ్య కర్తృత్వమునకు సాధకము. ఆ భాగమును పండితారాధ్య చరిత్రమునుండి యుదాహరించుచున్నాను.

''ఊర్జిత ప్రమథాత్మ! యొండేమిమల్లి
కార్జున పండితుండనగ నిచ్చోట
నుండుటకంటె యెన్నండొకో ప్రమథ
మండలిలో భవన్మహదాజ్ఞఁజేసి
యుండంగఁ గాంతు నొకోయనికోరు
చుండుదునన్నట్టులనుపగదయ్య
నావాఁడు వీడు నుండీ వేఱుగాఁడు
నా విన్న నువున గణంబుల నడుమ''

పర్వత ప్రకరణము 545 పుట.

ఈ సహస్ర గణ మాలికా పఠనము విజయనగర రాజ్య పాలకులగు వీరనరసింహరాయల కాలమునుండియు జరుగుచున్నట్లు రాయలవాచకమునుండి తెలియు చున్నది.

''రాయలవారు బ్రాహ్మీ ముహూర్తమునలేచి ఆరాధ్యుల వారి నామావళులున్నూ''......

(రాయల వాచకము—మొదటి పుట)

ఇచట యారాధ్యులవారి నామావళులనగా సహస్రగణ మాలికయే.

ఈ మాలికా పఠన మత్యంత మహిమాన్వితమైనది. కావుననే సోమనాథుడు గ్రంథాంతమున దీనిని ప్రత్యేకముగ పేర్కొన్నాడు.

''అరయనీ కృతి సార్థమగు చతుర్థ ప్ర
కరణ మధ్యమున సంకలితమై వెలుఁగు
నవ్యగత సహస్ర నామస్తవంబు
భవ్యంబు పఠియించు ఫలకాంక్షులకును
నైహికాముష్మి కాద్యఖిల సంపత్స
మైహితాభీష్ట ముఖ్యము లొందుననిన
ప్రమథ రుద్రాది పురాతన నూత

1. 1894 లో నేలూరిలో బాలాత్రిపురసుందరీ ముద్రాక్షరశాల.

2. 1932. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక 21 సంపు. 1 వ సంచిక.

3. చమట—చెమట. చరకు—చెరకు—చరలాడు—చెరలాడు. ఇట్టివానికి యతిస్థానమున ప్రయోగములున్నవి.

4. కర్ణాట కవి చరిత్ర—ప్రథమ భాగము-పుట 75

సమహా గణాభివర్ణనము లోకములకు" 552 పుట.

ఈ కాలపువారు నమ్మినను నమ్మకున్నను, నీ సహస్ర గణమాలికను బహుకాలము పారాయణముచేసి, నా జనకులు కీర్తిశేషులు సుందరముపంతుల వారభ్యుదయము చెందిరన్న విషయము నేను స్వయముగా నెఱిగినది.

సహస్రగణమాలికలో నీ క్రింది గణముల పేళ్లుండును— 1. ప్రమథ గణములు. 2. రుద్రగణములు. 3. యోగాచార్యులు 4. అరవత్తుమువురు. 5. షోడశగణములు. 6. దశగణములు. 7. త్రయోదశ గణములు, 8. పురాతన భక్తులు — వీరందరి సంఖ్యయు సహస్రముగా నుండవలెను. కాని, ప్రస్తుత ముద్రణమునగాని, పండితారాధ్య చరిత్రమునగాని ఈ సంఖ్య నిర్ణయించుటకు నాధారములేదు. కన్నడ భాషలో గణసహస్రనామమను గ్రంథమున 1066 గణముల నామములు కాననగుచున్నవి.[1] అందు.

ప్రమథ గణములు	—	430
రుద్ర గణములు	—	149
యోగాచార్యులు	—	22
అరవత్తుమువురు (నాయనార్లు)	—	67
షోడశులు	—	16
దశ గణములు	—	10
త్రయోదశులు	—	13
పురాతనులు	—	359
(అమరగణము)		1066

కన్నడకవి చరిత్రయం దిచ్చిన పై సంఖ్య సరికాదు. యోగాచార్యులు, 28 అరువత్తుమువురు 63 అను సంఖ్య స్పష్టముగా సోమనాథుడు నిర్దేశించియున్నాడు. పురాతనులలో కన్నడాంధ్ర దేశమున శివభక్తులు, బసవ పండితారాధ్యుల సమకాలికులు. పండితత్రయమున శ్రీపతి పండిత శివలెంక మంచెన పండితులు నిందుగలరు. పండితారాధ్య చరిత్ర వ్రాతప్రతులను కన్నడ సంస్కృత భాషాంతరీకరణములను పరిశోధించి ఈ సహస్ర గణమాలిక స్వరూపమును నిర్ణయింపవలసియున్నది.

సంస్కృతాంధ్ర బసవోదాహరణములు

ఉదాహరణ కావ్యములు తెలుగుభాషకేకాక, దేశ భాషలలో తెలుగునకు ప్రత్యేక విశిష్టత సంపాదించినవి. సంస్కృత భాషల యందు నీయుదాహరణలు లేవు. సంస్కృతాంధ్ర భాషలలో ఉదాహరణ వాఙ్మయమునకు మూలపురుషుడు సోమనాథుడే.[2] ఇందు సంస్కృతాంధ్రోదాహరణములు మూడు పరియాయము లీవరకే ముద్రితమై యున్నవి. ప్రస్తుత గ్రంథమున యుదాహరణ విశిష్టత యేమాత్ర మెరుకపడదు.

వృషభాష్టకము

ఇందు ప్రకటితమైన వృషభాష్టకమునకును, క్రీ. శ. 1955 లో పరిశోధన పత్రికలో పాల్కురికి సోమనాథుని ప్రత్యేకసంచికయందు ప్రకటితమైన వృషభాష్టకమునకు పాఠభేదములు కాన్పించుచున్నవి. పరిశోధన పత్రికలో ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగార ప్రతులతో సంప్రతింపబడి ముద్రింపబడినది.

పాల్కురికి సోమనాథుని లఘుకృతులన్నియు ప్రత్యేక ప్రత్యేక పీఠికా విశేషములతో సమీచీనముగ ముద్రింపబడినగాని వాని విశిష్టతను విద్వల్లోక మెరుంగదు. అయిన నీ కృతుల నేకాకారమున నొక గ్రంథమున సంతరించిన శ్రీ తమ్మయ్యగారెంతయు నభినందనీయులు.

ఆంధ్ర గ్రంథమాలాధిపతులు, సోమనాథుని వృషాధిప శతకముతో గూడ నీ కృతులను, విపుల పీఠికా వ్యాఖ్యా సమేతముగ బ్రకటింతురు గావుతమని యభ్యర్థించుచున్నాను.

---

1. కర్ణాటక కవి చరిత్ర, 294, 295 పుటలు.

2. తెలుగున నీ యుదాహరణ వాఙ్మయమును బరిశీలించి వాఙ్మయమున దానికిగల ప్రత్యేక విశిష్టతను, మొట్టమొదట నా యుదాహరణ వాఙ్మయ చరిత్ర మూలమున వెల్లడించితిని. ఆ తరువాతి సాహితీ విమర్శకులు, సారస్వత చరిత్రకారులు దానినే యనువదించిరి. నా గ్రంథములో ముద్రితా ముద్రితోదాహరణముల సమస్త వివరణములున్నవి. ప్రస్తుత మది పునర్ముద్రణము కావలసియున్నది.



20 సంవత్సరముల తరువాత మీయొక్క ఈ చిన్నారి
కూతురు తను కన్న బిడ్డనే ముద్దు లాడుచుండగలదు.

ఆమె గృహిణిగా - కన్నతల్లిగా ఆదర్శ మాతృమూర్తిగా కావాలనేగ మీ కోర్కె. అందుకు తగిన విద్యాబుద్ధులు చెప్పించండి. ఆడపిల్లలకు కావలసిన వంట, కుట్టుపని, గృహనిర్వహణ, శిశు సంరక్షణ, మొదలైన అనేక విషయాలలో స్త్రీలకు ప్రత్యేక శిక్షణ యిచ్చుటకు కళాశాలలు వున్నాయి. ఇప్పటినుండి ప్రయత్నిస్తే యీనాటి మీ చిన్నారి చిట్టికి ఆనాడు తగిన శిక్షణ యిప్పించగలరు. అందుకో సులభమైన మార్గం వుంది.

అలాగే, ఆమె వివాహ ఖర్చులు అంటారా! అందుకు ఆనాడు డబ్బు కావాలంటే యీనాడే మేల్కొనటం మంచిదికదా! అందుకు కూడా మంచి మార్గముంది.

ఈ రెండు మార్గాలుకూడా జీవిత భీమాయే: ఒకటి విద్యావార్షిక పట్టా. రెండోది వివాహ ఎండోమెంటు పట్టా. ఈ రెండు పట్టాలవల్ల, మీరు ప్రీమియములన్నీ చెల్లించేవరకు జీవించి వుండకపోయినా, ఆమెకొరకు మీరు ఆదా చేయదలచుకున్నంత సొమ్ము ఆమెకు చెల్లించబడును. మరి ఏ యితర విధమైన పొదుపు మార్గము మీకు యీ ప్రయోజనాన్ని కలిగించదు. వివరాలకు జీవిత భీమా ఏజెంటునుగాని, దగ్గరలోనున్న కార్పొరేషను కార్యాలయంలోగాని సంప్రదించండి.

జీవిత భీమాకు
ప్రతిగా మరొకటి లేదు

ముత్తుస్వామి దీక్షితులు

శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావు

2

శ్రీముత్తుస్వామి దీక్షితుల సంగీత రచనలను గురించి కొన్ని ముఖ్యమయిన అంశములు తెలుసుకొనవలయును. సంగీత త్రిమూర్తులలో రుద్రాంశము వీరిది. రాగ ప్రధానమయినది వీరి రచన, భావ తాళములు రాగమున కుపకరించునవి. త్యాగయ్యగారి సాహిత్య భావములు, దైన్యావస్థలు, నిందా స్తోత్రములు వీరియందు గానరావు. శివుడు శ్మశానవాసి. నిరంతరము తపస్సులో నిమగ్నులై ఉండుటయు, కోపమున ప్రపంచమును భస్మీపటలము గావించు మూడవకన్ను గలవాడు. వీరి కీర్తనలందు తత్తుల్యమగు కాఠిన్యత గలదు. ఈశ్వరుడు క్షిప్రప్రసాది. వీరి కీర్తనలూ అంతే. ఒక కీర్తనతో ఒక రాగము పూర్తిగా వశము కాగలదు.

మహావిష్ణువు, శివుడు హిందూ దేవతలలో అర్చనల నెక్కువగా పొందినట్లు త్యాగయ్య దీక్షితుల కీర్తన లెక్కువ వాడుకలో నున్నవి. వారు కర్ణాటక సంగీత దేవతకు రెండు నేత్రములు. తంజావూరులోని మహా విద్వాంసుల మెప్పును, పండిత పామరుల మెప్పును పడయగల్గిరి. ఇప్పటిలో పండితుల మెప్పు అవసరమన్న జ్ఞాపకమే రాదు. అట్టి మెప్పు పొందని రచనలు కొంతకాలము మాత్రమే దీపావళి తారాజువ్వలవలె ప్రకాశించి ఉన్న తావు తెలియక అంతరించును. కాలవ్యవధియందు కలకాలము నిలచి ప్రజాహితమును చేకూర్చు అంశములు (Classical elements) నశించక కాపాడు భారము గాయకులపై ఉన్నది.

వర్ణములు, పదవర్ణములు, కీర్తనలు, రాగమాలికలు దీక్షితులవారు వందలాదిగా రచించిరి. ఎక్కువగా సంస్కృత భాషయందును, కొన్ని తెలుగునను, ఒకటి రెండు మణిప్రవాళ భాషయందును రచించిరి. త్యాగయ్యగారి వలె భాషకు (Lyrical importance) కవితా మహత్త్వమును వీరు ఇవ్వలేదు. అట్టి దివ్యనామ సంకీర్తనలు, గేయ నాటకాలు లేవు. వీరి యిద్దరి రచన అందునూ గమనించతగిన సామాన్యమయిన గుణ విశేషములు అనేకము లున్నవి. ప్రసిద్ధరాగము లనబడు తోడి, శంకరాభరణము, బిలహరి మొదలగు రక్తి రాగములందు రాగ మొక్కటికి నాలుగయిదు కీర్తనలు చేసిరి. అనేక దేశీయములయిన పాటలందు నిమగ్నమయి యుండిన మట్లను సముద్ధరించి రాగ మర్యాదను చేకూర్చిరి. దీక్షితుల వారి 'మాయే', మాహరీరాగ కీర్తన, పున్నాగవరాళి కీర్తనలు ఇట్టివి. అపరూప రాగములందు అనేక కీర్తనలు రచించిరి. "డెబ్బదిరెండు మేళకర్తలందు ఒక చిన్న కీర్తన, ఒక పెద్ద కీర్తన కలవు, కాని నేడవి లభ్యమగుట లే"దని శ్రీ టి. ఎల్. వెంకట్రామయ్యరుగారు చెప్పిరి. మరుగుపడినవి అటుంచి నేడు దక్కిన కీర్తనలు కూడ రమ్యముగా నున్నవి. వివాది స్వరము లను సరిగమ లేక పదనిస అని మామూలుగా ప్రయోగించక లంఘనమను సూత్రమున 'మరి గరిస', 'సనిపదాని' మొదలగు ప్రయోగములతో రక్తిగా రచనలు సాగించినారు. వివాది స్వరముల నెంతవరకు ఏ రీతిగా ప్రయోగించవలయునన్న రహస్యమును ఈ కీర్తనలందు చూడవచ్చును. 'ఒంటురీతి' అను కీర్తనలో షట్శ్రుతి ధైవతమున్న సంగతే చెవికి తెలియదా అన్నట్లుండును. నాట, వరాళి రాగాల సొగసులు వర్ణనాతీతములు. ఇద్దరూ సంగీతప్రధానమగు రచనలను ప్రసాదించిరి. ఆ కీర్తనలు నాదోపాసనయందు రాగల భిన్న భిన్న రాగరుచులను శ్రోతలకు అందజేయును. ఇవి చెవికింపయి, బుద్ధికి వికాసవంతములయి, ఆత్మానందము నిచ్చు అద్భుత రచనలు.

ఇటుకల కట్టడములుగా ఉన్న సంగీత సంప్రదాయమును చలువరాతి భవంతులుగా మార్చినవి వీ రిరువురి రచనలు. కాని ఇద్దరి శైలులు—భిన్న మార్గముల ననుసరించినవి. అవి రెండూ తెలిసిననే కాని సమగ్ర స్వరూపము తెలియదు. (they are complementary) భారతీయ సంస్కారము నందున్న ఉత్తమ సాహిత్యమును, ఉపనిషదాది వేదాంతసారమును అలవరచుకొని ఏవిధమయిన ఐహికవాంఛలు లేక అత్యుత్తమమయిన కళారాధనతో మోక్షమును గడించు సాధనగా సంగీత విద్య ఉపకరించునని చాటిన జీవన్ముక్తులు, భక్తాగ్రేసరులు వీరు.

క్షేత్రయ్య రాగ మాధుర్యము, విలంబ కాల మహిమ ముత్తుస్వామి దీక్షితుల కీర్తన లందు కానవచ్చును. రాగమునకు బహు ముఖ్యమయిన ప్రయోగములు క్షేత్రయ్య పదాలలో నుండును. దీక్షితుల కీర్తనలందు రాగ సౌధములను పోలు పని ధర్మము కానవచ్చును. రాగములోని ముఖ్యాంశములు పెంపుదల, అపూర్వ ప్రయోగములు అన్నీ ఒక్క కీర్తనలోనే చూడవచ్చును. 'కమలాంబికాయై' అను నవావరణ కీర్తన రాగాలాపన పద్ధతికి సూత్రప్రాయము లాంటిది. పల్లవిలో ఆకిప్తిక—అంటే రాగమిది యని తెల్పు మూల రూపము గల మూర్ఛన—అను పల్లవిలో రాగవర్ధని—రాగానికి మరీ ముఖ్యమనదగు వేర్వేరు ప్రయోగముల సంక్షిప్త ఆలప్తి,—ఇక చరణమునందు విలకడగా ఒక్కొక్క స్థాయిలోని జీవస్వరము

వద్ద నిలచి పనిచేయు రీతుల వివరణ ఇన్నియూ గలవు. విలంబ కాలమునందు, మంద్ర మధ్యమ తారస్థాయిలందు, గమకములు, రవజాతి సంగతులు, విశేష ప్రయోగములు, స్వరపిండములయి నాదపు ముద్దలుగా నుండుపట్లు, కంపిత— అకంపిత స్వర ముల సూచన, గమక ప్రమాణ మిది యని కొంత ప్రవేశ మున్న విద్యార్థికి గూడ నిష్కర్షగా గోచరించు సంగతులు, శుద్ధముగా గమకమే లేని కొన్ని స్వరాలు, గమకపుష్టి కలిగిన సంప్రదాయమును, నాలుగు ముక్కలలో వ్యక్తపరచు మధ్యమ కాల ఖండికలు దీక్షితుల కీర్తనలందు పరిశీలించతగిన మేల్బం తులు. విలంబకాలమునందు గొంతులు నిలచి, తాళము నిల కడగా నిలబెట్టుకొని, శృతి శుద్ధముగా సంప్రదాయముగా రాగ స్వరములు మాత్రముగాక రాగ స్వరూపమును గూడ గ్రహించు భావనాశక్తి—ఇన్ని యున్నగాని దీక్షితుల కీర్తనలు పాడుటకు వీలుండదు. ఈ కీర్తనలు వినువారు కూడ, ఇట్టి అంశము లనే ఈ కీర్తనలందు ఎదురు చూడవలయును. విలంబకాలము నందున్న శృతి మాధుర్యము, సంగీతపుష్టి మధ్యమకాలము నందు, త్వరితగతులందు అంతకంతకు తగ్గుట తథ్యము. సామాన్యముగా వినేవారికి విలంబము విసుగు పుట్టించును. అతి త్వరితమయిన సంగతులు చెవిలో ఎంతోకాలము నిలువవు. మధ్యమ కాలమే ఎక్కువ రక్తి నిచ్చును. ఇది త్యాగయ్య కీర్తనల విశేష ప్రచారములోని మూల తత్త్వము.

ఉన్నదున్నట్టు పాడి వినిపింపజేయు శక్తి క్రమంగా సమసిపోయిన విద్వాంసులీ కీర్తనల 'అసు' నం చితకకొట్టి, ఎవ రికి నచ్చిన సంగతులు వారు చేర్చి మధ్యమ కాలపు కీర్తన లుగా మార్చి పాడుతూ సభారంజనమను పేరిట ఉత్కృ ష్టములయిన ఈ కీర్తనలను చౌకపరచుచున్నారు. వినువారి చెవిలో ఈ కీర్తనల అసలు రూపము లేనప్పుడే ఇట్టిది వీలగును. శ్రీ రాజగోపాల (సావేరి), బాలగోపాల (భైరవి,) మీనాక్షి మే ముదందేహి (పూర్వకల్యాణి) శ్రీ సుబ్రహ్మణ్యాయ నమస్తే (కాంభోజి), అక్షయ లింగవిభో (శంకరాభరణం) ఈ కీర్తనలను మహనీయులు (శ్రీ అరియకుడి రామానుజ అయ్యంగార్లు, మహారాజపురం విశ్వనాథయ్యరు, కీ. శే. గాయక సార్వభౌమ రామకృష్ణయ్య పంతులు మొదలుగా గల గాయ కోత్తములు) పదేపదే పాడి వినిపించినందున శ్రోతలలో ఆ గొప్ప కీర్తనలను ఆ రీతిగానే విని ఆనందించు అలవాటు ఏర్పడినది. అది కాదని ఇప్పటివలె ప్రచార దృష్టిలో త్వరితగతిలో వందలుగా దీక్షితుల కీర్తనలు ప్రజలలో ప్రాకినందువల్ల— తీరని నష్టమే గాని లాభముండదు. అందుకే నేటి సభలలో మేలయిన త్యాగయ్య కీర్తనలు, దీక్షితుల కీర్తనలు వెనుక బడి పోవుచున్నవి.

మాయామాళవగౌళ రాగమునకు, వాటి జన్యములకు ముత్తుస్వామి దీక్షితుల కీర్తనలందు అనేక లక్ష్యములు గలవు. పురందరదాసుల అనుసరణ ఇందులో గమనించవలయును. మలహరి, గౌరి, సాళంగనాట, గౌళిపంతు, ఫరజు, పాడి మొద లగు రాగములందు దీక్షితుల కీర్తనలే నేడు లభ్యమయిన ముఖ్య లక్ష్యములు. మాటలను కీర్తనలందు జోడించు నప్పుడు తాళ మాధుర్యములను చేకొని కొన్ని సందర్భము లందు మృదంగ ఘోషవలె చెవికి నిండయిన నాదము నిచ్చును. ''రంగేశుడు సద్గంగా జనకుడు'' అన్న ముక్కలవల్ల కలుగు ధ్వని (''పాపామగరీ రీమగరి రిసస'') అన్ని ఎంతగమకముగా పాడినా కలుగదు. ఇట్టి పదజాలము సంస్కృత భాషలో అద్భుత ముగా సృష్టించు వీలు అపారముగా నున్నది. పదజాలము అన్న విశేషమును దీక్షితులవారి కీర్తనల సాహిత్యమందు విరి విగా చూడవచ్చును. ''అనంగా ద్యుపాసితయా అష్టదళాబ్జ స్థితయా, ధనుర్బాణ ధరకరయా దయా సుధా సాగరయా''— అని శంకరాభరణ నవావరణ కీర్తనలోని మధ్యమ కాలములో అద్వైత మతమును, శంకరాచార్యుల వాక్కును వీరి కీర్తన లందు చూచునప్పుడు నవీన రుచులు కనపడును. నవగ్రహ కీర్తనలు జ్యోతిశ్శాస్త్రముతో ఉట్టిపడునవి. నవావరణ కీర్తన లందు శ్రీ విద్యామంత్ర పూజావిధానపు మంత్రములు, స్థల మహాత్మ్యములు గల కీర్తనలు, వీరి సంస్కృత రచనకు విలు వను చేకూర్చినవి. ఇన్ని సంపదలున్నా మాటలు పాడుట కను వుగా నుండి, దీర్ఘాక్షరములతో పూర్ణానుస్వారములతో—వీణ మీటులోని సహజత్వమును అనుకరించు సంయుక్తాక్షరములు నాదోపాసకులకు గాని ఇతరులకు అబ్బునా ? సంస్కృత భాష లోని పుష్పము విశేషణము—వాటిని పూర్తిగా ఉపయోగించి కొన్ని సందర్భములందు కాళిదాస మహాకవి వలె ''గానవన మయూరీ'' అనియు ''కోమలతర పల్లవ పద'' అని మామవ పట్టాభిరామ అను కీర్తనలోను భాషా సరళతను చాటినారు. అద్వైతమత సారములయి, భగవంతుని సాక్షాత్కారము పొందు టకు సాధనములుగా పనికి వచ్చునది వీరి కీర్తనలందున్న సాహిత్యము. రాగముపేరు, ఎంచిన దేవుని మహిమలు, గురు గుహ ముద్ర, స్థల మహాత్మ్యపు విశేషములు, కాలము, ఉద్యమ కాలము, త్రికాలము అను మూడు కాలముల రచన—ఇన్నియు చేర్చినందువలన వీరి కీర్తనలు ప్రబంధ శైలి నందుకొని మరీ పెద్దవిగా రూపొందినవి. విందులోని భక్షణములవలె కచ్చేరీలో ఒక్కటి, రెండు ఇట్టి గొప్ప కీర్తనలను ప్రౌఢమయిన బాణిలో పాడిన గల్గు ఆనందము చెప్ప నలవికాదు. ఈ కీర్తనలకు తగిన రీతిగా గౌరవమయిన రాగ ఆలాపన చేసి, నెరవలు స్వర ములు పాడునప్పుడు గూడ ఆ కీర్తనల గౌరవమును అనుసరించు నవి కూడా పెద్ద తరహాగా నుండవలయును. వీటిని చౌక చేసినందున ప్రయోజన ముండదు.

కర్ణాటక సంప్రదాయములో వీరికున్న పట్టుదల ఎవ రికీ తీసిపోదు. తంజావూరి మహారాష్ట్రరాజుల ఏలికలో ఉత్తర హిందూదేశమునందు ప్రచారములో నున్న హిందుస్థానీ సంగీత విద్వాంసు లుండిరి. 'హరికథ' మహారాష్ట్రుల వద్దనుండి మన విద్వాంసులు అవలంబించిరి. అభంగులు భజన్లు అందరికీ తెలుసును. బండి తోలువారికి కొన్ని వందలు అభంగులు తెలి సిన రోజులు అవి. రెండు సంప్రదాయములను దెలిసి, దేని

ముత్తుస్వామి దీక్షితులు

విశిష్టతను దానికి నిలుపునట్లు పాడుట ఉత్తమ మార్గము. పురందరదాసు కాలమునుండియూ మన కర్ణాటక సంగీతము తన విశిష్టతను నిలుపుకుంటూ హిందూస్థానీ రాగాలను జీర్ణించుకున్నది. సుమారు సగము రాగాలు అట్టివి. తోడి, పంతువరాళి, ఖరహరప్రియ, గౌరి మనోహరి, కీరవాణి, కానడా, అఠాణా, బేహాగ్, కాపి—మొదలగునవి అవి. ఇట్టి రాగములందు బహుకాలముగా దక్షిణదేశపు విద్వాంసులు కీర్తనలు, తిల్లానాలు, జావళులు రచించిరి. అట్లే త్యాగయ్యగారూ కొన్ని రచించిరి.

దీక్షితులవారికి మొదట (బాల్యదశలో) హిందూస్థానీ సంగీతముతో కొద్దిపాటిగా పరిచయము ఉండినది. పెద్దవారయి కాశీక్షేత్రమునందు ఐదు సంవత్సరములు ఆ సంగీతమును బాగుగా నేర్చుకున్నారు. ధ్రుపద్‌లను బోలు వీరి కీర్తనలు—శ్రీ సత్యనారాయణం (శుభపంతు వరాళి), పరిమళ రంగనాథం (హమీరు), జంబూపతే (యమున్), చేత శ్రీ బాలకృష్ణం (ద్విజావంతి), రంగపుర విహారం (బృందావన సారంగ), సోమసుందరేశ్వరం (శుద్ధ వసంతం—మాండులాంటిది) మొదలగు కీర్తనలు మనము పాఠంచేసిన హిందుస్థానీ సంగీతపు పోకడలు బాగా విశదము లగును. ఇవి హిందూస్థానీ విద్వాంసులూ పాడవచ్చును. ఇవి అచ్చంగా హిందూస్థానీ ఫక్కీలో చేసినవి. ఇవిగాక ఇతర కీర్తనలందు ఆ సంగీతపు మంచి అంశములు అవలంబనను ఎంత నైపుణ్యముగా చేసినారో పరిశీలించిన ఆశ్చర్యము గలుగును. మొట్టమొదటి సంగతి విలంబకాల పోషణ—కమలాంబాం భజరే (కల్యాణి) లేక, "శ్రీ సుందర రాజం—(పంతువరాళి అనబడు రామక్రియ) అనే కీర్తనలు పరిశీలిస్తే విలంబము ఎంత బాగుగా, నిండుగా నున్నదో తెలియును. రాగమును నిలకడగా పాడునట్లుండు ఖండికలు, 'గా' 'మా' మొదలగు స్వరాలలో నిలిచి కొద్దిగా కంపించి, జారుగా—వాది సంవాది స్వరములను చేర్చు సంగతులు, పా—రీ—, సా—మా—లాంటివి కలవు. కాని మన రాగ స్వరూపానికి చెందిన స్వర స్థానములు, గమకరీతులు, ఛాయ ఇనుమంత మారదు. కల్యాణి మన కల్యాణే—యమన్ కాదు. పంతు వరాళి పూరియా కాదు. దేని వైశిష్ట్యత దానిది.

ఇక కర్ణాటక పద్ధతికి దీక్షితుల వారి కీర్తనలు ఇచ్చు సంపదను గురించి ఆరితేరిన విద్వాంసులు తెలుపగలరే కాని నాలాంటివారికి ఆపని సాధ్యము కాదు. కాని సంగీత విద్యార్థి దృష్టిలోనుంచుకొని కొన్ని సంగతులు చెప్ప సాహసించుచున్నాను.

ముత్తుస్వామి దీక్షితులది వీణశైలి, త్యాగయ్య గారిది గాత్రశైలి. వెంకటమఖి కాలమునుండి వచ్చిన వీణావాదన తత్పరత వీరి చేతిలో శిఖరాన్ని అందుకున్నది. పది కీర్తనలు దీక్షితులవి బాగా వాయించుటకు సామాన్యంగా వీణకున్న మీటు రీతులు, వ్రేళ్ల పనులు పూర్తిగా తప్పనిసరిగా వచ్చి తీరును. త్యాగరాజస్వామి కీర్తన లందున్న సౌలభ్య మిచ్చుటలేదు. శ్రమపడి వాయించవలయును. గాత్రజ్ఞునికి శారీరము స్వాదీనమగును.. అనుస్వరములు, గమకములు రాగమునకు ముఖ్యమగు జీవస్వరము లను పాడు తీరు, అన్నీ సమకూర గలవు. నవగ్రహ, నవావరణ, పంచలింగక్షేత్ర కీర్తనములను సాధించిన వివిధ తాళము లందు స్వర విస్తారము చేయుటకు తగిన పరిచయ మేర్పడును. బాల గోపాల లాంటి కీర్తన మాటలను మినహాయించి రాగాలాపనగా పాడుకొన్న ఇదివరకు వూహకందని వారికి కూడ రాగ ఆలాపన అలవడును. తోడి రాగమునందు మూడు నాలుగు కీర్తనలు కమలాంబికే—దాక్షాయణీ—సుబ్రహ్మణ్యా మాం రక్షతు—నేర్చుకున్న (ముఖాముఖిగా) గాంధారమును గమకము లేకుండ తోడి రాగమునకు చెందునట్లు పట్టు విధానము ఒక కీర్తన యందును, గమక పుష్టిగా పాడుటకు మరొక కీర్తన యందును, ధైవత మధ్యమముల ప్రాధాన్యత మూడవ కీర్తన యందును తెలియనగును. ఈ మూడు కీర్తనలందు సూచింపబడిన భిన్న భిన్న మార్గములకు సరియగు పీఠిక అని చెప్పగల రీతిని రాగాలాపనను చేసిన మంచిది. సుమారు ఒక వారము ఈ రీతిగా ఆలాపన చేసిన కొత్త వూహలు, ప్రౌఢత ఏర్పడును, మధ్యమకాల ఖండికలను సూక్ష్మముగా గమనించిన తానసంప్రదాయపు ప్రయోగములు, ఆహత అనాహత స్వరముల చేరికలు విశదము లగును. రెండుస్వర స్థాయిలందు పాడు శక్తి కరతలామలకముగ తప్పనిసరిగా అలవడితీరును. గౌరి, సాళంగనాట, హెజ్జుజి, గుండక్రియ మొదలగు అనేక రాగములకు దీక్షితుల కీర్తనలే ఆధారములు. యదుకుల కాంభోజి లాంటి రాగములందు కూడ విస్తారముగా పాడు మనోబల మేర్పడును. చిన్న రాగములను హిందుస్థానీ గాయకులు ఎంత విస్తారముగా పాడగల్గుచున్నారు! అట్టి విస్తరణ పునరుక్తి దోషములేక, కేవలము శారీర ప్రదర్శనకు పనికి వచ్చు స్వర ప్రయోగముల గడబిడలతో గాక, ఒక స్థిరమయిన హర్మ్యమును నిర్మించు రీతిగా నుండునట్లు రాగ ప్రయోగములతో పొందుపరచు విద్వత్తు దీక్షితుల కీర్తనలను గురుముఖముగా పాఠంచేసినవారికి అబ్బును.

ఇప్పుడు భారతదేశమున కంతా అనువర్తించు సంగీతము కావలయుననియూ రెండు పద్ధతులకూ సమానముగా వర్తించు సూత్రములను తెలిసికొని కొత్త రూపములను సృష్టించవలయునను ఆశలు రేకెత్తుచున్నవి. అట్టి సూత్రములను బాగా తెలుసుకొన దలచిన ప్రతివారూ దీక్షితుల కీర్తనలు పాఠం చేయవలయును. కొన్ని ధ్రుపద్దులను రూఢీ చేసుకోవలయును. వీటితోబాటు కొన్ని భజన్లను రాజేసు కొన్నప్పుడు బుద్ధి వికాసవంతమయి, ఇదివరకు ఏఒక్క పద్ధతికి అందని అపూర్వమయిన, సర్వజనామోదకరమయిన, భారత దేశ ఔన్నత్యమునకు సరియనిపించినట్టిదయిన భారతీయ సంగీతమును నవ్య మార్గాలలో సృష్టించగల ధీరులు రాగలరు.

సీరియల్ నవల

ఆకర్షణలో అపస్వరాలు

శ్రీ సింగరాజు లింగమూర్తి

(గత సంచిక తరువాయి)

13

రాత్రి తొమ్మిది గంటలైంది. దాసు సుల్తాను బజారు పార్కులోంచి బైటకువచ్చి నీరసంగా అడుగులువేస్తూ బడీచావిడీదగ్గరకువచ్చి నిలుచున్నాడు—బస్సుకోసం. కొంచెం దూరంలో రమణ కనిపించాడు. రోడ్డుదాటి ఎదురుగా వెళ్లాడు దాసు.

"అదేమిటి—అలా తోటకూరకాడలా వాడిపోయావేమిటి?" అని ప్రశ్నించాడు రమణ.

"ఏం చెప్పను రమణా!—.... నష్టజాతకుణ్ణి!"

"ఏం.... ఏం జరిగింది?" ఆదుర్దాగా ప్రశ్నించాడు రమణ.

"ముందు ఏదైనా హొటలుకు తీసుకుపో.... ప్రొద్దుటినుంచి తిండిలేదు.... ఆకలి మండిపోతున్నది" అన్నాడు దాసు.

"ఓరి నీయిల్లు బంగారంకాను.... నిన్న జీతం తీసుకున్నావేమో—ఇవ్వాళ అప్పుడే ఇలా అంటున్నావేమిటి.... సరే, పోదాంరా" అన్నాడు రమణ.

ఇద్దరూ కోఠీ వైపు నడుస్తున్నారు.

"రెండుసార్లు మీ ఇంటికివచ్చాను... మీవాళ్ళుచెప్పలా?"

"చెప్పారులే!.... పోనీ వచ్చినవాడివి ఇంట్లో కూర్చోకపోయావా—నీకు కొత్తవాళ్లెవరున్నారు.... మా ఆవిడ, మా అమ్మేగా." అన్నాడు రమణ.

"నిజమే రమణా.... నామనస్సేం బాగుండలేదు.... ఎక్కడా కాలునిలువలేదు...."

"అసలేం జరిగింది దాసూ?"

దాసు నడుస్తూనే క్రిందటిరోజు జీతం తీసుకోవడం దగ్గరినుంచి పర్సుపోవడంవరకు జరిగిందంతా చెప్పాడు.

"ఏం చేయడానికీ తోచడంలేదు రమణా!.... ఎక్కడికైనా పారిపోదా మనిపిస్తున్నది."

"పారిపోయి ఏం చేదా మని.... జీవితాన్ని ఇంకా నరకంగా చేసుకోడంతప్పితే.... అది నీబోటివాడు చేయవలసిన పనికాదు.. కష్టాల్లో జీవితాన్ని నిలద్రొక్కుకోడంలోనేవుంది ఘనత.

"కబుర్లుచెప్పడం చాలాతేలిక రమణా!"

ఇద్దరూ సుల్తాను బజారు శృంగాటకందాటి కొంత దూరం వచ్చారు.

"మా ఇంటికి వెడదాంపద—భోజనంచేద్దాం.... ఇప్పుడు మళ్లీ టిఫిన్ ఎందుకు?"

"ఊహూం.... ఇంటిదగ్గర ఎదురు చూస్తుంటారు.... పరిస్థితి ఇంట్లో అందరికీ తెలిసిందే కాబట్టి నేను అన్నం తినందే వాళ్లూ తినరు."

"ఇంతసేపు ఇంటికి వెళ్లకుండా ఏం చేసినట్టు?"

"ఏం చేయలేదు.... ఇంట్లోవుంటే ఎవరో ఒకరు అప్పులవాళ్లు వస్తారు. ఏమని సమాధానం చెబుతాను."

"ఇట్లా ముఖం చూపించకుండా ఎన్నాళ్లు దాటేస్తావు? .... కనిపించి జరిగింది నచ్చచెప్పాలిగాని."

"చెప్తే నమ్మవద్దూ.... సరే ఇప్పుడు టిఫిన్వద్దూ—ఏమీవద్దు.... ఇక్కడినుంచి బస్సెక్కుతా" అన్నాడు దాసు.

"ఊరికే బెంబేలుపడితే మనం ఎందుకూ కొరగాకుండా పోతాం దాసూ!.... ఇదుగో, నాదగ్గర ప్రస్తుతం పదిరూపాయలున్నాయి—తీసుకువెళ్లు.... రేపుసాయంత్రం కళాసమితికిరా—నేనేదైనా ప్రయత్నంచేస్తాను.... వెంకటేశ్వర్లుచెప్పి నావిడను కూడా రేపు తెస్తానన్నాడు.... నీవు తప్పకుండారా!"

"అలాగే వస్తాను."

"ఈ పదిరూపాయలైనా జాగ్రత్తగా పెట్టుకో." అని రమణ దాసును హెచ్చరించాడు. బస్సువచ్చిందాకా వుండీ, దాసు ఎక్కినతరువాత రమణ వెళ్లిపోయాడు.

దాసు బస్సుదిగి నడుస్తుంటే దుకాణం ఆసామీ ఎదురయ్యాడు.

"ఏం—పొద్దుపోయి వస్తున్నారు" అని దాసును ప్రశ్నించాడు—దుకాణం ఆసామీ.

"అవునండీ.... స్నేహితులతో మాట్లాడి వస్తుంటే ఆలస్యమైంది.... మీ కివ్వాల్సినడబ్బు...." అని నసిగాడు దాసు. అతనివాక్యం పూర్తికాకముందే దుకాణం అతడు అందుకొని "మీ చెల్లెమ్మగారు తెచ్చిజమకట్టి, మళ్లీ వెచ్చాలు తీసుకుపోయారు.... ఆలస్యం అయిందన్నమాటేకాని మీ దగ్గర డబ్బెక్కడకు పోతుందండీ!" అన్నాడు.

దాసు ప్రమాన్పడిపోయాడు. "ఏమిటి ఇతను చెబుతున్నది నిజమా, కలా?.... సుబ్బులుకు డబ్బెక్కడిది.... ఇతను చెప్తుంటే నమ్మకపోవడం ఎట్లా?" అనుకున్నాడు.

"వస్తాను సార్—పొద్దు పోయింది.... డబ్బివ్వడం ఆలస్యమైందని నేను ఏమైనా పొరపాటు మాటలంటే క్షమిం

చండి....'' అంటూ దుకాణం ఆసామీ దాసుకు దణ్ణంపెట్టి వెళ్లి పోయాడు.

''చిత్రంగా ఉందే!.... అంత డబ్బెక్కడినుంచి వచ్చింది?'' అనుకుంటూ దాసు చరచరా నడుస్తూ ఇల్లుచేరాడు.

ఇంట్లో వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది.

''కాళ్లు కడుక్కోనాయనా—వడ్డిస్తా.... ప్రొద్దుటి నుంచి ఎక్కడైనా తిన్నావో లేదో?'' అంది రాధమ్మగారు.

''ఇప్పుడే అడగటం దేనికి?.... వాళ్లంతట వాళ్లే చెప్తారు.'' అనుకుంటూ దాసు బట్టలుమార్చుకుని సుబ్బలక్ష్మి అందించిన నీళ్లతో కాళ్ళు, ముఖం కడుక్కున్నాడు. భాస్కరం, సుబ్బలక్ష్మి పిల్లలు నిద్దర్లు పోతున్నారు. భూషణంగారు చుట్టత్రాగడం అయిపోయిందేమో! అవతల పారేసి పుక్కిలించి దాహం తీర్చుకున్నారు.

రాధమ్మగారు దానుకు వడ్డిస్తున్నది. సుబ్బలక్ష్మి వంటింటి గుమ్మంలో కూర్చుంది.

''సాయంత్రం ముకుందరావు హెడ్మాస్టారు కబురు చేశారన్నయ్యా!.... ఒక టీచరు సెలవుపెట్టిందట. మనిద్దర్నీ వచ్చి మాట్లాడమన్నారుట'' అంది సుబ్బలక్ష్మి.

''అయితే రేపుప్రొద్దునవెళ్లి కలుద్దాం.... అన్నట్టు నేను చీకటితో వెళ్లాలే—ఒక పనిమీద.... పోనీ నీవువెళ్లిరా.'' అన్నాడు దాసు.

''నే నొక్కదాన్ని పోలేను అన్నయ్యా!''

''ఒంటరిగా వెళ్లడం అలవాటు చేసుకోవాలి సుబ్బులూ!.. నాకు తీరుబడి వుంటుందీ, ఉండదు— అన్నప్పుడల్లా రావడానికి''

''చీకటితో ఎక్కడకు వెళ్లాలినీవు?''

''నీవు ఎందుకు వెడతానంటున్నావో నాకు తెలునులేరా అబ్బాయ్!.... నీవేం వెళ్లక్కరలేదు— ఎవరికీ భయపడి.... నిన్నెవరూ అడక్కుండా చూసుకుంటాంలే!'' అంది రాధమ్మగారు.

దాసు ఆశ్చర్యంగా తల్లివంక, సుబ్బలక్ష్మివంక చూశాడు.

''దుకాణంలో డబ్బుకట్టి వెచ్చాలు తెచ్చావటగా సుబ్బులూ—డబ్బెక్కడిది?'' అని ప్రశ్నించాడు దాసు.

''అవును.... పాలదానికి, బొగ్గులవాడికికూడా యిచ్చి వేశాను.... రేపు కిరాయికూడా అంతా ఇచ్చేద్దామనుకుంటున్నాను'' అంది సుబ్బలక్ష్మి.

దాసు సుబ్బలక్ష్మి వంక పరిశీలనగా చూస్తూ ఎక్కడిదీ —ఇంతడబ్బు?'' అన్నాడు.

''డబ్బు ఎక్కడిదైతేనేం?.... అన్నీ సర్దుతున్నాంగా.... నిన్న ఎక్కడో వడ్డీకి డబ్బుతెచ్చా నన్నావుగా—అదికూడా తీసుకు వెళ్లి ఇచ్చెయ్యి.'' అంది సుబ్బలక్ష్మి.

''అయితే డబ్బెక్కడిదో నేను అడక్కూడదన్నమాట?'' కోపంగా అన్నాడు దాసు.

''డబ్బు యిచ్చినవాళ్లు ఎవరిచ్చింది నీకు చెప్పవద్దన్నారు''

''చిత్రంగానే ఉందే.... అంత గుప్తదానం చేసేవాళ్లెవరూ—ఈ రోజుల్లో?''

''ఎవళ్లో ఆలోచించుకో!'' నవ్వుతూ అంది రాధమ్మగారు.

''ఏం నాన్నా.... ఏమిటిది?''

''నాకుమటుకేం తెలుసోయ్....సుబ్బులు నాకూ చెప్ప లేదు.'' అన్నారు భూషణంగారు.

''అయితే చెప్పరదన్నమాట.... ఎవరిదగ్గరపడితే వాళ్ల దగ్గర డబ్బుతీసుకోవడమేనా? నన్ను అడగడం చెయ్యడం ఏమీ అక్కరలేదూ?'' కోపంతోనే అన్నాడు దాసు.

''ఎవరిదగ్గరో ఎందుకు తీసుకుంటాను. ఇవ్వదగినవారే యిచ్చారు— పుచ్చుకున్నాను, మనకు అవసరంకదా అని.'' అంది సుబ్బలక్ష్మి.

''అదే—వాళ్లెవరాఅని.... చెప్పకపోతే నామీదఒట్టే!''

''సాయంత్రం మాలతి వచ్చిందిరా అబ్బాయ్—'' అంది రాధమ్మగారు.

''అయితే ఆమెను దేబరించారన్నమాట''

''చెప్పేది సాంతం వినవేం?.... ఆ అమ్మాయి మాట్లాడుతుండగనే కిరాయికోసం ఇంటియజమానివచ్చి వీధిలో నాన్నగారితో ఘర్షణపడటం విన్నది.... అప్పుడు అసలుజరిగిందంతా చెప్పాల్సివచ్చింది. పాపం, ఆపిల్ల ఉత్తజాలిగుండెరా.... చాలా చాలా విచారించింది.... సుబ్బుల్ని ఒకసారి తనతోపంపమని అడిగితే సరే, పోయిరావే అన్నాను. దాన్నితీసుకువెళ్లి అయిదువందలిచ్చి పంపింది.''

''అయిదువందలే!'' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు దాసు.

''మనకు అయిదువందలు అయిదు లక్షలుగా ఉంటుంది. వాళ్లకేమిటోయ్—బాగా ఉన్నవాళ్లు.... వాసుదేవరావుగారు రెండుచేతులా సంపాదిస్తున్నాడు.'' అన్నారు భూషణంగారు.

''ఉద్యోగం చెయ్యబోతున్నావయ్యో— మంచి చీరెలు లేకపోతే బాగుండదని తనవి రెండుకొత్తచీరెలుకూడా ఇచ్చిందన్నయ్యా!'' అని తెచ్చిచూపింది సుబ్బలక్ష్మి.

''ఏం—అన్నయ్య చచ్చిపోయాడనుకున్నావా?'' కోపంగా అరిచాడు దాసు.

''ఏమిట్రా అప్రాచ్యపుమాటల్లు.... పాపం, ఆ అమ్మాయి మన పరిస్థితుల్ని అర్థంచేసుకుని సహాయంచేస్తే సంతోషించక అట్లా ఎగిరిపడతావేం?'' అన్నారు భూషణంగారు.

దాసు ఏమీ మాట్లాడకుండా కంచంలో చెయ్యికడిగేసుకొని, యివతలకువచ్చి, పక్కమీద వాలాడు. రాధమ్మగారు వంటిల్లు సర్దుకుంటున్నది.

''తనమీద మాలతికి ఎందుకింతజాలి.... ఇంతడబ్బు ఇవ్వడంలో ఆమె ఉద్దేశమేమిటి? అయినా ఇంతడబ్బు ఆమె దగ్గర ఎలా ఉంటుంది.... తండ్రిని అడిగితేమటుకు యిస్తాడా? ....ఒకవేళ మాలతి తనను ప్రేమిస్తున్నదేమో!.... తనలో ఏమిచూసి ప్రేమిస్తున్నది?.... ఆమెకంటే తక్కువ చదువుకున్నవాడిని.... దరిద్రంలో మునిగితేలుతున్నవాణ్ణి.... చేసేది గుమాస్తాగిరి.... ఎందుకు ప్రేమించినట్టు.... ఇలా డబ్బు సహాయంచేసి తనను లొంగదీసుకోవాలనే స్వార్థమేమో?....

ఇవేమీ లేకుండా తోటిమానవుడు బాధల్లో ఉన్నాడని నిజంగానే జాలితలుస్తున్నదా?'' అని ఆలోచిస్తున్నాడు దాసు.

రాధమ్మగారు బెడ్‌లైట్ వెలిగించి స్విచ్ ఆఫ్‌చేసి పడుకుంది. భూషణంగారు అప్పుడే నిద్దరలో గురకపెడుతున్నారు.

''నిజంగానే మాలతి ప్రేమిస్తుంటే ఎంత అదృష్ట వంతుణ్ణి... కాని తనకా యోగ్యతఉందా?'' అని ప్రశ్నించు కున్నాడు.

మాలతి తనదైపోయినట్టు, తనకష్టాలు గట్టెక్కి ఏదో ఉన్నతమైన జీవితం గడుపుతూ మాలతిని దేవతగా ఆరా ధిస్తున్నట్టు అనిపించింది దాసుకు. ఆ ఊహల్లో ఎప్పుడునిద్ర పట్టిందో—తెల్లారి శ్యాంవచ్చి లేపేదాకా అతనికేం తెలియదు.

14

కళాసమితి సభ్యులు ఒక్కొక్కరే చేరుకుంటున్నారు. 'క్రొత్త పుంతలు' నాటకంలో పాల్గొనేవారే కాదు, మిగతా సభ్యులు కూడా—ఆ వచ్చే క్రొత్త నటి ఎవరో చూడాలనే కుతూహ లంతో ఎదురు చూస్తున్నారు. ఆ క్రొత్త అమ్మాయిని ఆకర్షించాలనీ, ఆ నటి మెప్పు పొందాలనీ ప్రతి సభ్యుడూ నీళ్ళు నములుతూ కూర్చున్నారు. నటీమణులమీది మోజును నాటకాలమీది మోజుగా చలామణి చేసుకొనే వ్యక్తులు ప్రతి నాటక సమాజంలోనూ ఉండడం మామూలే! దీనివల్ల సభ్యు లలో కలతలు రావడం, ముఠాలు కట్టుకోడం కూడా జరగ నివి కావు. కాని ఇటువంటివాళ్ళకు ప్రాధాన్యం రాకుండా సభ్యుల్ని సమైక్య పరచడానికి రమణ, దాసు ముందుగానే నిర్ణయించుకున్నారు.

వెంకటేశ్వర్లు మీనాక్షితో గదిలోకి వచ్చాడు. ఆమెను చూసేప్పటికి అందరి ముఖాలూ విప్పారాయి. వెంకటేశ్వర్లు మీనాక్షిని అందరికీ పరిచయంచేసి ''ఇంకా దాసుగారు రానే లేదే ? .... మీరు ఆయనను ఇవ్వాళ రమ్మని చెప్పారా ?'' అని రమణను ప్రశ్నించాడు.

''చెప్పాను .... వస్తూనే ఉండాలి.'' అని అంటుండగానే దాసు లోపలకు వచ్చి మీనాక్షిని చూసి బిత్తరపోయాడు. మీనాక్షి చిరునవ్వుతో ''నమస్కారమండీ—దాసుగారూ !'' అని చేతులు జోడించింది.

''అయితే ఇద్దరికీ పరిచయమే నన్నమాట'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''మొన్నటి వరకూ వాళ్ల ఆఫీసులోనే పని చేశాను— మా అన్నయ్య మీతో చెప్పలేదేమో !'' అంది మీనాక్షి.

''ఈమె ఇక్కడ కూడానా ? .... అందులో ఈమె ప్రక్కనే తాను హీరోగా నటించాలి .... '' అనుకున్నాడు దాసు.

''క్రొత్త పుంతలు'' నాటకం కథావస్తువు, రచయిత ఉద్దేశం, ప్రవేశపెట్టిన పాత్రల పరిచయం, వాటి ప్రయో జనం గురించి దాసు సభ్యు లందరికీ వివరించాడు. ఇంతలో పాతనటి జయలక్ష్మి రిక్షా దిగి లోపలికి వచ్చి అందరికీ నవస్కరించింది. మీనాక్షి వంక కోరగా చూసి ఆమె ప్రక్కనే కూర్చుంది. జయలక్ష్మి వేయవలసిన పాత్రను గురించి కూడా దాసు వివరించాడు.

''ఇందులో ఇంకో స్త్రీపాత్ర ఉందిగా .... అది నా కివ్వ కూడదూ ?'' అంది జయలక్ష్మి—దాసు చిరాకుగా చూశాడు.

''ఎవరికి ఏ పాత్ర నప్పుతుందో నాకు తెలుసు. మీ కిచ్చిన పాత్రకు మీరు న్యాయం చేయగలరన్న నమ్మకం నాకుంది.'' అన్నాడు దాసు.

కొన్ని క్షణాలు ఎవరూ మాట్లాడలేదు.

''మళ్లీ ఇంకోసారి అందరికీ చెబుతున్నాను. అందరూ అన్ని పోర్షన్లూ వేయలేరు. వేసినా మెప్పించలేరు. అందుకని ఎవరూ చిన్నబుచ్చుకో నక్కరలేదు. ఏ పాత్ర ఇచ్చినా దానికి న్యాయం కలిగించేందుకు ప్రయత్నిస్తేనే నాటకంతో పాటు నటుడి జీవితం కూడా విజయవంతం అవుతుంది.'' అన్నాడు దాసు.

''నేనా ఉద్దేశంతో అనలేదండీ .... మీరు ఏది వెయ్య మంటే అదే వేస్తాను'' అంది జయలక్ష్మి.

''రేపటినుంచి ఎవరి పోర్షన్లు వారు వ్రాసుకోండి. ఉన్నవి రెండే పుస్తకాలు కాబట్టి, ఒకటి ఆడవాళ్ళకు ఇద్దాం ... ఆ తర్వాత వెంటనే రిహార్సల్సు ప్రారంభిద్దాం.'' అన్నాడు రమణ. అంతా 'సరే నంటే సరే' అన్నారు.

''ఈ శుభ సమయంలో అందరం కలిసి తేనీటివిందు చేసుకుంటే ఎంత రమణీయంగా ఉంటుందీ !'' అని నాటక ఫక్కీలో అన్నాడు జయలక్ష్మి ప్రక్క కూర్చున్న ఒక సభ్యుడు, మీనాక్షివంక చూస్తూ.

''ఆ ఖర్చు తమరే భరించిన మరింత రమణీయంబుగా నుండు'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''అస్మదాదులు అద్దానికి వెరతురే .... కానిమ్ము .... భృత్యునిం బంపుడు'' అన్నాడా సభ్యుడు.

''ఎవ్వరూ తెప్పించ నక్కరలేదు. సమితి తరఫున నేనే తెప్పిస్తాను—ఇవ్వాల్టికి'' అంటూ రమణ బాయ్‌ని పిలిచిఉన్న సభ్యుల నందరినీ లెక్కపెట్టి టీలు తీసుకురమ్మన్నాడు.

''ఏమండీ .... ఇందులో హీరోయిన్‌కేమీ పాటలు లేవే'' అంది జయలక్ష్మి.

''రచయిత పాతకాలంవాడు కాదు .... అందులో మనం నటించేది సినిమా కూడా కాదు.'' అన్నాడు భావగర్భితంగా దాసు. మీనాక్షి చప్పట్లు కొట్టింది. మిగతా సభ్యులు కొందరు మీనాక్షిని అనుసరించారు. బాయ్ టీలు తెచ్చి అందరికీ గ్లాసులు అందించాడు.

వెంకటేశ్వర్లు మీనాక్షిని తీసుకురావడం జయలక్ష్మికి ఇష్టంగా లేదు. చాటుచాటుగా జయలక్ష్మి వెంకటేశ్వర్లుని చూపుల్తో పొడవడం దాసు గ్రహించాడు. మొన్న మొన్నటి వరకూ వెంకటేశ్వర్లు జయలక్ష్మి వెంట తిరిగేవాడు. ఆమె రిహార్సల్సు నుంచి వెళ్లేప్పుడు తోడుగా వెళ్తూ ఇంటివద్ద దిగబెట్టేవాడు. దారిలో ఆమెను హొటలుకు తీసుకుపోయే వాడు .... ఆమె ఏదైనా కొనదలచినప్పుడు తానే కొని ప్రజంట్

చేయడం చాలామందికి తెలుసు. మీనాక్షిని వెంకటేశ్వర్లే తెచ్చాడని తెలుసుకున్న జయలక్ష్మిలో ఇటువంటి లాభాలేమీ ఇక ఉండవనుకొన్నందున వెంకటేశ్వర్లు అంటే కోపం, మీనాక్షి అంటే అసూయా అంకురించడం సహజం.

అందరూ టీలు త్రాగడం అయిపోయింది.

"రేపటినుండే రిహార్సల్సు ప్రారంభ మవుతాయి కాబట్టి నాటకంలో పాల్గొనేవాళ్ళు తప్ప మిగిలినవాళ్ళు అనవసరంగా రావద్దని ప్రార్థిస్తున్నాను." అన్నాడు దాసు.

"అవును .... నిజమే. గది అసలే చిన్నది. అందరూ చేరితే మూవ్‌మెంట్స్‌కు చాలా కష్టం" అన్నాడు రమణ.

ఎవరూ ఏం మాట్లాడలేదు.

"సరే—ఇంక నేను వెళ్లవచ్చునా" అంటూ లేచింది మీనాక్షి.

"ఆమెను పంపించి వస్తాను" అని లేచాడు వెంకటేశ్వర్లు.

"మీ కెందుకులెండి శ్రమ ...... నేను వెళ్లగలను" అని మీనాక్షి అందరికీ నమస్కారంచేసి బైటకు వచ్చింది. ఆ క్షణంలో వెంకటేశ్వర్లు ముఖంమీద జయలక్ష్మి చూపుల ఎరుపు ప్రసరించకపోలేదు. ఒకసారి వెంకటేశ్వర్లు వంక చూసి నవ్వి జయలక్ష్మికూడా వెళ్లిపోయింది. ఇంక తమ కక్కడేమిపని అన్నట్టు ఒక్కొక్కరే జారుకున్నారు. చివరకు గదిలో మిగిలింది దాసూ, రమణ.

దాసు సిగరెట్ ముట్టించి జేబులోంచి పదిరూపాయల నోటుతీసి "ఇదుగో రమణా—నిన్న నీవు ఇచ్చింది." అన్నాడు.

రమణ నోటు అందుకోకుండా దాసువంక విస్మయంగా చూశాడు.

"అప్పుడే ఎట్లా ఇవ్వగలుగుతున్నానని ఆశ్చర్యపడుతున్నావుకదూ ? .... నిజమే— ఆశ్చర్యంగానే ఉంటుంది, నిన్నటి నా పరిస్థితికి. ధనవంతుల్లోకూడా పరిస్థితుల్ని అర్థంచేసుకొని సాటివారిని ఆదుకోగల ఉదారులుంటారని నిన్ననే తెలుసుకున్నాను రమణా !" అన్నాడు దాసు.

"సరే — ఇంతకూ ఆ ధనవంతులెవరూ.... ఏం సహాయం చేశారు ?" అని ప్రశ్నించాడు రమణ.

మాలతి కథను రమణకు చెప్పాడు దాసు.

"నిన్న నీవు ఎక్కడికైనా పారిపోదామని ఉందంటివే.... ఇప్పుడు పారిపో !" అని నవ్వాడు రమణ. దాసు ఏమీ మాట్లాడలేదు ఓ క్షణం.

"ఈ పరిస్థితిలో మాలతి సహాయం చేయకపోతే నాగతేం అయ్యేదో !.... ఏమైనా ఇదికూడా ఋణమేగా .... ఎప్పటికైనా తీర్చాల్సిందే." అన్నాడు దాసు.

"ఆమే నీ దౌతున్నప్పుడు ఇంకనీవు తీర్చేదేమిటోయ్ !" అని నవ్వాడు రమణ.

"అంటే !...."

"తన అదృష్టాన్ని గురించి ఇంకోళ్ళు చెబితే వింటూ మురిసిపోయే తత్వం నీలోనూ ఉందన్నమాట.... మాలతి నిన్ను ప్రేమిస్తున్నది. లేకపోతే అంతడబ్బు ఇస్తుందా ?.... ఇంకోరెవరైనా నీ పరిస్థితుల్లోనే వుంటే అంతడబ్బు సాయంచేస్తారంటావా ?"

దాసు ఆలోచనలో పడ్డాడు. "అయితే తనను మాలతి ప్రేమిస్తున్న దన్నమాట. చదువు, సంస్కారం, అందం, చందం, గౌరవనీయ కుటుంబం.... మాలతి.... ధర్మపత్ని— ఈ పదాలన్నీ కలిసి దాసుమనస్సులో తేనె పెరను కదిలించాయి. ఇంతలో ఈతిబాధల తేనెటీగల్లు ఆలోచనల్ని ముసురుకున్నాయి. దాసు అభిమానంమీద దాసుకు లభించిన అవకాశం దాడి ప్రారంభించింది.

"రమణా ! నాకు మాలతిఅంటే ఎంతో గౌరవం...... అభిమానం.... ఆమెచేసిన సహాయానికి చెయ్యెత్తి నమస్కారం పెట్టాలనిపిస్తుంది.... ఆమెనుగురించి ఎప్పుడూ ఇలా ఆలోచించలేదు." అన్నాడుదాసు.

"ఏమైతేనేం .... మొత్తానికి నీ జీవితం ఒక మలుపు తిరుగుతోంది." అన్నాడు రమణ.

"మరో శుభవార్త రమణా !.... మా సుబ్బులుకు ఉద్యోగం దొరికింది. సర్టిఫికెట్ వచ్చిన తరువాత క్లియర్ వేకన్సీలో వేస్తామన్నారు— స్కూలు సెక్రటరీ."

"రెండు సంతోషమైనవార్తలు చెప్పావు. కష్టమో నిష్ఠూరమో భరించి మీ చెల్లెలికి ఒకదారి చూపినందుకు నిజంగానిన్ను అభినందించాల్సిందే !" అన్నాడు రమణ.

"ఇందులో అభినందించాల్సిం దేముంది రమణా !.... నా బుజంమీది బరువు నేను దించుకోవల్సిందేగా.... అందుకు తన చెయ్యికలిపింది మా సుబ్బులు." అన్నాడు దాసు నిశ్చలంగా.

"ఇంక వెడదామా ?" అన్నాడు రమణ. ఇంతలో రాజు మోటారు సైకిలుమీదవచ్చి గదిముందు దిగాడు.

"హలో— సుందోపసుందులు ఇద్దరూ ఉన్నారే !.... వెరీగుడ్ !" అంటూ లోపలకు వచ్చాడు.

"ఏమిటి విశేషాలు రాజూ ?" అన్నాడు రమణ.

"విశేషాలకేం సవా లక్ష ఉన్నాయి.... ఇదుగో—ముందు చందా తీసుకో.... ఏకంగా డొనేషన్‌కూడా ఇచ్చేద్దామని వచ్చాను అంటూ రాజు ఒక పదిరూపాయలనోటు, రెండురూపాయల నోట్లుతీసి రమణ చేతికిచ్చాడు.

"ఇదుగో అబ్బాయిలూ, మీ ఇద్దరూ మారు మాట్లాడకుండా నా వెంటరావాలి." అంటూ రాజు పాంటు జేబులోంచి గోల్డుఫ్లేక్ సిగరెట్ పెట్టెతీసి, తానొకటి ముట్టించి రమణకు, దాసుకు అందించాడు పెట్టె. రమణ ఒకసిగరెట్ తీసుకున్నాడు. దాసు "నా బ్రాండ్ వుందిలే" అన్నాడు.

"నీవెక్కడ దొరికావయ్యాస్వామీ.... మంచి సిగరెట్ యిచ్చినా తీసుకోవు.... అదంతా కుదరదు, ఇవ్వాళ నేను చెప్పినట్లు వినాల్సిందే !.... ఊఁ.... ముందు సిగరెట్ ముట్టించు" అని రాజు ఒక సిగరెట్ దాసుపెదాలకు అందించి అగ్గిపుల్లగీశాడు.

"మరింక బయులు దేరుదామా?" అన్నాడు రమణ.

"ఎక్కడికి ?" అన్నాడు దాసు.

"నేను తీసుకు వెళ్ళేచోటుకు.... ఇవ్వాళ మనబర్త్‌డే బ్రదర్ !.... నేను మిమ్మల్ని పార్టీలో తడిపేస్తాను.... తర్వాత ఇంకెక్కడికైనా," అనిరాజు మాటకట్‌చేశాడు. రమణ అనుమానంగా దాసువంక చూడడంతోదాసు రాజుమాటల్ని అర్థంచేసుకున్నాడు.

"క్షమించురాజా.... నాకు అలవాటులేదు.... మీా ఇద్దరూ వెళ్ళండి." అన్నాడు దాసు.

"మనం దిగింది చాలక అతణ్ణి కూడా దింపడం ఎందుకులే రాజా !" అన్నాడు రమణ.

"మనం మటుకు రోజూ ఏడుస్తూ మేమిటోయ్ ! ... అకేషనల్‌గా .... అన్నీ రుచి చూడవచ్చు నన్నారు .... దేవీపాద తీర్థమను, లేదూ ఆ రోజుల్లోని సోమరసం అను."

"ఎందుకీ వృథా ఖర్చు .... నోటికి రుచిగానైనా ఉండదు, వగరు—చేదు" అన్నాడు రమణ.

"వెర్రినాన్నా ! .... ఉప్పు ఉప్పగా ఉండక తియ్యగా ఉంటుందిట్రా ! .... మరి అది లేకుండా రుచి వస్తుందా ? అలాగే అవకాశాల్ని యీ వగరు చుక్కతో అభిషేకించినప్పుడే జీవితానికి రుచి వస్తుందోయ్" అన్నాడు రాజు.

"మీతో కంపెనీ కోసం రమ్మంటే వస్తాను. నేను మటుకు పుచ్చుకోను .... తీరా అక్కడ నన్ను బలవంతం పెడితే కాదు" అన్నాడు దాసు.

"సర్లే .... అప్పటి మాట ఇప్పుడేనా ? .... నడు" అని దాసుకు, రమణకు రెండు చేతులూ అందించి ఇద్దర్నీ రాజు లేవదీశాడు. ముగ్గురూ గది బయటకు వచ్చారు.

"మోటారుసైకిలు మీ గదిలో పెట్టేస్తా .... రేపు వచ్చి తీసుకు వెళ్ళొచ్చు." అంటూ రాజు బాయ్ సహాయంతో మోటారుసైకిలు లోపల పెట్టాడు. రమణ తాళం వేశాడు. రాజా—రమణ ఒక రిక్షాలో, దాసు మరో రిక్షాలో ఎక్కారు.

రిక్షాలోంచి దిగేప్పుడు ఎవరైనా తెలిసినవాళ్ళు చూస్తారేమోనని దాసు బెరుకుగా రమణ చాటుగా బారులోకి నడిచాడు. ముగ్గురూ ఒక గదిలోకి వెళ్ళి సోఫాలో కూర్చున్నారు. బోయ్ లోపలకు వచ్చి "క్యాహోనా సాబ్ !" అన్నాడు.

రాజు తమకు కావలసినవాటికి ఆర్డరిచ్చి దాసుకు వింటో తెమ్మన్నాడు. బోయ్ వెళ్ళిపోయాడు.

"ఇప్పుడే వస్తాను" అంటూ రాజు గదినుంచి బైటకు వెళ్ళాడు.

దాసుకు ఆ ప్రదేశం క్రొత్తగా ఉంది. ప్రక్క గదుల్లోంచి తూలుడు మాటలు, నవ్వులు, కేరింతలు వినిపిస్తున్నాయి. రాజు మళ్ళీ గదిలోకి తిరిగి వచ్చాడు. వస్తూనే, "ఏం దాసూ—అట్లా దిగాలుపడి కూర్చున్నావేం ? బీ బ్రేవ్" అన్నాడు భుజం తట్టుతూ.

బోయ్ ఒక ట్రేలో గ్లాసులు, ఒక పెద్ద సీసా తీసుకు వచ్చి టేబులుమీద పెట్టాడు. మళ్ళీ వెళ్ళి దాసుకు వింటో ఒక ప్లేటులో వేయించి, ఉప్పు—కారం చల్లిన జీడిపప్పు, రెండు ప్లేట్లలో ఆమ్లెట్లు, స్లయిస్ తీసుకువచ్చాడు. రాజు రెండు గ్లాసుల్లో బీరు మూడు పాళ్లకు వంచాడు. నురగలు క్రక్కుతూ తన అగాధ గాంభీర్యాన్ని ఒడ్డుకు చేర్చే సముద్రం లాగా బీరు కూడా ఆ గ్లాసులో నురగలు క్రక్కుతున్నది. ఒక గ్లాసు రాజు అందుకొని, రెండు గ్లాసులూ తాకించి, అలాగే దాసు తీసుకున్న వింటో గ్లాసుకు కూడా తాకించాడు.

దాసు వింటో సిప్ చేస్తున్నాడు.

"ఏం దాసూ, వింటోలో రెండు చుక్కలు వెయ్యమంటావా ?" అన్నాడు రాజు.

"నేను మొదట్లోనే చెప్పానుగా—నన్ను బలవంతం చేయవద్దని."

"ఉమర్ ఖయాం ఏమన్నాడో తెలుసా .... బ్రతికిన మూడునాళ్ళూ మైమరచి బ్రతకమన్నాడు. రేపటికోసం ఆలోచించకు—ఇవ్వాళ్ల అనుభవించిందే అనుభవం" అన్నాడు మాటలు సాగదీస్తూ రాజు.

"రాజా అపరఖయామా దాసూ !" అంటూ నవ్వాడు రమణ. దాసు నవ్వలేదు.

"అవును .... నాపాలసీ అంతే .... అయితే బ్రదర్ దాసూ—త్రాగడం మంచిదికాదంటావు. ఏం ? .... ఏమీలేదు... చెడిపోయిన మనస్సును ఇస్త్రీ మడతల్లో పెడితే లాభం ఉంటుందా బ్రదర్ ! .... ఒక్క చుక్క వేసుకొని రాజాలా బ్రతుకుతున్నాను .... బ్రదర్ దాసూ ! .... నువ్వు కొత్త .... ఈ నాలుగు గోడల మధ్య మనకు దాపరికం లేదు. నేను ఎందుకు తాగుతానోతెలుసా ?" కాస్త తడబడుతున్న మాటల్తో అంటున్నాడు. ఈ ధోరణికి ఏమిజవాబివ్వాలో దాసుకు అర్థంకాలేదు. రమణ గ్లాసు పూర్తిచేసి, సీసాలో మిగిలిన బీరు తను వంచుకొని, రాజు కింత వంచాడు. తొంగిచూసి పోతున్న బోయ్‌ని ఆపి, "రెండు పెగ్గులు నారాయణగూడా" ఆర్డరిచ్చాడు రాజు.

సిగరెట్ ముట్టించి మళ్ళీ ప్రారంభించాడు దాసు.

"తెలుసుకో బ్రదర్—తెలుసుకో. నేను బ్రహ్మచారి ననుకోకు .... నా భార్య అంటే మై వైఫ్ మనల్ని వదిలేసి పోయింది .... ఎందుకు వదిలేసిందో తెలుసా ? .... ఇవ్వాళ నువ్వు నా బ్రదర్‌వి .... నీతో చెప్పేస్తున్నాను ...... "

దాసు వింటో తాగుతుంటే ఎట్లాగో అనిపించింది .... "ఏమిటి ఇలా ఉందేం ? .... వింటో ఎన్నోసార్లు తాగాను .... ఎప్పుడూ ఇలా చిరుచేదుగా లేదే !" అనుకున్నాడు. ఈమాటలే పైకి అనేశాడు కూడా.

రాజు నవ్వి "ఏం బ్రదర్—ఎలాఉంది ...? కాస్త రుచిచూస్తే ఏం ఫర్వాలేదులే ! .... అబ్బే .... ఎంతా—నాలుగు చుక్కలు వేయించా .... అంతే" అన్నాడు.

దాసుకు కోపం వచ్చింది. కాని ఏం చేస్తాడు ? అప్పటికే చాలాభాగం తాగేశాడు. కాస్త ఏదో తెలియని ఉల్లాసాన్ని ఫీలవుతున్నాడు.

"ఆఁ .... ఏం చెప్తున్నాను .... ఈక్వల్ వైసెస్ మధ్య పెరిగేంత స్నేహం ఈక్వల్ వర్చ్యూస్ మధ్య పెరగదు ...

పెళ్ళాన్ని మచ్చిక చేసుకోడంకన్నా బిడ్డను పెంచడం తేలిక బ్రదర్ ! .... ఎవర్నో మరిగింది .... నాలుగు రోజులు లేచి పోయింది. తర్వాత మళ్ళీ కాళ్ళ బేరానికి వచ్చింది .... మా ఫాదర్ దాన్ని మెడపెట్టి బయటకు గెంటెయ్యమన్నాడు .... మనది విశాల హృదయం .... క్షమించేసి ఉండిపొమ్మన్నాను .... ఎందుకు ఉండమన్నానో తెలుసా .... అదంటే నాకు చాలా ఇష్టం .... అందంగా ఉంటుంది .... దాని అందాన్ని చూసి మన హృదయం విశాలం చేసుకున్నకొద్దీ, అది తన బుద్ధిని సంకుచితం చేసుకుంది. నా ఆకలికి, దాని ఆకలికి లంగ రంధ లేదు .... ఒక నెలరోజు లుండి మళ్ళీ ఇంకోడితో లేచిపోయింది బ్రదర్ ! .... పది రోజుల తర్వాత మళ్ళీ రాయబారాలు జరి పింది నాతో ఉంటానని .... ఎందుకో తెలుసా ! .... నాకు కావలసింది దాని అందం, దానికి కావలసింది ఆధారం ...... ఈ అవసరాలన్నీ ప్రవాహాల్లాంటివి. వాటి వేగానికి నువ్వు తట్టుకోగలవా బ్రదర్ ! .... నా ప్రవాహం దానికి ఎదురీత, దాని ప్రవాహం నాకు సుడిగుండం .... ఇద్దరం కలిసి ఒడ్డుకు చేరలేం, నాన్సెన్సు—వీల్లేదు పొమ్మన్నాను .... '' అప్పటికి రెండు గ్లాసులు అయిపోయాయి. ఇంకో బ్రాందీ బాటిల్ తెమ్మన్నాడు రాజు. ఫిష్ కట్‌లెట్లు, ఇంకో ప్లేటు జీడి పప్పు తెప్పించాడు.

దాసుకు చూపు కాస్త ఎట్లాగో ఉన్నట్టు అనిపించింది. కాని అతని నుంచి పొల్లు మాట ఏమీ రావడంలేదు. రమణ కూడా రాజుతో సమానంగా తాగాడు. కాని అతను నిండుగా, తాపీగా, మామూలుకన్నా నిదానంగా మాట్లాడుతున్నాడు.

''దాసు మనిద్దరికంటే అదృష్టవంతుడుడోయ్ రాజూ!'' అన్నాడు రమణ.

''వ్వాట్ ! .... చెప్పావు కాదేం ? .... ఎవరా సుందరి, ఏమా కథ .... '' ఆసక్తితో ప్రశ్నించాడు రాజు.

''చెప్పనా ....'' అన్నట్టు రమణ దాసువైపు చూశాడు. వద్దన్నట్టు సంజ్ఞ చేశాడు దాసు.

''దాస్తావేం బ్రదర్—చెప్పేసెయ్యి .... మన ముగ్గురిలో ఏమీ రహస్యాలు ఉండకూడదు .... చెప్పు బ్రదర్ ! .... నువ్వు లవ్‌చేసిన ఏంజల్ ఎవరు ?''

''నాకూ చెప్పలేదు'' అన్నాడు రమణ ఆ ధోరణి తప్పించాలని.

''ఫీష్ .... అన్నీ అబద్ధాలే ! .... చెప్పు మై డియర్ బ్రదర్ దాసూ ! .... ఎవర్ని ప్రేమించావు .... నాటకంలో వేషం వేసిందే మాలతి .... ఆమెనేనా ? .... '' అన్నాడు రాజు.

''ఆమె పేరు ఇక్కడ ఎత్తడం మంచిదికాదు.'' అన్నాడు దాసు.

''ఎస్ .... ఎస్ .... ఆమె నీ ప్రియురాలు కదూ ! .... మేం ఆపేరు అనకూడదు .... ఆల్‌రైట్ .... ఎక్కడికైనా పోదామా ?'' అన్నాడు రాజు ఇంకో సిగరెట్ ముట్టించి.

''ఇంకెక్కడికి పోతాం .... ''

''ఉంది బ్రదర్ .... పోవాల్సినచోటు ఇంకోటి ఉంది ... రండి నాతో .... మనం ఇప్పుడు చేసింది యజ్ఞం .... ఇప్పుడిక పోవాల్సింది స్వర్గం .... అప్సరసలు మనకోసం వేచుకు కూర్చుంటారు బ్రదర్ ! .... హాయిగా కాసేపు గడిపి, కథను కంచికి పంపించేసి, మళ్ళీ భూలోకంలో ఎవరిళ్లకు వాళ్ళు'' అన్నాడు రాజు.

''ఉహూం .... నేను రాను .... దాసు కూడా రాడు.

''అదేమిట్రా రమణా ! .... యజ్ఞంచేసినాక ఇంద్ర ధనుస్సు విరవకపోతే ముక్తికాంతా కల్యాణం జరిగే దెట్లా గోయ్ దద్దమ్మా ! .... లైఫ్ యీజ్ ఫుల్ ఆఫ్ షేప్స్ ! .... వెరైటీ ఇన్ షేప్స్ యీజ్ వెరైటీ ఇన్ లైఫ్ .... ఏమోయ్ దాసూ ! .... ఇంకో గ్లాసు పుచ్చుకో .... కాళ్ళకింద డన్‌ల పిల్లోలూ, కళ్లముందు రసగుల్లాలూ .... ఇదే బ్రదర్ యజ్ఞ ఫలం.'' అన్నాడు రమణ.

''నేను రాను.'' అన్నాడు రమణ.

''ఏం దాసూ నీవూ ! .... రమణకేం ఇంట్లో వైఫ్ ఉంది .... నీవు బ్రహ్మచారివేగా .... రా పోదాం.''

''నే నసలు రాను.'' విసురుగా అన్నాడు దాసు.

''ఆల్‌రైట్ .... బలవంతంగా సుఖం కొనుక్కోడం మహాపాపం ! .... బలవంతపు సుఖాన్నే నరకం అన్నారు' .... మీరు మానేయండి .... నేనే వెళ్తాను.'' అన్నాడు రాజు. దాసు, రమణ లేచారు.

బోయ్ బిల్లు తీసుకువచ్చి యిచ్చి ఖాళీ ప్లేట్లు, సీసాలు తీసుకు వెళ్లాడు. బిల్లు రాజే చెల్లించాడు. ఇందాక రాజు అన్నట్లు కాళ్లకు డన్‌లపిల్లోలు కట్టుకు నడిచినట్టే ఉంది దాసుకు. రాజు కాస్త తూలుతూ నడుస్తున్నాడు. రమణ మామూలుగా నడుస్తున్నాడు. బైటికి వచ్చాక రాజు రిక్షా కేకవేశాడు. అతని పిలుపుకు మూడు రిక్షాలు వచ్చి ఆగాయి.

ముగ్గురూ మూడు రిక్షాలెక్కి ఎవరి దారిన వాళ్ళు వెళ్లిపోయారు.

15

దాసు రేడియో స్టేషను ముందు బస్సు దిగి లోపలకు అడుగు పెట్టేటప్పటికి వెనుకనుంచి వచ్చి ఆగిన రిక్షా లోంచి మాలతి దిగింది. దాసును చూచి చిరునవ్వుతో ''నమస్కారమండీ !'' అంది. దాసు నిలబడిపోయి ప్రతి నమస్కారం చేశాడు.

''మీరు కూడా రిహార్సల్సుకు వచ్చారా ?'' అంది మాలతి.

''అవును .... రాగద్వేషాలనాటికలో బుక్ చేశారు.''

''నేనూ అందులోనే !''

''మీరు లవుంజిలో కూర్చోండి .... నేను సెక్షన్‌లోకి వెళ్లి వస్తా .... స్క్రిప్టు టైపు అయిందో లేదో'' అన్నాడు దాసు. మాలతి స్టూడియోస్ వైపు, దాసు ఆఫీసువైపు వెళ్లారు.

దాసు సెక్షన్‌లోకి వెళ్లి నాటకాలకు సంబంధించిన ఉద్యోగిని 'రాగద్వేషాల' స్క్రిప్టును గురించి అడిగాడు.

"ఐయాం సారీ—దాసుగారూ! .... స్క్రిప్టు ఇంకా పూర్తికాలేదు. ఆయన సాయంత్రానికల్లా ఇస్తానన్నారు ..... రేపు మూడు గంటలకల్లా వచ్చేయండి ...... సైపు అయి సిద్ధంగా ఉంటాయి కాపీలు." అన్నాడాయన.

"ఇవ్వాళ రిహార్సల్సుకు పెట్టిన హాఫ్‌డే సెలవు వృథా అయిపోయింది" అంటూ దాసు నసిగాడు. మర్నాడు సాయంత్రము ఆఫీసు విడిచిపెట్టిన తర్వాతనే రావడానికి సర్దుబాటు చేసుకున్నాడు. తరువాత మాలతి కోసం వెళ్ళాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ రేడియో స్టేషనులోంచి ఇవతలకు వచ్చారు.

"ఏమండీ—'గోపీకి' వెళ్ళి కాఫీ తాగుదామా?" అంది మాలతి.

"పదండి" అంటూ దారితీశాడు దాసు. ఇద్దరూ ప్రక్క ప్రక్కగా నడుస్తున్నారు.

"మీకు ఎట్లా కృతజ్ఞత తెలియజేయాలో అర్థం కావడంలేదు." అన్నాడు దాసు.

"ఎందుకు .... నేనేం చేశానని?"

"గొప్పవాళ్ళకు అలాగే అనిపిస్తుంది."

"ఇప్పుడు గొప్ప—బీద తారతమ్యం దేనికి?"

దాసు కొన్ని క్షణాలు వూరుకొని "మీకు పూర్తిగా ఋణపడి పోతున్నాను." అన్నాడు.

"ఋణం సంగతి తరువాత ఆలోచిద్దాం గాని, కృతజ్ఞత తెల్పాలనుకుంటున్నారు కాబట్టి హోటలు బిల్లుచెల్లించి సినిమాకు తీసుకు వెళ్లండి—మ్యాట్నీకి ఇంకా టైం ఉంది." అంది రిస్టువాచీ చూసుకుంటూ మాలతి.

"వో—అలాగే .... ఎలాగూ సెలవు పెట్టాను .... రిహార్సల్సు లేకపోయె .... కనీసం ఒక మంచి సినిమా అయినా చూసినవాళ్ళం అవుతాం" అన్నాడు దాసు.

హోటలు ఆవరణంలోంచి ఖాళీగా వస్తున్న టాక్సీని ఆగమని చెప్పి మాలతి దాసుతో లోపలకు వెళ్ళింది. మరో పది నిముషాల్లో ఇద్దరూ వచ్చి టాక్సీలో కూర్చున్నారు.

"కమల్ టాకీసుకు పోనీ" డ్రైవరుతో అంది మాలతి. టాక్సీ అసెంబ్లీ భవనాల ముందు నుంచి పరుగెత్తుతున్నది.

"మీ చెల్లెళ్ళి ఇంకా చదివిస్తే బాగుండేది .... అప్పుడే ఉద్యోగంలో చేర్పించేశారు." అంది మాలతి.

"బాగానే ఉంటుంది .... కాని పరిస్థితులు అనుకూలంగా ఉండాలి కదండీ! .... అసలు దానికి చదువుమీద ధ్యాస అట్టే లేదు .... ఏదో సంసార పక్షం మనిషి." అన్నాడు దాసు.

"అయితే చదువుకున్నవాళ్లు ఉద్యోగ పక్షంగా ఉంటారని ఏమైనా సిద్ధాంతీకరించారా?" అని చర్చకు పూనుకుంటున్నట్లు సీటులో దాసుకు అభిముఖంగా తిరిగి కూర్చుంటూ అంది మాలతి. టాక్సీ వేగంగా పోతున్నది. గాలి వాలుకు మాలతి పైటచెంగు దాసు ముఖంమీద పడి నైట్‌క్వీన్ పరిమళం గుప్పుమంది. దాసు ముఖం మీంచి మాలతి పైటను తొలగించుకోడం, ఆమెతానే చీరెలాగుకోడం—ఈ రెండు పనులూ ఢీకొన్నాయి. ఏమిటో చనువు ఫీలయ్యాడు దాసు.

"ఒక చెంప ప్రశ్నవేస్తూ మరోచెంప కోపమొస్తే ఎలా?" అంటూ ఛలోక్తి విసిరాడు. మాలతి తల వంచుకొని నవ్వింది. ఆబిడ్స్‌సర్కిల్‌లోని పుస్తకాల షాపుల్లో పత్రికల తోరణాలు చూస్తూ ముఖం త్రిప్పుకుంది.

"ఎమ్. ఏ. అయిన తర్వాత ఏం చేద్దామని?" అని పలుకరించాడు దాసు.

"క్లాసు వస్తే ఏ కాలేజీలో నైనా లెక్చరర్ నవుతాను .. లేకపోతే హాయిగా ఇంట్లో కూర్చుంటాను."

దాసుకు ఇంకేమీ మాట్లాడటానికి తోచలేదు. ఆడవాళ్ళతో కలిసి అట్లా కారులో వెళ్లడం, చనువుగా మాట్లాడటం దాసుకు ఇదే మొదటి అనుభవం.

టాక్సీ కమల్ టాకీసులో ఆగింది.

"బాక్స్ టిక్కెట్లు తీసుకోండి" అంటూ మాలతివేనిటీ బ్యాగ్‌లోంచి పది రూపాయలనోటు తీసి యివ్వబోతుంటే "సినిమాఖర్చు నన్నే పెట్టుకోమని మళ్లీ ఇదేమిటి?" ఉన్నాడు దాసు.

"ఎవరు ఖర్చుపెడితేనేం లెండి .... వూ—తీసుకురండి" అని అంటుండగానే దాసు బుకింగ్‌వైపు వెళ్లాడు. మాలతి డ్రైవరుకు డబ్బిచ్చింది. దాసు టిక్కెట్లతో తిరిగి వచ్చాడు. మాలతి టాక్సీలోంచి దిగి దాసుతో హాల్లోకి వెళ్ళింది. అప్పటికే సినిమా ప్రారంభమైంది.

ఆమె ప్రక్కన కూర్చుని దాసు సినిమా చూస్తున్నాడే కాని ఎంతో ఇబ్బందిగా ఫీలయ్యాడు. మ్యాటినీషో గుడ్డి వెల్తురులో ప్రక్కనున్న మాలతి సిల్కు చీరె మెత్తని స్పర్శ దాసు మనస్సును పిండివేసింది. సినిమా అయిన తరువాత ఇద్దరూ కొంతదూరం నడిచి ఒక టాక్సీ మాట్లాడుకొని ఎక్కారు.

"మా యింటికి వస్తారా?" అంది మాలతి.

"నాటకం రిహార్సల్సుకు వెళ్ళాలి."

"తప్పకుండా వెళ్ళాలా?"

"వెళ్లవద్దా మరి .... అందులో డైరెక్షన్ నాదే .... ఎదురు చూస్తూంటారు.

"అలాగే వెళ్లవచ్చు .... ముందు మా ఇంటికి రండి" అంది మాలతి.

దాసు మాట్లాడలేదు. టాక్సీ వాసుదేవరావుగారింటి ముందు ఆగింది. ఇద్దరూ పై హాల్లోకి వెళ్లేప్పటికి బొమ్మల బుష్‌కోటు తొడుక్కున్న యువకు డొకడు ఎదురై "హలో—మాలతీ!" అన్నాడు.

"ఏం బావా—ఎప్పుడూ రావడం? ఉత్తరమ్మైనా వ్రాయకుండా అమాంతం వూడిపడ్డావే?" అంది మాలతి.

"మిమ్మల్నందరిని సర్‌ప్రయిజ్‌లో ముంచేద్దామని .... రేడియో స్టేషనునుంచేనా—అత్తయ్య, మైత్రేయా చెప్పారులే" అన్నాడతను.

"వీరు దాసుగారు .... మంచి ఆర్టిస్టు. బి. ఏ. ప్యాసై గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నారు .... ఇతను మా మేనత్త కొడుకండీ ! .... మిస్టర్ గోపాల్‌రావు .... మెడిసిన్ ఫైనల్లో ఉన్నాడు." అని మాలతి ఉభయుల్నీ పరస్పరం పరిచయం చేసింది. గోపాలరావు ఒకసారి దాసువంక పరిశీలనగా చూసి కరచాలనం చేశాడు. మాలతి వాళ్లిద్దరినీ డ్రాయింగ్ రూంలో కూర్చోమని చెప్పి లోపలకు వెళ్లింది. ఇంతలో మైత్రేయి డ్రాయింగ్‌రూంలోకి వచ్చి "ఓహో—నటశేఖరులా ! ... ప్రణామములు". అంటూ చేతులు జోడించి అభినయ ఫక్కీలో నిలబడింది.

"అచ్చం కూచిపూడి హీరోయిన్‌లాగానే డైలాగ్ చెప్పేశావు పిల్లా !" అన్నాడు గోపాలరావు.

"ఏయ్ బావా ! .... నన్ను పిల్లా గిల్లా అంటే వూరుకోను .... ఇది ఫస్ట్ వార్నింగ్ .... మళ్లీ గనక అన్నావో చెవులు మెలేస్తా" అంటూ పెద్దగా నవ్వేసింది మైత్రేయి.

"ఆ వచ్చేవా డెవడోగాని వాడ్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తావు." అన్నాడు గోపాలరావు.

"ఎవరో ఎందుకు—చెట్టంత బావే ఉంటే .... " అంది మైత్రేయి నవ్వుతూనే.

వాళ్లిద్దరి సంభాషణా దాసుకు ఇబ్బందిగా ఉంది. మాటల మధ్యలో వాళ్లు తనవంక చూస్తే తానూ పాల్గొంటున్నట్లు కాస్త నవ్వుముఖం పెట్టడం తప్ప ఏం చేయాలో తోచలేదు.

"అమ్మ బాబోయ్ ! .... నిన్ను చేసుకొని ఇంక బ్రతకడమే ! .... గంపగయ్యాళివి."

"అసలు నిన్ను చేసుకుంటానికి ఇక్కడ ఎవరు సిద్ధంగా ఉన్నారని .... నీ అంతటి నవమన్మథుడు దొరకడనా ?" అని మైత్రేయి అంటుంటే మాలతి బట్టలు మార్చుకుని టాయిలెట్ అయి వచ్చింది. రెండు ప్లేట్లనిండా బిస్కెట్లు, టీ కప్పులూ ఉన్న ట్రేతో బాయ్ వచ్చి బల్లమీద పెట్టాడు. మాలతి ఒక ప్లేటు దాసుకు అందించి "తీసుకోండి" అంది. దాసు రెండు మూడు బిస్కెట్లు తిని టీ త్రాగాడు.

"ఏం బావా ! ఎన్నాళ్లు మకాం."

"ఉన్నన్నినాళ్లు .... ఈసారి అటో—ఇటో తేల్చుకొని మరీ పోతాను."

"ఇంక నేను వెడతానండీ !" అంటూ లేచి నిలుచున్నాడు దాసు. గోపాలరావు కరచాలనం చేశాడు.

"అప్పుడే ! .... ఒక్కమాటైనా మాట్లాడలేదు" అంది మైత్రేయి.

"ఏనుంది మైత్రేయీ ! .... వెళ్లాలి" అంటూ దాసు "వస్తానండీ !" అని గోపాలరావుతో చెప్తూ మాలతిని కళ్లతోనే పలకరించి గది బయటకు వచ్చి చరచరా మెట్లు దిగి వీథిలోకి వచ్చాడు.

16

"క్రొత్తపుంతలు" నాటకం రిహార్సల్సు ఒక ప్రక్కనుంచి చరచరా సాగిపోతుంటే, మరోప్రక్క వార్షికోత్సవం సన్నాహాలు కూడా జరుగుతున్నాయి. జయలక్ష్మి సంగతి ఎలా ఉన్నా మీనాక్షి మటుకు రిహార్సల్సుకు సక్రమంగా రావడం, చెప్పింది విని ఆ ప్రకారం చేయడం దాసుకు ఎంతో నచ్చింది. చదువుకున్నదీ, సంస్కారం కలదీ కాబట్టి ఆమె సరిగ్గా రిహార్సల్సుకు వస్తుందో రాదో, వచ్చిననాడు చెప్పినట్లు విని చేస్తుందో లేదో నని మొదట్లో దాసు సందేహించాడు. జయలక్ష్మి సరిగా రిహార్సల్సుకు వచ్చేదికాదు. ఒకరోజు వస్తే రెండు రోజుల్ని మానేసేది. వచ్చిననాడు "ముందు నా రిహార్సల్సు తీసుకోండి—నేను తొందరగా పోవాలి" అనేది. ఒక్కోసారి "నాకు మూడ్సు రావడంలేదు." అనేది. "తల నొప్పిగా ఉంది—కాఫీ తెప్పించండి" అని నసిగేది. తీరా కాఫీ తాగాక, "ఏమిటోనండీ—ఇవ్వాళ ఎలాగో ఉంది .... రేపు చేస్తాలెండి .... నా సీను వదిలేసి ఇంకోటి తీసుకోండి" అనేది.

"ఏమండీ .... ఇక్కడ నాకు నవ్వు రావడంలేదు .... మరోసారి నవ్వుతా లెండి .... " అనో, "మీరు చెప్పిన యాక్షన్ కంటే—ఇలా చేస్తే బాగుంటుంది కదండీ !" అనో అంటుండేది. దాసుకు ఆమె ప్రవర్తన చికాకు కలిగించినా ఏంచేస్తాడు .... నాటకం పడాలంటే ఎట్లాగో నచ్చజెప్పి సరిపుచ్చుకోవాలి. ఆమెను వద్దనవచ్చు. కాని ఇంకొకరు ఆమాత్రమైనా దొరకరు. లేకపోతే ఆ చిన్న పాత్రకు కూడా ఏ తెనాలికో, గుంటూరుకో ఉరకాలి. అందుకని దాసు ఎంతో ఓర్పుతో ఉండేవాడు.

"ఎందుకోయ్—అంత నచ్చచెప్పటం, నీవు చెప్పినట్లు చేసితీరాలని కచ్చితంగా చెప్పక" అనేవాడు రమణ.

వెంకటేశ్వర్లు దాసంటే కొరకొర లాడుతున్నాడు. దానికి సగం కారణం మీనాక్షి, రెండోసగం తను అడిగిన పాత్రను దాసు ఇవ్వకపోవడం. మీనాక్షిని తీసుకువచ్చింది వెంకటేశ్వర్లే అయినా ఆమె అతనిపట్ల ఎప్పుడూ కృతజ్ఞతగా ఉండటం లేదనీ, దాసంటేనే ఆమెకెంతో గౌరవమనీ లోలోపలే వాపోయేవాడు మొదట్లో. ఎన్నాళ్లని అట్లా అణుచుకోగలుగుతాడు పాపం ! అది ఒక్కోసారి అతనికి తెలియకుండానే బయటపడేది..... ఎవరిమీదో పెట్టి దాసును, మీనాక్షిని ఆడిపోసుకునేవాడు. ఒకరోజు రిహార్సలులో వెంకటేశ్వర్లు దాసు చెప్పిన ప్రకారం చేయకుండా తన యిష్టం వచ్చినట్లు డైలాగులు చెప్పడం మొదలుపెట్టాడు.

"అట్లా డైలాగు అప్పజెప్తే ప్రయోజనం లేదు వెంకటేశ్వర్లూ .... మాడ్యులేషన్ ఉండాలి .... నీకు యాక్షనుకు అవకాశం కూడా ఉంటుంది—నేను చెప్పిన డైలాగ్ అంటే" అన్నాడు దాసు.

"ఇప్పుడు మటుకు యాక్షనుకు ఎందుకు స్కోపు లేదు." మొండిగా అన్నాడు వెంకటేశ్వర్లు.

దాసు ఆ సంభాషణను రెండు రకాలగాను అని, ఆప్రకారం యాక్టుచేసి చూపించి "ఇప్పుడు చెప్పు—ఏది బాగుందో" అన్నాడు. మీనాక్షి, మరికొందరు సభ్యులు దాసు చెప్పిన విధమే బాగుందన్నారు. వెంకటేశ్వర్లుకు అది చిన్నతన మనిపించింది. నలుగురిలో తనమాట వీగిపోయిందని బాధ పడ్డాడు. అయినా అతని పద్ధతి మార్చుకోలేదు.

"నీవేదో మనస్సులో పెట్టుకొని యిలా చేయడం ఏం భావ్యంగా లేదు వెంకటేశ్వర్లూ .... పోనీ నీకు ఇష్టం లేకపోతే చెప్పెయ్యి—నీ కిచ్చిన పాత్ర మరెవరికైనా ఇస్తాను" అన్నాడు దాసు.

ఇక లాభం లేదనుకున్నాడు వెంకటేశ్వర్లు. "తను నాటకంలో వేషం వేయకపోతే ఎట్లా ? .... అప్పుడే పది మందికీ చెప్పుకున్నాడు కూడా .... " గత్యంతరంలేక దాసు చెప్పిన ప్రకారమే చేశాడు.

దాసు అప్పుడే కళాసమితి గదిలోకి వచ్చాడు. ఇంకా ఎవరూ రాలేదు. అంతకుముందే పని కుర్రాడు గది శుభ్రం చేసి చాపలు పరచి అరుగుమీద కూర్చున్నాడు. గదిలో ట్యూబు లైటు వెలుతురు క్రుమ్మరిస్తున్నది.

"రమణ కూడా రాలేదా ?" అని ప్రశ్నించాడు దాసు.

"వచ్చి వెళ్లారుసార్ !—ఇంకో గంటలో వస్తామని."

"ఒక్కడే వెళ్లాడా ?" -

"ఆయన, సీతాపతిగారూ, మన ప్రెసిడెంటుగారింటికి ఎల్దామనుకొని కలిసిపోయారు."

ఇంతలో గదిముందు ఆగిన రిక్షాలోంచి మీనాక్షి దిగుతూ "ఇంకెవరు రానట్టుందే ?" అంటూ దాసును పలకరించింది. లోపలకు వచ్చి చాపమీద ఒక ప్రక్కగా కూర్చుంది.

"ఈపాటికల్లా రావాల్సిందే ! .... ఏమైంది మీ ఉద్యోగ ప్రయత్నం ?" అని ప్రశ్నించాడు దాసు.

"మీతో చెప్పడానికి అవకాశం దొరకలేదు. మూడు రోజులైంది., సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో చేరాను ..... కాని చాలా దూరమండీ !" అంది మీనాక్షి.

"పోన్లెండి—ఎక్కడో అక్కడ దొరికింది .... నేను మా ఆఫీసులో యిప్పించలేకపోయాను .... "

"మీరు మటుకేం చేస్తారు—ఆఫీసరు ఒప్పుకోనప్పుడు" ఫరవాలేదులెండి అన్నట్లు అతనివంక చూస్తూ అంది మీనాక్షి.

'క్రొత్త పుంతలు" నాటకం మూలంగా మీనాక్షికి దాసు దగ్గర మరికొంత చనువేర్పడింది. ఇది చివరకు మీనాక్షి పట్ల దాసుకుండే బెరుకుతనం పోయి ఒక్కోసారి డైరెక్షన్ యిచ్చేటప్పుడు 'నీవు' అనడం, కలివిడిగా మాట్లాడటం అలవాటైంది. ఒకసారి రిహార్సల్సు జరుగుతున్నప్పుడు మీనాక్షి సరిగా చేయకపోతే అప్రయత్నంగానే "నీవు అలా పోజుపెట్టి డైలాగు చెప్పడం ఎబ్బెట్టుగా ఉంది మీనాక్షీ !" అని నాలుక కరచుకొని ఆమె ఎలా నిలబడాల్సిందీ, సంభాషణ ఏవిధంగా చెప్పాల్సిందీ చేసి చూపించాడు దాసు. రిహార్సల్సు అయి ఆమె వెళ్ల బోతుంటే దగ్గరకు వెళ్లి "మరోలా అనుకోకండీ—ఇందాక పొరపాటున ఏకవచనం ప్రయోగించాను." అని క్షమాపణ ముఖం పెట్టాడు.

"ఫర్వాలేదండీ .... మీరు అలా పిలిస్తేనే బాగుంది" అని అంటుంటే ఆమె కాటుక కళ్లు నవ్వాయి.

కొంచెంసేపు ఎవరూ ఏమీ మాట్లాడకుండా కూర్చున్నారు. మధ్య మధ్య మీనాక్షి అతనివంక చూస్తూన్నది. దాసు మరోవైపు చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. అతని ఆలోచనలో గోపాలరావు మెదిలాడు. "చిత్రమైన వ్యక్తిలా ఉన్నాడు .... ఏమిటి తేల్చుకోందే పోనంటున్నాడు .... ఏమిటా తేల్చుకొనేదీ ?" అని ప్రశ్నించుకున్నాడు. కాని సమాధానం తోచ లేదు.

"ఏమిటీ ఆలోచిస్తున్నారు ?" అంది మీనాక్షి. దాసు ఆమెవైపు చూశాడు. ఆమె పెదవులమీద మందహాసం నర్తించడం, కళ్లు పలకరించడం చూసి 'ఎలా వస్తుందో—అలా చీటికి మాటికి నవ్వు" అనుకున్నాడు.

ఆడది కాస్త నవ్వుతూ పలుకరించిందంటే చాలు, కొంతమంది ఆ చిరునవ్వుకు చిలువలు పలువలు కల్పించుకొని మురిసిపోతుంటారు. ఆడవాళ్లతో పరిచయాలు పెంపొందించుకోడం, తమలో కలిగే తృష్ణకు 'ప్రేమ' అని రూపకల్పనం చేసికోడం, కూడా కొందరికి అలవాటు. వేసే ఎత్తుగడలు ఫలిస్తే తమంతటివారు లేరు. ఫలించనప్పుడు ఆ స్త్రీ మీద వీలున్నంత 'విష్పరింగ్ కాంపైన్' ప్రారంభిస్తారు. దాసులో ఈ తత్వాలు ఏమీ లేవు. సాధ్యమైనంతవరకు ఆడవాళ్లకు దూరంగా తప్పించుకు తిరుగుతాడు. వాళ్ల గౌరవం వాళ్లకిచ్చి, మన గౌరవం నిలబెట్టుకోడంలోనే నాగరకత, విశిష్టత ఉందనుకొనేవాళ్లలో దాసు ఒకడు.

"ఇవాళ ఇంకెవరూ వచ్చేట్టు లేదు" అంది మీనాక్షి.

"అలాగే ఉంది చూడబోతే" అన్నాడు దాసు.

"పోనీ మనిద్దరి సీను రిహార్సలు వేసుకుందాం !"

"వేస్తే బాగానే ఉంటుంది .... కొంత పోర్షన్ కూడా నలుగుతుంది .... కాని వీళ్లంతా ఎందుకు రానట్టు ? ..... అంతా కూడబలుక్కున్నట్టు మానేశారే ?" అని ఆలోచిస్తున్నాడు దాసు.

"ఏమిటి సందేహిస్తున్నారు ?" అని ప్రశ్నించింది మీనాక్షి.

"పోన్లెండి .... ఇవ్వాల్టికి మనం కూడా మానేద్దాం" అన్నాడు దాసు.

తనతో రిహార్సలు వేయడానికి ముఖమాట పడుతున్నాడనుకుంది మీనాక్షి. నిజానికి ఆ సీనంతా ప్రేమఘట్టం. గదిలో ఇంకెవరూ లేరు. దాసు వద్దనేప్పటికి ఇంకేమీ అనలేక పోయింది మీనాక్షి.

"అంతా వస్తే ఎంత బాగుండేది .... నాటకం ఇంకా ఎన్నాళ్లో లేదు." అంటూ దాసు కుర్రవాణ్ణి కేక వేశాడు. "రమణ వస్తే చెప్పు—మే మిద్దరం వచ్చి చాలాసేపు కూర్చున్నామనీ, ఎవరూ రిహార్సల్సుకు రాలేదని .... ఆమెకు

రిక్షా కావాలేమో పిలు—నేను వెడతాను'' అంటూ లేచ్చి నిలుచున్నాడు దాసు.

''రిక్షా కాస్త దూరంపోతే దొరుకుతుందిలెండి .... ఇప్పుడు వెళ్లి ప్రత్యేకంగా తీసుకురాకపోతేనేం'' అంటూ మీనాక్షి కూడా బయలుదేరింది. ఆమె వెళ్లిన తరువాత వెడదాం గదా అని దాసు అరుగుమీద నిలబడ్డాడు. ఆమె కదల కుండా కొన్ని క్షణాలు నిలబడి ''ఊఁ—పదండి .... ఇంకా నిలబడ్డారేం ?'' అంది.

దాసు మాట్లాడకుండా నడుస్తున్నాడు. మీనాక్షి అతని ప్రక్కనే నడుస్తున్నది. ఏ రిక్షా అయినా ఎదురు వస్తే మాట్లాడుకొని వెడుతుందేమోలే అనుకున్నాడు దాసు.

''ఇవ్వాళ తొందరగానే వెడుతున్నాంగా .... మా ఇంటికి రండి—వెడదాం'' అంది మీనాక్షి.

''ఎందుకూ ?''

''వూరికేనే .... కాసేపు కూర్చుని పోదురుగాని.''

''ఈసారి ఎప్పుడైనా వస్తానులెండి .... ''

''మా అమ్మ ఒకసారి మిమ్మల్ని చూస్తానంది .... మళ్లీ మీకు తీరుబడి ఉంటుందో ఉండదో .... ఇప్పుడు వెడదాం రండి !'' అతని కళ్లల్లోకి చూస్తూ అంది మీనాక్షి.

''నన్ను చూడడం దేనికి ?'' ఆశ్చర్యంగా ప్రశ్నించాడు దాసు.

ఎందుకో మీనాక్షి చెప్పలేదు. ఈలోగా ఒకటి రెండు రిక్షాలు వాళ్లను దాటేసుకొని పోయాయి. ''మనిషి ఒక పట్టాన కొరుకుడుబడే రకం కాదు'' అనుకుంది మీనాక్షి. ''ఈవిడ తనను ఇంటికి రమ్మనడంలో ఉద్దేశ మేమిటి ? .... తల్లి నన్నెందుకు చూడాలనుకుంటున్నది ?'' అని ఆలోచిస్తూ నడుస్తున్నాడు దాసు. రోడ్డుమీద ట్రాఫిక్ బాగా ఉంది. రోడ్డు క్రాస్ చేయడంలో మీనాక్షి రెండడుగులు ముందైంది. ఇంతలో ఒక కారు వేగంగా వచ్చేస్తున్నది. పరధ్యానంలో ఉన్న మీనాక్షి అది గమనించలేదు. దాసు మీనాక్షి చెయ్యి పుచ్చుకొని వెనక్కు లాగడం, కారు కిర్రున ఆగిపోవడం, ఒక లిప్త కాలంలో జరిగిపోయింది. దాసు చెయ్యి పట్టుకుని లాగడం, కారు కిర్రున ఆగడంతో ప్రమాదం ఏమీ జరక్కపోయినా మీనాక్షి కంగారుపడి దాసు చెయ్యి వదలకుండా అలాగే గట్టిగా పట్టుకుంది.

''హలో .... దాసుగారా !'' అన్న పరిచితమైన కంఠం విని దాసు మీనాక్షి చెయ్యి విదిలించుకొని కారులోకి చూశాడు. మైత్రేయి, మాలతి, గోపాలరావు కారులో ఉన్నారు. మాలతి ఒకసారి దాసువంక, ఒకసారి మీనాక్షివంక చూసి వూరుకుంది.

''అలా పరధ్యానంగా రోడ్డుమీద నడుస్తారుటండీ ! .... మీరు లాగకపోతే ఆమె కారు క్రిందికి వచ్చేసేది పాపం'' అన్నాడు గోపాలరావు.

మీనాక్షి కృతజ్ఞతతో దాసువైపు చూసింది.

''రండి దాసుగారూ కార్లోకి'' అంది మైత్రేయి.

''ఎందుకులే మైత్రేయీ ! .... మీరు వెళ్లండి ... నాకు వేరే పనుంది.'' అన్నాడు దాసు మాలతివంక చూస్తూ. మాలతి గోపాలరావుతో ''కారు పోనీయ్ బావా !'' అంది. కారు ముందుకు సాగింది. కొన్ని క్షణాలు కారు పోయిన వంకే చూస్తూ రోడ్డు ప్రక్క నిలబడ్డాడు దాసు.

''మాలతి అసలు పలుకరించనేలేదే !'' అనుకున్నాడు.

''ఏమండీ .... నాకు దాహం వేస్తున్నది .... హొటలుకు వెడదాం రండి'' అంది మీనాక్షి.

''మీరు వెళ్లకూడదూ !''

''నేను ఒక్కదాన్నా .... రండీ—ప్లీజ్'' కాటుక చూపుల్తో ప్రాధేయపడుతూ అంది మీనాక్షి.

''ఏమిటీ బెడద ? .... రోడ్డుమీది జనం అంతా ఇట్టే చూస్తున్నారు.'' అనుకుంటూ దాసు మీనాక్షితో దగ్గరలో ఉన్న ఓ హొటల్లోకి వెళ్లాడు.

మీనాక్షి సర్వర్‌ను పిలిచి రెండు స్వీట్స్, రెండు హాట్స్ తెమ్మని ఆర్డరిచ్చింది.

''ఇప్పు డెందు కివన్నీ .... నాకు ఆకలి లేదు.'' అన్నాడు దాసు.

''ఇవ్వాళ మీరు నా ప్రాణాలు కాపాడారు.
ఈమాత్రమైనా కృతజ్ఞత చూపవద్దా !''

''నేనేకాదు—ఆ క్షణంలో ఎవరున్నా ఆపనే చేస్తారు... అది విధ్యుక్తధర్మం.''

''అందరూ మీలా అనుకుంటారా ?'' అంది నవ్వుతూ మీనాక్షి.

సర్వర్ స్వీట్స్, మంచినీళ్ల గ్లాసులు తెచ్చి బల్లమీద పెట్టి వెళ్లాడు.

దాసు ఆలోచనల్లో మాలతి మసులుతున్నది. ''ఎందుకూ తనవంకా, మీనాక్షివంకా అలా చూసింది ? .... అలా కలివిడిగా మాట్లాడే మనిషి ఒక్కమాటైనా అనలేదే !'' అని ఆలోచిస్తున్నాడు. మీనాక్షి ఏవో కబుర్లు చెబుతున్నది. అతను 'వూ' కొడుతూ ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని ''మీ నాన్నగారు ఏం చేస్తుంటారు ?'' అని ప్రశ్నించాడు.

''మా నాన్నగారు పోయి మూడేళ్లయింది. మా అన్నయ్యా, ఇద్దరు తమ్ముళ్లూ ఉన్నారు.''

''మీ అన్నయ్య ఏం చేస్తుంటారు ?''

''ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో పనిచేస్తున్నాడు .... తమ్ముళ్లు ఇంకా చదువుతున్నారు .... చాలా—ఇంకేమైనా సమాధానాలు చెప్పాలా ?'' కవ్విస్తున్నట్లుగా చూస్తూ అంది మీనాక్షి.

''మిమ్మల్ని మా సమితికి తెచ్చింది వెంకటేశ్వర్లు గదా—ఎందుకూ మీరు అతనంటే పెడసరంగా ఉంటారు ?'' అని ప్రశ్నించాడు దాసు.

''మొదట్లో అతనేదో మంచివా డనుకున్నాను. మా అన్నయ్యకూ వెంకటేశ్వర్లుకు స్నేహం .... నేను కాలేజీ నాటకాల్లో వేస్తుండేదాన్ని. ఒకరోజు అతను వచ్చి ' అన్న

య్యను అడిగాడు—నేను మీ కళాసమితిలో చేరి నాటకంలో వేషం వేస్తానేమోనని .... నాకు నాటకాలంటే చాలా సరదా. అందుకని ఒప్పుకున్నాను. మొదటిరోజే కళాసమితికి వచ్చేప్పుడు ఒకే రిక్షాలో వెడదాం అన్నాడు. నాకు ఒళ్లు మండిపోయింది. కాని అన్నయ్య స్నేహితుడనీ, నాటకంలో వేయడం పడదేమోననీ తగ్గి నేను వేరే రిక్షా చేసుకుంటాలెండి'' అన్నాను .... జయలక్ష్మి అతణ్ణి గురించి చాలా చెప్పిందిలెండి ....'' అని చెప్పింది మీనాక్షి.

సర్వరు కాఫీ కప్పులు ట్రేలో తెచ్చిపెట్టి బిల్లు తేవడానికి వెళ్లాడు. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చోవడంవల్ల దాసుకు హొటలు లోపలకు వచ్చేవారు కనిపిస్తున్నారు. మీనాక్షికి ఆ అవకాశం లేదు. అప్పుడే మెట్లెక్కి లోపలకు వస్తున్న వెంకటేశ్వర్లు, శాస్త్రి కనిపించారు దాసుకు. వాళ్లిద్దరూ వీళ్లని చూడనట్టుగా ఒక టేబులు దగ్గర కూర్చున్నారు.

''చచ్చాం .... ఇంక రేపటి నుంచి ప్రచారం చేస్తారేమో ? మీనాక్షిని వెంట తీసుకుని తిరుగుతున్నానని'' అనుకుంటూ దాసు మీనాక్షి ఏదో చెప్పబోతుంటే వద్దని సంజ్ఞ చేశాడు. ఎందు కట్లా అంటున్నాడా అని ఒకసారి అతనివంక చూసి వెంటనే గిరుక్కున వెనక్కు తిరిగి చూసింది. కాస్త దూరంలో కూర్చున్న వెంకటేశ్వర్లు, శాస్త్రి ఆ క్షణంలోనే ఆమెవైపు చూశారు. మీనాక్షి మళ్లీ దాసువైపు తిరిగి ''వీళ్లేనా—ఇంకెవరో అనుకున్నా'' అంది. దాసేమీ మాట్లాడకుండా కాఫీ సిప్ చేస్తున్నాడు.

''ఇంతకీ కాల్లోవాళ్లు ఎవరో చెప్పారుకాదు'' అంది మీనాక్షి మళ్లీ.

''తెలిసినవాళ్లు.''

''మీరు వాళ్లను గురించే ఆలోచిస్తున్నారు కదూ !'' కళ్లు చికిలిస్తూ అంది. దాసు నవ్వి వూరుకున్నాడు. సర్వర్ తెచ్చిన బిల్లును మీనాక్షి అందుకొని వేనిటీబ్యాగ్‌లోంచి ఐదు రూపాయల నోటు తీసి బిల్లు తెచ్చిన స్టీలు పళ్లెంలో పెట్టింది. సర్వర్ అది తీసుకు వెళ్లాడు.

''బైటకు వెళ్లాలంటే వాళ్లముందు నుంచే వెళ్లాలి'' అన్నాడు దాసు.

''వెడదాం .... ఏం భయం ? .... వాళ్లకంటే ముందే మీరు పలుకరించి రిహార్సల్సుకు ఎందుకు రాలేదో అడగండి'' అంది మీనాక్షి.

''పోనీ వాళ్లు వెళ్లిందాకా మనం ఇక్కడే కూర్చుంటే?'

''వాళ్లూ అలాగే కూర్చుంటారేమో!''— నవ్వుతూ అంది మీనాక్షి.

సర్వర్ మిగతా డబ్బు తెచ్చి మీనాక్షి ముందు ఉంచాడు. ఆమె అందులో ఒక పది నయాపైసల బిళ్ల వదిలి మిగతాది బ్యాగ్‌లో వేసుకొని ''పోదామా'' అంది లేస్తూ. ఇద్దరూ వెంకటేశ్వర్లు, శాస్త్రి కూర్చున్న బల్లదాకా వచ్చారు.

వెంకటేశ్వర్లు అంతకుముందు వాళ్లను చూడనట్టు ముఖం పెట్టి ''ఓ—మీరా .... ఎవరో ననుకున్నా !'' అన్నాడు.

''నమస్కారమండీ !'' అంది మీనాక్షి.

''రిహార్సల్సుకు రాలేదేం వెంకటేశ్వర్లూ ?'' అన్నాడు దాసు.

''ఓ పనిమీద వెళ్లాం .... ఇప్పుడు వద్దాం అనుకుంటున్నాం .... మీ రిద్దరూ ఇప్పుడే వెడుతున్నారా ?'' అన్నాడు శాస్త్రి.

''దాదాపు గంటసేపు రూంలో కూర్చున్నాం .... ఎవరూ రాలేదు. అందుకని బయలుదేరాం !'' అంది మీనాక్షి.

''అదేమిటీ .... ఎవరూ రాకపోవడ మేమిటి ?'' ఆశ్చర్యం పడుతున్నట్టు అన్నాడు వెంకటేశ్వర్లు.

''ఏమో .... సర్లే .... రేపు కాస్త టైంకు రండి'' అంటూ దాసు ముందుకు సాగాడు. మీనాక్షి అతణ్ణి అనుసరించింది.

''ఏమండీ—కాస్త ఇంటిదాకా దిగబెట్టరూ !'' అంది మీనాక్షి ముద్దుగా.

''ఏం భయం ? .... రిక్షాలో వెళ్లండి.''

''ఊహూ .... నాకు భయంగానే ఉంది .... మీరిటు వెళ్లగానే వెంకటేశ్వర్లు నావెంట పడతాడు.''

''నేను లేకపోతే ఏం చేసేవారో ?''

''ఉన్నారు కాబట్టి .... కాస్త దయయుంచి రండి ప్లీజ్ !'' అంది మీనాక్షి.

''వాళ్లు మీవెంట పడకుండా నేను చూచుకుంటాను.... మీరు రిక్షాలో వెళ్లండి.''

''అయితే మా ఇంటికి రావడం ఇష్టంలేదన్నమాట ?'' కొంటెగా మీనాక్షి గునిసింది.

''అలాగని నేను అనలేదే ! .... మరోసారి ఎప్పుడైనా వస్తాను .... మరోలా అనుకోవద్దు.'' అంటూ దాసు రిక్షా కోసం వెదుకుతున్నాడు. ఇంతలో వాళ్ల ప్రక్కన రాజు మోటరు సైకిలు ఆగింది. ''ఇతనికంట కూడా పడ్డానే'' అనుకుంటూ దాసు రాజువైపు తిరిగాడు.

''రూముకు వెళ్లాను దాసూ ! .... మీ రిద్దరూ వెళ్లారని కుర్రాడు చెప్పాడు ....'' అన్నాడు, రాజు మీనాక్షిని చూస్తూ. మీనాక్షి రాజువైపు చూసింది 'ఎవరా' అన్నట్టు.

''ఇతను మన సమితి మెంబరు .... డొనేటర్ కూడా .... సాహిత్యపరుడు—కృష్ణంరాజంటారు .... ఈమె మా నాటకంలో హీరోయిన్ రాజూ ! .... పేరు తెలుసుననుకుంటాను .... గ్రాడ్యుయేటు ... సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో పని చేస్తున్నారు.'' అని దాసు ఉభయులకు పరిచయం చేశాడు. మీనాక్షి రాజుకు నమస్కరించింది. ఇంతలో వాళ్ల ప్రక్క నుంచి ఖాళీ రిక్షా పోతుంటే దాసు ఆపాడు. మీనాక్షి ఇద్దరికీ నమస్కరించి రిక్షాలో ఎక్కింది.

''మంచి పర్సనాల్టీ !'' అంటూ రాజు పాంట్ జేబులోంచి సిగరెట్ పెట్టె తీశాడు.

ఆ క ర్ష ణ లో అ ప స్వ రా లు

"ఏమిటి విశేషాలు రాజూ !"

"ఏంలేవు .... మీ రూముముందు నుంచి పోతూ వూరికే మీరున్నారేమోనని చూశాను. వస్తా .... కొంచెం అర్జంటు పనుంది" అంటూ సిగరెట్ ముట్టించి మోటరు సైకిలు ఎక్కాడు. దాసు సిగరెట్ ముట్టించి మోటరుసైకిలు పోయిన వరక చూస్తూ హోటలుకు కాస్త దగ్గరలో ఉన్న ఫుట్ పాత్‌మీద నిలబడ్డాడు.

వెంకటేశ్వర్లు, శాస్త్రి హోటలునుంచి బయటకు వచ్చి దాసు అక్కడే ఉండటం చూసి ఆశ్చర్యపడ్డారు. 'ఇక్కడే నిలబడ్డారేం ?' అని ప్రశ్నించాడు వెంకటేశ్వర్లు.

"మీరూ వస్తారుకదా—కలిసి పోదామని ఆగాను." వెంకటేశ్వర్లు ముఖ కవళికను పరిశీలిస్తూ అన్నాడు దాసు.

"ఇంటికేనా ?" అన్నాడు శాస్త్రి.

"ఆఁ" అన్నాడు దాసు.

ముగ్గురూ ఆబిడ్స్ నుంచి కోటీవైపు నడుస్తున్నారు.

"వెంకటేశ్వర్లూ నాలో ఏమైనా లోపంగాని, మీకే మైనా అన్యాయంగాని చేస్తుంటే ముఖాముఖి అడిగేసెయ్యి .... మనస్సులో ఏదో బాధ పడటం దేనికి ? .... బుద్ధిపూర్వ కంగా నేనేమీ చేయలేదని నమ్ముతున్నాను .... నీవు ఏదో అను మానం పెట్టుకొని రిహార్సల్సుకు రాకుండా మానేయడం బాగుండలా !" అన్నాడు దాసు.

"అబ్బే ! .... ఆ ఉద్దేశంతో నేను మానేయలేదండీ !" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నా కన్నీ తెలుసు .... ఏది ఏమైనా ప్రతివాడిలోనూ ఏదో ఓ లోపం ఉంటుంది. వ్యక్తిగతంగా మనలో మనకు అనేక భేదాభిప్రాయా లుండవచ్చు. వాటి ప్రభావం మన కళా సమితిమీద పడకూడదు. నాటకాన్ని నన్ను డైరెక్టు చేయ మన్నారు కాబట్టి, నాటకం విజయవంతం కావడానికి, మన సమితికి మంచిపేరు రావడానికి శ్రమ పడుతూ, నాకు తోచిన సలహాలు యిస్తున్నాను. అవి మీ రెవరూ కష్టంగా భావించ రాదు .... పోనీ నేను మానేస్తాను .... మీ రెవరైనా బాధ్యత తీసుకోండి. నాకు కావలసింది నాటకం పదిమంది మనన్ననలు పొందడం, మన కళాసమితికి మంచిపేరు రావడమూ !" అని దాసు అంటుంటే వెంకటేశ్వర్లు మారు మాట ఎత్తలేదు. అంతా అయినాక, "అబ్బే—అదేం లేదండీ .... మీరే డైరెక్టు చేయాలి .... రేపటినుంచి అంతా రిహార్సల్సుకు సరిగ్గా వస్తాంగా" అన్నాడు వెంకటేశ్వర్లు.

ఈలోగా ముగ్గురూ కోటీదాకా వచ్చారు.

"సరే—మీరింక వెళ్లండి .... నేను బస్సెక్కుతాను."

"మంచిది—వెళ్లిరండి" అన్నాడు వెంకటేశ్వర్లు. దాసు బస్‌స్టాండు వైపుకు, వాళ్లిద్దరూ సుల్తాను బజారు వైపుకు మళ్లారు.

17

రేడియోనాటిక "రాగద్వేషాలు" రిహార్సల్సు జరుగుతున్నాయి. రేడియో అధికారి పాత్రధారులకు ఏవో సలహాలిస్తున్నాడు. ఇంతలో స్టూడియోలోకి వచ్చిన దాసును చూసి "మీరు కూడా వచ్చేశారు, ఒక్కసారి రీడింగ్ రిహార్సలు చూసుకుందాం.... రారేమో ననుకున్నాను.... మీరూ మాలతిగారూఒకసారి స్క్రిప్టు చదవండి—డైలాగులు చెప్తూ...." అనిరేడియో అధికారి వాళ్లు నిర్వహించవలసిన పాత్రలను చెప్పాడు.

దాసును చూడగానే మాలతిముఖంలో మూగతనం, కళ్లల్లో నిర్లక్ష్యం ప్రత్యక్షమయ్యాయి. అప్పటికి చిన్నపాటి కదలికలతో మాలతిని పలకరించాడు, నమస్కరిస్తున్నట్లుగా, మాలతి జవాబివ్వలేదు.

"నమ్ము జానకీ— నా మాటనమ్ము.... నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను.... నా ఆరాధ్యదైవంగా భావిస్తున్నాను... కాని నీవే నన్ను అర్థంచేసుకోలేకపోతున్నావు.... ఏవో అనుమా నాలు పెట్టుకొని నీలోనీవే బాధపడుతున్నావు."— దాసు 'రాగద్వేషా'ల్లోని డైలాగు చదవడం మొదలు పెట్టాడు.

'ఎలా నమ్మమంటారు— కళ్లారా చూసినదాన్ని కాదని? —మాలతి తనడైలాగ్ చదివింది.

"ఏం చూశావు నీవు.... ఆమెతో కలుపుగోలుతనంగా మాట్లాడటం తప్పా ?.... ఆమెకు చేతనైన సహాయంచేయడం తప్పా ?"

"అవును..... మీ రేంచేసినా చెల్లుతుంది."

"చదువూ— సంస్కారం ఉన్నదానివీ అర్థంచేసుకుంటా వనుకున్నాను.... కాని పాటిఆడదానిమీద నీకింత ద్వేషం ఉంటుం దనుకోలేదు."

"అనండి— అనండి..... పైగా నన్నే అనండి...."

"రైట్.... చాలా బాగుంది.... కాని అక్కడ టోన్‌లో గర్వమూ, పాథోస్— రెండూ చూపించండి" అన్నాడు రేడియో అధికారి మాలతితో.

మాలతి అదే సంభాషణను అధికారిచెప్పిన విధంగా అంది. "ఎక్స్. డబ్బుల్ రైట్.... ఎల్లుండికాస్త ఓ గంట ముందు వచ్చేయండి అంతా.... మళ్లీ ఒకసారి స్క్రిప్టుచూసు కొని, ఇక డైరెక్టుగా రికార్డింగుకు పోదాం !" అన్నాడు అధికారి.

అంతాలేచి బయటకు వచ్చారు. మాలతి ఎవరితోనూ మాట్లాడకుండా రేడియోస్టేషన్ ఆవరణంలోంచివచ్చి అప్పుడే ఆమెకోసం వచ్చిన కారులోకి ఎక్కి కూర్చుంది— దాసువంక కోరగాచూస్తూ.

"ఆయనకూడా వస్తారా అమ్మా" అన్నాడు డ్రైవరు.

"కారు పోనియ్" అంది మాలతి— అసెంబ్లీ భవనా లను చూస్తూ. డ్రైవరు కారు ముందుకు పోనిచ్చాడు. దాసు కారుపోతున్నవంకే కొన్నిక్షణాలు చూస్తూ నిలబడిపోయాడు.

"ఎందుకూ మాలతికి తనమీదకోపం.... ఏం చేశానని .... ఒక్కమాటైనా మాట్లాడలేదే !" అనుకున్నాడు దాసు.

దాసు అక్కడినుంచి రిక్షా చేసుకొని కళాసమితికి బయలుదేరాడు. దారిలో అతని ఆలోచనలన్నీ మాలతిమీదే కేంద్రీకృత మవుతున్నాయి. "ఆమెలో ఇంతమార్పు కలగడానికి కారణమేమై ఉంటుంది ?" అని ఆలోచిస్తున్నాడు. అతనికి గోపాలరావుమాటలు స్ఫురణకు వచ్చాయి— " ఈ సారి అటో—ఇటో తేల్చుకు పోతాను" అతనిమాటలకు, మాలతి ప్రవర్తనకు ఒక వంతెన కట్టుకోడానికి ప్రయత్నించాడు.... "బహుశా అంతే అయి వుంటుంది.... గోపాలరావును పెళ్లిచేసుకోబోతుంటే తనతో మాట్లాడటానికేం ?.... ఊహూ—అది కారణం కాకపోవచ్చు.... అసలు గోపాలరావును చేసుకోకనే పోవచ్చు.... మరైతే తనమీద కోపమెందుకు?" అని ప్రశ్నించుకున్నాడు. ఒక్కసారి క్రితంరోజు జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది..... తనతో మీనాక్షి రోడ్డు క్రాస్‌చేయబోవడం, ఈలోగా మాలతికారు మీనాక్షిమీదకు రాబోవడం, తను చేయి పట్టుకుని లాగి, పొదివిపట్టుకొని ఆమెను తప్పించడం—అన్నీ కళ్లముందు కదలాడాయి.... క్రమంగా అతనికి సామాధానం చిక్కినట్లే అనిపించింది. "స్త్రీ సహజమైన అసూయ చదువుకున్నదైనా మాలతిలో ఉందేమో !.... మీనాక్షికూడా అందగత్తెల్లోనే జమ. నేను మీనాక్షివెంట ఉండడం మాలతికి కష్టంతోచి ఉంటుంది. -మీనాక్షిమీద అసూయకు ఫలితం నామీద కోపం.... అయినా, అర్థంలేని కోప మెందుకు ?.... మీనాక్షిమీదకంటే తన మీదే గౌరవాభిమానాలున్నాయని మాలతికేం తెలుసు ?.... ఎలా తెలుస్తుంది ?" అన్న ఆలోచనలు అతనిలో రేగుతున్నాయి. మరో అయిదు నిముషాల్లో రిక్షా కళా సమితి గదిముందు ఆగింది. అప్పటికే నాటకంలో పాల్గొనే వాళ్లంతా వచ్చేశారు.

"మీకోసమే ఎదురు చూస్తున్నా— ఇంకా రాలేదేమా అని" అన్నాడు వెంకటేశ్వర్లు.

"రేడియో స్టేషనుకు వెళ్లివచ్చేటప్పటికి ఆలస్యమైంది. పోనీ మీరు రిహార్సల్సు ప్రారంభించకపోయారా ?" అన్నాడు దాసు.

"అలాగే అనుకున్నాంగాని, ఏకంగా దాసుగారు వచ్చాక ప్రారంభిద్దాములెండి అని మీనాక్షిగారనేప్పటికి వూరుకున్నాం" అన్నాడు వెంకటేశ్వర్లు.

"సరే—కానివ్వండి.....ముందు మీ సీను తీసుకుందాం వెంకటేశ్వర్లూ.....రేపటినుంచి సీను తరువాత సీను వేసుకుందాం. అన్నట్టు జయలక్ష్మిగారు రాలేదే!" అన్నాడు దాసు.

రిహార్సల్సు పూర్తి అయ్యేప్పటికి తొమ్మిది కావచ్చింది. అందరినీ పంపించి దాసు ఇంటికి వెళ్లేప్పటికి పదైపోయింది.

భూషణంగారు మంచంమీద ముసుగుపెట్టి పండుకొని ఉన్నారు. సుబ్బలక్ష్మి పిల్లలు నిద్దర్లు పోతున్నారు. సుబ్బలక్ష్మి, రాధమ్మగారు దిగాలుపడి కూర్చున్నారు.

దాసు బట్టలు మార్చుకొంటూ, "భాస్కరం ఏడీ?" అన్నాడు.

"ప్రొద్దున నీవు వెళ్లకముందే కొంపలోంచి వెళ్లాడా—ఇంతమటుకు రాలేదు" అంది సుబ్బలక్ష్మి.

"ముందులేచి భోజనం చెయ్యి నాయనా—తర్వాత మాట్లాడుకోవచ్చు.....ప్రొద్దుననగా నాలుగు మెతుకులు తిన్నావు" అంది రాధమ్మగారు.

భూషణంగారు మూలుగుతూ, దుప్పటి తొలగించి "వచ్చావా" అన్నారు.

"ఎందుకు నాన్న మూలుగుతున్నారు?"

"మధ్యాహ్నంనుంచి జ్వరం.......ఇంతమటుకు జారలేదు" అంది రాధమ్మగారు.

దాసు తండ్రి దగ్గరకువెళ్ళి చెయ్యి పట్టుకు చూసి "అబ్బ—కాలిపోతున్నదే......డాక్టర్ దగ్గరకు వెళ్లొస్తాను" అంటూ దాసు చొక్కా వేసుకోబోతుంటే "ఫర్వాలేదులేవోయ్—ఇంకాసేపటికి జారిపోతుంది.......అంతగా అయితే ప్రొద్దున వెళ్లవచ్చులే" అన్నారు భూషణంగారు.

"తిరిగి తిరిగి వచ్చావు—ఇప్పుడు ఇంకేం వెడతావులే!" అంది రాధమ్మగారు.

"జ్వరం బాగా ఉన్నదమ్మా—ఎట్లా వూరుకోడం?"

"ఈ పూట కేదో ఇంట్లో ఉన్న మందే తీసుకున్నారులే..... ప్రొద్దున వెళ్ళవచ్చు.......వడ్డిస్తారా"

దాసు అన్నం ముందర కూర్చున్నాడేకాని, ఏమీ తిన బుద్ధి పుట్టలా. మొక్కు తీర్చుకొనిలేచి చెయ్యి కడుక్కున్నాడు.

"అదేమిట్రా—ఏమీ తిననేలేదు?" ఆశ్చర్యంగా అంది రాధమ్మగారు.

"ఆకలి లేదమ్మా!.......చొక్కా వేసుకొని అట్లా వెళ్ళి వస్తా—భాస్కరం ఎక్కడైనా కనిపిస్తాడేమో" అన్నాడు దాసు.

"ఎక్కడని వెతుకుతా వన్నయ్యా!.......వాడు జల్సాగా తిరుగుతుంటాడు—చేతిలో డబ్బు కూడా ఉంది" అంది సుబ్బలక్ష్మి.

"డబ్బెక్కడిది?"

"నా పెట్టెలోంచి కొట్టేశాడు. ప్రొద్దున స్నానం చేయబోయేముందు చీరెకోసం పెట్టె తెరిచాను......ఆ తొందరలో మళ్ళీ తాళం వేయడం మరచిపోయాను. తీరా నేను స్కూలుకు వెళ్ళబోయేముందు చూద్దును గదా పది రూపాయల నోటు కనిపించలా."

"ఇంకేం—అవి అయిపోయిందాకా తిరిగి వస్తాడు.....ఛీ... ఛీ.......వాడికి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధిలేదు......వీడెలా దారికి వస్తాడో అర్థం కావడంలేదు" అని విసుక్కున్నాడు దాసు. ఎదుట భాస్కరం కనిపిస్తే గొంతు పిసికివెయ్యాలన్నంత కోపం వచ్చింది. ఇంతలో వీధి తలుపు చప్పుడైంది. భాస్కరమేవచ్చి ఉంటాడనుకొని ఈ చెంపా, ఆ చెంపా వాయ కొడదామన్న ఉద్రేకంతో దాసు వెళ్ళి తలుపు తెరచి ఆశ్చర్యంతో కొన్ని క్షణాలు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

"ఏమిటి బావా, అట్లా తెల్లబోయి చూస్తావేం?...... నేనే విశ్వనాథాన్ని" భుజంతడుతూ అన్నాడు విశ్వనాథం. రిక్షావాడు బెడ్డింగుతెచ్చి గుమ్మంలోపెట్టి విశ్వనాథందగ్గర డబ్బులకు చెయ్యి జాపాడు.

''ఎందుకొచ్చావ్......వెళ్లు......వచ్చిన దారినే వెళ్ళిపో.... ఏ ముఖం పెట్టుకొని వచ్చావు?'' కోపంతో అరిచాడు దాసు.

''అన్నయ్యా!'' అంటూ సుబ్బలక్ష్మి ముందుకు వచ్చింది.

''నీవు వూరుకో సుబ్బులూ!...... మళ్ళీ ఏదో ఎత్తు వేసుకొచ్చాడు.''

''ఆ రోజులు పోయాయి బావా!'' నవ్వుతూ అన్నాడు విశ్వనాథం.''

''అదేమిటి నాయనా......ఇంటికి వచ్చినవాడిని అలాగేనా మర్యాద చేయడం?'' అంది రాధమ్మగారు. ఇంకేమంటాడు దాసు? ''తొందరపడ్డానా?.......ఊహూ.....తన తప్పేంలేదు'' అనుకున్నాడు. వీళ్ల మాటలకు భూషణంగారు లేచి కూర్చున్నారు. విశ్వనాథం నవ్వుకుంటూ లోపలకువచ్చి భూషణంగారి దగ్గరకు వెళ్ళి, ''నమస్కారం మామగారూ........ మీ ఆరోగ్యం ఎలా ఉంటున్నది?'' అని ప్రశ్నించాడు.

''బాగానే ఉంది.'' ముక్తసరిగా అన్నారు భూషణం గారు.

''ఏం బాగో నాయనా, వారం రోజులు కులాసాగా ఉంటే పదిహేను రోజులు బాధ పడతారు.......అమ్మాయ్... కాళ్లు కడుకుంటానికి నీళ్లివ్వమ్మా'' అంది రాధమ్మగారు. సుబ్బలక్ష్మి నీళ్లు తెచ్చి ఇచ్చింది. చిరునవ్వుతో సుబ్బలక్ష్మి వంక చూస్తూ చేతిలోంచి చెంబు అందుకొని, వాకిట్లోకి వెళ్ళి కాళ్లు కడుక్కొని వచ్చాడు విశ్వనాథం. సుబ్బలక్ష్మిని సిగ్గు, సంతోషం ముంచెత్తుతున్నాయి. దాసు మౌనంగా ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. తల్లీ— కూతుళ్లిద్దరువంట గదిలో గుసగుసలాడుతున్నారు. భూషణంగారు మళ్లీకప్పుకొని పడుకున్నారు.

''ఇప్పుడు వంట ప్రయత్నం చేస్తారేమో— ఏమీ అక్కర లేదు......ఇంత రాత్రివేళ మిమ్మల్ని శ్రమ పెట్టడం దేనికని రైలు దిగగానే ఏకంగా హోటల్లో భోజనం చేసి వచ్చాను'' అన్నాడు విశ్వనాథం.

''నిజంగానా?'' తలుపు పక్క నిలబడి ఓరకంట చూస్తూ అడిగింది సుబ్బలక్ష్మి. ఆస్వరంలో ఆర్ద్రత, అప్యాయత ధ్వనించాయి. చాలా కాలం తర్వాత భర్తను చూడటంవల్ల, సహజంగా స్త్రీలో ఉన్న క్షమాగుణంవల్ల సుబ్బలక్ష్మిలో ఆప్యాయత ధ్వనించి ఉంటుంది.

''నిజంగానే తినివచ్చాను సుబ్బులూ!'' అంటూ విశ్వనాథం సుబ్బలక్ష్మి వంక ప్రేమ ఒలకపోస్తూ అన్నాడు.

''భాస్కరం ఏడీ?'' అని ప్రశ్నించాడు విశ్వనాథం.

''ఇంట్లో పది రూపాయలు దొంగిలించి ప్రొద్దుననంగా వెళ్లాడు. ఇంతవరకూ అజా—పజా లేదు'' అంది సుబ్బలక్ష్మి పక్కలు వేస్తూ.

చిట్టితల్లి లేచి ఏడుపు ప్రారంభించింది. సుబ్బలక్ష్మి చంక నెత్తుకొని సముదాయిస్తూ......''అదుగో—నాన్న—నాన్న.. అంటూ విశ్వనాథాన్ని చూపింది. ''ఎవరూ ఈ క్రొత్త మనిషి?'' అన్నట్టు చిట్టితల్లి విశ్వనాథం వంక చూస్తూ ఏడ్పు మానింది.

''దాని మొహం—దానికేం గుర్తు'' అన్నాడు విశ్వనాథం.

''ఒకసారి తీసుకోండి!'' అంటూ సుబ్బలక్ష్మి చిట్టితల్లిని విశ్వనాథానికి అందివ్వబోయింది. కాని, చిట్టి వెళ్ళనని తల తిప్పేసుకుంది. విశ్వనాథం కూడా చేతులు చాచనూలేదు. సుబ్బలక్ష్మి చిట్టి తల్లినిపడుకోపెట్టి చిచ్చికొట్టి నిద్రపుచ్చింది.

రాధమ్మగారు కిరసనాయిలు బెడ్‌లైటు వెలిగించి స్విచ్ ఆఫ్ చేసింది.

దాసు ఆలోచిస్తూ పడుకున్నాడు. అతని ఆలోచనల్లో మాలతి, మీనాక్షి మెదలుతున్నారు. క్రమంగా అతని ఆలోచనలు కళాసమితిమీదికి, తరువాత భాస్కరం, విశ్వనాథం మీదికి మళ్లాయి.

''నీవు చేయదలచుకుంటే ఈ ఉద్యోగం మా వూళ్లో మటుకు దొర్కదేమిటి?'' అని అంటున్న విశ్వనాథం మాటలు నిద్ర మగతులో దాసుకు వినిపించాయి.

18

విశ్వనాథం రెండు రోజులుండి సుబ్బలక్ష్మిని తీసుకువెడతాననీ, అక్కడే ఏ స్కూలులోనైనా ఉద్యోగం యిప్పిస్తాననీ అన్నాడు. సుబ్బలక్ష్మికూడా వెడతానని ప్రయాణమవుతున్నది.

''బాగా ఆలోచించు సుబ్బులూ !.... ఇదివరకు రెండు సార్లు ఇలాగే తీసుకువెళ్లివెళ్ళగొట్టాడా-మళ్లీ అదే పనిచేస్తే?...'' చాటుగా అన్నాడు దాసు.

''మనస్సు మార్చుకున్నారు.... ఇంకెప్పుడూ, అలా చేయనని ఇది ముట్టుకొని ప్రమాణంకూడా చేశారన్నయ్యా !'' అంది సుబ్బలక్ష్మి— పమిటలోంచి మంగళసూత్రాన్ని తీసి చూపిస్తూ.

''నీ మంగళసూత్రం మీదకంటే నీ సంపాదనమీద ఆశపడుతున్నట్టున్నాడు.''

''పోనీలే అన్నయ్యా !.... ఆ ఉద్దేశంతోనైనా నన్ను బాగాచూస్తే అంతేచాలు.''

''కష్టపడి చదువు చెప్పింది నీవు....ఉద్యోగం ఇప్పించింది నీవు....దానిఫలితం అనుభవించడానికి ఇప్పుడు ఆయన తయారయ్యాడు.'' అన్నారు భూషణంగారు. అదికోపమో, విసుగో, పాతచరిత్రవల్ల మరుగువడిపోయిన అభిమానపూరిత స్వరూపమో తెలియలేదు దాసుకు.

''అది సంపాదించి నన్నేం ఉద్ధరించనక్కరలేదు...... పిల్లలు కలదికదా అని జీవనోపాధి కలిగించాను.''

''పోనీలే నాయనా, ఇన్నాళ్లకు మళ్లీ దాని కాపురం నిలబడుతున్నది.... అంతకంటే మనకింకేం కావాలి ?'' అంది రాధమ్మగారు.

''అది వెడతానంటే నాకేం అభ్యంతరం లేదమ్మా !.... కాని మళ్లీ ఏదైనా వెనుకటిలాగే జరిగితే రెంటికీచెడిన రేవడిగతి అవుతుంది. అదే నా భయం!'' అన్నాడు దాసు.

''ఒకవేళ నీవు అనుమానించినట్టే జరిగితే—మళ్లీ నీ భుజాలమీద బరువుపెట్టనులే అన్నయ్యా !'' అని నొచ్చుకుంది సుబ్బలక్ష్మి.

''కోపంవచ్చిందా సుబ్బులూ !.... ఆ ఉద్దేశంతో నేను అనలేదమ్మా !.... నా ప్రాణం ఉండగా నీవు అలా నొచ్చుకో

నక్కర్లేదు .... నీకు ఎప్పుడు కష్టమనితోస్తే అప్పుడు వచ్చేసెయ్యి.'' అన్నాడు దాసు.

దాసు భోజనం చేస్తుంటే ''ఏదోవిధంగా దానిసంసారం కుదటబడి దానింటికది వెడుతున్నది ..... మళ్లీ ఎప్పుడు వస్తుందో యేమో ! ..... దానికొక చీరె, రెవికలగుడ్డ, పిల్లల కేమైనా బట్టలూతెస్తే బాగుండును'' అంది రాధమ్మగారు.

''బాగానే ఉంటుంది.... కాని....''

''ఏదో— యీ ఒక్కసారీ తిప్పలుపడు నాయనా ! ఏమనుకోకు— వీలైతే అతనికికూడా తీసుకురా, లేకపోతే వాళ్లకైనా తీసుకురా.''

''ఏం తిప్పలు పడమంటావమ్మా.... ఎవరిస్తారు ?.... మళ్లీ ఎవరి దగ్గరనైనా వడ్డీకి తీసుకురావాలి.'' కొంచెం విసుగుతో అన్నాడు దాసు.

''అట్లా విసుక్కుంటే ఎట్లా ?.... పోనీ మానుకో.... పుట్టింటివాళ్లు ఉత్త కటికిదరిద్రులుకాబోలు, ఏమీ పెట్టలేదని అక్కడవాళ్లు అనుకుంటారు.'' నిష్ఠూరంగా అంది రాధమ్మగారు. దాసు ఒక్కసారి తల్లివంకచూసి ఊరుకున్నాడు.

''ఈ ఆడవాళ్లకు ఆలోచనే ఉండదేమో.... మొగవాళ్లు ఎలా కష్టపడితే వాళ్లకేం— తాము చెప్పింది చేయాలని పట్టుపట్టడం తప్పితే'' అని అనుకుంటూ ''సర్లే— ప్రయత్నం చేస్తాను'' అన్నాడు.

దాసు బట్టలువేసుకుని వెళ్లిపోయాడు. అతనువెళ్లిన పదినిముషాలకు భాస్కరం మాసిన బట్టలతో, ఇంట్లోకివచ్చాడు.

''వాడటుపోయిందిచూసి నువ్విటు వచ్చావా నాయనా, నీకు ముఖమెలా చెల్లుతున్నదిరా !'' అంది సుబ్బలక్ష్మి. ఆమె మాటలువిని రాధమ్మగారు వంటగదిలోంచి ముందుగదిలోకి వచ్చింది.

''ఎక్కడ అఘోరించావు ఈ మూడురోజులు ?'' ఆయాసపడుతూ అన్నారు భూషణంగారు.

''సిగ్గులేకపోతేసరి.... ఏళ్లొచ్చాయి — ఎందుకూ.... తీసుకువెళ్లిన పదిరూపాయలూ తగలపెట్టిన తర్వాత ఇప్పుడు ఇల్లుజ్ఞాపకం వచ్చింది.'' కోపంతో అంది సుబ్బలక్ష్మి.

''ఎవరు తీసుకువెళ్లారు—పదిరూపాయలు ?''

''ఇంకాప్రశ్నకు ప్రతిప్రశ్న వేస్తావెందుకు ?.... నీవు తీయందే పదిరూపాయలనోటుకు రెక్కలొచ్చి ఎగిరిపోయిందా? ....పెట్టె మింగేసిందా ?''

''ఏమో ?.... నాకేం తెలుసు ?''

''సాయంత్రం అన్నయ్యొచ్చి నాలుగుతగిలిస్తే నీవే చెప్తావు.''

''ఊఁ.... కొడతాడు.'' అని రుంజుకున్నాడు భాస్కరం.

''పోనీలే ఊరుకోతల్లీ....మంచి మాటలతో చెప్పాలి, గాని ఊరికే గదమాయిస్తే ఏం ప్రయోజనం?'' అందిరాధమ్మగారు.

''నీ గారాబమే వాడినలా చెడగొడుతున్నది .... నాకేం నా దారిన నేను పోతున్నా—ఇంకనీయిష్టం—నీ కొడుకులిష్టం'' అంది సుబ్బలక్ష్మి.

''లేరా భాస్కరం.... స్నానంచేసి బట్టలు మార్చుకో.'' అంది రాధమ్మగారు.

''ఓహో — భాస్కరం వచ్చాడే'' అంటూ విశ్వనాథం లోపలకు వచ్చాడు.

దాసు ఆఫీసులో మళ్లీ యాదయ్యను వడ్డీకి డబ్బు ఇప్పించమని అడిగాడు. ఒకసారితీసుకొని అనుకున్నదానికంటే ముందే మాలతిఇచ్చిన డబ్బులోంచి చెల్లించడంతో యాదయ్యకు నమ్మకంఏర్పడి ఏభై రూపాయలు ఇప్పించాడు. దాసు డబ్బు భద్రంగా పెట్టుకొని కళాసమితికి వెళ్లాడు.

ఆరోజు మీనాక్షి రిహార్సల్సుకు రాకపోవడంవల్ల, సభ్యుల్లో ఉత్సాహం తగ్గిపోయింది. అందరూ మొక్కుబడి తీర్చుకున్నట్లు డైలాగులుచెప్పి లేచిపోయారు. మీనాక్షిఉంటే గదిలోంచి కదలనివాళ్లంతా ఇవ్వాళ సిగరెట్‌కనీ, కాఫీకనీ క్షణం క్షణం లేచివెళ్లారు. పిలిస్తేగాని డైలాగుకోసం రాలేదు. అనాటికి రిహార్సల్సు అయిపోయాయి.

''ఒకసారి వాసుదేవరావుగారింటికివెళ్లి మాలతిని కలిస్తే.... ఉహూఁ.... ఆమె దృష్టిలో తను తేలిక అయిపోతాడు.... ఆమె పలుకరించడమే మానివేసినప్పుడు పిలవకుండా వెడితే ఏం బాగుంటుంది ?'' అని ఆలోచిస్తూ నడుస్తున్నాడుదాసు.

వెళ్లి ఆమె కోపానికి కారణమేమిటో అడిగి, తనతప్పేమైనా ఉంటే క్షమాపణ చెప్పుకుంటే.... అనుకున్నాడుకూడా.

''ఆమె నావిషయంలో ఏదో అపార్థం చేసుకొని ఉండవచ్చు....తాను సహాయంచేసింది కాబట్టి నేను తన కనుసన్నల్లో ఉండాలనుకొని ఉండవచ్చు.... తను ఆమెనుంచి సహాయం పొందాడు కాబట్టి పోనీ, అభిమానానికి పోకుండా వెళ్లి మాట్లాడించితేపోతుంది. అనుకొని దాసు ఒక రిక్షాలో వాసుదేవరావుగారింటి ముందు దిగి పైకివెళ్లాడు.

''ఓహో—దాసుగారా .... రండి—రండి'' అంటూ అతణ్ణి డ్రాయింగ్ రూంలోకి తీసుకువెళ్లింది మైత్రేయి.

దాసు సోఫాలో కూర్చుంటూ ''మీ నాన్నగారు లేరా ?'' అన్నాడు.

''లేరు.... నిజం చెప్పండి దాసుగారూ, మీరునాన్నగారి కోసమేనా వచ్చింది ?'' గలగలానవ్వుతూ ప్రశ్నించింది మైత్రేయి.

''నీవు ఘాటుగా మాట్లాడుతావు'' అన్నాడు దాసు.

''లోపల ఒకటి బయటఒకటి—నాకు చేతకాదు.... పాపం, ఎంతో ఆశపడివచ్చారు— అక్కయ్యతో మాట్లాడుదామనీ,— వీణమీద పాట పాడించుకుందామనీ కదూ !'' దాసు ఏమీ మాట్లాడక పోయేటప్పటికి మైత్రేయే అందుకొని ''పోనీ—నేనో పాట పాడనా ?'' అంది.

''ఇప్పుడేం వద్దులే మైత్రేయీ !''

''అవునులెండి.... నాపాట మీకెందుకు ?.... అవును గాని దాసుగారూ,— మొన్న మీ వెంట ఉన్నావిడ ఎవరు ?.... మీరు ఉండడంవల్లగాని లేకపోతే కారు క్రింద పడిపోయేదే !'' అంది మైత్రేయి.

''ఆమె మా నాటకంలో వేస్తున్నది.... ఆమెపేరు మీనాక్షి.''

ఆకర్షణలో అపస్వరాలు

"ఊహూఁ...." అంది, ఆలోచిస్తున్నట్టు మైత్రేయి.

"మీ అక్కయ్యకెందుకో నా మీద కోపం వచ్చినట్టుంది...."

"అయితే మా అక్కయ్యకోపం తీర్చడానికి వచ్చారన్నమాట.... సమయానికి అదికాస్తా వెళ్లి కూర్చుంది వాళ్ల ఫ్రెండ్ ఇంటికి."

"మీ బావగారేరీ ?"

"ఉత్త వెర్రి బాగులవాడు......"

"ఏం—అలా అంటున్నావు ?"

"ఉన్న సంగతే అది......" అని మైత్రేయి అంటుండగా అక్కడకు వాసుదేవరావుగారు వచ్చారు. దాసులేచి వినయంగా నమస్కరించాడు.

"కూర్చో దాసూ !.... అంతా కులాసా ?.... మీనాన్నగారెలా ఉన్నారు ?"

"అంతా కులాసాయేనండీ.... మా నాన్నగారికే రెండు మూడురోజులనుంచీ జ్వరం."

"అలాగా,.... పోనీ మా ఆసుపత్రికి తీసుకురాకపోయావా.... ఏమైనా మందువాడుతున్నారా ?"

"ఏదో వేసుకుంటున్నారులెండి...."

"తగ్గకపోతే నాదగ్గరకు తీసుకురా.... లేకపోతే వచ్చి చెప్తే నేనే వచ్చిచూస్తాను."

"అలాగేనండీ !"

"అమ్మాయ్— ఇంకా అక్క రాలేదా ?"

"ఊహూఁ" అంది మైత్రేయి.

"కూర్చో దాసూ! .... మాలతికూడా వస్తుంది." అంటూ వాసుదేవరావుగారు అక్కడినుంచి వెళ్లిపోయారు.

"కూర్చోండి— కాఫీతెస్తా."

"ఇప్పుడేం కాఫీ మైత్రేయీ !— ఏంవద్దు.... వెళ్తా నేనుకూడా !"

"అక్కయ్య రాందే !"

"నేను వచ్చినట్టు చెప్పు.... వెళ్తా—వేరేపనుంది" అంటూ లేచాడు దాసు.

"అక్కయ్య కోప్పడుతుందేమో— ఎందుకు పోనిచ్చావని.... ఈ మధ్య రెండుకొత్త బొమ్మలువేశాను.... పోనీ అక్కయ్య వచ్చిందాకా అవి చూద్దురుగాని రండి."

"ఇంకోసారి చూస్తానులే మైత్రేయీ !.... నాకు వేరే పనుంది." అంటూ మెట్లదగ్గరికి వచ్చాడు.

దాసు సుబ్బలక్ష్మికి చీరె, ఆమె పిల్లలకి బట్టలు కొనడానికి ఒక షాపులోకి వెళ్లాడు. ఏదోబేరమాడుతున్న మీనాక్షి దాసును చూడగానే నమస్కరించింది.

"రిహార్సల్సుకు రాలేదేమండీ !" అని ప్రశ్నించాడు దాసు.

"మా పినతల్లికూతురూవాళ్లు వచ్చారండీ.... రేపు వెళ్లిపోతున్నారు.... వాళ్లతో ఉండిపోవాల్సివచ్చింది. వాళ్లకే ఏమైనా కొందామని ఇలా వచ్చాను." అంది మీనాక్షి.

"పోన్లెండి.... ఇవ్వాళ ఒక్కరోజు రాకపోతే ముంచుకు పోయిందేమీలేదు." అంటూ దాసు మరోప్రక్కకు తిరిగి అక్కడున్న గుమాస్తాతో, 16, 18 రూపాయల్లో ఏవైనా చీరెలు చూపెట్టమన్నాడు. గుమాస్తా కొన్నిచీరెలు అతనిముందున్న బల్లమీద పడేశాడు. ఆ చీరెల్లో ఏది తీసుకోవాలో తెలియలేదు దాసుకు.

"ఏమండీ— ఇందులో ఏదైనా ఒకచీరె సెలక్టు చేయండి —మా చెల్లెలికి కావాలి." అన్నాడు దాసు, మీనాక్షిని పిలిచి. మీనాక్షి అతనిప్రక్కకువచ్చి నిలబడి చీరెలు చూస్తున్నది. ఇంతలో షాపులోకి మాలతి ఆమెతోపాటు ఆమె స్నేహితురాలు వచ్చారు. దాసు ప్రక్కకు తిరిగిచూశాడు. "ఈ చీరెతీసుకోండి —బాగుంది" అంటూ మీనాక్షి చీరెపట్టుకుని దాసువైపుకు తిరిగింది.

"ఇంకో షాపులోకి వెడదాం రా ! లీలా !" అంటూ మాలతి చరచరా దుకాణంలోంచి బైటకు వెళ్లిపోయింది. ఆమె స్నేహితురాలు లీలకేమీ అర్థంకానట్టు "ఏమిటిది మాలతీ !" అంటూ బైటకువెళ్లింది. మీనాక్షి "లీలా !" అని కేకవేసింది. కాని ఆమె అప్పటికే మెట్లుదిగి వెళ్లిపోయింది. మాలతి వెళ్లిన వంకే చూస్తున్న దాసును "ఈ చీరెచూడండి !" అంటూ మీనాక్షి అతని చెయ్యి పట్టుకుంది.

నిశ్చలంగా, సాభిప్రాయంగా దాసు మీనాక్షివంక చూశాడు. మీనాక్షి పెదవులమీద చిరునవ్వు నర్తించింది. కాటుకకళ్లు కవ్విస్తున్నట్టు అతనివంక చూస్తున్నాయి.

"సరే— ఈ చీరె ఇవ్వండి" అన్నాడు గుమాస్తాతో. మిగతా బట్టల సెలక్షన్‌లోకూడా దాసు అడక్కుండానే మీనాక్షి సలహాయిచ్చి అవి కొనిపించింది. ఇద్దరూ పార్సిల్సు పుచ్చుకొని దుకాణంలోంచి బయటకు వచ్చారు.

"ఇంక నేను వెడతాను." అంటూ దాసు ఆమె సమాధానానికైనా ఎదురుచూడకుండా మరోమార్గంవైపు వెడుతుంటే "పిరికివాడు" అనుకుంటూ లోలోపలే నవ్వుకుంటున్న మీనాక్షి దృష్టికి ఎదురుగ్గా మోటారుసైకిలుమీద వస్తున్న రాజు కనిపించాడు. ఆమె దగ్గరకు వచ్చేటప్పటికి రాజు స్పీడు తగ్గించి ఆమెవంక చూశాడు.

"నమస్కారమండీ !" అంది మీనాక్షి.

"షాపింగు అయిపోయినట్టుంది." అన్నాడు రాజు— ఆమెకళ్లల్లోకిచూస్తూ. మీనాక్షి 'అవు'నన్నట్టు చూసింది, బిడియపడుతూ.

"ఇవ్వాళ రిహార్సల్సు లేవుకాబోలు ?"

"నాకు పనుండి వెళ్లలేదండీ !.... వస్తాను.... పొద్దుపోయింది." అంది మీనాక్షి.

"ఓకే .... ఛీరియో !" అంటూ రాజు చిరునవ్వువిసిరి మోటారుసైకిలు ముందుకు పోనిచ్చాడు.

[సశేషం]

శ్రీనాథుని జన్మస్థలము కాల్పట్టణమే

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

శ్రీనాథుని చరిత్రము తెలుఁగు దేశ చరిత్రముతో ముడివడి యున్నది. నూటయేఁబది యేండ్ల తెలుఁగుదేశ చరిత్రమున కంతటికి యాతని రచనలు సూచకములు. ఆతని చాటువులు, ఆతనినాఁటి తెలుఁగు జాతీయతకు దర్పణప్రాయములు. అతని రచనలలో చరిత్ర నిర్మాణమున కుపయోగించెడి సామగ్రి ఎంతయో జతగూడియున్నది. కాని యాతని చరిత్రము మాత్ర ము వివాదాస్పదముగనే నిలిచిపోవుచున్నది. శ్రీనాథుని జన్మస్థల మేది? అతఁ డెప్పటినుండి ఎప్పటివఱకు జీవించియుండెను? ఆతఁడు రచించిన కృతులెన్ని? ఆతని కేయే ప్రభువులు, మంత్రులు నాశ్రయదాతలైరి? ఇత్యాదిగ నాతనికి సంబంధించిన విషయము లన్నియు, నాతని రచనలలోఁ గానవచ్చెడి సారస్వతచారిత్రక విషయ సమన్వయమునందలి భేదములచే, భిన్న భిన్నములుగా వెలువడుచు వచ్చుచున్నవి. శ్రీనాథుఁడు తెలుఁగుదేశము నాలుఁగు చెరఁగులు తిరిగి, తాను మెట్టిన చోటులందున్న విశేషములను కవితలో సంతరించి పెట్టినాడుఁగాన, నెవరికి వారు తమ తమ ప్రాంత మువానినిగా భావించుట సహజమైన విషయము.

కాని యాతని జన్మస్థలమేది? యను విషయమును నిర్ణయించుటకు మూలము భీమేశ్వర పురాణములోని వాక్య ములే. వానిని సమన్వయించుటలో మాత్రమే మత భేదము లేర్పడుచున్నవి. ఆ వాక్యముల నొకమారు తడవి నా యూహ కందిన విషయములతో సమన్వయించి, యాతని జన్మస్థల మేది కావలయునో నిరూపించెదను. శ్రీనాథుఁడు భీమేశ్వర పురాణము కృత్యాదిలో—తొమ్మిది పద్యములలో వివిధ దేవత లకు, వెనుకటి సంస్కృత కవులకు నతు లర్పించి, తెలుఁగు కవు లలో నన్నయ, తిక్కనలను సంస్మరించి, శంభుదాసునకు బదు లుగాఁ దన పితామహుఁడైన కమలనాభామాత్యు నిట్లు స్మరించి నాడు.

"కనకక్ష్మాధరధీరు వారిధి తటీ కాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మ పురాణ సంగ్రహ కథా కావ్య ప్రబంధాధిపున్
వినమత్కాకతిసార్వభౌముఁ గవితా విద్యాధరుం గొల్తుమా
యనుగుందాత ప్రదాత శ్రీ కమలనాభామాత్య చూడామణిన్"

శ్రీనాథునితండ్రి మారయామాత్యుఁడు. తాత కమల నాభామాత్యుఁడు. ఈతఁడు మేరుపర్వతమంతటి ధీరుఁడు. సముద్రతీరమునంటియున్న కాల్పట్టణమునకు ప్రభువు. గొప్ప వాఁడు. 'పద్మ పురాణ సంగ్రహ కథ' అనే కావ్యమును గూర్చుట కధికారి. కాకతి సార్వభౌముఁ డీతనికి వినతుఁడగు చుండెడివాఁడు. కవిత్వ విద్యను దాల్చినవాఁడు. శ్రీనాథుని యెడలఁ బ్రీతిగల పితామహుఁడు. గొప్పదాత. అట్టివానిని గొల్చెదననిభావము.

ఈ పద్యమునుబట్టి సముద్రపు టొడ్డునందున్న కాల్ప ట్టణమేదో నిర్ణీతమైన దానినిబట్టి శ్రీనాథుని జన్మస్థల మేది యో తేలును. నెల్లూరుప్రాంతమందుండెడి విమర్శకులు కాల్పట్ట ణమును నెల్లూరు మండలమునకుఁ జేర్చుటకై 'కృష్ణాపురమును' కాల్పట్టణమునుగా నిరూపించుట కెన్నియో యత్నములు చేయు చున్నారు. దూరముగానున్న తమిళ శాసనాదులలోనుండిన వాక్యము లను ముడిపెట్టుచున్నారు. దాని కుపోద్బలకముగా 'పాక నాఁటింటి వాఁడవుబాంధవుఁడవు' అని బెండపూఁడి అన్నామాత్యునిచే ననిపించిన వాక్యమునకు పాకనాఁటిలో ఇల్లుగలవాఁడ వై మాకు బంధువైన వాఁడవు అను నర్థమును వివరించున్నారు. ఇల్లు వాకిలి యున్నట్లు తెలియరాక దేశ ద్రిమ్మరియైనవానికి పాకనాఁటిలో నిల్లుండిన ట్లూహించుట మంచిదే.

నెల్లూరు సమీపమందున్న కృష్ణాపురమే యాతని యావాస మైనచో 'వారిధి తటీ కృష్ణాపురాధీశ్వరున్' అని తప్పక యని యుండెడివాఁడు. కాల్పట్టణమనియే చెప్పవలెను గనుక, అది యతిస్థానములో పడినది గనుక కనకక్ష్మాధరధీరు అని పద్యము ప్రారంభింపవలసి వచ్చినది. కాల్పట్టణ శబ్దమును ముందు సిద్ధముచేసికొనియే వారిధి తటీ శబ్దముతో సమాసము చేసికొన వలసివచ్చినది. ఈ పద్యములోనే 'వినమత్కాకతి సార్వభౌము' అను విశేషణమున్నది. శ్రీనాథుని తాతకు కాకతి సార్వభౌముఁడు వినతుఁడగుటకు మూలమేమో? కొంచెము యోజింతము. అరియేటి అన్న మంత్రికి పౌత్రుఁడైన బెండపూఁడి అన్నమంత్రి శ్రీనాథుని ప్రాభవమునుగ్గడించుచు—

'పాకనాఁటింటి వాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని పౌత్రుఁడ వమలమతివి'

అని యనుచున్నాఁడు. దీనినిబట్టి బెండపూఁడి అన్నమంత్రికి శ్రీనాథునితో పాకనాఁటి నియోగిశాఖకు సంబంధించిన బాంధ వము తండ్రి తాతలనాటినుండియుఁ గలదని యూహింపవలసి యున్నది. 'పాకనాఁ టింటివాఁడవు' అను పదమునకు ప్రకరణ మునుబట్టి పాకనాఁటి నియోగిశాఖకుఁ జెందిన వాఁడవను నర్థమే వచ్చునుగాని మరియొక యర్థము రాదనుకొందును.

బెండపూఁడి అన్నామాత్యుని తాతయగు అన్నమంత్రి మొదలుగనే యా వంశమువారికి 'అరియేటి, లేక అరేటి' అన గృహ నామ మేర్పడినట్లు ఈ కృత్యాది విషయమునుబట్టియే తెలియుచున్నది. తాతయగు అన్నమంత్రి రెండవ ప్రతాపరుద్రుఁ రాజ్యమునందు స్థాపించుటలో ప్రధాన పాత్ర వహించి అతః గజసేనకు ప్రధానాధ్యక్షుఁడుగానుండి, ప్రతాపరుద్రునకు కుడి భుజముగానుండి, రణరంగములలో సేనాధిపతిగా నుండినట్లు

శ్రీనాథుని జన్మస్థలము కాళీపట్టణమే

కూడఁ దెలియుచున్నది. అట్టి అన్న మంత్రియే ఆనాఁడు పద్మ పురాణ సంగ్రహకథా కావ్య రచయితయై మహా కవియైన కమల నాభామాత్యునకు పాకనాఁటింటి బాంధవముచే కాకతి సార్వ భౌముని వినతునిఁ జేయించి సముద్ర తీరమునందు గోస్తనీనది సముద్రమునఁ గలిసినచోటునందున్న కాళీ పట్టణమున కధీశ్వ రత్వమును కలిగించి యుండునని మన మూహింపవచ్చును. ప్రభుత్వమునకు సరిపడిన కాల్పట్టణము కాళీపట్టణమే యగును. ఇది అరియేడు, లేక అరేడునకు దగ్గరగా ఆరు క్రోసుల మేరలో నుండినది. అరేడును, తాతయైన అన్నమంత్రి కొలనిరుద్రుని వలన అగ్రహారముగా స్వీకరించి తన బంధువులను పోషించెనని ఈ క్రింది పద్యము చెప్పుచున్నది.

"కొలను ప్రతాపరుద్ర నృప కుంజరుచేత నరేడు సారణీ
సలిల వివర్ధమాన బహు సస్య సమాకుల మగ్రహారమై
వెలయఁ విభాకర గ్రహణవేళఁ దగంగఁ బరిగ్రహించి బం

ధుల భరియించె నన్నవిభుతో సరియేట్లు ప్రధానులెవ్వరున్"
కొలను ప్రతాపరుద్రుఁ డనఁగా ఇందులూరి రుద్రుఁడు. వీరి వంశ స్థులు కాకతీయ ప్రభువయిన మొదటి రుద్రుఁడునాఁటినుండియు వారికి సేనాధిపతులు అమాత్యులుగానుండి వారికి రాజకీయ విషయములలో సహకరించుచు, కొలను (కొల్లేరు) ప్రాంత మును జయించి, దానిని కాకతీయ సామ్రాజ్యమునకుఁజేర్చి, వారికి సామన్తమాండలికులుగానుండి తా మా ప్రాంతమును పాలించు చుండినట్లు, కొలను రుద్రదేవుఁడు రచించిన శివయోగ సార కృత్యాది విషయమునుబట్టి తెలియవచ్చుచున్నది. రెండవ ప్రతాపరుద్రుని సమయములో కొల్లేరు ప్రాంతమును పాలించు చున్న ఇందులూరి రుద్రుఁడే కొలను ప్రతాపరుద్రుఁడు. అతని నుండి, బెండపూఁడి అన్నామాత్యుని తాతయగు అన్నమంత్రి కొలను (కొల్లేరు) మండలమునకుఁ జెందిన 'అరేడు' ఈనాఁడు 'ఆరేడు' అనఁబడు గ్రామమును సూర్యగ్రహణ సమయమున అగ్రహారముగాఁ దీసికొనెనని ఈ పద్యము చెప్పుచున్నది. అప్పటి నుండియే అన్న మంత్రివంశమువారు అరియేటివారయినారు.

ఈ గ్రామము నీనాఁడు 'ఆరేడు' అని యందురు. ఇది నేఁటి పశ్చిమ గోదావరి జిల్లాలో వయ్యేటి కాలువ యొడ్డున నున్నది. ఇచ్చట వరి బాగుగ పండును. పద్మినీపురమని వెనుకటి శాసనములలో ప్రసిద్ధమయిన జల్లిసీమ గరపవరమునకు రెండు మైళ్లకుపైన 'వుండి' కి ఆరుమైళ్ల క్రిందనీ 'ఆరేడు'న్నది. ఆరేడు అగ్రహారములో పూర్వమునుండియు నివసించుచున్న వారందరు నియోగి శాఖకుఁ జెందినవారే. అరియేటి అన్నమంత్రి నాఁడు వారు పాకనాఁటినుండియే కొలని రుద్రుని సహకారమున ఆరేడునకువచ్చి యుండిరని మన మూహింపవచ్చును. అన్న మంత్రి కుమారుఁడైన తల్లప్ప ప్రధానినిగూర్చి భీమేశ్వర పురాణ మునందిట్లు వాకొనియున్నాఁడు.

పన్నీట గంధ జలమున
నన్నయ తల్ల ప్రధానుఁ డభిషేకింపన్
గన్నవ పుక్కిట జలమునఁ
గన్నయ రోచకము వాయు గఱకంఠునకున్.

తల్ల మంత్రికి సోదరుఁడైన దేవయకు, రామాంబకు, ద్రాక్షా రామ భీమేశ్వరుని కృపవలన లింగన మున్నగువారు జన్మించిరని తెలుపు ప్రకరణమునందే, తల్లప్రధాని కాళహస్తీశ్వర భక్తుఁ డని ప్రత్యేకముగఁ దెలుపుట, వారు పూర్వము పాకనాఁటివారే యనుటకు నిదర్శనము. అన్నమంత్రి పాకనాఁటి బాంధవ్య మును బట్టియే, కమలానాభామాత్యుని పాకనాఁటినుండి రావించి ఆరేడున కాఱు క్రోసుల మేరలో నుండిన కాళీ పట్టణమున కధీశ్వరుని గావించి, కాకతి ప్రతాపరుద్రుని మన్ననలకుఁ బాత్రునిగాఁ జేసెనని మన మూహింపవచ్చును. కొల్లేరునకు మీఁది భాగమున ఆరేడు, క్రింది భాగమున సముద్రపు టొడ్డున కాళీపట్టణమును గలవు. కావున నీ విధముగ శ్రీనాథునకు బెండఁపూడి అన్నమంత్రికి పాకనాఁటింటి బాంధవము సరిపడును.

కాళీపట్నము నిన్నటి వరకు నొక ముఖాసా గ్రామము. మొగలతుఱ్ఱు సంస్థానమునకుఁ జెందియుండి, 1760 ప్రాంతమున మొగలతుఱ్ఱు ప్రభువుల ప్రాపున నైజాము ప్రభువుతో పరిచయము సంపాదించి, వారికి దుబాసీగా నుండి, కోస్తా జిల్లాలను ఈస్టిండియా కంపెనీ వారికి కౌలుగా నిప్పించిన కాంద్రేగుల జోగిపంతులు అనువారికీ కాళీపట్నము సంక్రమించెను. ఇది వెనుక, నెనిమిది చతురపుమైళ్ల విస్తీ ర్ణము గల గ్రామము. వినుకొండ వల్లభామాత్యుఁడు గ్రాస గ్రాసములతోఁ గూడిన మోపూరున కెట్లు పాలకుఁ డయ్యెనో కమలనాభామాత్యుఁ డట్లే కాల్పట్టణాధీశ్వరుఁ డయ్యెనవచ్చును. ఈ కాళీపట్టణము గోస్తనీ నది సముద్రమునఁ గలిసినచోట నున్నది. గోస్తనీనది యావలియొడ్డు కృష్ణాజిల్లాకుఁ జెందిన కల్దిండిసీమ. కొల్లేటి నీరు, అచటి ఆకివీడు మీదుగా ప్రవ హించుచు వచ్చి ఈ కాళీ పట్టణము దగ్గరనే సముద్రమునఁ గలియును. కనుక అరియేటి వారితో బాంధవ్యము, ఈ కాళీ పట్టణము కాల్పట్టణ మైనప్పుడే జతపడును.

మఱియొక విషయము నాలోచింతము. శ్రీనాథునకుఁ జిన్ననాఁటి నుండియు శివభక్తి తత్పరత గలదనుట సత్యము. అట్టి గాఢమైన భక్తి యేర్పడుటకుఁ బరిసరమందలి దివ్య తీర్థ క్షేత్రములు చాలవరకుఁ గారణములు గాకమానవు. గోస్తనీ నదీ సాగరసంగమ స్థలమందున్న కాళీపట్టణమున కాపేరు, అది కాళికా దేవికి సంబంధించినదై వెనుకటి యోడల రేవుపట్టణ మగు టచే నేర్పడిన దనుట నిశ్చయము. ఆ గ్రామము సరిహద్దు లలో వెంప యను గ్రామము గలదు. అచటి యీశ్వరుఁడు సోమేశ్వరుఁడు. 'వెంపదేవునకు గంపెడు పూలు' అను సామెత యచ్చట ప్రసిద్ధము. కాళీపట్నం చెరువులో పూసిన తామర పూలు తెచ్చి గంపలతో పూజచేయు పరిపాటి యీనాటికి నచట గలదు. ఆ యూరు సముద్రపు టుప్పెనలోఁ బడినప్పుడు, పూడిపోయిన గోపాలస్వామిని, త్రవ్వకములో బైటపడఁగా, పునః ప్రతిష్ఠ చేసి ఆలయము కట్టించుట యీమధ్యనే జరిగినది. అచటి మైదానము త్రవ్వగా నిలువెత్తు గల కాళీ విగ్రహము బయటపడి వెంపలోనే నిలిచియున్నది. ఈ వెంపకుమీఁద శివదేవునిచిక్కాల గలదు. దాని దగ్గరనే దిగ్గులూరున్నది.

అదియే శ్రీనాథుని బావమరిది యూరు దగ్గుపల్లి కావచ్చును. దానికి సన్నిహితముగా క్షీరారామమున్నది. ఇక గోస్తనీ యొడ్డున, కాలీపట్నమునకు సన్నిహితముగా ఎనమదుర్రు అను గ్రామమున శక్తీశ్వరుఁడున్నాఁడు. దానిని పూర్వము యమునా పుర మనేవారఁట. అచ్చట శక్తి యీశ్వరుఁడు ఒక పీఠముపై నున్నారు. యమప్రతిష్ఠితుఁడైన యీశ్వరుఁడు. అక్కడి నుండి కాలీపట్నము వరకు మైదానమే. తత్సంబంధమువల్ల నైన నది కాలీపట్నము—కాల్పట్టణము కావచ్చును. ఆయూరు నకు రెండు క్రోసులు మీఁద సోమారామము. అనఁగా గుణ పూఁడి భీమవరము. గోస్తనీ నదీ తీరమున జుత్తికలో వాసుకి రవి సోమేశ్వరుఁడు. ఈ తీరుగ నా పరిసర మంతయు శివక్షేత్ర మయమగుటచే, అచట జన్మించిన శ్రీనాథుని కంతటి శివ భక్తి తత్పరత ఏర్పడినదని మన మూహింపవచ్చు నను కొందును. కృష్ణాపుర మైనచో నిట్టి శివభక్తి యేర్పడుట కవకాశ మెక్కడ ? భీమేశ్వర పురాణములో శ్రీనాథుఁడు భీమ మండలిలోఁ ప్రసిద్ధమైన తీర్థములను క్షేత్రములను, పట్టణ ములను, పల్లెలను, సస్యములను పుష్ప ఫలాదికమును వర్ణిం చిన తీరునుబట్టి చూచిన, నాతనికా మండలితో బాల్యము నుండియుఁ బరిచయము లేకున్న నట్లు నిరూపింపఁ జాలఁడని చెప్పవచ్చును. పంచారామములలో గుణపూఁడి భీమవరము సోమా రామమని నిరూపించిన విషయమునుబట్టి, యాతఁడు దానికి సమీపమందున్న కాలీపట్టణమువాఁడే యనవచ్చును. భీమ మండలములో నుండిన యూళ్ల పేళ్లను దెలుపుటలో నిట్టి మార్పులు కొలదిగఁ గన్పట్టుచున్నవి. 'పలివెల' అను దానిని వృత్త సౌలభ్యమునకై 'పల్వల' అని మార్చినాఁడు. పీఠికా పురిని—పీఠాపురి చేసినాఁడు. 'గంట్రేడు' ను వృత్త సౌలభ్య మునకై 'గంట్రెడు' చేసినాఁడు. మిగిలిన యూళ్ల పేళ్లలో వ్యత్యాసము చేయకుండ యథాతథముగనే తెలుపుచు వచ్చి నాఁడు. దీనినిబట్టి కాలీపట్టణమే కాల్పట్టణమైనదని చెప్ప వచ్చును.

ఇంక నొకమాట నే నీవరకే తెలిపియుంటిని. కవి యే మండలములోఁ బుట్టి పెరిగిన, నాతని రచనలలో నా మాండలిక పదములు, అచటి జనుల వ్యవహారమందున్న జాతీయములు, అచటివారి వ్యవహారమునందున్న వాక్యరచనా పద్ధతి తప్పక ప్రవేశించును. శ్రీనాథుఁడు నెల్లూరు మండలమున కృష్ణా పురమునఁ బుట్టి పెరిగినవాఁ డయినచో, నీతని రచన తిక్కన నాచన సోమనల రచనల తీరునుబట్టి నడిచియుండ వలసిన దియే. తిక్కన శిష్యుఁడే యయినను కేతన దశకుమార చరి తములో గుంటూరు మండలమునకుఁ జెందిన నుడికారపుఁ దీరే హెచ్చుగఁ గానవచ్చుచున్నది. ఆ క్రమమునఁ జూచిన శ్రీనా థుని రచన లన్నిటిలోను గోదావరి, కృష్ణా మండలములకు జెందిన నుడికారపుఁ దీరు, వాక్య విన్యాస పద్ధతి విశేషముగఁ గానవచ్చుటచే, నీతఁడా రెండు మండలములకు సరిహద్దులో నుండిన కాలీ పట్టణమందు జన్మించిన పాకనాటి నియోగి శాఖకుఁజెందినవాఁడని మన మూహింప వచ్చును.

శ్రీనాథుని వలన దంతులూరి గన్న భూపాలుఁడు 'ధనంజయ విజయ, మను కావ్యమును కృతి నందినట్లును, ఆ గన్న భూపాలుఁడు కాలీపట్టణమునకు అయిదు క్రోసుల దూరమందున్న తాడినాడ దగ్గర శత్రు సైన్యములను నిలువరించె ననియు, మూర్తిత్రయోపాఖ్యానము నందలి ఈ క్రింది పద్యముల వలనఁ దెలియవచ్చుచున్నది.

అహిత దుర్గాధ్యక్షు లందరు భయమందఁ
 గ్రీడి కైవడి నిల్చెఁ దాడినాడ
నక్షుద్ర దాన విద్యా క్షాత్రములచేతఁ
 బ్రతి యెవ్వరును లేక ప్రతిభఁ గాంచెఁ
దనకీర్తి దశదిగంతర గీయమానమై
 గనుపట్ట ధర్మ మార్గంబు నెరపె
శ్రీనాథ సుకవీంద్రుచే ధనంజయ విజ
 యం బను సత్కావ్య మంది వెలసె

నృపతి మాత్రుండె నిజపాద నీరజాత
ఘటిత కోటీర వైరి భూకాంతమాన
సాంతర భయాపహారి శ్రీ దంతులూరి
గన్న భూపాలమౌళి దోర్గర్వశాలి.

ఈ పద్యములోని విషయమునుబట్టి, దంతులూరి గన్న భూపాలుఁడు కృష్ణా మండలములోని 'కల్దిండి' కి, ధరణి కోట ప్రభువుల పక్షమునఁ బాలకుఁడై యుండి, ఆ కోటకు మూఁడు మైళ్ల మేరలో నుండిన తాడినాడ దగ్గర శత్రువు లను నిలువరించి నిలిచెనని యూహింపవచ్చును. దంతులూరి వారిది ధనంజయ గోత్రము. కనుక కిరాతార్జునీయ కథను ధనంజయ విజయ కావ్యముగా సంతరించి, తొలుతఁ దనయా వాసమున కయిదు క్రోసులలో నుండిన కల్దిండి దుర్గ పాల కుఁడుగా నుండిన దంతులూరి గన్న భూపాలునకు కృతి యిచ్చి యుండునని యూహింపవచ్చును. ఈ ధనంజయ విజయమునే తరువాత, కొంత మార్పులు చేర్పులు చేసి, హర విలాస కథ సూత్రమునఁ గూర్చి యుండుననియు నూహింప వచ్చును. హరవిలాస రచన మేకాకారముగ నుండకపోవుటకుఁ గారణము, అప్పటప్పటఁ దాను కూర్చిపెట్టిన కథాఖండము ల నేకసూత్రమునకుఁ గూర్చి పెట్టుటయే యని నేను భావించుచున్నాను. పై విషయములనుబట్టి శ్రీనాథుని జన్మ స్థలము గోస్తనీ నదీ సాగర సంగమ స్థలమునందున్న కాలీ పట్టణమే యగును.

తిరుపతికొండ

తంగిరాల

ఇది కొండ, అది కొండ,
ఇటు చూడు, అటు చూడు,
ఎటు చూడు – అటు కొండ!!
ఈ మూల ఆ మూల
దాచుకొని పడుకున్న
చట్టుబండల కొండ!
ఎండచే మొగమంత
జేవురించిన కొండ!
అడవి చెట్లన్నియును
కంబళిగ అల్లుకుని
కప్పుకున్నది కొండ!
కుందేళ్లు తెగ మ్రింగి
పడియున్న చిలువ వలె
కదలదే ఈ కొండ!
మెదలదే ఈ కొండ!
కంగారు పడదెంత
గంభీరమగు కొండ!!

ఇది కొండ, అది కొండ,
ఇటు మెట్లు, అటు మెట్లు,
ఇటు చూడు, అటు చూడు,
ఎటు చూడు – అటు మెట్లు!!
నిట్ట నిలువున మెట్లు!
కాళ్ళు పీకెడి మెట్లు!
నేలపై నిలుచుండి
నింగి ముట్టెడి మెట్లు!!
'కొండయ్య' భుజముపై
కండువా ఈ మెట్లు...!
'కొండయ్య' టోపికి
కుచ్చువలె ఆ మెట్లు...!!

పరమేశు పాదాల
ప్రేలాడు ఈ మెట్లు...!
భక్తకోటికి నెపుడు
ముక్తి నొసగే మెట్లు...!!
రాణి తిరుమల దేవి
పాద మంజీరాల
పాట విన్నవి మెట్లు...!!
రాణి చిన్నా దేవి
పాద మందారాల
తావి పీల్చిన మెట్లు...!!
కృష్ణరాయల కీర్తి
మిన్నేటి పొంగులో
స్నానమాడిన మెట్లు...!!
దీపాల కళ్లతో
దిక్కులన్నీ వెదకి
పరమేశు పాదాలు
పట్టుకున్నవి మెట్లు...!!

ఇదికొండ, అదికొండ,
ఇటుచూడు, అటుచూడు,
ఇటు మెట్లు, అటు మెట్లు,
ఇటు వెళ్లు, అటు వెళ్లు,
గుడివైపు మళ్లు...!!

ఈ కొండ నవ్వింది...
ఆ కొండ నవ్వింది...
ఏడుకొండలపైన
ఈశుడే నవ్వాడు...!!
ఈ మెట్లునూ వంగె...
ఆ మెట్లునూ వంగె...
కోటిభక్తుల గుండె
లొక్కుమ్మడిని పొంగె...!!

కీ. శే. గోపీచంద్

శ్రీ డి. రామలింగం

ఆధునిక తెలుగు సాహిత్యం సజీవమై, వైవిధ్య విలసితమై, వైశిష్ట్య సమన్వితమై అలరారుతూ ఇతర భారతీయ సాహిత్యాలతో తులతూగడమే గాక వాటిలో లేని కొన్ని విశిష్టతలు కూడా కలిగిఉండంటే అందుకు స్వీయ సంఘమును అవగాహన చేసుకొని, పాశ్చాత్య విజ్ఞానాన్ని సముపార్జించుకొని, కొత్తను కాంక్షించి వ్యతిరేకతలను సరకు గొనకుండా ధైర్యంచేసి నూత్నమార్గావలంబకులై నవ్య భావాలు వెలార్చగల ప్రతిభావంతులైన రచయితలు ఆవిర్భవించడమే ముఖ్య హేతువని చెప్పాలి. అలాంటి ప్రతిభావంతులను లెక్కించవలసి వచ్చినపుడు కీ. శే. త్రిపురనేని గోపీచంద్ మొదటి వరుసలోనే గుర్తుకు వస్తాడు. ఆయన జీవితంలో ఎన్ని వృత్తులు అవలంబించినా, ఏ మార్గాలలో పయనించినా ప్రధానంగా రచయితగానే జీవించాడు. ఒక కొత్త నడకలో తెలుగు కథానికను, నవలను సుసంపన్నం చేయడమే గాక జన్మతః మేధావియై స్వభావరీత్యా తత్త్వ జిజ్ఞాస కలవాడవడంవల్ల వేదనాజీవియై, సత్యాన్వేషకుడై ఈ తరం పాఠకులను, రచయితలను ఆలోచనా వాహినిలో ఓలలాడించాడు.

గోపీచంద్ వాస్తవికత ముఖ్య లక్షణంగా కథకుడుగా మొదట తెలుగు సాహిత్యరంగంలో ప్రవేశించాడు. ఆంధ్రదేశ గ్రామీణ జీవితాన్ని, మధ్య తరగతి సంఘాన్ని యథార్థంగా చిత్రించిన రచయితగా పేరు పొందాడు. ఇక్కడ గ్రామీణ జీవితము, వాస్తవికత అనే మాటలను ప్రత్యేకంగా విశదీకరించవలసి ఉన్నది. గోపీచంద్ బాల్యం కృష్ణాజిల్లా అంగలూరు మొదలగు గ్రామాలలో గడచింది. బాల్య స్మృతులు ఈయనలో పల్లె జీవితంపట్ల కుతూహలం కలుగజేశాయి. ఆంధ్రలో రైత్వారీ పద్ధతి అమలులో ఉండడంచేత మధ్య తరగతి ఏర్పడిందని తెలుసుకున్నాడు. మన పల్లెలు వెనుకటి నాగరికతను దాటి కొత్త నాగరికతలో పడే సంధి యుగంలో ఎన్ని ఒడుదుడుకులకు లోనవుతున్నాయో గ్రహించాడు. పూళ్ళు విచిత్రంగా మారిపోతున్నాయి. ఆచార వ్యవహారాలలో, దృక్పథంలో నమ్మకాలలో అన్నిటా వ్యత్యాసాలే! మన తాతల కాలానికి ఇప్పటికీ ఎంత తేడా ఉంది! సంఘీభావం, పరస్పర ప్రేమ, కట్టుబాట్లు సడలిపోతున్నాయి. ఎవరికి వారు డబ్బు విలువను గ్రహించి జాగ్రత్త పడుతున్నారు. అబద్ధాలను నీతులుగా ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ చూచి "ప్రస్తుతం మన కుటుంబాలను చూస్తూఉంటే ఒకప్పుడు వైభవోపేతంగా ఉండి శిథిలాలైన పురాతన కట్టడాలు జ్ఞాపకమొస్తున్నాయి" అన్నాడు గోపీచంద్. అయితే సంధి యుగంలో ఇలాంటి స్థితి తప్పదనీ, కొత్త నాగరికతలోని చెడులను చూచి వెనక్కి దేకడం శ్రేయస్కరమనుకోవద్దనీ, వాటిని తొలగించుకొని ముందుకు పోవాలనీ ఉద్బోధించాడు. భావాలకు ఎల్లలు లేవు. నవీన భావాలు పాశ్చాత్యుల సొత్తు కాదు, మన దేశమూ ప్రపంచంలోనిదే. ప్రపంచంతోపాటూ మనమూ వృద్ధిచెందా లన్నాడు.



గ్రామీణ జీవితం ఆయనకు అసంఖ్యాకమైన ఇతివృత్తాల నిచ్చింది. ఆ రోజులలో కథానిక బాగా వ్యాప్తిలో ఉంది. తాను భావిస్తున్న విషయాలను పాఠకులకు చెప్పాలంటే కథ మంచి సాధన మనిపించింది. వాస్తవికత ప్రాతిపదికగా కథారచన కుపక్రమించాడు. వాస్తవికత అంటే సామాన్యంగా ఉన్న వాటిని ఉన్నట్లు వ్రాయడం. కాని గోపీచంద్ పద్ధతి కొంచెం భిన్నమైనది. సంఘంలో జరిగింది జరిగినంతవరకే, చూసింది చూసినంతవరకే చెబితే ఆ రచయిత కేవలం ఫోటోగ్రాఫర్ మాత్రమే అవుతాడని అంటూ, సంఘంలో జరిగే సంఘటనలకు ప్రయోజనం కలిపి రచయిత చదువరులకు ఒక దృష్టిని కలిగించాలని ఆయన తలపెట్టాడు. వస్తువు ఏదైనప్పటికీ రచయిత చదువరులకు కలిగించదల

చిన దృష్టి, దాన్ని సాధించగలిగిన రచనా విశేషమూ ఉత్తమ కావ్య లక్షణాలని ఆయన భావం. సంఘానికి అపకారం చేసే రచనలు—వాటి రచనా విశేషం ఎంత గొప్పదైనా, ఉత్తమ రచనలు కావు. అవి ప్రజలను ఇంకా అజ్ఞాన దశకు తీసుకుపోతాయి. ప్రజా సామాన్యానికి శ్రేయస్సు చేకూర్చే భావాలను వాళ్లకు నచ్చేట్టు చెప్పడమే ఉత్తమ రచన అవుతుంది. అందుకు గోపీచంద్ ప్రజలు తన రచనల పట్ల నిరాదరణ చూపుతారేమోనని వెనుకాడలేదు. మొదట కొద్దికాలం నిరాదరణ చూపినా క్రమేణా దానిలోని పరమార్థాన్ని కొందరైనా గ్రహిస్తారు. అప్పుడు ఆ రచయితకే పలుకుబడి వస్తుంది. ఉత్తమ రచనకు నిదర్శనం ప్రజల ఆదరం ఒక్కటే కాదు, ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే భావాలు కావాలి. మనిషి మనస్సును పెంచి అతనికి ఆహ్లాదం కలుగజేయడం కూడా కళయొక్క ప్రయోజనాలలో ఒకటి. కథా రచయితకు మానవుని మనస్సు చాలా ముఖ్యమైందని ఆయన భావం. మనస్సు పరిపరి విధాల పోతుంది. మనిషిలో క్రౌర్యం ఉంది, దౌష్ట్యం ఉంది. మళ్లీ ఇతరులకు మేలుచేసి ఆ మేలును వారు పొందుతుండగా చూచి ఆనందించి సంతృప్తిపడే కాంక్ష ఉంది. అసలు ప్రపంచంలోని విచిత్ర వస్తువులలోకెల్లా చిత్రమైన వస్తువు మనిషి. మానవ స్వభావమే ఒక క్లిష్ట సమస్య. అదే మానవునిలోని ఆకర్షణ కూడా అని చెప్పినవాడు కాబట్టే తీరుతీరుల పాత్రలను, విభిన్న పరిస్థితులను చిత్రిస్తూ, సొంత భావన కొంత జోడిస్తూ చిన్నా పెద్దా రమారమి యాభై కథలదాకా వ్రాశాడు. ఈయన కథలను సాంఘికమైనవి, రాజకీయ సంబంధమైనవి, సెక్సు సంబంధమైనవి అని మూడు రకాలుగా విభజించవచ్చును. తండ్రీ కొడుకుల సంబంధాలు, దారిద్ర్యంతో విరిగిన మనసులు, ధర్మానుపత్రుల అధర్మాలు, పీడనతో వెతలతో సగం పిచ్చివాళ్లయిపోయిన దీనుల స్థితులు, సంస్కారాలు భిన్నమైనపుడు భార్యాభర్తల మధ్య వచ్చే పొరపొచ్చములు, రాములవారి కాలం నుంచి వస్తూవున్న ధర్మ వడ్డీలు, కలల బరువులు, ఆస్తులపై మమకారాలు, పతితులు, ఆత్మద్రోహులు, విఫలమైన జీవితాలు—ఇట్లా సంఘంలో తాను చూచిన వ్యక్తులను, స్థితులను కథలుగా అల్లాడు. కథా రచయితగా, తాత్వికుడుగా గోపీచంద్ ప్రతిభకు "ఆశాజ్యోతి" కథ ఒక్కటి చాలు. ఈ కథలో ఒంటరియై, నిస్సహాయయై, ఇద్దరు బిడ్డలు గల స్త్రీ బ్రతుకు దైన్యానికి మారు రూపంగా కన్పిస్తుంది. బ్రతకాలా ? వద్దా ? బ్రతికితే దేనికోసం ? దేనికి బ్రతకడం అనేది అర్థంలేని ప్రశ్న అంటాడు రచయిత. బ్రతకడమే ఆనందం. అంటే అంటకుండా బ్రతకడమే జీవితాన్ని జయించడం. ఇందులో బ్రతుకుకూ, చావుకూ సంకేతాలుగా దీపాన్ని కొడిసీ ప్రస్తావించాడు. ఒక్కొక్కప్పుడు కొడి పెద్దదై దీపాన్ని ఆర్పేసేట్టుగా ఉంటుంది. కొంతసేపటికి దావంతట అదే రాలిపోతుంది. దీపం తిరిగి కాంతిగా వెలుగుతుంది. జీవితం కూడా అంతే. ఈ కథలన్నీ యువతరం వారిపై కలుగజేసిన ప్రభావం గణనీయమైంది. ఉన్నవ లక్ష్మీనారాయణ గారితో ఆరంభమైన ఆంధ్ర గ్రామీణ జీవిత చిత్రణం, గోపీచంద్‌తో మరొక అడుగు ముందుకు వేసి కొత్త నాగరికతలోకి పోబోతూ ఉన్న మధ్య తరగతిని కూడా కలుపుకొని మన కథా సాహిత్యంలో ఒక కొత్త ధోరణి వ్యక్తమైంది. మనం ఇండ్లలో, వీథులలో చూచే మనుషులు, చుట్టూ కన్పించే పరిసరాలు, పరిస్థితులు కథలలో నిలిచి రచయిత చెప్పదలుచుకున్న అంశాలను దృగ్గోచరం చేయ మొదలెట్టాయి. కొన్ని కథలైతే పాత్రలనూ, పరిస్థితులనూ పెట్టి రచయిత తన నిర్వచనానికి అనుగుణంగా ప్రయోగాలు చేసినట్లుండేవి. కథలలో సామాన్యంగా ఆయన ఒక సారాంశాన్ని ఇదమిత్థమని తేల్చి చెప్పలేదు. అలా చెప్పడానికి ఆయన వేరే వ్యాసాలు ఎన్నో వ్రాసి ప్రకటించాడు. ఆ వ్రాయడం కూడా ఉద్యమ నాయకుడి వలె వ్రాశాడు. అవి ప్రసిద్ధ వ్యాసాలు. యువతరంవారి నవి ఆకర్షించాయి. కథ ద్వారా పాఠకుల కొక సంస్కారాన్ని, ఒక కొత్త దృష్టిని కలిగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు గోపీచంద్. అయినా అవి రచయిత ఉద్దేశాన్ని నెరవేర్చాయి. రాజకీయాలను కూడా తడవా లనుకున్నప్పుడు 'దేశం ఏమయ్యేట్టు ?', 'గోడమీది మూడోవాడు', 'బీదవాళ్లంతా ఒకటే' వంటి కథలు వ్రాశాడు. అవి కొన్నిచోట్ల సంభాషణలవలె, వట్టి వాక్చిత్రాలవలె కన్పించినా, కథ కుండవలసిన బిగువు లేకపోయినా, దేశ రాజకీయ స్థితిని ప్రయోజనకరంగా బయల్పరచాయి. గోపీచంద్ అంటే కేవలం ఏవో కథలు వ్రాసుకునేవాడు మాత్రమే కాదు రాజకీయాలు, పార్టీల సంగతి బాగా ఎరిగినవాడని వాటివల్ల వ్యక్తమైంది.

గోపీచంద్ కూడా సెక్సు విషయాలని గూర్చి వ్రాశాడు. ముఖ్యంగా "పతివ్రత ఆంతరంగికం" అనే కథలో ఫ్రాయిడియన్ మనస్తత్త్వ శాస్త్ర సూత్రాల ననుసరించి భర్త చనిపొయ్యాడన్న వార్త విని స్పృహతప్పి పడిపోయిన ఒకానొక పతివ్రత మనోలోకంలో కన్పించాయని చెబుతూ ఆయన చిత్రించిన దృశ్యాలు మొరటుగా అరాచకంగా బూతుగా ఉన్నాయని చెప్పక తప్పదు. "బొమ్మల పెళ్లిళ్ల .... ఆడబొమ్మను మగబొమ్మ దగ్గరికి నెట్టడం .... నిమ్మకాయలు .... ఏ పేరమ్మా ఆ చెట్టు కాయల పేరు .... దేవాలయాల మీద బూతు బొమ్మలు .... రవికలోకి చెయ్యి పోనిస్తాడేం .... వారాలబ్బాయికి తలంటి పోస్తూ .... రాత్రే కార్యం అయిన అఅమ్మాయిని చూచి జాలిపడి నొప్పులా అని అడగడం ... పెట్రొమాక్సు లైటుకు ఎవరో గ్యాసు కొడుతూ ఉంటే గుండె దడదడ లాడ్డం.... పెట్టెపై పుంజెక్కడం .... వెరచడం అంటే ఏమిటి అనుకోవడం" ఇంకా చాలాచాలా. అయితే తానూ ఫ్రాయిడియన్ ఫక్కీలో ప్రతిభావంతంగా వ్రాయగలనని చూపడానికే రచయిత ఈ కథ వ్రాసి ఉంటాడని నా ఉద్దేశం. అంతకు మినహా అలాంటి ధోరణులను వ్యాప్తం చేయడం ఆయన లక్ష్యం కాదు. గోపీచంద్ మేధావికదా, ఇలాంటివి వ్రాయడ మేమిటి అని కొందరు పాఠకులు ఆశ్చర్యపొయ్యారు. అందుకు ఆయన

చెప్పిన సంజాయిషి యిది : ''సెక్సు కూడా జీవితానికి సంబంధించినదే. దానిపై ఎందుకని నిషేధం ? కామేచ్ఛ మానవులలో ఉంటూనే ఉంటుంది. కాని శృతిమించి పబ్లిక్ న్యూసెన్స్ కాకూడదు. అలా ప్రవర్తించేవారు Sex perverted. వారి చేష్టలను అధిక్షేపించవలసిందే.''

స్త్రీ పురుషుల సంబంధాల విషయంలో గోపీచంద్ వెర్రి వూ లోకాల పొంత బోలేదు. కాల్పనిక లోకాలలో విహరించలేదు. కేవలం ఆచరణ సాధ్యమైన రీతిలోనే ఆలోచించాడు. పరస్పరము ఆకర్షితులైన స్త్రీ పురుషులు అతి సన్నిహితంగా ఉంటూ తమది కామేచ్ఛ లేని నిష్కళంకమైన ప్రేమ అని చెప్పుకొని తమని తాము ఏమేమిగానో వూహించుకొంటూ ఇతరులకు అర్థం గాకుండా ప్రవర్తించేవాళ్ల వ్యవహారాన్ని ఆయన ''అమలిన శృంగారం'' అనే కథలో చిత్రించాడు. ఈ కథలో ''నీకు అక్కరలేదా ?'' అని అడిగిన స్త్రీతో ఆ యువకుడు ''అది మలినం'' అని చెబుతాడు. మరి అంతవరకూ జరిగినదేమిటంటే అమలిన శృంగారం అంటాడు. ఫలిత మేమిటంటే—ఇద్దరిలోనూ చివరకు అసంతృప్తి పెరిగిపోతుంది. తీరని కోర్కెలతో ఇద్దరి మతులు చెడిపోతాయి. వాళ్లని చూసినవాళ్ళు కలవరపడి పోతారు. తెలుగు సాహిత్యంలో కాల్పనికోద్యమ కాలంలో భావ కవులు వారి కవితలలో ప్రధానంగా ప్రచారం చేసిన సంస్కారం విరహం అని గోపీచంద్ అభిప్రాయం. అయితే దీనినిబట్టి ఆయన అసలు ప్రేమనే నిరసించాడని అనుకోవడానికి వీలులేదు. తాను విరసించేది ''ప్రేమకంటె ఉదాత్తమైన దేమీ లేదనే భావాన్ని; తాను ప్రేమించిన వ్యక్తి లభ్యం కానప్పుడు కృశించడమే పరమ ధర్మమని చెప్పే సంస్కారాన్నీ, కృత్రిమ బ్రహ్మచర్యాన్ని ప్రోత్సహించే సిద్ధాంతాన్నీ'' అని చెప్పుకున్నాడు. మరేం చెయ్యాలి ? అని ప్రశ్నించేవారికి ''పరివర్తనం'' నవలలో సమాధానం చెప్పాడు. ఇది గోపీచంద్ మొదటి నవల. ఇందులో రాజారావు భార్య చనిపోయిన తర్వాత ఆ వియోగంలో హృదయ దౌర్బల్యం కల్పించుకొని క్షోభపడుతూ ఉంటాడు. అతనికి వేదనలోని సుఖం ఉందా అనిపిస్తుంది చూచేవారికి. అంతా అతనిపై ఆశలు వదులుకుంటారు. ఈ స్థితి జీవితం నుంచి తప్పించుకు తిరగడమేననీ, దీనివల్ల వ్యక్తి దృష్టి సాంఘిక సమస్యలపైకి కాదుగదా, తన చుట్టూ ఉన్నవారి వైపే ప్రసరించదనీ ఈ నవల ద్వారా రచయిత చెప్పదలచాడు. చివరకు రాజారావులో పరివర్తనం కలిగి అతను మళ్లీ పెళ్లికి సుముఖుడై ఈ లోకంలో పడడంతో కథ ముగుస్తుంది. ఇది ఇతర దేశీయ భాషలలోకి పరివర్తనం కావలసిన నవల. కథానాయకుడి వేదనతోపాటు అతని చుట్టూ ఉన్న పాత్రలన్నీ తమ తమ వైఖరులతో ఆవేదన పడతాయి. "వాస్తవ ప్రపంచంలో మానసిక సీమలను కల్పించి హృదయంగమంగా చేసిన కల్పన ఇది. రచయిత బహు కొద్ది సంభాషణలతోనే కథను కరుణరస ప్రధానం చేశాడు.

అలాగే వాస్తవాలను చూచుకోకుండా ఆదర్శాలను స్వప్నాలు కని, ప్రేమ వివాహాలు స్వేచ్ఛగా చేసుకొని, వూహాసౌధాలలో నివసిస్తూ, ఎవరికీ అందని దివ్య సీమలలో విహరిస్తున్నామనే భ్రమచెందే యువతీ యువకులు మనుషులలోకి వచ్చి యదార్థ జీవితాన్ని ఎదుర్కోనాల్సి వచ్చేసరికి ఎలా ఆశాభంగం చెందుతారో ''ఆత్మగతం'' అనే కథలో చూపెట్టాడు. ఒకప్పుడు అసాధారణుడైన పురుషునికి తాను భార్య అయినందుకు మురిసిపోయి గర్వించిన శీల క్రమేణా దివి నుండి భువికి దిగివస్తుంది. ఇదివరకు అతడు చెంత కూర్చుంటేనే పరవశత్వం కలిగేది. ఇప్పుడు విసుగు పుడుతూ ఉంది. ఇతరుల ఎదుట ఆయన దగ్గరగా ఉంటేనే సిగ్గుగా ఎలాగో ఉంటూంది, అనుకుంటుంది.

ఆధునికాంధ్ర సాహిత్య రంగంలో చలం వచ్చి స్త్రీ పురుషులు కామంతో లేచిపోవడాన్ని ముఖ్య ఇతివృత్తంగా పెట్టుకొని చేసిన అసంఖ్యాక రచనలవల్ల కుటుంబ జీవితానికి 'ముప్పు' వచ్చిందని గోపీచంద్ భావించాడు. మరి చలం వ్రాసినవి మన సంఘంలో లేవా అంటే—ఉన్నవి అని ఆయన అంగీకరించాడు. కుటుంబ జీవితాలలో చెడుగు లున్నాయి. ఇటునంటివేనా, ఇంకా రకరకాల చెడుగు లున్నాయి. కాని చెడుతోపాటు మంచి కూడా ఉంది. ఆ మంచిని చలం పట్టించుకోలేదన్నాడు. స్త్రీకి సంఘంలో కుటుంబాలలో తగిన స్థానం, గౌరవం లేదని ఒకే తీరున గొడవ పెట్టి చలం సాంఘిక జీవితంలోని ఒక వైపును మాత్రమే అదేపనిగా విచ్చలవిడిగా చిత్రించాడు. పోనీ ఆయన చెప్పినట్టు అలా లేచిపోయినవాళ్ళు సుఖపడుతున్నారా అంటే అదీ లేదన్నాడు. అపైన రోగాలు ఆర్థికమైన ఇబ్బందులతో బాధపడి ముసలితనం వచ్చి నానా అగచాట్లు పడుతున్నారు. వాళ్లకి జీవితంలో సంతృప్తి లేదు. ఈ అంశాన్నే గోపీచంద్ ఒకానొక వ్యంగ్య రచనలో వెంకట చలం అనే పాత్రను సృష్టించి చలం ధోరణిని అవహేళన చేశాడు. ''అతని అన్ని పాత్రలూ ఒకే రకంగా ఉన్నాయి. అదే మనుపు, అదే ఉబుకు, అదే వంపు. నాకు ఒక్కటే భేదం కన్పించింది. కొన్ని పాత్రలకు ఉల్లిపొర రవికె లున్నాయి. కొన్నిటికి అవి కూడా లేవు'' అని వ్యంగ్యంగా వర్ణిస్తూ ''ఎప్పుడూ డబ్బు సంగతి ఆలోచించలేదు. ముసలితనం వస్తుందనీ, కురూపి అవుతామని ఆలోచించలేదు. అసలు ఆ ఆలోచనలకు తీరిక ఉందా ఆ వెన్నెల్లో, ఆ మైదానంలో, ఆ గులాబీ తోటల్లో, ఆ తీయని కమ్మని వాసనల్లో'' అని చెప్పి తన పాత్రలకు అసలు ఆకలే వెయ్యదని ఆ రచయిత విశ్వాసం'' అన్నాడు.

కుటుంబ జీవితం లేకుండా మానవులు సుఖపడరని గోపీచంద్ ప్రగాఢ విశ్వాసం. ఈ విశ్వాసాన్నే ఆయన అనేక రచనల్లో ఉద్ఘాటించాడు. ఒకవేళ ఎవరైనా ఒక స్త్రీ కాలు జారి భర్తను వదిలి లేచిపోయినా కొన్నాళ్లకు భర్తమీద ఆమెకు తప్పక సానుభూతి కలుగుతుందని ఆయన ''పునస్సమాగమం'' అనే కథలో చెప్పాడు. లేచిపోయిన భార్యను మళ్లీ భర్తతో కలిపాడు. అతడు కూడా ఆమె రాకకు కరిగిపోయి

ఆమె ఓదార్పుతూ ఉంటే నిశ్చేష్టు డవుతాడు. ఇలాంటి సమస్యే "మెరుపుల మరకలు" అనే నవలలోది. ఇందులో వివాహితయై కాపురం చేస్తూవున్న ఉషారాణికి ఒక వ్యక్తిని ప్రేమించి అతనితో జీవయాత్ర గడపడంలో నమ్మకం లేదు. ఫ్రెంచి సాహిత్యంతో, సార్త్రే అస్తిత్వ వాదంతో పరిచయం గల జవ్వని ఆమె. ఒకే కాలంలో అనేకులను ప్రేమిస్తుంది. విచ్చలవిడిగా, ఒక్కొక్కప్పుడు ప్రమాదకరంగా సంచరిస్తుంది. తన ప్రభావంలోకి వచ్చిన ఏ పురుషుణ్ణి విడిచిపెట్టదు. చివరకు జీవితాన్ని త్యజించి యే కోరికా లేకుండా హిమాలయాలలో అంతర్ధానమై పోతుంది. ఆమెకు పరిచితుడైన చంద్రవదనుడు కూడా ఆమెలాగే Sex perverted మనిషి. ఉషారాణి వంటి జాణ కాదు గాని—"పిల్ల తెమ్మెర" నవలలో నాయిక శమంతకమణి కూడా దాదాపు అంతే. ఇతరులకు తప్పులుగా కన్పించేవి ఆమెకు తప్పులుగా కన్పించవు. ఒక కుర్రవాడితో లేచిపోయి సినిమాకు వెళ్లి వచ్చిన దానికి మళ్లీ తాపీగా ఇంటికి తిరిగి వస్తుందట! మొగుడి వద్ద నుంచి పారిపోయి బ్రతికినన్నాళ్లు పిల్ల తెమ్మెరలాగా బ్రతుకుతుంది. అది తప్పో ఒప్పో ఆమెకు అక్కరలేదు. చివరకు లేవదీసుకు పోయినవాడే ఆమెను హత్య చేస్తాడు. "గడియ పడని తలుపులు" నవలలో కోటేశ్వరమ్మది కూడా భగ్న జీవితమే. ఆమె పరిచయంలోకి వచ్చినవా రెవరూ స్థిమితంగా బ్రతకలేరు. చివరి కామెకు ఏకాంతం మిగులుతుంది. నిరాశ, నిస్పృహ, విరక్తి పెరుగుతాయి. తుది ఘడియలలో అసలు భర్త చిత్రానికి అంజలి ఘటించి ప్రాణాలు విడుస్తుంది. ఇవన్నీ లయ తప్పిన జీవితాలని రచయిత చెప్పదలుచుకున్నాడు. ఇలాంటి స్త్రీ పురుషుల జీవితాలను చిత్రిస్తూ పోగా మానవ జీవితంలో ఏదో 'మిస్టరీ' ఉందేమో అన్న భావం రచయితకు తట్టింది. ముఖ్యంగా స్త్రీ వ్యక్తిత్వంలోని ఇంద్రధనుస్సులకు విభ్రాంతి చెందాడు. "ఎంత మనోహరమైనది ఈ స్త్రీ సృష్టి! స్త్రీలో తరచినకొద్దీ లోతులు కనిపిస్తూనే ఉంటై" అన్నాడు ఒకచోట.

ఆలోచనలలో, అభిప్రాయాలలో, సిద్ధాంతాలలో, జ్ఞానాన్నీ, సత్యాన్నీ అన్వేషించడంలో గోపీచంద్ వలె అనేక మానసిక సంఘర్షణలకు లోనైనవారు మన రచయితలలో చాలా తక్కువమంది కన్పిస్తారు. గోపీచంద్ మొదట భౌతిక వాది. హేతువాద యుగంలో పుట్టి పెరిగాడు. అనేక సిద్ధాంతాల మధ్య మసిలాడు. తండ్రి త్రిపురనేని రామస్వామి చౌదరి గారు నాస్తికులు. మన వర్ణ వ్యవస్థపైన, సంప్రదాయాలపైన, కట్టుబాట్లపైన తిరుగుబాటుచేసి ఆధునికాంధ్ర సాహిత్యంలో హేతువాద యుగాన్ని ప్రారంభించిన వారిలో ప్రముఖంగా చెప్పుకోదగినవా రయ్యారు. ఆయన రచించిన "సూత పురాణం" లో పచ్చి నాస్తికవాదం ఉంది. తండ్రి ప్రభావం వల్ల గోపీచంద్ నాస్తికు డయ్యాడు. తన తండ్రిలో బెర్నార్డ్ షా లక్షణా లుండేవని ఒక సందర్భంలో చెప్పుకున్నాడు. షా నాటకం "కారవాన్ ఆఫ్ ది క్యూరియస్" లో దేవు డున్నాడా లేదా అనే చర్చ ఉంది. మానవుడికి విమర్శా జ్ఞానం కలిగినప్పటినుంచీ ఈ దేవు డేమిటీ అని ఆలోచించడం మొదలుపెట్టాడట. తుదకు దేవుడి కోసం వెదకడం నిష్ప్రయోజనమని అందులో తేల్చబడింది. అయినా అన్ని దేశాలలో ఆస్తికు లున్నారు. ఈ విషయమై నాస్తికుల వాదం ఇట్లా ఉంది. జ్ఞానం వృద్ధి చెందినప్పుడు, ప్రకృతిని లోబరుచుకునే శక్తులను మానవుడు సంపాదించనప్పుడు మానవుడు విశ్వాసాన్ని ఆశ్రయించాడు. అదే అధ్యాత్మిక నాగరికత. జ్ఞానం వచ్చి సైన్సు వచ్చిన తరువాత దేవునిపై గల విశ్వాసం పోయింది. పైగా దేవుణ్ణి నమ్మడంతో అతని ఉనికిని బలపరచడానికి కర్మ సిద్ధాంతం స్వర్గ నరకాలు సృష్టింపబడ్డవనీ, పుక్కిటి పురాణాలు వచ్చాయనీ, మతం భగవంతుడు అనే భావాలు సామాన్య ప్రజలను దోచుకోవడానికి మాత్రమే ఉపయోగ పడుతున్నందున వాటిని ఎదిరించాలనీ చెబుతూ, అసలు మన సంఘంలో పాత పద్ధతుల నన్నిటినీ పునర్విమర్శ చేసి హేతువాదానికి సరిపోతేనే వాటిని అంగీకరించాలని గోపీచంద్ మొదట తీవ్రంగా వాదించి ప్రచారం కూడా చేశాడు. తరువాత మార్క్స్, ఎంగెల్స్ కమ్యూనిస్టు మేనిఫెస్టో గోపీచంద్‌ను ప్రభావితం చేశాయి. అందులోని సాంఘిక న్యాయం అనే సూత్రం ఆయనను కొంత ఆకర్షించింది. అయితే మార్క్సిజం ఎంతసేపటికీ ఆకలి సంగతి చెబుతుందే గాని మరొక ఆలోచనకు ఎడమే ఇవ్వదు. దాని ప్రభావం పల్చబడ్డ తరువాత ఎం. ఎన్. రాయ్ ప్రతిపాదించిన నవ్య మానవతా వాదం (New Humanism) ఈయనకు నచ్చింది. అది మార్క్సిజంపై ఒక మెట్టు పైకి పోయిం దనుకున్నాడు. (1) "Beyond Communism", (2) "Reason, Romanticism & Revolution" అనే రాయ్ గ్రంథాలు ఈయనను ఆకర్షించాయి. వాటిలో మానవ వ్యక్తిత్వాన్ని గూర్చిన చర్చ ఉంది. నవ్య మానవతా వాదం మనిషి మారాలంటుంది. దీనినే ముఖ్యాంశంగా స్వీకరించి గోపీచంద్ "అసమర్థుని జీవయాత్ర" అనే తన ప్రసిద్ధ నవల రచించాడు. తెలుగు నవలా సాహిత్యంలో ఈ నవల ఒక మైలు రాయి. మాక్సిం గోర్కీ నవల Foma Gordayev (The man who was afraid) అనే నవల ఛాయలు దీనిలో ఉన్నాయని కొందరు పోల్చుకున్నారు. కాని రెండిటికీ అల్లికలో, నిర్వచనంలో ఉద్దేశించిన సిద్ధాంతంలో ప్రబలమైన సామ్య మేమీలేదు. ప్రతిపాదించిన విషయంలో, ప్రవేశపెట్టిన పాత్రలలో, పాత్రల వైఖరుల ద్వారా ముఖ్యాంశాన్ని విశదీకరించిన వైనంలో "అసమర్థుని జీవయాత్ర" దానికదే సాటి కావడం వల్లనూ, అలాంటి అసమర్థుని లక్షణాలు నేటి తరం యువకులలో కొద్దో గొప్పో ఉన్నాయి గనుకనూ ఈ నవల యువజనం దృష్టి నాకర్షించింది. వారికి ఆత్మ విమర్శ చేసుకున్న ట్లయింది. అందులో సమస్యలే తమనూ ఎదుర్కొనేవి, అనుకున్నారు. రచయిత తన ఈ నవలను 'ఎందుకు?' అనే ప్రశ్న వేయడం నేర్పినందుకు తన తండ్రికి

అంకితమిచ్చానని తెలుసుకున్నాడు. ఇందులో కథానాయకుడు సీతారామారావు తానొక ప్రత్యేకత గల మనిషి ననుకుంటాడు. సంఘంతోపాటు అతను మారలేదు. సాటి మనుషులతో తనను సరిపెట్టుకోలేడు. జీవితంలో కష్టనిష్ఠురాలను ఎదుర్కోవలసి వచ్చేటప్పటికి బిత్తరపోయి అతివాదియై వైరివాడై తుదకు తన్ను తానే అంతం చేసుకుంటాడు. నవలలో ఒక పాత్ర జీవిత సత్యాన్ని ఇట్లా చెబుతుంది : "జీవిత ప్రవాహం ప్రచండ వేగంతో వెళ్లిపోతూ ఉంటుంది. ఎవరెవరి సంస్కారాన్ని బట్టి వాళ్లు తమ సుఖంకోసం పోటీ పడుతున్నారు. ఇదొక మహా సంగ్రామం. ఇందులో పిరికివాళ్లకు, అసమర్థులకు చోటు లేదు. అంతేకాదు, జ్ఞానమును సంఘ జీవితానికి ఉపయోగపరిచే మనస్తత్వం కూడా కావాలి. అది లేకపోతే సంఘర్షణ పతనం తప్పదు" అదీ ఈ నవల నేటి యువజనానికి చేసిన హెచ్చరిక. అయితే నవ్యమానవతావాదం మనిషి మారాలంటుంది గాని ఎలా మారాలో చెప్పదని గోపీచంద్ త్వరలోనే తెలుసుకున్నాడు. కనుకనే పై నవలలో ఎవరెన్ని హితవులు చెప్పినా సీతారామారావుకి మారడం ఎలాగో తెలియలేదు. అసలు కిటుకంతా మనస్సులోనే ఉందనీ కనుక మనస్సును ఆరోగ్యపరచుకోవాలనీ అతనికి తట్టనే లేదు. తట్టినా అందుకు సాధనాలు పద్ధతులు అతనికి అంతకంటె తెలీవు. ఈ సమస్య లెదుర్కొన్న గోపీచంద్ అనేక తత్త్వశాస్త్ర గ్రంథాలు చదువుతూ పొయ్యాడు. బాల్యంలో అతను ఆస్తికులైన ఉన్నవ లక్ష్మీనారాయణగారి ముఖతా విన్న మాటలు, వాదాలు ఎక్కడో ఒకమూల ఉండనే ఉన్నాయి. ఐన్‌స్టీన్, విల్బర్ మార్షల్, వైట్‌హెడ్, బెర్గ్సన్, టాల్‌స్టాయి మున్నగువారి అభిప్రాయాలను గమనించాడు. బెర్ట్రండ్ రస్సెల్ గ్రంథాలను చదివి రస్సెల్‌కు ముందు తత్త్వశాస్త్రం మహారణ్యంగా ఉండేదనీ, ఆయన తికమకను తొలగించి సాఫీ మార్గం ఏర్పరచ గలిగాడనీ అనుకున్నాడు. పాశ్చాత్య నాగరికతకు మానవాధికారం, హేతువాదం, ప్రజాస్వామికం ముఖ్య లక్షణాలన్న సర్వేపల్లి రాధాకృష్ణ పండితుని అభిప్రాయాన్ని గమనించాడు. అయినా చివరి ప్రశ్నకు ఆయనకు సంతృప్తికరమైన జవాబు లభించలేదు. ఆ సమయంలో అరవిందుడు ఈయన జ్ఞాన వీధిలోకి ప్రవేశించాడు. అరవిందుడు సంస్కృతాంగ్ల సాహిత్యాలను బాగా ఎరిగినవాడు. ఆ రెండు భాషలలోని తాత్విక గ్రంథాలను క్షుణ్ణంగా పరిశీలించినవాడు. పైగా ఆ మహర్షియే పాత సిద్ధాంతాలను తిరస్కరించలేదు. కాని వైరుధ్యాలను తొలగించాడు. సమన్వయం ద్వారా ఒక సంపూర్ణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. తన సిద్ధాంతంలో భౌతిక వాదానికి కూడా స్థానమిచ్చిన ఆధ్యాత్మికవేత్త అరవిందుడు. ముఖ్యంగా 'Life Divine', 'Supramental Consciousness', 'Human spiral', 'The synthesis of yoga' అనే అరవిందుని గ్రంథాలు గోపీచంద్‌కు నవ్య జ్ఞానోదయం కలిగించాయి. అంతవరకూ తాను నమ్మిందీ, చెప్పిందీ పూర్తి సత్యం కాదని గ్రహించాడు. 'ఏ విషయమైనా తప్పు అని అనకూడదనీ, అసంపూర్ణమనీ అనుకోవచ్చునీ అన్నాడు. భౌతిక ఆధ్యాత్మిక వాదాలు ఒకదాని కొకటి వ్యతిరేకం కాదనే సత్యం తెలిసింది. భావాల సంఘర్షణ తొలగిపోయి, మనస్సు శాంత పడింది. మనిషి ఎలా మారాలో ఆచరణ సాధ్యమైన రీతిని అరవిందుడు చెప్పాడు. జడమైన ఈ ప్రపంచాన్ని మనస్సుకు అతీతమైన చైతన్యం (Supramental Consciousness)తో బాగు చేయవచ్చుననీ, ప్రతిదీ దివ్యమైనదే ననీ, పదార్థమును కూడ దివ్యమైన దానినిగా చేయవచ్చుననీ అరవిందుడు చెప్పి మనస్సుకు అతీతమైన దాన్ని సాధించే మార్గం చూపాడు. దానికి గోపీచంద్ తాను అంతకుముందు స్వీకరించిన నవ్యమానవతా వాదాన్ని కూడా జోడించి భౌతికవాద, ఆధ్యాత్మిక వాద సమన్వయం చేసి తాను గైకొన్న నిర్ణయాలను దృష్టాంత సహితంగా, ప్రామాణికంగా వివరిస్తూ 1949 లో కొన్ని వ్యాసాలు వ్రాశాడు. ఈవ్యాసాలు 'పోస్టు చేయని ఉత్తరాలు' అను శీర్షికతో ఆంధ్రపత్రికలో మొదట వరుసగా ప్రకటితమయ్యాయి. ఇవి ఆయన మిత్రులకూ, పాఠకులకూ, ఆయన భావాలను గమనిస్తున్నవారికీ ఆశ్చర్యం కలిగించాయి. ఇక గోపీచంద్ హేతువాది కాడనీ, ఆధ్యాత్మిక వాదిగా మారాడనీ అంతా అనుకున్నారు. ఇలా మారేవాడు ఇకముందు ఒక నిశ్చయంపై నిలబడతాడనీ నమ్మక మేమిటని అన్నారు. వారికి ఆయన సమాధానమిస్తూ గాంధిగారిని కూడా ఇలాగే విమర్శించటం జరిగిందనీ, అందుకు ఆ మహాత్ముడు 'నీకు కావలసింది సత్యమా' లేక వెనుక చెప్పిందానికి వైరుధ్యం లేకపోవడమా అని ఎవరైనా అడిగితే నేను సత్యాన్నే కోరుకుంటాను' అని చెప్పిన జవాబును ఉట్టంకించాడు. అంతేగాక నెహ్రూ వ్యక్తిత్వాన్ని కూడా ఉదహరించి నెహ్రూ ఎప్పటి కప్పుడు నూత్న జ్ఞానాన్ని తనలో కలుపుకుంటూ విశాలమవుతూ ప్రయాణం చేస్తూ ప్రకృతి గర్భంలోని అద్భుతాలు తన నెప్పుడూ తన్మయుణ్ణి చేస్తాయని అంటున్నాడనీ చెప్పాడు. పోనీ అసలు సత్యమేదో తేలేదాకా దేన్నీ నమ్మకుండా ఉంటే ? ఆలోచనాపరులకది సాధ్యంకాదంటాడు గోపీచంద్. ఏ దృష్టి లేకుండా మనిషి ఈ ప్రపంచంలో ఒక్క క్షణం ఉండలేడు. ఏ నమ్మకం లేకుండా ఒక్కపనీ చెయ్యలేడు. కనుక ఎప్పటికప్పుడు ఒక సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తూ ఆ సిద్ధాంతం సంపూర్ణమనుకోకుండా ఎప్పుడూ నూత్న జ్ఞానాన్ని అన్వేషిస్తూ అలా పొందిన జ్ఞానాన్ని తన సిద్ధాంతంతో కలుపుకొని మారుతూ మానవుడు జీవించాలని ఆయన ఉద్దేశం. జ్ఞానం అసంపూర్ణం కదా అని దాని జోలి మనకెందు కనుకుంటే జ్ఞానమూ లేదు, అభివృద్ధీ లేదు. ఇప్పుడున్న జ్ఞానాన్ని నమ్మి పనిచేయబట్టే అది అసంపూర్ణమనే జ్ఞానాన్ని పొందగలుగుతున్నామని వాదించాడు. మానవుడు 'నేను' ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడమే గాక బాహ్య పరిస్థితులను కూడా అవగతం చేసుకొని సమన్వయం చేసుకుంటే సత్యం బోధపడుతుంది. ఒకప్పుడు ఆధ్యాత్మికవాదం శాస్త్రజ్ఞానం లేని కొంతమంది సనాతనుల వాదం అని విమర్శించిన గోపీచంద్

కీ. శే. గోపీచంద్

దృష్టిలో మార్పు వచ్చిన తరువాత మొత్తం ప్రపంచాన్ని ఒకటిగా చూడకపోవడం వల్ల అనర్థాలు వచ్చాయంటూ సంపూర్ణమైన చెడుగు ఎందులోనూ లేదన్నాడు. ధ్యానంలో తనకు నమ్మకం కలుగుతూ ఉందన్నాడు. ఆధ్యాత్మిక శక్తిని అంగీకరించాడు. మనిషి మానసికంగా పెరగాలని ప్రబోధించాడు. మానవునిమీద పరిస్థితుల ప్రభావం వల్లనే సంఘం, సంప్రదాయం రూపొందుతాయని మార్క్సిస్టులు చెబితే అది పూర్తిగా నిజమని నమ్మిన గోపీచంద్ పోను పోను క్రమేణా మానవునిపై పరిస్థితుల ప్రభావం నశిస్తూ ఉందనీ, మానవుడు తనకు కావలసిన పరిస్థితులను సృష్టించుకొని పరిస్థితుల ప్రభావాన్ని అధిగమించి కూడా బ్రతుకగలుగుతున్నాడని ఒప్పుకున్నాడు. అయితే హేతువాదం అవసరం లేదనే వారితో ఆయన ఏకీభవించలేదు. హేతువాదం మన జీవితానికీ, ఆలోచనలకూ మార్గం చూపుతుందని చివరివరకూ ఆయన విశ్వాసం. నేడు కావలసింది ఆధ్యాత్మికతను అంగీకరించడమే. ఈ మీమాంస అంతా విన్నవారు—గోపీచంద్ భావకవుల ప్రేయసినీ, ప్రణయమునూ, విరహమునూ విమర్శించినట్లే మరొకరు 'అయ్యా ఈ గొడవంతా ఏమిటి ? దేవుడు లేడని లోకమంతా గోలపెడుతూ ఉందా ? ఆధ్యాత్మిక వాదం నేటి ఆవశ్యకత అని జనం నినాదాలు చేస్తూ ఉందా ? ఈ సంఘర్షణ అంతా మీరెందుకు కల్పించుకొని మమ్మల్ని బాధపెడతారు ? అసలు ఇవి ఈనాడు ముఖ్య సమస్యలా ?' అని అడగవచ్చు. కాని ఇవి భావ కవుల వేదన వలె ప్రాతిపదికలేని వైయక్తిక భావం కాదు. వారివలె గోరంతను కొండంతలుగా వూహించే అంశమూ కాదు. ప్రపంచ మేధావులను (వారు కొద్దిమందే కావచ్చు) ఒకప్పుడిది బాగా కలత పెట్టిన సమస్య. మానవ సంఘం ఉనికి, సంప్రదాయాల అవలంబన, సాధనాల నిర్ణయం మొదలగు విషయాలపై దీని ప్రభావం అధికం. అయితే ఈసంఘర్షణ ప్రత్యక్షంగా సాంఘిక రంగంలో కాక వ్యక్తుల మనస్సులలో జరుగుతూ ఉంటుంది.

కమ్యూనిస్టు రాజ్యాలు వచ్చిన వరువాత ఈ సమస్యకు సాంఘిక ప్రాముఖ్యం కూడా కలిగినట్లున్నది. ఇవన్నీ అటుండనిచ్చి గోపీచంద్ సమగ్రజ్ఞానం సముపార్జించుకోకుండా మొదట్లోనే పరిసర ప్రభావాలకు లోనై భౌతికవాది అయ్యాడు. ఆ వాదమును ప్రచారం కూడా చేశాడు. కనుక తత్త్వం బోధపడ్డ తర్వాత మిన్నకుండా ఎలా ఉంటాడు ? తాను మొదట పడ్డ పొరపాటునూ తరువాత తెలుసుకున్న అంశములనూ లోకానికి చెప్పవలసిన అవసరాన్ని గ్రహించాడు. ఫలితమే అందరినీ ఉద్దేశించి ఆయన వ్రాసిన ఉత్తరాలు; కాని పోస్టు చేయని ఉత్తరాలు. ఈ గ్రంథమును ఆస్తికులైన శ్రీ శివలెంక శంభుప్రసాద్‌గారికి అంకితమివ్వడం మరొక విశేషం. గోపీచంద్ తన యీ నూత్న సిద్ధాంతాన్ని తాను సృష్టించబొయ్యే సాహిత్యానికి కూడా అన్వయం చేసుకున్నాడు. మనిషి మానసికంగా పెరగాలంటే మన కథారూపాలలో బాహ్య సమస్యలకే గాక భౌతికాతీతమైన సమస్యలకు కూడా స్థానమివ్వాలని ఉద్బోధించాడు.

దృక్పథంలో, సిద్ధాంతంలో ఇట్టి మార్పు వచ్చిన తరువాత గోపీచంద్ వ్రాసిన రెండు నవలలు ముఖ్యంగా పరిశీలింప దగ్గవి. మొదట "చీకటి గదులు" నవలను తీసుకుందాము. ఇందులో స్వాతంత్ర్యానికి పూర్వం నాటి ఆంధ్ర దేశ సాంఘిక రాజకీయ స్థితిగతులు ఇతివృత్తంగా కథ ఆరంభమైంది. బ్రాహ్మణ, అబ్రాహ్మణ భేదాలు, బ్రాహ్మణేతరోద్యమం వేసిన వెర్రి తలలు, ఒక్క బ్రాహ్మణ్యంలోనే గాక ఇతర వర్ణాలలో కూడా ప్రవేశించిన చెడులు, బ్రాహ్మణేతరులలో పై వర్గాలవారి సంగతి మాత్రమే పట్టించుకొని దిగువ కులాలను, హరిజనులనూ విస్మరించి ఆర్థిక స్థితులను పట్టించుకోనట్టి జస్టిస్ పార్టీ, ఇంకా కాంగ్రెస్, సోషలిస్ట్, కమ్యూనిస్టు పార్టీల విభేదాలు, అసలు తల్లి, సవతి తల్లి అనే నమ్మకాలు - ఈవిధంగా సంఘంలో మనుషుల మనస్సులలో సహృదయత్వం క్షీణిస్తూ ఎన్ని గదులు తయారవుతున్నాయో వాటిలో చీకటే గాని వెలుతురుకు ఆస్కారంలేక పోవడానికి హేతువు లేమిటో చాలా పెద్ద కాన్వాసుపై చిత్రించాడు. సమగ్రమైన దృష్టి మన సంఘంలోని వ్యక్తుల కవసరమని ఈ నవలలో తేల్చాడు. రెండవ నవల "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" లో మతిమంతులు (బహుశా తెలివికలవారని కాబోలు) ఎవరికి వారు తమ చుట్టూ ఏర్పరచుకొనే వలయాలవల్ల ఒకరినొకరు అర్థం చేసుకోకపోగా, సమ్యగ్దృష్టి, సమన్వయ శక్తి కొరవడి అసూయాద్వేషాలను పెంచుకొని జీవితాన్ని ఒక పెద్ద విషవలయంగా తయారు చేస్తున్నారని చెప్పి ఇది సంఘానికి అరిష్టహేతువు అని హెచ్చరించాడు. అయితే సమన్వయం కావాలంటే మనస్సును అధిగమించి పై అంతస్థులలో భావన చెయ్యాలని చెప్పాడు. అరవిందుడు చెప్పిన అతీత మానసిక ప్రవృత్తిని స్పృశించడానికి గోపీచంద్ ఈ నవల వ్రాశాడు. నవల చివరి భాగం అరవిందుని తత్త్వ చర్చలతో నిండిఉంది. ఆ తత్త్వంలో పడ్డ రచయిత కేశవమూర్తి, ఆయన భార్య సౌజన్యాల రాశి సుజాత, బ్రతికున్నంతవరకూ పట్టు విడవకుండా చివరకు సమ్యగ్దృష్టి కనపరచి అందరినీ ఆశ్చర్యపరచిన పరమేశ్వరశాస్త్రి, దొంగ వెధవలు, సీమంతం, రాధారమణ, శారద్వతుడు అందరూ అన్ని వలయాలు. అంతా పొరపాట్లు చేసినవారే. "విశ్వాన్నంతా తనలో చూచుకోగల్గిన మానవుడు పుట్టుకురావడానికి ప్రజాస్వామిక విధానం పునాది" అని గోపీచంద్ ఈ నవలలో చెప్పగలిగాడంటే మార్క్సిజం నుంచి ఆయన ఎంతవరకు పురోగమించాడో అర్థం చేసుకోవచ్చు.

తెలుగు సాహిత్యంలో గోపీచంద్ ఉత్తమ కథకుడుగా, ప్రసిద్ధ నవలా రచయితగా నిలిచిపొయ్యాడు. ఇతర ప్రక్రియలలో కూడా ఆయన కొంత వ్యాసంగం చేశాడు. లేఖలు, వ్యాసాలు వ్రాశాడు. ప్రపంచ తత్త్వవేత్తలను గూర్చి వ్రాశాడు. 'మాంచాల', 'అభాగిని' వంటి నాటకాలు, 'తత్త్వమసి' మున్నగు నాటికలు, ఇంకా చాలా రేడియో నాటికలు వ్రాశాడు. నాటక రచయితగా మన సాహిత్యంలో ఆయన

కంతగా ప్రశస్తి రాదేమో. కారణం నాటక రచన ఆయన ప్రక్రియ కాదు. తాత్వికునిలో, తన ముక్కుకు సూటిగా పొయ్యే వాస్తవికవాదికి నాటకీయత పట్టుబడదు. బెర్నార్డుషా వంటి నాటకకర్త కూడా ఈ విమర్శను తప్పించుకోలేక పొయ్యాడు. గోపీచంద్ ఇటీవల "మాలపల్లి" నవలకు చేసిన నాటకీకరణంలో కూడా చెప్పుకోతగినంతగా కృతకృత్యుడు కాలేదు. ఆయన ప్రతిభ కథానికలలో, నవలల్లోనే గాఢంగా అభివ్యక్తమైంది. ఆ రెండు ప్రక్రియలలో ఆయన సిద్ధహస్తుడు. ఎంత చిన్న అంశాన్నయినా ఒక కథగా, ఎటువంటి సంక్లిష్ట ఇతివృత్తమున్నైనా ఒక నవలగా రూపొందించగల నేర్పు ఆయనకుంది. మొట్టమొదటి కథ వ్రాసినప్పుడు ఆయనకూడా కృత్యాద్యవస్థ అనుభవించాడు. ఆ అవస్థనే 'నా మొదటికథ' అని ఒక కథగా చిత్రంగా వ్రాశాడు. క్రమేణా ఆ ప్రక్రియను సాధనంచేశాడు. చెకోవ్, మపాసా, బేట్స్, సారోయన్, పుష్కిన్, గోర్కీ, మామ్, ఓ హెన్రీల రచనా విధానాలన్నీ ఈయనను ఆకర్షించాయి. వారందరి పద్ధతులలో ఈయన రచనలు చేశాడు. ముఖ్యంగా బేట్స్ గోపీచంద్‌కు ఎక్కువగా నచ్చినట్లు కన్పిస్తాడు. కేవలం వాతావరణాన్ని చిత్రిస్తూ కథను అల్లడంలో బేట్స్ నేర్పరి. బేట్స్ కథలకు అనుసరణలుకూడా ఈయన వ్రాశాడు. చలం కథల ఇతివృత్తాలు సరిపడవు. గాని కథారచనలో చలం చూపిన శిల్పచాతుర్యాన్ని గోపీచంద్ ఒక సందర్భంలో ప్రశంసించాడు. చలం ఏ దేశంలోని కథకుడికీ తీసిపోడని ఆయన అన్నాడు. ప్రపంచ కథాసాహిత్యాన్ని, అది సాధించిన ప్రయోజనాలనూ చూచినప్పుడు గోపీచంద్ తాను చెప్పదలుచుకున్న విషయాలకు కథ చక్కని సాధనమని గ్రహించాడు. తనప్రత్యేకతను కూడా చూపిస్తూ ప్రయోగాలవంటి సంఘటనలను పాత్రలను కల్పించి 'గోపీచంద్ కథ' అనే ప్రశస్తిని ఆర్జించుకున్నాడు. గోపీచంద్ కథ అంటే—దాని ముఖ్యలక్షణాలు నాకు తోచినంతవరకు ఇవి : వాస్తవమైన గ్రామీణ జీవితం లేదా మధ్యతరగతి జీవితం ప్రాభవను. నిరాడంబరత, అవిచ్ఛిన్నంగా సాగిపొయ్యే అల్లిక, తలుపుచాటునుంచి తొంగిచూచే తరుణి వలె ఒకానొక సంస్కారము లేదా తాత్విక జిజ్ఞాస, సొంతనిర్వచనం, సుపరిచితమైన తెనుగు నుడికారం. భాషకు ఆయనకు తండ్రి రచనలే ఒరవడి. ముఖ్యంగా "తండ్రులు—కొడుకులు" వంటి కథలలో మధ్యాంధ్ర గ్రామీణులభాష స్వచ్ఛనిసర్గంగా దర్శనమిచ్చింది. రైతాంగములో తండ్రి, తల్లి, కొడుకు, కోడలు, అల్లుడు, మరదలు, ఆసామి, పాలేరు, పాలమనిషి, కూరగాయల మనిషి ఎలా మాటాడుతారో, వారి నేర్పులేమిటో ఆ మాటల స్వారస్యాలేమిటో గోపీచంద్ ప్రతిభావంతంగా వ్రాశాడు. మొదటి రచనలలోకంటె ఈయన తరువాత చేసిన రచనలలో కావాలని వర్ణనలుచేసి అలంకారాలు చూపాడు. "మెరుపుల మరకలు" నవలలో ఇలాంటి అలంకారాలు అనేకం. అసలు ఏ ప్రక్రియలోనైనా గోపీచంద్ ఆరంభంలో చేసిన రచనలలోకంటె తరువాతి రచనలలోనే రచనాకళ సొగసులను విశేషంగా చూపుతూపొయ్యాడు. రచయితపెరుగుతూ పొయ్యాడనడానికి ఇదే నిదర్శనం.

గోపీచంద్ తీసుకున్న కొన్ని ఇతివృత్తాలు ఆధునికత, ఆంగ్లవిద్య, నాగరికత, విజ్ఞానం తెలిసినవారికి మాత్రమే బోధపడే విషయాలు అయినా వాటిని మామూలు పాఠకుల స్థాయిలోకి తెచ్చి రచనచేశాడు. వాటికీ వాస్తవపరిస్థితులే, సంభావ్యమైన సన్నివేశాలే ప్రాతిపదికలు. కానికొన్ని తావులలో పాత్రల చేత అభిప్రాయాలు చెప్పించినప్పుడు ఆయన ఔచిత్యాన్ని పరామర్శించుకున్నట్లు కన్పించదు. ఉదాహరణకు "అసమర్థుని జీవయాత్ర"లో పామరుడుగా కన్పించే రామయ్య తాతచేత నవ్యమానవతావాదంలోని అంశాలను విపులీకరించి చెప్పించడం. వాటిని రచయిత చెబితే సిద్ధాంతాలు చెప్పినట్లు వుంటుందని రెండుపాత్రల సంభాషణలో ఆ చర్చను ప్రవేశపెట్టాడు. నవల చదవడం పూర్తి అయినతర్వాత ఆలోచిస్తే రామయ్య తాతకు అంత సిద్ధాంత పరిజ్ఞానమే ! అని ఆశ్చర్యపోతాము. అట్లే "గడియపడని తలుపులు"లో కోటేశ్వరమ్మ స్వీయ ప్రేమగాథను ఒక పురుషునికి విడమరచి చెప్పడం. అదేమళ్లీ "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా"లో మొదటి కథను రచయిత చెప్పడం మొదలుపెట్టినా అక్కడక్కడా రవీంద్రుని "ఇంటా—బైటా" నవలవలె పాత్రలచేతనే ఆయా కథలను చెప్పించడంవల్ల వాటి దృక్పథాలు సమగ్రంగా అర్థమయ్యే వీలుకలిగింది.

కథకుడుగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రభవించిన గోపీచంద్ నవలా రచయితగా వాసికెక్కి ఎప్పటికప్పుడు యేదో ఒక తత్వాన్ని అనుసరిస్తూ, చివరకు విభిన్న తత్వాల సమన్వయం చేసుకొని చివరిదశలో "నాకిప్పుడు తత్త్వ జిజ్ఞాసే ఆనందాన్ని ఇస్తూవుంది" అన్నాడు. సిద్ధాంతాలకంటే, భావాలకంటె జీవితం ముఖ్యం — అంటే మానవుడు ముఖ్యం. జీవిత పరమావధి ప్రతి మానవుడికీ ఈ లోకాన్ని వాసయోగ్యం చేయడమే అని వేదాంతివలె భావించాడు. ఆయనే చెప్పుకొన్నట్లు ఆయన రచనలు జీవితంలో కలిగిన అనుభవాల మూలంగా వెలువడిన విదళింపులజల్లులు. ఈ పరిణామమును చూస్తే "ఇరవయ్యో శతాబ్దపు రచయితలు చివరకు తత్త్వ వేత్తలుగా మారవలసివస్తుంది. జీవితాన్ని సంపూర్ణంగా చూచే స్థితికి వారు వస్తారు." అన్న బెర్నార్డుషా మాట గోపీచంద్‌పట్ల సార్థకమైందనిపిస్తుంది. నిరంతరం ఆలోచనాపరుడై, నిలకడగా పుంఖాను పుంఖంగా రచనలుచేస్తూ (గోపీచంద్ ఇటీవలనే వెయ్యి పేజీల నవలనొకటి వ్రాయతలపెట్టినట్లు తెలుస్తున్నది) వచ్చిన ఈ తెలుగు రచయిత జీవయాత్రలో సగంవరకు మాత్రమే ప్రయాణించి ఆకస్మికంగా కన్నుమూయడంవల్ల ఆంధ్ర సాహిత్యానికి వచ్చినలోటు ఇంతలో తీరేదికాదు. పరమేశ్వరుడు ఆయన ఆత్మకు శాంతి కలిగించుగాక !

సవతి తల్లి

" మీరా "

సుందరంగారి చిటికెన వ్రేలి ఆసరాతో ఆ యింటి కోడలిగా మొట్టమొదట కుడికాలు పెట్టింది ఆ ఇంటిలో శాంత. అందరికన్న చిన్నపిల్ల సుగుణ నాయనమ్మ సీతమ్మగారి కొంగు పట్టుకొని వింతగా కళ్లు పెద్దవిచేసుకుని చూస్తోంది. క్రొత్తగా అత్తవారి యింటిలో అడుగుపెట్టిన శాంతకు సంకోచంగాను ఉన్నది. ఎక్కడా సందడి, ఆర్భాటాలులేవు. గ్రుడ్లప్పగించి చూస్తున్న సుగుణను దగ్గరకు తీసుకొని ఒడిలో కూర్చోబెట్టుకొంది. "ఏం చదువుతున్నావు పాపా ?" అని అడిగింది. భయపడుతూలేచి వెళ్లిపోబోయింది సుగుణ. "తప్పమ్మా ! మీ అమ్మ దగ్గర కూర్చో." అన్నది సీతమ్మగారు. "ఇప్పుడు యేం చదువుతున్నావమ్మా ?" అని మరల అడిగింది శాంత. "మూడు...." అని భయపడుతూ చెప్పింది సుగుణ.

"ఇది చిన్నపిల్లమ్మా ! దీని యిద్దరన్నలూ అలా బయటకు వెళ్లినట్లున్నారు." సీతమ్మగారు చెప్పింది.

ఆ రాత్రి భోజనాల దగ్గర పెద్ద పిల్లలిద్దరూ కనిపించారు శాంతకు. "మీ అమ్మ వచ్చిందిరా !" అని సీతమ్మగారు అన్నది మనుమలతో.

"రా బాబూ !" అని దగ్గరకు పిలిస్తే వెళ్లలేదు రెండవవాడు చంద్రం. ఒకసారి తలెత్తి శాంతను చూచి మరల తలదించుకొన్నాడు పెద్దవాడు సూర్యం. శాంత మనస్సు చివుక్కుమన్నది.

ఆ రాత్రి .... శాంత కది వైవాహిక జీవితంలో మొదటి రోజు. భయపడుతూ అడుగు పెట్టింది గదిలో. నేల చూపులు చూస్తూ నిలబడింది. సుందరంగారు మంచంమీద కూర్చుని ఉన్నారు. శాంతను చూడగానే ఆయనకు తన మొదటి భార్యతో గడిపిన మొదటి రోజులు గుర్తుకు వచ్చాయి. ఔను ..... జానకి కూడ యిలాగే సిగ్గుపడుతూ గడప దగ్గర నిలబడిపోయింది. ఆయన నెమ్మదిగా పిలిచారు. "జానకీ ! ఇలా రా!" శాంత ఒక్కసారి గతుక్కుమంది. ఉలిక్కిపడి చూచింది తల యెత్తి. తన భాగ్యరేఖ, తన జీవిత భాగస్వామి యీ రూపంలో ప్రత్యక్షమవుతాడని అనుకోలేదు. తను ఎన్ని కలలు కన్నది. నిరంతరం తన మొదటి భార్యనే తలంచుకొనే యీాయనతో ఎలా జీవించడం ? ..... ఛీ .... ఛీ, ఏమిటి తన ఆలోచనలు. తన అదృష్టానికి బాధపడి ప్రయోజనం లేదు. తను ధైర్యంగా ఉండాలి. వారి మనస్సు అప్పుతమైతే తను బాధపడవలసిన పనే ఉండదు. పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడి పెద్దవాళ్లను చేస్తే .... యీ జీవితానికి అదే తృప్తి .... ఈవిధంగా సాగుతున్నాయి ఆమె ఆలోచనలు.

"జానకీ !" అని పిలిచిన తరువాత సుందరంగారు తన తప్పు తెలుసుకొన్నారు. శాంత ఏమనుకుంది ? పాపం ! రెండవ పెళ్లి భర్తనని ఆమె బాధపడుతూ ఉంటుంది. దానికి తోడు తాను యిలా ప్రవర్తిస్తూ యుంటే .... మొదటిసారి పెళ్లి జరిగినప్పటి ఉత్సాహం, సందడి, సరదాలు ఈసారి ఏమీ జరుగనేలేదు. ఆమె ఎన్నో వూహించుకొని ఉంటుంది. శాంతకు కష్టం కలుగకుండా చూడాలి. ఆమెను సంతోషపెట్టడానికి ప్రయత్నించాలి. ఈవిధంగా అనుకొంటూ ఆయన నెమ్మదిగా లేచారు. "శాంతా ! కాళ్లు లాగడం లేదూ ? నిలబడిపోయావు." దగ్గరకు వెళ్లి ప్రశ్నించారు. శాంత నెమ్మదిగ వచ్చి మంచం మీద కూర్చుంది. ఆయన వచ్చి ప్రక్కను కూర్చున్నారు. "పిల్లల్ని చూశావు కదూ ? వాళ్లను నాకు వదిలి వాళ్ల తల్లి వెళ్లిపోయింది. ఇకనుండి నీవే వాళ్ల బాధ్యత వహించాలి. వాళ్ల కష్టం, సుఖం నీవు చూడాలి. నిన్ను చూడడానికి నేను ఉన్నాను." అన్నారు ఆయన. అంతకన్న ఏమి మాట్లాడాలో ఆయనకీ తోచలేదు. శాంత బుర్ర వూపింది.

*   *   *

శాంత వంద రూపాయలు తెచ్చుకొనే ఒక గుమాస్తా కూతురు. ఆమె తల్లిదండ్రులకు శాంత కాక మరో ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకూను. శాంత మూడవఫారం చదివింది. ఇంకా చదవాలనే ఉత్సాహం ఉన్నా తండ్రి ఇబ్బందులు తెలిసిఉన్నది కనుక ఇక చదివిన చదువులు చాల్లే అని తండ్రి అంటే బుర్ర ఊపింది. అందరి ఆడపిల్లలలాగే భవిష్యత్తును వూహించుకొని కలలు కన్నది. పెద్ద అందగాడు కాకపోయినా తన కీడైనవాడు కావాలని కోరుకొన్నది. పెద్ద ఉద్యోగస్థుడు ధనవంతుడు తన కవసరంలేదు. తనను అర్థం చేసుకోగల్గే హృదయ మున్నవాడు చాలు ననుకొన్నది. తండ్రి పెద్ద కూతురు పెండ్లి చేయడానికే ఎన్నో అవస్థలు పడ్డాడు. తల బొప్పి కట్టింది. కూతురు ఇష్టపడినవానికి చేయాలంటే ఈరోజుల్లో తానెక్కడ తేగలడు కట్నాలు ? కాళ్ల దగ్గరకు వచ్చిన సంబంధం. బాగా కలిగిన కుటుంబం. రెండవపెళ్లివాడైతేనేమి ? మరీ పెద్ద వయస్సు కాదుగా, చక్కటి సంబంధం. కోరుకున్నవన్నీ తీరుతాయి. కూతురు సుఖపడుతుంది. ఈ ఆలోచనలతోనే శాంత తండ్రి సుందరంగారి సంబంధం స్థిరపరిచాడు. తల్లీ కూతుళ్ల కిద్దరికీ నచ్చలేదు.

కాని పెద్ద పెద్ద కట్నాలు పోస్తేనేగాని పెళ్లికొడుకులు రాని యీ రోజుల్లో ఏమి చేస్తారు ? త్వరలోనే పెద్ద అర్భాటా లేమీ లేకుండా దేవుని సన్నిధిలో పెళ్లి చేసుకుని శాంతను ఇంటికి తీసుకొని వచ్చారు సుందరంగారు.

పెద్దబ్బాయి సూర్యం పదిహేనేళ్లవాడు. అతను స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. ఇప్పుడిప్పుడే ప్రపంచం అర్థం అవుతోంది. సూర్యం మనస్సు గంభీరమైనది. తమ్ముడు, చెల్లి అంటే అభిమానం. తల్లి పోయిన దగ్గరనుండి వాళ్లంటే మరీ ప్రేమగా చూస్తూ ఉంటాడు. చెల్లిని చూచి అప్పు డప్పుడు కన్నీళ్లు కూడా పెడుతూ ఉంటాడు. రాత్రి పడు కున్న తరువాత అతని మస్తిష్కంలో ఆలోచనలు ముసిరి మనస్సు కలవరపడుతూ ఉంటుంది. అతని కన్నీళ్లకు తలగడే సాక్షి. తను, తమ్ముడు మొగపిల్లలు. కాని సుగుణ విష యమే అతనిని బాధిస్తూ ఉంటుంది. తండ్రి మరల పెండ్లి ప్రయత్నాలు చేస్తూ ఉన్నాడంటే విని బాధపడ్డాడు. వచ్చే తల్లి ఎటువంటిదో ? .... కాని శాంతను చూచిన తరువాత తాను అంతగ భయపడడం అవివేక మనిపించింది. ఆమె ..... తమ క్రొత్త అమ్మ మంచిదిలాగనే కనిపిస్తున్నది. కాని .... యేమో, తరువాత .... యెలా ఉంటుందో. ఇప్పుడున్న మమ కారం ఆమెకు పిల్లలు పుట్టిన తరువాత ఉంటుందా ? ఏమైనా ఇంక అన్నిటికి ఎదురు చూడాలి, అనుకొన్నాడు సూర్యం.

పన్నెండేళ్ల చంద్రం మూడవ ఫారం చదువుతున్నాడు. ఏ చిన్న విషయమైన వింతగ, తన కందినంతవరకు లోతుగా ఆలోచించడం చంద్రం అలవాటు. అతనిమీద పరిసరాల ప్రభావం త్వరగా పడుతుంది. ఆ వయస్సు కూడ అటువం టిదే. చిన్నప్పుడు తాను నాయనమ్మ దగ్గర విన్న కథల్లో, తను చదువుకున్న చిన్న పిల్లల కథల పుస్తకాలలో కొన్ని సవతి తల్లి కథలు కూడ ఉన్నాయి. ఆ సవతితల్లు లందరూ గయ్యాళిగంపలు. సవతి పిల్లల్ని పీక్కుతినే రాబందులు. కొంత మంది తమ సవతి పిల్లల్ని చంపడానికి కూడ ప్రయత్నిం చారు. అమ్మ చచ్చిపోయిన తరువాత తమకు సవతి తల్లి వస్తుందని యెవరూ చెప్పలేదు. ఒకరోజు నాన్నగారు పెళ్లి చేసుకొని మరీ తీసుకొని వచ్చారు. అప్పుడే భయం వేసింది చంద్రానికి. అందుకే ఆమె పిలిచినా దగ్గరకు వెళ్లలేదు చంద్రం. కాని చూడగా చూడగా తన క్రొత్త అమ్మ చాల మంచిదేహో అనిపిస్తోంది. కొంతమంది సవతి తల్లులు మంచివాళ్లు కూడ ఉంటారు కాబోలు అనుకొన్నాడు చంద్రం.

చిన్నపిల్ల సుగుణ ఎనిమిది సంవత్సరాలది. అందరికంటె చిన్నది. అందులోను ఆడపిల్ల ఒక్కతే అవడంతో సుగుణ చిన్నతనం నుండి ముద్దుగ, గారాబంగా పెరిగింది. ఆ గారాబమే ఆ పిల్లకు పెంకెతనం, మంకుతనం నేర్పింది. కావాలను కొన్నది వెంటనే జరిగి తీరవలసిందే. లేకపోతే ఆ యింట్లో ఎవరికి స్థిమితం ఉండదు. ఉండనివ్వదు సుగుణ. తల్లి పోయిన దగ్గరనుండి నాయనమ్మ మరింత గారాబం చేసింది. ఎవరికీ భయ పడని సుగుణ కోపిష్ఠి అయిన తండ్రికి మాత్రం భయ పడుతుంది. సుగుణకు కావలసినవి అమర్చిపెట్టి ఆమె అవునన్న దానికి వూకొట్టితే ఆమె అంత మంచిపిల్ల మరొకరు ఉండనే ఉండరు..

శాంతకు ఆ ఇంటిలోని ఒక్కొక్కరి మనస్తత్వాలు నెమ్మది నెమ్మదిగ అర్థమవుతున్నాయి. నెమ్మదిగ ఆ సంసా రానికి అలవాటు పడింది. సుగుణ ఇంటికి దగ్గర బడిలోనే మూడవ తరగతి చదువుతోంది. ఆ అమ్మాయికి ఉదయం 8 గంటలకే బడి. శాంత తెల్లవారుఝామునే లేస్తుంది. ఏదైనా ఫలహారం తయారుచేస్తుంది. తరువాత సుగుణకు తలదువ్వి, బొట్టు పెట్టి, ఫలహారం, కాఫీ యిచ్చి బడికి పంపుతుంది. సుగుణకు త్వరగా చనువు ఏర్పడింది శాంత దగ్గర. క్రొత్త పోగానే తల్లి దగ్గర గారాలు చేయడం నేర్చింది. ఉదయం బడికి వెళ్లిన సుగుణ తిరిగి ఇంటికి పద కొండు గంటలకు వస్తుంది. వస్తూనే పుస్తకాల సంచీ విసిరి "అమ్మా ! అన్నంపెట్టు" అంటూ కేకలేస్తుంది. ఒక్క క్షణం ఆలస్యమైనా వూరుకోదు.

తన పనులమీద బయటకు వెళ్లి తిరిగి 12 గంట లకు వచ్చే సుందరంగారు ఆరోజు పదకొండు గంటలకే ఇంటికి వచ్చారు. ఆయన వెనుకనే మేడపైకి వెళ్లింది శాంత ముఖం కడుక్కోవటానికి సబ్బూ, తువాలు అందివ్వడానికి. సరిగ్గా అదే సమయాన "అమ్మోయ్ ! ఆకలి—త్వరగా అన్నంపెట్టు" అంటూ వీధిలోనుండే కేకలేసుకుంటూ వచ్చింది సుగుణ. మేడ పైన ఉన్న శాంతకు సుగుణ పిలుపు వినిపించలేదు. శాంత పలకకపోయేసరికి "అన్నం ! అన్నం!" అనుకొంటూ ఏడ్పు లంకించుకొంది సుగుణ. ఇల్లు ఎగిరిపోయేలా ఏడ్పులూ రంకెలూ. "వస్తున్నానమ్మా !" అంటూ కంగారుపడుతూ పలికింది శాంత మెట్లు దిగుతూ. పైన ఉన్న సుందరం గారు కూడ విన్నారు ఆమె ఏడ్పులు. "సుగుణా ! ఏమిటా అరుపులు ? అమ్మ వచ్చేవరకూ ఆగలేవూ ?" అని కోపంగా ఉరిమారు. సాధారణంగా తను వచ్చేసరికి నాన్నగారు రారు. తండ్రి లేరనే ధైర్యంతోనే సుగుణ అంత గట్టిగా ఏడు స్తోంది. తండ్రి కేకతో ఉలిక్కిపడి వచ్చే రాగాన్ని నోట్లోనే అణుచుకొంది. అది వెక్కిళ్ల రూపంలో బయటపడసాగింది. అంతలో మూల గదిలో నిద్రపోతున్న సీతమ్మగారు లేవనే లేచారు.

"ఇంక నీ గారమెక్కడ సాగుతుందే తల్లీ ? మీ అమ్మ అనుకొన్నావా ఏమిటి ?" అని సణుగుతూ లేచింది. అంతలో శాంత వచ్చింది. "రామ్మా ! సుగుణా ! అలా ఏడుస్తారా ఎవరైనా ? నాన్నగారు కోప్పడుతారు. లే .... అన్నం పెడ తాను." అంటూ సుగుణ చెయ్యి పట్టుకొని తీసికెళ్లబోయింది. "నాకొద్దు పో !" అని విసిరికొట్టింది సుగుణ. "రా అమ్మా ! నా తల్లి కదూ ? మా సుగుణ చాల మంచిది. అసలు ఏడవనే

ఏడవదు. చెప్పినమాట వింటుంది,'' అంటూ పూరడించ బోయింది. ఆ మంకుపిల్ల మరీ బిగుసుకుపోయింది.

''శాంతా ! అన్నం వడ్డించావా ?'' సుందరంగారు కేక వేశారు పైనుండి.

''వెళ్ళు తల్లీ ! నీ మొగుడికి అన్నం పెట్టు. దానికి నేను పెడతానులే. నాకు తప్పుతుందా ?'' అంటూ వచ్చింది సీతమ్మగారు. శాంత మనస్సు చివుక్కుమంది. ఏమీ అనలేక భర్తకు అన్నం వడ్డించడానికి వెళ్ళింది. మరో రోజు వరకు సుగుణ శాంత దగ్గరకు వెళ్ళనేలేదు.

ఆరోజు బారసాలకు రమ్మని ఎవరో పేరంటానికి పిలిచారు. సుగుణను తీసుకొని బయలుదేరింది శాంత. హాలులో అడుగు పెట్టగానే పేరంటాళ్ళ అందరి దృష్టులు ఆమె మీదనే పడ్డాయి. కొంతమంది పైనుండి క్రింది వరకు చూడడం మొదలుపెట్టారు. ఏదో తప్పు చేసినట్లుగా ముడుచుకు పోయింది శాంత. సుగుణ చెయ్యి పట్టుకొని నెమ్మదిగా ఒక మూలకు వెళ్ళి కూర్చుంది. పేరంటానికి పిలిచినావిడ ఒకసారి వచ్చి పలుకరించి ''ఇప్పుడే వస్తానమ్మా ! లోపల కొద్దిగా పని ఉన్నది'' అంటూ వెళ్ళిపోయింది. శాంతకు అందరూ క్రొత్త. పేరంటాళ్ళు అందరూ ఇద్దరు, ముగ్గురు చేరి కబుర్లలో పడ్డారు. శాంతకు ఏమి చేయడానికి తోచక ముళ్ళ మీద కూర్చునట్లు ఉన్నది.

''అమూల ఆకుపచ్చ చీర కట్టుకొని కూర్చున్నావిడేనా సుందరంగారి పెళ్ళాం ?'' ఆ ప్రక్కనుండి నెమ్మదిగా ఎవరో అడుగుతున్న ప్రశ్న వినిపించింది.

''ఇన్నాళ్ళూ చూడలేదేమిటి ? ఆవిడే సుందరంగారి భార్య.'' మరొకామె సమాధాన మిచ్చింది.

''పిల్లల్ని యెలా చూస్తుందట ? .... ఆఁ .... ఎంతైనా సవతి తల్లి కదూ ?'' ప్రశ్నించి తనే సమాధానం చెప్పుకొంది మొదటావిడ. ''అంతేలే !'' అన్నది రెండవ ఆమె. వాళ్ళు గుసగుసలుగా మాట్లాడినా అన్నీ శాంతకు విన్పిస్తూనే ఉన్నాయి. ఒక్కొక్కమాట ఆమె హృదయంలో ములుకులా గ్రుచ్చుకొంటోంది.

''ఆవిడ అలా అందరికి దూరంగాపోయి కూర్చున్నదేమో? లక్షాధికారి పెళ్ళాన్ననికాబోలు!'' ఎవరో ఒక సామాన్య కుటుంబీకురాలు తన అక్కసు వెళ్ళగ్రక్కింది.

''ఔనౌను. ముసలి మొగుణ్ణిచూచి మురిసి పోతున్నది ఇంటికి యెవరువెళ్ళినా మాట్లాడదట.'' అన్నది మరో పేరంటాలు. ఇక వినలేకపోయింది శాంత. అక్కడ ఒక్కనిముషం ఉండ బుద్ధికాలేదు. కాని పేరంటం పూర్తికానిదేవెళ్తే బాగుండదు. ప్రక్కనచూస్తే సుగుణలేదు. పిల్లలతో ఆడుకోనువెళ్ళినట్లున్నది. శాంత నెమ్మదిగా లేచి లోపలిగదిలోకి వెళ్ళింది ఇంటావిడ కనిపిస్తుందేమోనని. అక్కడ గదులలోకూడా పేరంటాళ్ళు కూర్చొని ఉన్నారు. నెమ్మదిగా వెళ్తున్న శాంతకు ప్రక్కగదిలో నుండి తననుగురించిన మాటలే విన్పించడంతో ఆగిపోయింది. ''ఏమే, సుగుణా ! మీ అమ్మ బాగాచూస్తుందా మిమ్మల్ని ?'' అని యెవరో సుగుణను ప్రశ్నిస్తున్నారు.

''బాగా చూడ్డమేమిటి ? అందరూ చూచినట్లే చూస్తుంది.'' అంటున్నది అమాయకురాలైన ఆ చిన్నపిల్ల. ''అయ్యో ! పిచ్చిపిల్లా ! ! ఇంత అమాయకురాలివైతే సవితి తల్లితో యేలా వేగుతావే నాతల్లీ!'' ప్రశ్నించి నావిడ కంగారుతో కూడిన గొంతుతో విన్పించింది.

''మీ అమ్మ అప్పచ్చులు అవీ చేసిపెడుతుందా ?.... ఎప్పుడైనా కొడుతూ ఉంటుందేమిటే మీ అమ్మ....?'' కౌతుకంతో అడిగింది మరోగొంతు.

''మా అమ్మ యెప్పుడూ కొట్టలేదు. ఎందుకూ కొట్టడం ?'' అంటూ తిరిగి ప్రశ్నించింది సుగుణ. ఆ పేరంటాళ్ళు నోళ్ళు నొక్కుకుంటున్నారు కాబోలు మళ్ళీ వాళ్ళమాటలు విన్పించలేదు.

ఏమీ తెలియని అమాయకురాలైన చిన్నపిల్ల హృదయంలో విషం నింపుతున్నారు. ఇదే ఆలోచిస్తోంది శాంత. ఆమె మనస్సు వేదనతో కుమిలిపోయింది. ఇంకా ఆచిన్నపిల్ల మనస్సు యేమి విరిచేస్తారో ? సవతితల్లి అంటే రాక్షసిఅనే అభిప్రాయం ఆపిల్లమనస్సులో హత్తుతారుకాబోలు. ఆ ఆలోచనరాగానే చటుక్కున ఆ గదిలో ప్రవేశించింది శాంత. అక్కడున్న సువాసినుల ముఖాలు క్షణకాలం వెలవెల బోయాయి. కాని మరుక్షణంలోనే ఒకామె తేరుకొని ''రామ్మా, రా! మీ అమ్మరాలేదా అని అడుగుతున్నాను సుగుణను. సావిట్లో కూర్చున్నావా ?'' అంది. శాంత తెల్లబోయింది. ఆమె యెవరో శాంతకంతగా పరిచయంలేదు. సుగుణ, మరో అమ్మాయి చెట్టాపట్టాలు వేసుకొని వెళ్ళిపోయారు అక్కడినుండి. శాంతను పలుకరించినావిడ ''శాంతన్రా ! అలా చూస్తారేమిటి ? సీతమ్మగారి కోడలు.'' అంటూ మిగతావారికి పరిచయంచేసింది.

''రామ్మా ! శాంతా ! ఇంకా నీకు క్రొత్తకదూ ? ఎవరూ తెలియదనుకొంటాను. ఈవిడ నారాయణగారి పెళ్ళాం, అదిగో ఆవిడ మీయింటికి రెండిళ్ళ యివతలఉన్న చంద్రయ్యగారి కోడలు.'' అంటూ అందర్నీ పరిచయం చేసింది. శాంతమాట్లాడకుండా కూర్చుంది.

''అదేమిటమ్మా ! అలా సిగ్గుపడతావు. నన్ను మర్చిపోయావేమిటి ? కాంతమ్మ పిన్నినే నేను.'' అంటూ తనను పరిచయంచేసుకొంది. శాంత బుర్ర ఊపింది. ఆ కాంతమ్మ పిన్నిగారు చాలాసేపు ఆ కబుర్లు యీ కబుర్లుచెప్పి చివరికి అన్నది.

''మీ అత్తగారు బాగా చూస్తారా ?.... ఆవిడో కోపిష్ఠి. మీ సవతిని అలాగే రాచి రంపాన్నిపెట్టేది. పిల్లలెలా ఉంటున్నారు?

వాళ్ళు గయ్యాళి పిల్లలమ్మా ! పీక్కుతినేస్తారు. పిచపతే మెతక దానివి. ఎలా వేగుతున్నావో యేమో ఈ వయస్సులో మొగుడితో చిలకా గోరింకల్లా తిరగాల్సింది.'' ఆవిడ బడబడా వాగేస్తోంది.

శాంత నెమ్మదిగా అన్నది. ''పిల్లలు రత్నాలండి ! వాళ్ళతో కాలం సరదాగా గడచిపోతోంది.'' కాంతమ్మగారు మూతి మూడు వంకర్లుతిప్పింది.

''ఇంకా క్రొత్తకదూ ? అలాగే ఉంటారు. మరో నాల్గు రోజులుపోనీ, యీ కాంతమ్మపిన్ని చెప్పినమాట నిజమోకాదో నీకే తెలుస్తుంది.'' ఆవిడ సవాలుచేసినట్లుగా మాట్లాడింది. ఆమె మాటల ధోరణి చూస్తుంటే శాంతకు అసహ్యమనిపించింది. పేరంటం పూర్తయ్యి శాంత బయలుదేరివచ్చేవరకు కాంతమ్మగారు అలావాగుతూనే ఉన్నది.

*　　　*　　　*

నాలుగు నెలలు గడచిపోయాయి. మధ్య యిలా యిరుగు పొరుగులనే మాటలు, పిల్లల్ని సవతితల్లి సరిగా చూడదేమోనని అత్తగారు సీతమ్మగారు తీసుకొనే జాగ్రత్తలు శాంత మనస్సును బాధపెట్టేవి. సవతి తల్లి అంటే ఉండే సాధారణమైన అభిప్రాయం వలన అందరూ యిలా ప్రవర్తిస్తున్నారని, రోజులు జరిగేకొలది అర్థం చేసుకొంటారులే అని సరిపెట్టుకునేది శాంత.

సంక్రాంతి దగ్గరకు వచ్చింది. కూతుర్ని, అల్లుడ్ని పండుగకు పిల్చుకు వెళ్ళడానికి శాంత తల్లిదండ్రులు వచ్చారు. పనులు ఎక్కువగా ఉండడం వలన సుందరంగారు పండుగ రేపు ఉన్నదనగా వస్తామని అన్నారు. శాంత ఒక్కతే బయల్దేరింది. తనతో సుగుణను పంపమని అడిగింది కాని, సీతమ్మగారు అభ్యంతరం చెప్పారు. ''నీవు వెళ్లిరా అమ్మా ! సూర్యం, చంద్రం దాన్ని విడిచి ఉండలేరు. ఐనా అది లేకపోతే అసలు సందడే ఉండదు.'' అన్నదామె. ఇక శాంత ఒక్కతే వెళ్లింది.

శాంత అక్కగారు అన్నపూర్ణ కూడ పండుగకు పుట్టింటికి వచ్చింది. అక్కతోను, చెల్లెళ్ళు, తమ్ముడుతో శాంతకు చాలా సరదాగా గడిచిపోతోంది కాలం. రెండు రోజుల తర్వాత అన్నపూర్ణ చెల్లిని నెమ్మదిగా కదలవేసింది. ''ఏమే, శాంతా ! మీ ఆయన బాగా చూస్తారా నిన్ను ?'' అంటూ. శాంత సిగ్గుగా తల వూపింది.

''మీ అత్తగారు నోటి దురుసు మనిషి అని విన్నాను. నిజమేనా ? నీతో ఎలా ఉంటుంది ?'' రెండవ ప్రశ్న వేసింది అన్నపూర్ణ.

''అబ్బ ! ఈ ప్రశ్న లేమిటే ? ఎవరు చెప్పారు నీకు అలాగని ?'' చికాకుగా ప్రశ్నించింది శాంత.

''అంత చిరాకేమిటే నీకు ? చెల్లిని ఆమాత్రం అడగ కూడదా ? నీ మంచి చెడ్డ లేమిటో తెలిసికొందామని అడుగుతున్నాను. ప్రొద్దుట లేచిన దానివి రాత్రి అందరి భోజనాలు అయ్యే వరకు వంచిన నడుం యెత్తడానికే వీలుండదట. అమ్మ చెప్పింది. ఏం పనంతా నీవే చేయాలా ? మీ అత్తగారు సాయం చెయ్యదా ? లేకపోతే ఒక వంటమనిషిని పెట్టుకోక పోయినారా ?'' గడగడా అడిగివేసింది అన్నపూర్ణ. శాంత మాట్లాడలేదు.

''మొగపిల్లలిద్దరు మొగం తిప్పుకొనే ఉంటారుట నీ గాలే పడనట్లు ?'' అంతలో శాంత తల్లి వచ్చింది. ''దాని సంగతి, దాని అత్తవారి సంగతి యేమి చెప్పమంటావే ? వద్దండీ అంటే వినకుండా గొప్పింటి సంబంధం. కూతురు సుఖపడుతుంది అంటూ చేశారు మీనాన్న యీ రెండవ పెళ్లి సంబంధము. ఒక అచ్చటా, ముచ్చటా ? ఇంటిల్లపాదిచాకిరీ అదే చెయ్యాలి. ఆ యింటిని చూచి మురిసిపోవాలి. మళ్లీ ఆ దివాణంలో చాకిరి చెయ్యడానికి ఒక్క నౌకరు లేడు.'' ఒక్కసారి గుక్కతిప్పుకోవడానికి ఆగిందామె. ఏదో వినరాని మాటలు వింటున్నట్టు వింతగా ముఖంపెట్టి వింటున్నది అన్నపూర్ణ.

''ఇక పిల్లలంటావా ? .... పెద్దపిల్లలిద్దరు నాలి ముచ్చులు .... చిన్నపిల్లేమో .... దానంత పేచీకోరుపిల్ల మరొకతె ఉండనే ఉండదు. పనిలో ఉండి ఒక్క నిముషం తాళవే అమ్మా అంటే గొంతెత్తుతుంది. అత్తగారు కొంప మునిగిపోయినట్లు ఏమిటే అంటూ పరుగెత్తుకొస్తుంది.'' తల్లి వరుస చూచి శాంతకు చిరాకెత్తింది.

''చిన్నపిల్లలన్న తరువాత ఏడవకుండా ఉంటారా అమ్మా ? అందులోనూ చిన్నప్పటినుండి గారాబంగా పెరిగిందాయె. ఇంక సూర్యం, చంద్రం అంటావా ? వాళ్ళు మొగపిల్లలు. ఎప్పుడూ బయట తిరుగుతూ ఉంటారు. ఇంకా నా దగ్గర చనువు ఏర్పడలేదు.'' అన్నది.

అన్నపూర్ణ విస్తుపోయి చూచింది చెల్లివంక. ''ఎన్ని కబుర్లు నేర్చావే శాంతా ! అత్తవారిమీద ఈగ వాలనివ్వడం లేదు. నీకూ పిల్లలు పుట్టనీ ! నీ పిల్లలనీ ఇంత గారాబం చేస్తారో లేదో చూస్తాను.'' సవాలు చేసినట్లు మాట్లాడింది అన్నపూర్ణ. శాంతకు ఒళ్ళు మండింది. తనకు రెండవ పెళ్లివాణ్ణి చేసినప్పు డేమయ్యింది ? తనకీ పెళ్లి వద్దన్నప్పుడు అనునయించిన కబుర్లన్నీ ఏమయ్యాయి? అప్పుడీ ఆలోచనలన్నీ రాలేదా వీళ్లకు ? జరిగిన్న దానితో తృప్తి పడ్తుంటే యీరోజు తన మనస్సులో విషబీజాలు నాటుతా రెందుకు ?'' అనుకొన్నది మనస్సులో. వికలమైన మనస్సుతో నెమ్మదిగా అక్కడినుండి లేచింది.

''అక్కడికి వెళ్లి ఇదింత దద్దమ్మగా తయారయ్యిందేమే! ఇదీ, దీనికి పుట్టబోయే పిల్లలూ ఆ యింటిలో నౌకర్లలా బ్రతకవలసిందే''. సానుభూతితో తల్లి అంటున్న మాటలు వినిపించాయి వెనుకనుండి. శాంత ఒక్క నిట్టూర్పు విడిచింది.

సవతి తల్లి

పండుగకు వచ్చి మూడు రోజులుండి వెళ్లిపోయారు సుందరంగారు. ఆ మరునాడు శాంత స్నేహితురాలు లలిత వచ్చింది, శాంతను చూడడానికి. ఆమె కళ్లల్లో ఏదో జాలి ప్రకటితమవుతోంది. ఎందుకో అర్థంకాలేదు శాంతకు.

"శాంతా! మీ ఆయన్ని చూపించకుండానే పంపేశావు?" అన్నది లలిత.

శాంత నవ్వి "వారికి చాల పనులున్నాయి లలితా, ఆయన లేకపోతే యింటిదగ్గర చాల అవస్థ అవుతుంది" అన్నది.

లలిత నిట్టూర్చింది. "క్రొత్త అల్లుడు. పెద్ద పండుగకు వచ్చి పదిరోజులు అత్తవారి ఇంటిదగ్గ రుండడానికే తీరికలేకపోయింది. ఎన్నెన్ని కలలు కన్నావు శాంతా! నీ ఆశలన్నీ కూలిపోయాయి. మొన్న మీవారు, మీ నాన్నగారు అలా కలసి వెళ్తూంటే చూశాను. దాదాపు మీ నాన్న వయస్సు ఉంటుందికదూ?" ఆ గొంతులో జాలే ప్రస్ఫుట మవుతోందో, కుతూహలమో అర్థంకాలేదు.

"నాన్నకంటె చిన్నవారే" అన్నది శాంత నెమ్మదిగా.

కాని లలిత శాంత మాటను తేలికగా కొట్టి పారవేసింది. "ఎంత చిన్న అయితే మాత్రం, ఆయనకు ఎలా లేదన్నా నలభై సంవత్సరాలు ఉంటాయనుకొంటాను. పాపం! నిన్ను చూస్తూంటే జాలేస్తుంది శాంతా! నీ అందానికి, తెలివికి తగిన వరుడేనా ఆయన?" లలిత సానుభూతిగా పలికింది.

"అలా అనకు లలితా! ఆయన వయస్సులో కొద్దిగా పెద్ద కాని హృదయం చాల మంచిది. ఎప్పుడూ నేనెక్కడ బాధపడతానో అని నన్ను ఒక కంట చూచుకొంటూ ఉంటారు. అది నా అదృష్టమే!"

లలిత ఆశ్చర్యంగా చూచింది. "నీ వెర్రి చెప్పు శాంతా! రెండో పెళ్లి రెండో పెళ్లే. నీవేమిటో చెప్తున్నావుగాని ముసలి వాళ్లకు కోపం యెక్కువంటారు. మన స్నేహితురాళ్లలో నీ అదృష్టమే ఇలా అయ్యింది." అన్నది జాలిగా.

శాంత మనస్సు కలుక్కుమన్నది. ఆమెకు కోపం కూడ వచ్చింది. తనకు వద్దంటున్నా పిల్లంతా సానుభూతి చూపిస్తారెందుకు? మనుష్యుల్ని అర్థం చేసుకోకుండా మాట్లాడుతారు. తానంటె తన భర్త లెక్కచెయ్యడనీ, ఎప్పుడూ కోపంగా, చిరాకుగా ఉంటాడనీ, అతనికంటె ఒక నల్లరాతిని కట్టుకొంటే తాను సుఖపడి ఉండేదాననని ఒకప్పుడు విచారించిన లలితేనా యీరోజు తనను చూచి సానుభూతి చూపిస్తున్నది? తనకేం లోటని తన అదృష్టం మాసిపోయిందనుకోవాలి?" శాంత కోపంగా మనస్సులో తర్కించుకొంటోంది.

"నీకు ముగ్గురు పిల్లలట కదూ? మీ పెద్దబ్బాయికే పదహారు సంవత్సరాలు ఉంటాయట? ఏం బ్రతుకు నీది? పెళ్లితోనే ముగ్గురు పిల్లలు. మరో ఐదారు సంవత్సరాలు పోతే నాయనమ్మ వవుతా వనుకుంటాను" లలిత సానుభూతిగా నవ్వింది. ఇది వినేసరికి శాంత మనస్సులో ఎక్కడో మురుక్కుమన్నది. తానేదైతే మర్చిపోవా లనుకొంటున్నదో అవన్నీ వీళ్లు భూతద్దంలో పెట్టి మరీ చూపిస్తున్నారు. తా నొద్దంటున్నా బలవంతాన చూపిస్తున్నారు. ఛీ! .... ఛీ!! .... ఏం మనుష్యులు!!! ఇక్కడుంటే తన మనస్సు విరిచేస్తారు. ఇక్కడినుండి త్వరగా పారిపోవాలి.

"ఏమిటే శాంతా, దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" లలిత ప్రశ్నతో యీ లోకంలో కొచ్చింది శాంత.

"ఆఁ.... ఏంలేదు. పోనీగాని నీ సంగతులు చెప్పు వింటాను. మీవా రొచ్చారా పండుగకు?" అంటూ మాట మార్చింది శాంత.

మరో వారం రోజులలో పట్టుబట్టి శాంత అత్తవారి ఇంటికి తిరిగి వచ్చింది. పండుగకు శాంతకు నెక్లెస్ చేయించి యివ్వాలనుకున్నారు సుందరంగారు. నెక్లెస్ చెయ్యమని కంసాలికి పురమాయించారు కూడాను. కాని పనుల వత్తిడి వల్ల కంసాలి పండుగకు వస్తువు అందివ్వలేకపోయాడు. శాంత తిరిగి వచ్చిన రెండు రోజులకు నెక్లెస్ తీసుకొని వచ్చారు సుందరంగారు. ముచ్చటగా ఉన్న ఆ నెక్లెస్ చూడగానే శాంత ముఖం విప్పారింది. విప్పారిన ఆమె ముఖం చూడగానే సుందరంగారి మనస్సు తేలికయినట్లయింది. తనవల్ల సుఖంలేదని శాంత అసంతృప్తి పడుతుందేమోనని ఎప్పుడూ ఆయన మథనపడుతూ ఉంటారు. అందుకే సాధ్యమైనంత వరకు ఆమెను సంతోషపర్చాలని ఆయన ప్రయత్నం.

సీతమ్మగారు నెక్లెస్ చూడగానే ముఖం ముడుచుకొన్నది. "సుగుణకు కూడ ఒకటి చేయించలేక పోయినావురా నాయనా?" అని ప్రశ్నించింది కొడుకును.

"అప్పుడే దానికి అంత పెద్ద వస్తువులు యెందుకు, యెక్కడో జారపెడుతుంది." అని ముక్తసరిగా అని అక్కడి నుండి వెళ్లిపోయారు సుందరంగారు.

"పడుచు పెళ్లాం మాయలో పడ్డాడు" అంటూ మనస్సులో గొణుక్కుంటూ లేచింది సీతమ్మగారు.

మరునాడు బడికి వెళ్తూ నెక్లెస్ పెట్టమని పట్టుబట్టింది సుగుణ. ఆటల్లో ఎక్కడైనా పడవేస్తుందేమోనని సందేహించింది శాంత.

"దాని గొంతు ఎండిపోయేలా యేడుస్తూంటే రాయిలా అలా కూర్చుంటావేమే. సరదా పడుతోంది. పోనీ, కొంతసేపు పెట్టమనే ఆలోచన లేకపోయిందా నీకు?" అని అత్తగారు కేకలేసింది. శాంత మాట్లాడకుండా వెళ్లి బీరువా తెరిచి నెక్లెస్ తీసి సుగుణ మెడలో పెట్టింది. గంతులు వేసుకొంటూ బడికి వెళ్లింది సుగుణ. నెక్లెస్ చూచి పిల్లలంతా తన చుట్టూ

చేరడం చూస్తే సుగుణకు ఎంతో గొప్పగా ఉంది. ఇక రోజూ నెక్లెస్ పెట్టనిదే బడికి వెళ్ళేది కాదు.

ఆరోజు ఆటల్లో దొంగ అయిన అమ్మాయి సుగుణను ఔట్ చెయ్యడానికి నెక్లెస్ పట్టుకు లాగింది. బలంగా లాగ డంతో అది పుటుక్కు మన్నది. అది తెలియగానే శాంత హృదయం కలుక్కుమంది. సుగుణమీద పట్టలేనంత కోపం వచ్చింది.

''చెప్పినమాట వినిపించుకొంటేనా .... ?'' అన్నది. వచ్చిన కోపాన్ని బలవంతాన అణచుకొంటూ. సుగుణ బిక్క మొఖం పెట్టింది.

''సరేలే ! చిన్నపిల్ల, దానిని కోప్పడుతా వెందుకు ? కంసాలి కిస్తే సరి, రేపు తెచ్చిపెడ్తాడు'' అని అత్తగారు అందుకొంది.

ఈ సంగతి సుందరంగారి చెవుల పడగానే ఆయన ఉగ్రు డయ్యారు.

''నీకు బుద్ధి ఉండొద్దు శాంతా ! చిన్నపిల్లకు నెక్లెస్ పెట్టమని ఎవరు చెప్పారు ?'' కళ్ళెర్రచేసుకొని అడిగారు. శాంత ఆయన కోపం ఎప్పుడూ చూడలేదు. ఆమె గుండె దడదడ లాడింది.

''సుగుణ కావాలని ఏడుస్తుంటే ..... '' అంటూ నాన్చేసింది.

''అఘోరించలేకపోయినావు. ఏడిస్తే పెట్టాలా, అయినా పెట్టుకొనే రాతుండొద్దూ నీ ముఖానికి ?'' అన్నారు కోపంగా. ఎవరి సంతోషం కొరకైతే ఆ వస్తువు చేయిం చారో ఆమెనే మాటలతో నొప్పిస్తున్నాననే జ్ఞానం లేక పోయింది ఆయనకు ఆ కోపంలో. శాంతకు ఉప్పొంగి వచ్చింది ఏడుపు. అసలే తాను ఒక్కసారి కూడ పెట్టుకోకుండా తెగి పోయిందని శాంత బాధపడ్తోంది. దానికి తోడు తప్పంతా తనదే అన్నట్లు సుందరంగారి కేకలు. వచ్చే యేడ్పును దిగ మ్రింగుకొంటూ నెమ్మదిగా అక్కడినుండి తప్పుకొంది.

ఆమె మనస్సు వికలమైంది. తనకు బంగారపు వస్తు వులు పెట్టుకొనే రాత లేదంటే తన తల్లిగారి పేదతనాన్ని వ్రేలెత్తి చూపినట్లేనా ? ఔను ..... తన తండ్రి ఉన్నవాడే అయితే యీరోజు ఇది జరుగకపోయి ఉండేది. చెయ్యని నేరా నికి తిట్లుతినే అవసరమూ ఉండేది కాదు. ఛీ.... ఛీ ..... అందరూ తనను తిట్టేవారే. శాంత మనస్సులో కల్లోలం బయలుదేరింది. ఓదార్చేవారు లేరు. మంచివా రనుకొన్న తన భర్త కూడ యిట్టే కోపం తెచ్చుకొంటారు. ''నీవెన్ని చెప్పు. ముసలివారికి కోపం ఎక్కువంటారు.'' లలిత అన్న మాటలు చటుక్కున జ్ఞాపకం వచ్చాయి. ఆ క్షణంలో నిజమే ననిపిం చింది శాంతకు. ఒక్కసారి భళ్ళున శబ్ద మయ్యింది. కూర గాయలు తరుగుతూ ఆలోచనలతో కొట్టుకొంటున్న శాంత ఉలిక్కిపడి తలయెత్తి చూచింది. పొయ్యిమీద పెట్టిన పాల కుండ పదహారు ముక్కలయ్యింది. కుండెడు పాలూ నేల పాలయ్యాయి. దాని కంతటికి కారణమైన పిల్లి నేలపాలైన పాలను త్రాగుతోంది. శాంత నిస్సహాయంగా చూస్తూ ఉండి పోయింది.

''అయ్యయ్యో ! పాలకుండ ముక్కలయ్యిందేమె. అంత మరీ పరధ్యానమైతే యెలా ? ఇక ఈ సంసారం బాగుపడి నట్లే ! ఏదో చిన్న వస్తువు తెగిందని యింక అదే తల్చు కుంటూ బాధపడితే అయినట్లే'' నాలుగు చివాట్లు పెట్టింది అత్తగారు. శాంత మాట్లాడకుండా లేచి పెంకులూ పాలు ఎత్తి అవతల పోసింది. ''మీ అత్తగారు కోపిష్ఠి, ఎలా వేగు తావో ఏమో'' కాంతమ్మగారి మాటలు చెవిలో మారుమ్రోగు తున్నాయి. జరుగుతున్న సంఘటనలతో ఆమె హృదయం ఒక్కొక్కటిగా బీటలువారుతోంది. ఆమె నెమ్మదిగా తన మనస్సును సమాధాన పర్చుకొంది.

మరునాడు ఆదివారం. పిల్లలు ముగ్గురూ కలసి భోజ నానికి కూర్చున్నారు. చివరిలో ''పెరుగు పొయ్యమ్మా !'' అన్నది సుగుణ.

''ఈరోజు పెరుగు లేదమ్మా. పాలకుండను పిల్లి తన్నేసింది. ఈ రోజుకి కూర వేసుకు తిను. ఇంకొంచెం కూర వెయ్యనా ?'' అన్నది శాంత.

''ఊహూఁ, నాకు పెరుగే కావాలి. ఇంకేం వద్దు.'' కంచం నెట్టేసింది సుగుణ. ఏంచెయ్యాలో తోచలేదు శాంతకు.

''పెరుగు లేదని అమ్మ చెప్తుంటే ఆ అల్లరేమిటే సుగుణా ! ఉన్నప్పుడు అక్కర్లేదంటావు. లేదన్నప్పుడు కావాలి. తప్పు కదూ ? కూర వేసుకు తిను.'' సూర్యం చెల్లిని మందలించాడు. సుగుణ కోపంగా కంచం దగ్గర నుండి లేచి వెళ్ళిపోయింది. చంద్రానికీ కష్టంగానే ఉన్నది. అతనికి పెరుగంటే యిష్టం. నెమ్మదిగా చారు పోసుకుని తిని లేచాడు. శాంతకు బాధ కల్గింది. ఏం చెయ్యలేక ఊరు కుంది.

''చుట్టాలు వచ్చారు. కొంచెం మజ్జిగ ఉంటే పొయ్యి సీతమ్మ వదినా'' అంటూ వచ్చింది కాంతమ్మగారు.

''అయ్యో ! ఈరోజు మజ్జిగలేదు పిన్నిగారూ. పిల్ల లకు కూడా లేకుండా పోయింది. నిన్న పాలన్నీ పిల్లి తన పొట్టన పెట్టుకొంది.'' శాంత చెప్పింది.

''మీ అత్తగారు పడుకొన్న దేమిటి ? అయితే వస్తా నమ్మా !'' కాంతమ్మగారు ముఖం నల్లగా మాడ్చుకొని అన్నది. ''ఏదీ, సీతమ్మ వదిన. ఒకసారి పలుకరించిపోతాను.'' అంటూ లోపలకు వెళ్లింది.

ఆ రాత్రి ఎనిమిదయ్యేసరికి పిల్లలు అన్నాలు తిన్న తరువాత పనులు ముగించుకొని వచ్చి నడుం వాల్చింది శాంత. ఇంకా సుందరంగారు ఇంటికి రాలేదు. జరిగిన సంఘటనలు

సవతి తల్లి

తల్చుకొని బాధపడుతోంది ఆమె. ప్రక్కనున్న పిల్లల చదువు కొనే గదిలో నుండి మాటలు వినిపించాయి.

"చంద్రం ! ఇలారా !" అని పిలుస్తున్నాడు సూర్యం. చంద్రం దగ్గరకు వచ్చినట్లున్నాడు. "సాయంత్రం ఏమిటిరా చెల్లికి చెప్తున్నావు ?" సూర్యం ప్రశ్నించాడు.

"ఏసంగతన్నయ్యా ! చెల్లికేమి చెప్తున్నాను ?" చంద్రం అడిగాడు అర్థంకాక.

"అమ్మను గురించి ఏమిటో చెప్తున్నావుకదూ ?" సూర్యం ప్రశ్న. చంద్రానికి అర్థమైనట్లున్నది అన్న అడిగేది. "ఏంలేదన్నయ్యా" అంటూ తప్పించుకోబోయాడు. ఈ మాటలు విన్న శాంత కుతూహలం ఎక్కువైంది. చెవులు రిక్కించుక్కొని వినసాగింది.

"అలా ముఖం తప్పించుకొంటావేంరా ! అమ్మను "అమ్మ" అని పిలవవద్దని చెప్తున్నావు కదూ ?" కాస్త కోపంగా వినిపించింది సూర్యం గొంతు. ఒక్కసారి శాంత గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. "ఏమిటి తాను వింటున్నది. తనను "అమ్మా !" అని పిలవడం యిష్టంలేదా చంద్రానికి.

"ఔనన్నయ్యా ! అమ్మలా చూడకపోతే అమ్మని పిలవడం ఎందుకు ? మధ్యాహ్నం చెల్లి పెరుగు కావాలంటే పోసిందా ?" చంద్రం ఎదురు తిరిగి ప్రశ్నించాడు.

"వెధవా ! నీకు పుట్టిన బుద్దేనా యిది ?' పెరుగు లేకపోతే అమ్మేం చేస్తుంది. పాలు పిల్లి తన్నేసిందని చెప్ప లేదూ ? ఏమీ తెలియని చెల్లికి వెధవ బుద్ధులన్నీ నేర్పుతున్నావా ?" కోపంగా మందలించాడు సూర్యం.

"మన అమ్మ ఎప్పుడైనా యిలా లేదని చెప్పిందా అన్నయ్యా ! మొన్న మాత్రం సుగుణ నెక్లెస్ తెంచిందని పెంకెపిల్లవంటూ తిట్టలేదూ ? మన అమ్మ ఎప్పుడూ నాకు తల దువ్వి బడికి పంపేదికదా, యీ అమ్మ ఎప్పుడైనా అలా చేసిందా ?"

ఇవన్నీ వినేసరికి సూర్యానికి అసహనం కల్గినట్లుంది. "చాల్లే, చేసిన పొరపాటు చాలక యింకా కబుర్లు చెబుతున్నావు. "అమ్మా ! నాకు తల దువ్వ" ని ఎప్పుడైనా అమ్మ దగ్గరకు వెళ్లావా ? అమ్మ క్రొత్తగా వచ్చింది కదా, యివన్నీ ఎలా తెలుస్తాయి. తను పిల్చినా దూరం దూరంగా ఉంటావు. ఇంకా తల దువ్వదు అంటూ నెపం వేస్తున్నావు. అయినా ఎవ్రరా నీ కివన్నీ చెప్పిపెట్టింది ?" కోపంగా ప్రశ్నించాడు సూర్యం.

చంద్రం నెమ్మదిగా సమాధానం చెప్పాడు "నాకేం తెలుసు. మధ్యాహ్నం కాంతమ్మ అవ్వగారు అంటున్నారు." శాంత యిక పై మాటలు వినలేదు. ఆమెకు అంతా అర్థమయ్యింది. "మధ్యాహ్నం మజ్జిగంటూ వచ్చి చంద్రాని కివన్నీ చెప్పిపెట్టిందన్నమాట. పిల్లల హృదయాల్లో కూడ విష బీజాలు నాటాయి. చెప్పినవన్నీ నమ్మే స్వభావం చిన్నపిల్లలది. ఇక వాళ్ళు కూడ తనను పరాయి మనిషిగా చూస్తే తన జీవిత మేమిటి ?" శాంత కంటినుండి కన్నీరు కాల్వలు కట్టాయి.

"శాంతా ! అన్నం వడ్డించు." సుందరంగారు ఎప్పుడు వచ్చారో, ఆయన పిలుపుతో ఉలిక్కిపడి కళ్ళు తుడుచుకొని లేచింది.

* * * *

మరో రెండు సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. ఇప్పుడు శాంతకు ఒక కొడుకు. వాడితో మరి కొంచెం పని ఎక్కువయ్యింది శాంతకు.

అప్పటివరకు వంటలో సతమతమవుతున్న శాంత గుక్కపెట్టి ఏడుస్తున్న పిల్లవాణ్ణి లేవదీసి పాలు పట్టిస్తోంది. అంతలో సుగుణ వచ్చింది. "అమ్మా ! అన్నం పెట్టమ్మా !" అంటూ. "ఒక్క నిముషం ఉండు సుగుణా ! తమ్ముడికి పాలు పట్టించి వస్తాను." అన్నది శాంత.

ఒక క్షణం వూరుకొని "త్వరగా రా అమ్మా ! నాకు ఆకలి మండిపోతోంది." సుగుణ మళ్లీ మొదలుపెట్టింది.

"కొంతసేపు ఆగమన్నాను కదమ్మా ! తమ్ముడు పాల కోసం ఒక్కటే ఏడుస్తున్నాడు. ఆకలేసి."

"వాడి కస్తమానం పాలే. నాకూ ఆకలేస్తోంది. నాకు పెట్టేసి వెళ్ళు." కొంచెం గారం, మరికొంత మొండితనం మిళాయించి గునిసింది సుగుణ. శాంత అసలే పిల్లవాడి యేడ్పుతో, పనుల వత్తిడిలో విసుగెత్తి ఉంది.

"అంత ఆకలేస్తుంటే గొడవ చెయ్యక వెళ్లి పెట్టుకు తినరాదూ ?"

సుగుణ మొండికెత్తి కూర్చుంది. "నువ్వే పెట్టు."

"అయితే, ఆగు వచ్చి పెడ్తాను" శాంత పిల్లవాడికి పాలు పట్టడంలో నిమగ్నమయింది.

"ఇప్పుడే పెట్టు. నాకు ఆకలేస్తోంది." అంటూ క్రింద చతికిలపడింది సుగుణ రాగంతీస్తూ. శాంతకు చిర్రెత్తు కొచ్చింది.

"అబ్బబ్బ ! నా ప్రాణాలు తీస్తున్నావు. వెధవా ! నీకూ ఇప్పుడే కావాలా పాలూ ?"

శాంత పిల్లాడిని మంచంమీద పడేసి లేచింది. 'లే తల్లీ! నీకు అన్నం పెడ్తాను"

పిల్లవాడు మళ్లీ గుక్కపెట్టి ఏడ్వడం మొదలు పెట్టాడు.

అంతలో సుందరంగారు వచ్చారు. "శాంతా ! వాడలా ఏడుస్తుంటే లేవదీయరాదూ ? వినిపిస్తోందా లేదా ?" అని కేక వేశారు.

''నాకు నాల్గు చేతుల్లేవు'' విసుగ్గా గొణుక్కుంది శాంత.

రోజులు జరుగుతున్నాయి. రానురాను సుగుణ పెంకె తనము పెరుగుతోంది. దానికి నాయనమ్మగారి మద్దత్తు ఉన్నది. శాంతకు అసహనం ఎక్కువవుతోంది. ఆరోజు సుగుణ బడినుండి వచ్చిన మరో అరగంటలో సుగుణతో చదువు కొనే మరో అమ్మాయి లక్ష్మి వచ్చింది.

''సుగుణ లోపల ఉన్నట్లున్నది, వెళ్ళు లక్ష్మీ !'' అన్నది శాంత.

మరో పది నిముషాలలో ఆపిల్ల లిద్దరూ పోట్లాడు కుంటున్న సవ్వడి వినిపించింది శాంతకు. చేస్తున్న పని నిలిపి వెళ్లింది. లక్ష్మి ఏడవడానికి సిద్ధంగా ఉన్నది.

''నీవు నాకేం యివ్వలేదు. ఎవరికిచ్చావో వెళ్లి అడుగు'' అని అంటున్నది సుగుణ.

''ఏమిటమ్మా ! మీ రిద్దరు పోట్లాడుకొంటున్నారు ? ఏమయ్యిందేమిటి ?'' అని అడిగింది శాంత నవ్వుతూ.

''చూడండి పిన్నిగారూ, సుగుణ నా పెన్ను ఎత్తు కొచ్చింది. అడుగుతుంటే లేదంటుంది.'' అని ఫిర్యాదు చేసింది లక్ష్మి. దొంగతనం అనేసరికి శాంత ముఖంలో నవ్వు మాయ మయింది. సాయంత్రం బడినుండి వచ్చిన తరువాత సుగుణ చేతిలో పెన్ను తనూ చూచింది. అది చంద్రదండో, సూర్యండో అయిఉంటుం దనుకొన్నది తాను. సుగుణ దొంగిలించిందే గాక అబద్ధం కూడా చెప్తోందా ?

''సుగుణా ! లక్ష్మికి పెన్ను యిచ్చేసెయ్యి.'' అన్నది కొంచెం తీవ్రంగా.

''నేనేం తియ్యలేదు. వెళ్లి కమల నడుగు. నాకేం తెలుసు.'' సుగుణ పెంకెగా జవాబు చెప్పింది. లక్ష్మి బిక్క మొఖం పెట్టింది. ''కమల తియ్యలేదట. నీవు తీశావన్నది'' అన్నది ఏడుపు గొంతుతో లక్ష్మి.

ఆరోజు బడిలో ఆపిల్ల లిద్దరికి ఆటల్లో పోట్లాట వచ్చింది. లక్ష్మి సుగుణను బాగ ఏడ్పించింది. ఆ ఉక్రోషంలో సుగుణ ఆపిల్ల పెన్ను ఎత్తుకొచ్చింది. ఆ కోపం ఇంకా పోలేదు.

సుగుణ పెన్ను తీసే తీయలేదని చెప్తూఉంటే శాంతకు కోపంవచ్చింది. చిన్నపిల్లల తప్పుల్ని యెప్పటికప్పుడు సరి దిద్దితేగాని వాళ్లకు మంచి అలవాట్లు ఏర్పడవు. అయినా మరో అమ్మాయి ముందు దండిస్తే ఆ పిల్లల అభిమానం దెబ్బతింటుంది. శాంత యిదే ఆలోచనతో ''నీవు వెళ్లమ్మా ! సుగుణ దగ్గరనుండి తీసుకొని నేను తరువాత యిస్తానులే'' అన్నది లక్ష్మితో. ఆ అమ్మాయి ఏడుపుమొఖంతో వెళ్లి పోయింది.

''సుగుణా ! అలా క్లాసుపిల్లల పెన్నులు ఎత్తుకు రావటం తప్పుకదూ ? ఎక్కడ పెట్టావో తెచ్చి యిచ్చెయి'' అన్నది అనునయంగా.

''నేనేం తియ్యలేదు. నాకేం తెలియదు.'' అన్నది సుగుణ మొండిగా. ఆపిల్ల అలా మాటిమాటికీ అబద్ధాలు చెప్తూఉంటే శాంతకు వెర్రి కోపం వచ్చింది.

''దొంగతనం చేసింది చాలక అబద్ధాలు కూడానా ? నీవు పెన్ను తెస్తుంటే నేను చూశాను. నీవు ఆ పెట్టెమీదలే. నేను నీ పెట్టె చూస్తాను'' అంటూ శాంత ముందు వచ్చింది. ఇక దానితో సుగుణకు ఏమి చేయాలో తోచలేదు.

''నేను తియ్యలేదు. నాకేం తెలియదు.'' అంటూ రాగం తీస్తూ లేచింది. శాంత పెట్టె తెరిచేసరికి యిక గంతు లెయ్యడం మొదలుపెట్టింది. ఆ కోపంతో చేతికి దొరికిన వస్తువును అందుకొని గిరవాటు వెయ్యడం మొదలుపెట్టింది. అక్కడే ఉన్న పౌడరు డబ్బా విసిరేసరికి అప్పుడే తప్పటడు గులు వేస్తూ వస్తున్న కృష్ణుడికి తగిలింది. వాడా దెబ్బకు క్రిందపడి గుక్కపెట్టి ఏడవడం మొదలుపెట్టాడు. బట్టల అడుగున ఉన్న పెన్ను బయటకు తీస్తున్నది శాంత అప్పుడే. ఆమెకు పిచ్చి కోపం వచ్చింది. గబగబా వచ్చి సుగుణను వీపుమీద నాలుగు వాయించింది. ''మరీ పెంకిపిల్లవైపోయావు. ఎవరి భయం లేకుండా పోయింది.''

ఆ దెబ్బలతో సుగుణ ఒక్కసారి యిల్లు ఎగిరిపోయేలా గొంతెత్తింది. ఆ ఏడుపు వింటూనే పరుగెత్తుకొచ్చింది సీతమ్మగారు. ''అయ్యయ్యో ! తల్లిలేని పిల్లను పట్టుకొని చితక తంతున్నావు. దాన్ని చంపేస్తావేమిటే ?'' అంటూ. నాయనమ్మను చూడగానే సుగుణకు ఇంకా కట్టలు తెంచుకు వచ్చింది యేడుపు. ఆవిడను పట్టుకొని ఒక్కసారి బావురు మన్నది.

''అత్తయ్యా ! మీ రుండండి. మీరు మరీ గారాం నేర్పేస్తున్నారు. అన్నీ చెడ్డ అలవాట్లు నేర్చుకొంటున్నది'' అన్నది శాంత సుగుణవంక కోపంగా చూస్తూ.

సీతమ్మగారు ఉగ్రురాలైపోయింది. ''చిన్నపిల్ల తెలి యక ఏమైనా చేస్తే దాన్ని చచ్చేట్లు కొడతావా ?''

''అది కాదు అత్తయ్యా ! ఇప్పుడు దండించకపోతే అవే అలవాట్లు పెద్దయినా ఉండిపోతాయి. వాళ్ల క్లాసుపిల్ల ....' అంటూ శాంత చెప్పబోయేసరికి ''చాల్లే తల్లీ ! నీ పిల్లలికి కూర్చుంటే ఒకటి నుంచుంటే ఒకటి తగల్పిస్తూ మంచి అలవాట్లు నేర్పు. దీన్ని ఇలా ఏడవనీ ....!'' అంటూ సీతమ్మ గారు సుగుణను తీసుకొని వెళ్లిపోయింది. ఆ మాటలు కొర డాతో వీపుమీద కొట్టినట్లు తగిలాయి శాంతకు.

''తల్లిలేని పిల్ల !'' వెక్కిరించినట్లు వినిపించింది. ''భార్యలేని సుందరంగారికి ఆ లోటు తీర్చేందుకు వచ్చింది కాని, తల్లిలేని పిల్లలకు అమ్మగా రాలేదు. వాళ్ళ తప్పు చేస్తున్నా దండించే అర్హత తనకు లేదు. తాను వాళ్లకు తల్లి కాదు. .... సవతి తల్లి. ఛీ ! .... ఛీ ! ఏమి సంఘం ? ఏమి మనుష్యులు ? రేపు యీ చెడు బుద్ధులే చిలవలు పలవలు

వేస్తే దానికి నిందించేది తననే. ఏమి బ్రతుకు ? శాంత హృదయం బాధతో కుమిలిపోసాగింది. కృష్ణుడు ఇంకా క్రింద పడి వెక్కుతున్నాడు. ఆ చంటివాడి ఏడుపు గాని, వాడికి తగిలిన దెబ్బగాని సీతమ్మగారికి కన్పించలేదు. వాడికి అమ్మ ఉంది. ఆమె మరొకళ్లకు సవతి తల్లి. అందుకే పాపం వాడి ఆలనా పాలనా ఆమెకు అవసరం లేకపోయింది.

రోజులు చాల నిస్సారంగా గడిచిపోతున్నాయి శాంతకు. ఆమె కిప్పుడు ఎవరి మంచి చెడ్డలు అవసరంలేదు. తన వంటేమో, తన పిల్లవాడేమో .... ఇదే ఆమె పనులు. ఎవరైనా కావాలన్నవి అమర్చిపెడ్తుంది. సీతమ్మగారు ఒకసారి కాంతమ్మగ్గారితో అంటున్న మాటలు శాంత చెవిని పడ్డాయి. "ఏం చేస్తాం ! వాళ్ల కర్మ కొద్దీ వాళ్ల అమ్మ చచ్చింది. ఈవిడొచ్చింది. దాని కొడుకేమో, అదేమో. వీళ్ళు ఉంటున్నారో, చస్తున్నారో దాని కవసరం లేదు. ముసిలిదాన్ని. వీళ్ల బాధలన్నీ చూస్తూ నేను పడిఉన్నాను."

సహనానికైనా ఒక హద్దు ఉన్నది. ఏ తీగైనా సాగదీస్తే సాగుతుంది. మరీ లాగితే పుటుక్కుమంటుంది. అదే అయ్యింది. శాంత సహనం చచ్చిపోయింది. "అవును. వాళ్ల అవసరాలు నాకేం పట్టింది ? నేనేం వాళ్ల తల్లిని కనుకనా ? సవతి తల్లిని ! సవతి-తల్లి ఎలా ఉంటుందో మీకు తెలుసుగా? ఇంకా ఎందుకు చెప్పుకోవడం ?" తన బాధనంతా ఆ మాటల్లో కక్కేసింది. సీతమ్మగారు నిర్ఘాంతపోయి అలా చూస్తూ ఉండిపోయింది కొంతసేపు.

"అంతవరకూ వచ్చేవుటే నీవు ? ఎంత బరితెగించిపోయేవే ?" సీతమ్మగారు తెప్పరిల్లి నోరు నొక్కుకోసాగింది. కాంతమ్మగారు నెమ్మదిగా అక్కడనుండి తప్పుకొన్నది. శాంత ఇంకా రెచ్చిపోయింది. "ఈ కొంపలో మంచిగా ఉన్నవాళ్లకి రోజులు గడవవు. ఎదుటివాళ్లను బట్టి మనుషులు మారుతూ ఉండాలి. ఇక నేను మడికట్టుకు కూర్చుంటే ఈ ఇంట్లో బ్రతగ్గలనా ?" అత్తగారి గొంతుకకు రెట్టింపు గొంతుతో సమాధానమిచ్చింది.

అంతలోనే సుగుణ కృష్ణుడి చొక్కా పట్టుకొని "ఛల్, ఛల్ ! నడవరా నడు." అంటూ ఏడుస్తున్న వాడిని కర్రతో ఝళిపిస్తూ నడిపించుకొస్తూంది. శాంతకు మండిపోయింది.

"వాడిని చూస్తుంటే నీకు కొట్ట బుద్ధేస్తుందా యేం ? ఎప్పుడూ వాడి ప్రాణానికి పడి ఏడుస్తావు ?" అంటూ ఆ పిల్ల చేతిలోని కర్ర అందుకొని రెండు తగలనిచ్చింది. సుగుణ ఆ దెబ్బతో బావురుమన్నది. ఆపిల్ల లిద్దరి యేడ్పుతో, సీతమ్మగారి కేకలతో ఇల్లు మారుమ్రోగిపోయింది.

* * *

ఈనాడు ఆ ఇంటిలోని వాతావరణం పూర్తిగా మారిపోయింది. సీతమ్మగారు పక్షవాతంతో మంచాన పడింది. గొంతెండిపోతోంది. కాస్త మంచినీళ్ళు పొయ్యండీ ! అంటే పలికేవాళ్ళు లేరు. "వచ్చేవరకు ఆగలేరూ ? ఇక్కడ ఖాళీగా కూర్చున్నానా ఏమిటి ?" అని సమాధాన మిస్తుంది శాంత. ఆమె ఉగ్రరూపం చూచి నోరెత్తలేదు సుందరంగారు. సవతి తల్లిని చూచి తల వంచుకొని వెళ్లిపోతాడు సూర్యం. అసలామె ఛాయలకే రాడు చంద్రం. సవతి తల్లిని చూచి వణికిపోతుంది సుగుణ. ఇప్పు డామెకు నోరు విప్పి మాట్లాడడానికి భయం.

తల్లిలేని పిల్లలకు "అమ్మ" కావాలనుకొన్నది శాంత. కాని పరిసరాలు, మనుష్యులు ఆమెను "సవతి తల్లి" ని చేశాయి.

కృష్ణమాచార్యుడు

శ్రీ వి. ఆనందమూర్తి

శిఖా యజ్ఞోపవీతము, కటిసూత్రము, కాషాయవస్త్రము ధరించి, లలాటమున తిరుమణి తిరుచూర్ణములు తీర్చి, దండెయు చిటితాళంబులును సంధించుకొని, ఘుమ ఘుమ ధ్వనులు మ్రోయగా దండెమీటుచు తాళ మ్రుగ్గ ళింపుచు, పంచమ వేదశ్రుతులను చాతుర్లక్ష సంకీర్తన వాక్పు జలుగా గానముచేసి, సింహాద్రి నారసింహుని పరవశింపజేసిన పరమ భక్తుడు కృష్ణమాచార్యుడు.

ఈతని కాలము కాకతీయ చక్రవర్తియైన రెండవ ప్రతాపరుద్రునకు సమకాలమని, ఏకశిలా నగర వృత్తాంతము, ప్రతాప చరిత్రము మున్నగు గ్రంథములనుబట్టి తెలియుచున్నది. అనగా క్రీ. శ. పదమూడవ శతాబ్ది తుది భాగమన్నమాట. ప్రభువు లీ భక్త సుకవిని మెచ్చి, సన్మానింపగా నా సన్మానములను కూడ నీతడు స్వామికే యర్పించుకొని నాడట. అట్టి ఈ మహనీయుని జీవిత వాహిని తొలుత కొన్ని యొడుదుడుకులకు లోనైనను కొందరు భాగవతోత్తముల సంసర్గమున పవిత్రీకృతమై సరళమగు భక్తిమార్గముల బ్రవహించి ప్రవహించి, తుదకు దయా సముద్రుడగు పరమ పురుషుని చేరుకొనినట్లు తెలియుచున్నది.[1]

ఈ పుణ్యాత్ముడు విక్రుతినామ[2] సంవత్సరమున (1290 A. D.) దక్షిణ భారతమందలి సంతూరు[3] అను గ్రామమున ఒక వైష్ణవ కుటుంబమున నవతరించెను. వ్యతీపాత యోగంబున పుట్టుకతోడనే అంధుడై జన్మించినాడను నెపమున జననీ జనకులు దయమాలి యా పిల్లవాని నొక పాడుపడిన కూపమున బడవేసిపోయిరి. అప్పుడు నృసింహస్వామియే కుమార నాముడగు నొక సన్యాసి రూపమునవచ్చి, వానిని వెలికిదీసి కాపాడి యొక మఠమునందిడి కొంతకాలము సంరక్షించెను. ఆపిదప సింహాచలమునకు చేర్పించెను. సింహాచలమున నుండగా ఒకతూరి స్వామివారే తమ కభిషేకించిన క్షీరము నొక బాలుని రూపమున వచ్చి కృష్ణమాచార్యుని కిచ్చివెళ్లెను. వాని నారగించి కనుల కద్దుకొనుటతో నా బాలుడగు కృష్ణమాచార్యునకు పోయిన కనులు వచ్చినవి. ఆ రాత్రియే స్వప్నమున స్వామి వరాహరూపమున ప్రత్యక్షమై, తన సన్నిధిని చాతుర్లక్ష సంకీర్తన వాక్పుజలు గావింపుమని యాదేశించెను. ఆ యాదేశానుసార మెందరో మహానుభావులవలెనే బాలుడగు కృష్ణమాచార్యుడును తన పదునారవయేట సంకీర్తన రచన కారంభించెను. ఆ శుభ ప్రారంభము పరాభవనామ సంవత్సర ఆషాఢశుద్ధ ద్వాదశినాడు జరిగినది.[4] అనగా 24—6—1306 A. D.

---

1. కృష్ణమాచార్యుని చరిత్రోదంతములు స్వీయ చరిత్రాత్మకములైన యాతని వచన సంకీర్తనములనుబట్టియే కొంత కొంత గుర్తింపనగుచున్నది. కాని, యట్టి సంకీర్తన ప్రతులన్నిటియందువలెకాక, తంజావూరు సరస్వతీ మహలు పుస్తక భండాగారమందలి 'విష్ణునామ సంకీర్తన ఫలము (సంఖ్య 448) అను వచన సంకీర్తన సంచయమున నీతని వృత్తాంతము సమగ్రముగా లిఖింపబడియున్నది. దాని ననుసరించియే పూజ్యులు శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు అతని జీవిత వృత్తాంతమును 'కృష్ణమాచార్యులు—ఆంధ్ర ప్రదేశము' అను వ్యాసమున గొంత వివరించియున్నారు (చూ. ఆంధ్ర ప్రదేశ అవతరణ సంచిక—వేంకట్రామా అండ్ కో—పుటలు 151—154.)

2. నా కడనున్న ఒకతాళపత్ర ప్రతిలో నీతని జననము 'తారణనామ సంవత్సర భాద్రపద మాసంబున కృష్ణపక్షము గురువారము' అనియున్నది. అనగా క్రీ. శ. 1284 ఆగస్టు 31 గాని, సెప్టెంబరు 7 గాని కాదగును. కాని, ఈ ప్రతి తప్పుల తడికెలుగా నున్నందున నీ తేది సరియైనది కాక పోవచ్చును. విక్రుతి (1290 A. D.) యే జన్మ సంవత్సరమై యుండును.

3. సంతూరను గ్రామము తిరునల్వేలి జిల్లాలో నొకటి కలదు. ఉత్తరార్కాడు కంగుండి డివిజనునందు కూడ నీ గ్రామమొకటి కలదని శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు వ్రాసిరి. వీనిలో నేదేని యాతని జన్మస్థానమై యుండవచ్చును—నాకడనున్న ప్రతిలో సంతూరు—సంతనపురమను పేరున వ్యవహరింపబడినది.

4. కృష్ణమాచార్యుడు 'శఠకోప మౌనివేదంబు తెనుగు గావించి సంసార ఖేదంబు' మాన్పినాడు. వింతయే మన ఆ ద్రావిడ ప్రబంధకర్తయగు శఠకోపయతియు, పదునారవ యేటనే ప్రజ్ఞాపూర్ణులై, దివ్య ప్రబంధ రచన సాగించిరి. దాని ననువదించిన ఈ కృష్ణమాచార్యుడును, పిదప 15 వ శతాబ్దిలో తాళ్లపాక అన్నమాచార్యుడును ఇట్లే పదునారవ యేటనే సంకీర్తన రచన కారంభించుట విశేషము.

కృష్ణమాచార్యుడు

తదుపరి కొంతకాలమునకు తన మేనమామయగు శ్రీ రంగాచార్యులు స్వామి యనుగ్రహమున నీ యువకుని గుర్తించి కూతునిచ్చి వివాహము చేయించెను. పెండ్లికి స్వామివారు కూడ వేంచేసిరి. చల్లగా కొంతకాలము సంసారము సాగెను. వారి సాంసారిక సౌఖ్య ఫలముగా పిదప వారి కొక కుమారుడు కూడ కలిగెను. కాని, దురదృష్టమున నేడవ యేటనే ఆ కుమారుడు పరమపదించెను. భగవల్లీలలేమోగాని అప్పైన కృష్ణమాచార్యుడు ఒకప్రక్కను కీర్తన వాఙ్మ్యాజులు గావించుచునే వేశ్యాలోలుడుగా నుండుచుండెను. ఇట్లుండగా నొక సందర్భమున సంకీర్తన రచయిత యనియు, పరమ భక్తుడనియు ప్రఖ్యాతిగాంచిన ఈ కృష్ణమాచార్యుని దర్శనార్థమై పొతకమూరిలోని భాగవతులును, అహోబలేశుని నాట్య వినోదులునైన సోదరు (నారాయణయ్య, ఓబళయ్య, అచ్యుతయ్య, అనంతయ్య, లక్ష్మయ్య, చెన్నమయ్యంగారు—అనువార) లార్గురు సుదూరము ప్రయాణించి సింహాచలము చేరుకొనిరి. వారా యూర కృష్ణమాచార్యుని తిరుమాళిగె కొరకు వెదకికొనుచు, కాకతాళీయముగ వేశ్యాలోలుడై మోహనాంగి యను వారకాంతతో వినోదించుచుండిన కృష్ణమాచార్యునే దరిసి గుర్తింపజాలక వివరము లడిగిరి. ఆ పుణ్యాత్ముడు పదునొకొండవ యవతారమనియు, బహుదూరము దర్శింపవచ్చినామనియు చెప్పికొనిరి. ఆ పొతకమూరి సోదరులు పరమ భాగవతులనియు, వారు పటము పన్నించి పాడగా స్వామివా రానందించెడివారనియు కృష్ణమాచార్యుడు వారినిగూర్చి వినియేయుండెను. ఇప్పుడు వారి రాక తన్నుగూర్చియేయని తెలిసికొనెను. అట్టి యుత్తములు, భక్తులు అంతదూరమునుండి తననుగూర్చి ఘనముగా నెంచి, దర్శనార్థ మరుదెంచుటయు, తాను మాత్రము తేనెలో బడిన ఈగ విధమున నీ దుస్థితిలో నుండుటయు దలచుకొని పశ్చాత్తప్తుడై, మనసు మార్చుకొని తెలివిం బొందెను. కాని, తత్కాలమునకు తనయున్న యునికి వెల్లడి కానీయక శ్రీవారి తిరుమాళిగ చూపింతును రండని తానే మరియొక తావునకు వెళ్ళి తలయు, మీసములు బోడించుకొని, విరాగి వేషమూని పరమ భక్తాగ్ర గణ్యుడగు కృష్ణమాచార్యుడుగా సాక్షాత్కరించెను. పొతకమూరి భాగవతులు దండప్రణామములాచరించిరి. కాని, కొంతవడికి తాము పూర్వము చూచిన శృంగార పురుషుని యాకృతి విశేషమే వీరిలోను దృగ్గోచరమగుటను గుర్తించి ఆ భాగవతులు తామేదో యపచారము గావించినట్లుగా భావించి, భయాందోళనలకు పాల్పడిరి. పదునొకండవ ఘనవతారమని ప్రసిద్ధిగాంచిన యా మహనీయుని శృంగార లీలలకు తాము తెలియక నంతరాయము కల్గించినామని తట తట దవడలు వాయించుకొని అపచారము మన్నింప వేడికొనిరి. దానితో కృష్ణమాచార్యుని పని యుక్కిరిబిక్కిరై పోయినది. వారి కారణముననే తనలో వైరాగ్య ప్రవృత్తి కలిగినదనియు, తానంతటి యోగ్యుడు కాడనియు, కృష్ణమాచార్యుడు భాగవతులతో చెప్పుకొనెను. పిదప పరస్పర మొకరి నొకరు సంభావించుకొనిరి. పటము పన్నించి యహోబలేశుని యాడించెడి పొతకమూరి భాగవతుల నాట్య వినోదమును కృష్ణమాచార్యుడును, కృష్ణమాచార్యుని సంకీర్తనములందలి సౌందర్యమును పొతకమూరి భాగవతులును దర్శించియు, వినియు పరస్పర మానందించిరి. ఆ యానందమున నక్కడి స్వామి కూడ పసివాడై పాలుపంచుకొనెను. పటము పన్నించి పాడిన పొతకమూరి అన్నల పాటలను విని యానందించుటకై నృసింహ స్వామియే బాలుడై యచటికి వచ్చిచేరెను. పిదప కృష్ణమాచార్యు లాలపింపగా నా బాలు డానంద తాండవ మొనరించెను. ఇట్లు వారివారి గానములకు జొక్కి యాడిన బాలుడే పరమపద నివాసుడని యెరింగి, యాతని పరవశింపజేసిన ఖ్యాతి భాగవతులదని, కృష్ణమాచార్యుడును, కృష్ణమాచార్యునిదని భాగవతులును పరస్పరము సంభాషించుకొనిరి. అప్పటికి కృష్ణమాచార్యుడు చాతుర్లక్ష సంకీర్తనములలో లక్షా యేబదివే లింకను వ్రాయవలసి యున్నట్లు వారితో చెప్పుకొనెను. అవియు, తరువాత కృష్ణమాచార్యుడు పూర్తి గావించియే యుండును. వానిన్నిటిని కృష్ణమాచార్యుడు పాడుచుండగా బాలుడై వచ్చిన స్వామియే ఘంటము పుచ్చుకొని వ్రాసెడివాడట! ఆ కీర్తనములన్నియు నా కాలముననే రాగి రేకులమీద కెక్కినట్లు కూడ వార్త మనకు మిగిలియున్నది. వాని కొక భండాగారము కూడ సింహాచలమున నుండినట్లు తెలియుచున్నది. ఆ భండాగారపు రేకులు కావు సరిగదా మన దురదృష్టమున సంకీర్తనములలో వందయైనను తిన్నగా మనకు మిగులలేదు. అదియు శాపఫలితమని సింహాచల క్షేత్రమునకు సంబంధించి కొన్ని కథ లున్నవి. ఏమైనను భక్తి సంకీర్తనములను బాడుకొనుచు, మహిమల నెన్నో ప్రదర్శించుచు, నీ మహనీయుడు బహుకాలము సింహాచలమందును, కొంత కాల మోరుగల్లు శ్రీరంగములందును జీవయాత్ర సాగించె ననవచ్చును. ఆంధ్ర దేశమందలి వైష్ణవ పుణ్యక్షేత్రముల నన్నిటిని దర్శించినట్లు కూడ నతడే తన వచనములందు పేర్కొన్నాడు.

ఆంధ్రదేశమున వచన రచనకు, భజన సంకీర్తన పద్ధతులకు పరమాచార్యుడు, ప్రపితామహుడు నయినవాడు మన మెరిగినంతలో నీ కృష్ణమాచార్యుడే. 'ఓం నమో నారాయణా! అనియు, 'నమో నమో లక్ష్మీ వల్లభా' అనియు, 'అనాథపతి సింహగిరి, నరహరి నమోనమో దయానిధీ' అనియు, ' మా యతి రామానుజముని వరందాతారు కృష్ణ కువ్వారస్వామి సింహగిరి నరహరి నమో నమో దయానిధీ' అనియు 'పరబ్రహ్మ సింహగిరి నరహరీ నమో నమో దయానిధీ' అనియు మకుటములుగా స్వామివారి యనంత నామ గుణ కథలను వచన భావంబున నీతడు విన్నపము సేయుచుండెడివాడు. ఈ విధమున కృష్ణమాచార్యుడు పాడుకొన్న వచన సంకీర్తనములలో విన్నపములుగాను, చూర్ణికలుగాను గుర్తింపదగినవి కొన్నిమాత్రమే మనకు లభించినవి. వానినే కృష్ణమాచార్యుడు ధ్యాన సంకీర్త

---

5. పొతకమూరు నెల్లూరుజిల్లా దర్శి డివిజను నందున్నది.

నములనియు (ధ్యాన సంకీర్తనము' అనుటకే దోస సంకీర్తనములని కొన్ని తాళపత్ర ప్రతులందు భ్రష్ట రూపము కానవచ్చుచున్నది) నామ సంకీర్తనములనియు, వేదాంత సంకీర్తనములనియు కొన్ని కొన్ని వర్గములుగా విభజించుకొనినాడు. పదునైదు పదునారు శతాబ్దులలో వెలసిన తాళ్లపాక కవీశ్వరులు , ఈ కృష్ణమాచార్యునే తమకు మార్గ దర్శకుడుగను, తాళబంధ చ్ఛందో విరహితమై, చూర్ణాఖ్యం బరగునట్టి పద రచనలకు పరికల్పకుడుగను పేర్కొనినారు. ఆ తీరు రచనలకేకాక ఇటీవలి నా పరిశీలనమున తాళమున కొదుగుననవియు, భజన సంకీర్తనములనదగినవియు నయిన వీరి రచనలు మరికొన్ని లభించిన కారణమున 'తెలుగు దేశమున భజన సంకీర్తన పద్ధతులకు కృష్ణమాచార్యుడే ప్రపితామహుడని పేర్కొననగుచున్నది.

కృష్ణమాచార్యుని కృతులలో నేటికి లభ్యములైనవి నాలు గైదు వరకున్నవి. వానిలో మొదటిది ప్రసిద్ధమైనది—

1. వచన సంకీర్తనములు:—కృష్ణమాచార్య శ్రీ వచన సంకీర్తనములను నాలుగు లక్షలకుపైగా రచించినట్లు ప్రసిద్ధి. వీనినే ఆతడు వచనములనియు, విన్నపములనియు, సంకీర్తనములనియు, సింహగిరి నరహరి వచనము లనియు, నామ సంకీర్తనములనియు, వేదాంత సంకీర్తనలనియు, ధ్యాన సంకీర్తనలనియు పలు దెరగుల పేర్కొనినాడు. వీనిని గూర్చియే కావచ్చును 'సంకీర్తన లక్షణ' కారులగు తాళ్లపాకవారు చూర్ణాఖ్య పదములను వివరించుచు

క. ధరఁ గృష్ణాచార్యాదిక
పరికల్పిత పదము తాళబంధచ్ఛందో
విరహితమై చూర్ణాఖ్యం
బరగు, నది నిరుక్తనామ భాసితమగుచున్,

మరియుం దచ్చూర్ణ విధం బెట్టి దనిన,

క. ఛందో గణముల నియతిం
బొందక తాళ ప్రమాణమునఁ గడుఁజెలువై
కొందరిచేఁ దచ్చూర్ణం
బందముగాఁ దాళగంధియనఁ బొగడొందున్''

అని పేర్కొనినారు. వారి లక్షణము ననుసరించి కృష్ణమాచార్యాదులు పరికల్పించిన చూర్ణపదము నిరుక్త నామ భాసితమై, తాళబంధ చ్ఛందో విరహితమై యొప్పునట్లు తెలియుచున్నది, కాని, తచ్చూర్ణికలే తాళ ప్రమాణమున గడుజెలువై యందముగా తాళగంధి యని కూడ బొగడొందునని వారే యందు వివరించినారు. కృష్ణమాచార్యుడును దండెయు చిటితాళంబులు సంధించుకొని, పాతకమూరి భాగవతుల సన్నిధిని నారాయణుని నామ గుణ కథలను ఘమ ఘమ ధ్వనులు మ్రోయగా దండె మీటుచు, తాళముగ్గడించుచు, వచన భావంబున విన్నపము గావించినట్లు చెప్పుకొన్నాడు. కావున నితని వచనములును, తాళగంధి చూర్ణములే యనదగును. ఇందు తాళము మాత్రమేకాదు, యనుక గమకాంత్యాను. ప్రాసాది శబ్దాలంకారములు, ఛందోగంధము, చిత్తమా! మనసా! జయ విజయీభవ! మున్నగు సంబుద్ధులు, గీతమును దలపించు గురు ప్లుత స్వరములు ప్రతి చరణాంతమున బాడదగు పల్లవిని బోలిన పాద నిర్మాణము మొదలగు నంశము లన్నియు నీ వచన సంకీర్తనములందలి గేయాంశమునే వెల్లడించుచున్నవి. మచ్చున కీ వచన భాగములు చూడుడు!

''ఒకపరి మిమ్ము నెరుంగుదుమయ్యా
ఒక పరి మిమ్ము నెరుంగమయ్యా
జ్ఞానిని చేయుమయా—అ
జ్ఞానిని చేయకుమయ్యా''
పుణ్యంబిది పాపంబిది—స్వర్గంబిది నరకంబిది
అనాచారమిది యాచారంబిది—నిషేధ మిది యనిషేధం
బిది......''

ఈ వచనము చక్కగా తాళమున కొదిగి గీతమువలె నున్నది.

''విష్ణుభక్తి లేని విద్వాంసుని కంటెను
హరి కీర్తనముసేయు నతడె కులజుండు
శ్వపచుడైననేమి—ఏవర్ణంబైననేమి
ద్విజునికంటె నతడె కులజుండు ద్రిష్టించి చూడంగ
విద్వజ్జనీ వైభవ్య భూషణము
సింహగిరి నరహరి దలంచిన యతడె కులజుండు''

''దేవా! తనువులు మాయ. తలపోసి తలపోసి చెప్పేకంటె వా కర కరల మోహ మిది. ఆశల పాషండంబిది. అతుకుల జల్లెడ యిది. తమ బ్రదుకులకొరకు పోరాడి పోరాడి యొరుల చెరిచెడి దుర్గంధపు డొంక ఇది......ఇది నాటకములాడేటి బూటకపు బొమ్మ—అమ్మమ్మా! ఈ బొమ్మ వృత్తములనెంచి చూచెద నంటినా గామై, గ్రామ సూకరమై, చండ పిల్లియై, పిల్లినోటి ఎలుకై, పూతై, పూతలాను మీనై.....''

''దేవా! ఆకలి యని యెడి తెవులు, ఇంటింటికి ద్రిప్పు. సత్య సుకృతమె యుప్పు. తనువు ధర్మమున నడిపినదే యొప్పు. అనాథపతి సింహగిరి మిమ్ము దలంపనిదే తప్పు.''

ఇత్యాది వచనములలో కొంత కొంత ఛందోబంధము, శబ్దాలంకారాదులు కాననగుచున్నవి.

''అజ్ఞాన జడితకర్మములం దగిలి కలంగకా
సుజ్ఞానివై సింహగిరి నరహరి దగిలి యుండే
సుఖివిగమ్మా—చిత్తమా''

అను నీ వచనమున గురుప్లుత స్వరములు పాటపాడు వైఖరిని దెలుపుచు నందలి గేయాంశమునే చాటుచున్నవి. ఇట్లే 'ఓం న్నమో నరాయణా' అనియు, 'మిమ్ము నెవ్వడు నమ్మినే, ఓం న్నమో నరాయణా' అనియు పదింబదిగా పల్లవి పాటగా వచ్చు

నొక వచనమున విస్పష్టముగా సంకీర్తన సంప్రదాయమే గోచరించుచున్నది. ఇట్లే వచన సంకీర్తనములను పరిశీలించినపుడు రచనా విధానమునందేకాక, భావములందును, భాషయందును కూడ కృష్ణమాచార్యుడు తరువాతి సంకీర్తన కారుల కెట్లు మార్గము మలచినాడో తేట తెల్లము కాగలదు. భక్తిమార్గమున పరమపద నివాసుని పరవశింపజేసిన ఆ జగదుత్తముని వచన సంకీర్తనము లేవియు నేటి దనుక సుపరిష్కృతములై ప్రకటింపబడ లేదు. మద్రాసు, తంజావూరు, తిరుపతులలోని పై సంకీర్తన తాళపత్ర ప్రతులను, నాకడనున్న తాళపత్ర గ్రంథములను సంప్రదించి కృష్ణమాచార్యుని నామధ్యన వేదాంత సంకీర్తనములను నేను లభ్యమైనంతవరకు సేకరించి పరిష్కరించి, అచ్చునకు సిద్ధ పరచియున్నాను. మచ్చునకు కొన్ని చూడుడు.

"దేవా! శ్రీమన్నారాయణ పరబ్రహ్మ స్వరూప! అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా! వేద వేదాంత వేద్యా! పురాణ పురుషోత్తమా! పురందర వంద్యా! దేవా కపట నటక సూత్రధారీ! మాయా వినోద! అగణిత మహిమావతారా! ఆశ్రితజన మందారా! సకల కళ్యాణ గుణోన్నత! సకల జగదంత ర్యామీ! శ్రీ మదయోధ్యాపుర వరాధీశ్వరా! దశరథ రాజ నందన! కౌసల్యా గర్భ శుక్తి ముక్తాఫలా! భరతాగ్రజా! సౌమిత్రమిత్రా! శత్రు వశీకరా! శరణాగత వజ్రపంజరా! కారుణ్య వారాన్నిధీ! భక్తి ముక్తి ఫల ప్రదాయకా! శంఖ చక్ర గదాధరా! కోదండ దీక్షాగురూ! భక్త పరాధీనా! ఇక్ష్వాకు కుల తిలకా! రాక్షస కుల సంహారకా! పక్షీంద్ర వాహన! దేవాదిదేవా! తాటకీ ప్రాణాపహారా! విశ్వామిత్ర యజ్ఞపాలకా! యజ్ఞరక్షకా! యజ్ఞస్వరూపా! యజ్ఞభోక్తా! సర్వ వ్యాపకా! సురనికర సేవితా! అహల్యాశాప విమోచకా! పురహర చాపఖండన! సీతాపతీ! పరశురామ బాహుబల పరాక్రమ హరణా! పితృవాక్య సత్యప్రతిపాలకా! మారీచ మృగవేటకార! చిత్రకూటాద్రి నిలయా! కాకాసుర విదారణా! విరాధ దైత్యహరణా! సుగ్రీవానుగ్రహా! వాలినిగ్రహా! మాల్యవంత ప్రవేశా! లవణాబ్ధి గర్వ హల్లకల్లోలా! విభీషణ స్థాపనాచార్యా! దకిణ సింధురాజ బంధన! దీన రక్షకా! ధూమ్రాక్షా! విరూపాక్షా! అతికాయ! మహాకాయ! రావణ కుంభ కర్ణాది రాక్షసకుల సంహారకా! ఇంద్రజిత్తు తలగుండుగండా! రావణగిరి వజ్రాయుధా! పంక్తి కంధర శిరఃపంక్తి ఖండన! విభీషణ రాజ్య స్థాపనాచార్య! జానకీ ప్రియా! పుష్ప కారూఢ! అనుజ సేవిత! మైథిలీ సమేత! ఆనందమయా! జయ జయ రాఘవేశ్వరా! మా యతి రామానుజముని పరందాతారుసింహగిరి నరహరి నమో నమో దయానిధీ!" ఇది నామసంకీర్తనము.

"దేవా! మీ తిరుమణి తిరుచూర్ణంబులు మేనధరించిన వారికి
సువర్ణాలంకారములు వికారములు.
దేవా! మీ శ్రీపాదతులసియందలి చవి యెరింగిన వారికి
అమృతాదిరుచులు తృణీకారములు.
దేవా! మీ పాద కమల యుగళమున పరిమళ మెరిగినవారికి
చందన ఘనసార పల్లవములు అసహ్యములు.
దేవా! మీ సౌంతర్యములు దరిసించిన కన్నుంగవలకు
ఇతరమైన రూపములు చూడ పాపములు.
దేవా! మీ అసంఖ్యాక పరిమళ కథామృతంబు ఘనతరముగ
గ్రోలిన జనులకు ఇతర కథలు నీరసములు.
దేవా! సర్వగంధా! సకల బాంధవుండవై ఇటువలె నిఖిలేంద్రియభోగ్యమై నన్ను రక్షింపవే అనాథపతి సింహగిరి
నమో నమో దయానిధీ!" ఇది ధ్యాన సంకీర్తనము.

"దేవా! చతుర్వింశతి తత్త్వాత్మకమైనది స్థూల తనువు. పదిహేను తత్వముల కూటమి సూక్ష్మతనువు. ఈ రెండు తనువుల యుత్పత్తి నాశనములకు కారణమైనది కారణ తనువు. ఈ తనుత్రయములం బాపవే పరబ్రహ్మ సింహగిరి నరహరి నమో నమో దయానిధీ!"

"దేవా! తానుగానిదేహమందు తానని దుఃఖపడేది అవిద్యాక్లేశము. దేహాదులందు అభిమానమువలన దుఃఖపడేది అస్మితాక్లేశము. విషయములకోరి దుఃఖపడేది రాగ క్లేశము. విషయములు దొరుకక దుఃఖపడేది ద్వేషక్లేశము. విషయము లందు తగిలి విడువలేక దుఃఖపడేది అభినివేశ క్లేశము. ఈ పంచక్లేశముల జిక్కినొచ్చినాడను. ఈ దుఃఖముల ద్రుంపవే పరబ్రహ్మ సింహగిరి నరహరి నమో నమో దయానిధీ!" ఇవి వేదాంత సంకీర్తనములు.

ఈతని వచన సంకీర్తనము లన్నియు ప్రధానముగా భక్తిని ప్రపంచించునవి. దేవాంతర మంత్రాంతర సాధనాంతరముల వర్జించి వైకుంఠవాసునేనమ్మి, 'నీవే తప్ప నితఃపరం బెరుగ'నని యర్చించుటే యిందలి సందేశము. ఈ వచనము లందరి భాషయు వ్యావహారికమై భక్తి భావము నప్రయత్నముగా నమాయకముగా ప్రదర్శించురీతి నుండును. ఆడుతా, పాడుతా, కుమ్మర సారెవలె తిరుగుతా, మునుగుతా, లేస్తా, అంగడివేశ్య, అంకిలి సేయకు, వరుషంబులు, అరుహముగాదు. చదివినన్నేమి, ఆచరించినన్నేమి, వచీని, కలిగీని, మున్నగు పద ప్రయోగము లీతనివి తరువాతి సంకీర్తన కారుల రచనలందును విరివిగా కానవచ్చుచున్నవి. పదములేకాదు భావములు సైతము తరువాతి కాలపు ప్రబంధ రచయితలును, సంకీర్తన రచయితలును అనుకరించినట్లు తెలియుచున్నది.

"సకల జీవహింసలుచేసి (జంతువుల మేను)లు ఖండించిన లోహమున్ను, వేద శాస్త్ర పురాణంబులువ్రాసే లోహమున్ను పరుసవేది సోకినంతనే సువర్ణంబైనట్లు"

"దేవా! అభ్యసింపరానివి రెండు. ఆచార్య కటాక్షం బొక్కటి. అటుమీద మీ దాసుడౌటొక్కటి"—మున్నగు భావములు ఆముక్తమాల్యద—మాల దాసరి కథలో కానవచ్చుచున్నవి. ఇట్లే

(1) 'శ్రీ వైష్ణవులె పరమ సాధకులు శ్రీ వైష్ణవులె బ్రాహ్మణులు'

(2) 'హరిభక్తిలేని విద్వాంసునికంటెను హరికీర్తనము
సేయు నతండె కులజుండు, శ్వపచుడైనన్నేమి?
ఏ వర్ణంబైననేమి?'

(3) 'దేవా! మీ చరణ యుగళ సేవకు ఏ కులజుం
డైన నేమి?

(4) 'దేవా! పెద్దతనంబుచేసి మిమ్ము మెప్పించేనంటినా
జాంబవంతుండు మీ సన్నిధినే యున్నాడే దేవా
బుద్ధిడినే మెప్పించే నంటినా
విభీషణుడు మీ సన్నిధినే యున్నాడే దేవా
బంటు తనంబున మిమ్ము మెప్పించేనంటినా
హనుమంతుండు మీ సన్నిధినే యున్నాడే దేవా
తీర్థంబులాడి మిమ్ము మెప్పించేనంటినా
గంగా భవాని మీ యంగుష్ఠముననే యున్నదేదేవా!,

ఇత్యాదిగానున్న పలు వచనములలోని భావములు తాళ్లపాకవారి సంకీర్తనములందు బహుధా ప్రస్తుతములైనవి. సామ్యమును పరికింపుడు.

(1) 'అణు రేణు పరిపూర్ణుడైన శ్రీ వల్లభుని
బ్రణుతించువారువో బ్రాహ్మలు॥
హరి నామములనె సంధ్యాది విధు లొనరించు
పరిపూర్ణమతులువో బ్రాహ్మలు
హరిమంత్ర వేద పారాయణులు హరిభక్తి
పరులైనవారువో బ్రాహ్మలు॥ (11—3—151)

(2) 'కొంచెమును ఘనముఁ గనుఁగొననేల హరిఁ దలఁచు
పంచ మహా పాతకుఁడె బ్రాహ్మణోత్తముఁడు॥
వేదములు చదివియును విముఖుడై హరికథలు
నాదరించని సోమయాజి కంటె
ఏదియునులేని కులహీనుడైనను విష్ణు
పాద సేవకుడువో బ్రాహ్మణోత్తముఁడు॥
పరమమగు వేదాంత పఠన దొరికియు సదా
హరిఁ దలఁచలేని సన్యాశికంటె
మరిగి పసురము దినెడి మాలయైనను వాఁడె
పరమాత్ము గొలిచినను బ్రాహ్మణోత్తముఁడు॥'
(11—3—117)

(3) 'ఏకులజుడైననేమి యెవ్వరైననేమి
ఆకడ నాతఁడె హరి నెరిఁగినవాఁడు॥' (5—195)

(4) 'రామ రామ రామ కృష్ణ రాజీవలోచన నీకు
దీమువంటి బంటననే తేజము నాది॥'
వారిధిదాటి మెప్పించ వాయుజుఁ డనేగాను
పారెజవుల మెప్పించ శబరిగాను
బిరాన సీతనిచ్చి మెప్పించ జనకుండగాను
యే రీతి మెప్పింతు నన్ను నెట్లు గాచేవో॥
ఘనమైన మోచి మెప్పించ గరుడుం డనేగాను
కొనగామ సుఖమియ్య గోపికంగాను
వినుతించి మెప్పించ వెయినోళ్ల భోగిగాను
నిను నెట్లు మెప్పింతు ననుగాచే దెట్లో
నవ్వుచు బాడి మెప్పించ నారదుడనేగాను
అవ్వల బ్రాణమియ్య జటాయువుంగాను
యివ్వల శ్రీ వేంకటేశ నీకే ఇటు శరణంటి
అవ్వల నా తెరువేదో రక్షించే దెట్లో

ఇందు తుదియుదాహరణమే తరువాత పట్నం సుబ్రహ్మణ్య అయ్యరువారి 'పరిదాన మిచ్చితే పాలింతువేమో' అను ప్రసిద్ధ మగు బలహరి రాగకృతిగా రూపొందినది.

ఇట్లుగా నానుయోగ్యములగు కృష్ణమాచార్యుని వచన సంకీర్తనములే ఆంధ్రమందలి వచన సంకీర్తన వాఙ్మయ శాఖల కాదికృతులనియు, కృష్ణమాచార్యుడే సంకీర్తన పరమాచార్యు డనియు తేట తెల్లగుచుచున్నది.

2. తులసీ మాహాత్మ్యము :—కృష్ణమాచార్యుని కృతులని తెలియ వచ్చిన వానిలో నీ 'తులసీ మాహాత్మ్య' మింకొక లఘు కృతి. ఏ తన్మాహాత్మ్యమును కృష్ణమాచార్యుడు సంకీర్తన రూప మున రచించెను. ఈవృత్తాంతము మదరాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారమందలి 'శ్రీ కష్ణమాచార్య సంకీర్తనములు' అను 206 సంఖ్యగల తాళపత్ర ప్రతిలో చివరగల 'తులశీ మాహా త్మ్యము' అను గ్రంథ భాగమునుబట్టి తెలియుచున్నది. కృష్ణమాచార్యుడు ఓరుగంటిలో నొక పతివ్రతా గృహంబున కేగిన సమయమున నేకపత్నీ వ్రతుండగు నా ఇంటి యజమాని తమ యాతిథ్యమును గొనుడని వేడగా, కృష్ణమాచార్యుడు బృందావనమును దర్శించిగాని, భుజింపననెను. అప్పు డా బ్రాహ్మ ణుడు బృందావన తులసీ మాహాత్మ్యమును వినిపింపుడని కోరగా కృష్ణమాచార్యు డా గాథను సంకీర్తన రూపమున గానము చేసె నట. ఆయన గానము చేసిన సందర్భమున నా మార్గమున బోవుచుండిన స్త్రీలు ముప్పురిలో నొకామె సంకీర్తన విందమనెనట. రెండవయామె ఆగి, సావధానముగ విందమనెనట. మూడవ యామె 'ఈ సంకీర్తనలకేమి, ఈ మాటలకేమి పోతాము ర'మ్మనెనట. పిదప సంకీర్తన విందమన్న వనిత రాజుకొడుకై జన్మించెనట. ఆగి, విందమన్న వనిత చక్రవర్తిగా జన్మించి సకల భోగము లనుభవించెనట. వలదు పోతాము రమ్మన్న వనిత బహు జన్మలు నందిగా జన్మించెనట. ఈ వృత్తాంతము తులసీ మాహా త్మ్య సంకీర్తన గాథకు ఫలశ్రుతిగా నందీయబడినది. (ఈ ఫల శ్రుతియే కృష్ణమాచార్యుని వచన సంకీర్తనముల తుదను

కృ ష్ణ మా చా ర్యు డు

గూడ కొన్ని తాళపత్రములం దీయబడినది.) ఏమైనను తులసీ మాహాత్మ్యమును వర్ణించు నీ గాథ సుప్రసిద్ధమైనదిగా తోచు చున్నది. ఆంధ్ర వనితల నోములందును, వ్రతములందును ప్రముఖ స్థానమును వహించి భూలోకమందలి కల్పకమని పేర్వడసి ఇంటింట వెలసిన తులసీ మహిమయే ఇందలి ఇతి వృత్తము. తెలుగు దేశమున తులసిమీది పాటలు కూడ కొన్ని గలవు. అందే వేని ఈతని రచనలగునో యేమో!

"నిశి సమయమందు తులశీ దరిసెనము చేసినవారికి శిశుహత్య, స్త్రీహత్య, గోహత్య మొదలైన పాతకంబులు పోవును. తులసికి కంపగట్టి రక్షణ చేసిన వారికి వేయి సంవత్స రంబులు సాయుజ్య పదంబు గలుగును. తులసికి కోట వేయించి కొమ్మలు దీర్చినపుణ్యాత్ములకు అశ్వమేధ ఫలంబులు గలుగును. తులసికి దీపంబెత్తినవారికి సూర్యచంద్రలోకంబులు గలుగును..., తులశీ బృందావనములకు అలికి ముగ్గుదీర్చి సాయంకాలమందు దీపంబెత్తిన స్త్రీలకు శాశ్వతంగా అయిదువతనంబు గలుగును. సరిలేని పుణ్యము కలిగి సంతోషంబున నుందురు దేవా! అంతమందు తులశీదళోదక మిచ్చిన దేహము పవిత్రంబై సద్గతి గలుగును. దేవా! తులశీ మాహాత్మ్యము పఠియించిన వారికి కొన్ని జన్మాదులు గడచిపోగాను, శాశ్వతంబుగా కైలాస సన్నిధానంబు గలుగును. తులశీ వనమందున్న దళముదెచ్చి శిరస్సున ధరించిన వారికి త్వరితంబుగా ఆదిత్యపురంబు గలుగును. ప్రొద్దుననేలేచి తులశీ దరిసెనము చేసినవారికి సర్వ పాపం బులు తొలగును" ఇత్యాదిగా వర్ణితమైన తులసీ మహాత్మ్య గాథను కృష్ణమాచార్యుడు సంకీర్తనముగా గానము చేసెనట. మరి యిది వచన సంకీర్తనమో, లేక గేయ సంకీర్తనమో! ఏమైనను ఇది యాతని రెండవ కృతి.

కృష్ణమాచార్యుడు వచన సంకీర్తన రచయితగా మాత్రమే నేటి దనుక లోకమునకు పరిచితుడు. కాని, ఇటీవలి నా పరి శీలనమున గుర్తింపనైన యాతని రచనలు మరి రెండు మూడిం టినిబట్టి చూడగా వచన సంకీర్తన పద్ధతికి మాత్రమేకాక, ధ్యాన (గేయ) సంకీర్తన పద్ధతికిని ఆతడే పరమాచార్యుడుగా పేర్కొనదగుచున్నాడు. ఆతని తరువాతనే పదునైదవ శతా బ్దిలో తాళ్లపాక కవులు, తమకు బూర్వముండిన ఇట్టి వచన సంకీర్తనములను, ధ్యాన (గేయ) సంకీర్తనములను, జానపదుల గేయచ్ఛందో రీతులను, దాక్షిణాత్యోత్తరాహ సంగీత సంప్ర దాయములను, నాట్య పద్ధతులను, సర్వమును బరిశీలించి సమన్వయ దృష్టితో పద రచనల కారంభించి యాంధ్రమున సంకీర్తన పద రచనా ప్రక్రియ కొక సమగ్ర సుస్వరూపమును గల్పించి, దానిని సుస్థిరపరచుటకై సంకీర్తన లక్షణము నొక దానిని రచించి, తరువాతి వాగ్గేయకారుల కెల్లరకును మార్గ దర్శకులయినారు. తాళ్లపాకవారు నిర్మించిన సుప్రసిద్ధ పద రచనా సౌధమునకు పునాదులు వేసిన వారిలో కృష్ణమాచార్యుడు ప్రము ఖు డనవచ్చును.

గేయ చ్ఛందమున గానానుకూలములగు కృష్ణమాచా ర్యుని ధ్యాన సంకీర్తనములలో నూతనముగా నేడు లభ్యము లైనవి, గేయమాలిక లనదగి,

నృసింహ నామాలు, రామనామాలు, రామనామ కీర్తనము అనునవి. ఈ మూడు లఘు కృతులును కలసి కృష్ణమాచార్యుని వచన (నామ) సంకీర్తనము లొకటి రెండింటితో సహా "రామ నామాలు (రామ స్తోత్రము)" అను పేరున తంజావూరు సరస్వతీ మహల్ పుస్తక భండాగారమున Tag సంఖ్య 28 లో కలగాపులగముగా కలసిపోయిన పత్రములలో కాన వచ్చుచున్నవి.1

3. నృసింహనామాలు:—కృష్ణమాచార్యుని లఘుకృతు లోనిది మూడవది లభ్యము. ఇది నృసింహస్తోత్రము. ధ్యాన (గేయ) సంకీర్తనము 'శ్రీ నృసింహ' అని ప్రతిపాదాంతమున నుండుట చేత నీ కృతికి నృసింహనామము అని పేరైనది. రగడలవలెనే రెండేసి పాదములు ప్రాసచేత బంధింపబడి, ప్రతిపాదమున రెండేసి యా వృత్తముల తరువాత యతి చెల్లుచు వెలసిన దేశి గేయ రచన మిది. తురగవల్గన జాతి రగడకు చెందినది. మాత్రాచ్ఛందస్సు ననుసరించి రెండేసి పాదములకు

> తకిట1తకిట తకిట2తకిట తకిట3తకిట తకిట4తకిట
> తకిట5తకిట తకిట6తకిట తకిట7తకిట తకిట8తకిట

అని ఎనిమిది యావృత్తము లున్నవి. ఇది త్రిశ్రజాతి—ఆది తాళమున కొదుగు రచన. ఇట్లు నృసింహ నామాంతములై నాల్గేసి యావృత్తములతో గూడిన పాదము లిందు ఏబదియున్నవి. అటుపై స్తోత్రము ద్రుతగతి ననుసరించి పాదమున రెండవ, నాలుగవ యావృత్తములందు శ్రీ నృసింహ—శ్రీ నృసింహ' అను సంబుద్ధులు రెట్టించివచ్చి, నాల్గేసి యావృత్తములుగల పాదము లేపాదమున కాపాదము ప్రాసయతిచేత కూర్పబడినవి విడిగా నైదున్నవి. వాని యాద్యంత స్వరూపము తెరుగుటకీ పంక్తులు మచ్చుకు చూడుడు.

ఆరంభము :

> శ్రీకరంజ భూరుహాఖ్య చెలగి వెలయు శ్రీ నృసింహ
> భీకరావతారధీర పృథులవక్ష శ్రీ నృసింహ

---

1. 1958 సంవత్సరము వేసగి సెలవలలో అన్నమా చార్యుని ద్విపద రామాయణమును గూర్చియు, వారి రామా యణ సంకీర్తనములను గూర్చియు పరిశీలింపగోరి తంజావూరు వెళ్లితిని. అచ్చటి రామాయణ రచనలనుజూచు సందర్భమున అక్కడి విద్వాంసులు శ్రీ సుందరశర్మగా రన్నిటితోబాటు ఈ 'రామ నామము'లను ప్రతిని గూడ నా ముందుంచిరి. అందలి కీర్తనలు కృష్ణమాచార్యుని రచన లనుటను గుర్తించి వారి కా విషయమును వెల్లడించి, పిదప, మూల్యమిచ్చి 11—7—58 లో వానికి వ్రాతప్రతులను నేను తెప్పించుకొంటిని. వానినే పరిష్కరించి తాళ్లపాకవారిని గూర్చి నేను వ్రాయుచున్న సిద్ధాంత వ్యాసమున కనుబంధముగా జేర్చుకొంటిని. 1959 లో భువ నేశ్వరమున జరిగిన ఓరియంటల్ కాన్ఫరెన్సు సందర్భమున నీ విషయమును గూర్చియే ఒక వ్యాసమును కూడ వంపియుంటిని.

వేడినట్టి ఫలములిచ్చు వినుతకీర్తి శ్రీ నృసింహా
(తోడు నీడ నీవుగావె దురితదూర శ్రీ నృసింహా)
వేదరాశి తుదన వెలుగు విశ్వభర్త శ్రీ నృసింహా
ఆదిదేవ నీ చరిత్ర మద్భుతంబు శ్రీ నృసింహా—
వాడిసురల కమృతమిడగ వలసి పొలసి శ్రీ నృసింహా
పోడిమిగను నీవు పూవుబోణివైన శ్రీ నృసింహా—
నిండుమది పవిత్రులందు నిలచియున్న శ్రీ నృసింహా
పుండరీక పత్ర నేత్ర భూతభక్త శ్రీ నృసింహా—

అంతము:—

తపము నీవె శ్రీ నృసింహా జపమునీవె శ్రీ నృసింహా
నీడనీవె శ్రీ నృసింహా తోడు నీవె శ్రీ నృసింహా
హితుడవీవె శ్రీ నృసింహా మతివినీవె శ్రీ నృసింహా
గతివి నీవె శ్రీ నృసింహా పతివినీవె శ్రీనృసింహా
జయము నీవె శ్రీ నృసింహా ప్రియమునీవె శ్రీ నృసింహా॥

అనంతరము:—

''ఇది పూర్వభాగ సంకీర్తనము దో(ధ్యా)న సంకీర్తనము. ఇది పరమ రహస్యము. ఇది పంచమ(హా) వేదంబు. ఈ సంకీర్తన నిత్యకృత్యంబు. ఎవ్వరు వ్రాయుదురు—ఎవ్వరు చదువుదురు—అట్టివారలకు ఆయురారోగ్యైశ్వర్యములు గలుగును. అనంతకోటి పుణ్యంబులు గలుగును. ఆపదోద్ధారక! అఖిల మంత్ర రాజాధిప! చింతిత ఫలదాయక! పరతత్వ ప్రకాశ! పరంధామ! పరమ పురుష! పరంజ్యోతి! మాయతి రామానుజ ముని(పరం) దాతారు అనాథపతి సింహగిరి కృష్ణకువ్వారు సామి సింహగిరి నరహరి నమో నమో దయానిధీ!''

అను వచనముతో నీ కృతి ముగియుచున్నది. ఇందలి తుది వచనమునుబట్టి ఇది కృష్ణమాచార్యుని కృతిగా గుర్తింప నగుచున్నది. ఇట్టిదే మరి యొక లఘుకృతి.

4. రామ నామ కీర్తనము:—లభ్యములగు కృష్ణమాచార్య కృతులలోనిది నాలుగవది. పైన పేర్కొన్న నృసింహ నామముల రచన వలెనే రామ నామ మహిమమును వెల్లడించు ధ్యాన (గేయ) సంకీర్తన మిది. ఇందు ప్రతిపాదాంతమునందు 'రామ నామము' అని వచ్చుచుండును. రెండేసి పాదములు ప్రాసచేత కూర్చబడి ప్రతిపాదమున రెండు వృత్తముల తరువాత యతి చెల్లుచుండును. ఇదియు వృషభ గమనమును రగడ జాతికి చెందినది. మిశ్రజాతి చాపు తాళమున కొదిగి

తకిట1తకతక తకిట2తకతక తకిట3తకతక తకిట4తకతక
తకిట5తకతక తకిట6తకతక తకిట7తకతక తకిట8తకతక

అని పాదమునకు నాలుగు వృత్తములు చొప్పున రెండేసి పాదములకు వెరసి ఎనిమిది యావృత్తములు గలవు. ఇట్టి చరణము లిందు ముప్పదిమూడు గలవు. పిదప ద్రుతగతినందుకొని

''తకిట తకతక రామనామము. తకిట తకతక రామనామము'' అను రీతిని యతియో ప్రాసయతియో కలిగి విడివిడి పాదములు పదునైదున్నవి. మచ్చున కీ పంక్తులు చూడుడు.

ఆరంభము:—

''శ్రీమదఖిల రహస్య మంత్ర విశేషధామము రామునామము
సామవేద విధూత శాస్త్ర విచారనామము రామునామము
సిద్ధకిన్నర సాధ్యపన్నగ సిద్ధసేవ్యము రామునామము
యుద్ధ మధ్య మహోద్ధతాసుర యోధభీమము రామునామము
నీలకంధర వర్షపురందర నిత్యకృత్యము రామునామము—
శైలరాజసుతా తనూభవ సతతకృత్యము రామునామము
రావణానుజ హృదయపంజర రాజకీరము రామునామము
తావలము సుజ్ఞానమూలస్తంభ మంత్రము రామునామము
సకలనిర్జర సకల సంయమి జనశరణ్యము రామునామము
సకలదివ్య నదీవిగాహన స్నానపుణ్యము రామునామము....''

అంతము :

''దివ్యమంత్రము రామునామము భవ్యమంత్రమురామునామము
జననిధానము రామునామము మనునిధానము రామునామము
సులభగమ్యము రామునామము తలపగమ్యము రామునామము
ముక్తిదము శ్రీరామునామము భుక్తిదము శ్రీరామునామము
కడువిచిత్రము రామునామము కల్పభూజము రామునామము.''

అనియుండి తుదకు ''ఇది పూర్వభాగసంకీర్తన. దో (ధ్యా)న సంకీర్తన. ఇదిపరమ రహస్యము. ఇది పంచమవేదము. ఈ సంకీర్తన నిత్యకృత్యంబుగా నెవ్వరు విందురెవ్వరు పఠియింతురెవ్వరు వ్రాయుదు రట్టివారి పితృపితామహ ప్రపితామహులు వైకుంఠమునం బొందుదు రట్టె—మీయాన. మీ పరణంబులాన. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా ! ఆపద్బాంధవా ! అఖిల మంత్ర రాజాధిపా ! చింతితఫలదాయకా ! పరంధామా ! పరమపురుషా ! పరంజ్యోతీ ! పరతత్వ ప్రకాశా ! శరణు శరణు మా యతిరామానుజముని (పరం) దాతారు అనాథపతి సింహగిరి కృష్ణకువ్వారుస్వామి సింహగిరి నరహరి నమోనమో దయానిధీ !'' అనువచనముతో నీకృతి ముగియుచున్నది.

5. రామనామాలు : లభ్యములగు కృష్ణమాచార్య కృతులలో నిది యైదవది. ఇదియు పైవానివలెనే గానానుయోగ్యమై 'రామారామా' అనుపాదాంత సంబుద్ధులుగల రామనామకీర్తనము. విశేషమేమన నీ సంకీర్తనమున రామనామస్తోత్రముతో బాటు రామాయణగాథయు క్రమమున తత్తద్విశేషణములందు స్ఫురించుచున్నది. ప్రాస నియమములేక ప్రతిపాదమున యతియో, ప్రాసయతియో చెల్లుచు రచన భజనపరులు పారవశ్యమున పాడుకొనదగినదిగా నున్నది. మచ్చునకీ పంక్తులు తిలకింపుడు.

కృ ష్ణ మా చా ర్యు డు

ఆరంభము :

దశరథాత్మజ రామారామా !
ధన్యచరిత్రా రామారామా!
భరతాగ్రజ రామా రామా !
పంకజేక్షణ రామారామా !
మిత్రతేజా రామారామా ! —ను
మిత్రవరదా రామారామా !
శత్రుభీషణ రామారామా !
శత్రుఘ్నసేవక రామారామా !
దండకావీర రామారామా !
తాటకాంతక రామారామా !
మంజుభాషణ రామారామా !
కళ్యాణప్రియ రామారామా ! అ
హల్యాప్రియ రామారామా !
చాపఖండన రామారామా !
భూపమండన రామారామా !
జానకీప్రియ రామారామా !
మానవేశ్వర రామారామా !....''

అంతము :

''నందితాత్మజ రామారామా !
వందితాభరణ రామారామా !
మానసింధూ రామారామా
దీనబంధూ రామారామా''

ఈ సంకీర్తనమున నిట్టిపాదములు నూటపదునెనిమిదివరకు గలవు. తకధిమి తక, తకధిమి తకధిమి— అను నా వృత్తము లతో చతురస్రజాతి— ఏకతాళమున కొదుగుగీతమాలిక యిది. ఈ ధ్యాన (గేయ) సంకీర్తనమువెనుక 'నమోనమో దయానిధీ,' అను మకుటముగల కృష్ణమాచార్యుని వచనము కానరాకున్నను పైన పేర్కొన్న ప్రతియందే 'రామనామాలు' అను శీర్షిక క్రింద నుండుటచేత పైవానివలెనే ఇదియు కృష్ణమాచార్యుని రచనముగా మనము సంభావింపవచ్చును.

పై రచనలన్నియు రాగతాళములతో పాడదగిన ధ్యాన సంకీర్తనములు. గీతమాలికలు. స్తోత్రప్రాయములు. వీరియీ రచనల ననుసరించియే కావచ్చును, తరువాత తాళ్లపాకవారు కూడ నీమట్టులలో ననేక సంకీర్తనములు రచించినారు. తాళ్లపాక అన్నమయగారి యీ శృంగార సంకీర్తనము చూడుడు.

అతిశోభతేయం రాధా
సతత విలాసవశా రాధా॥
దర్పక బలబోధారాధా
తర్పణ గంధవిధా రాధా
దర్పయుత క్రోధారాధా
దర్పక రసవేధా రాధా॥
తారితావరోధా రాధా
తారుణ్యోద్బోధా రాధా
ధారితాను రోధా రాధా
దారితాపరాధా రాధా॥

ఇత్యాదిగా నెనిమిది చరణములుగల యీ రచన పైనిపేర్కొన్న 'దశరథాత్మజ రామారామా' అను నామసంకీర్తనమునే బోలి యున్నది. ఇట్లే 'తకిట తకిట' అను నా వృత్తములును, 'తకిట తకతక' అను నా వృత్తములును పాదమునకు నాలుగేసి చొప్పున గల సంకీర్తనలుకూడ తాళ్లపాకవారివి బహుసంఖ్యలో నున్నవి. ఉదాహరణ కొకటిరెండు తిలకింపుడు.

''ఏమి చిత్రం జేమిమహిమలు ఏమి నీమాయా వినోదము
వామనాచ్యుత నిన్ను దెలియగ వసుధలో మా తరములా''
(అన్నమా—2—225)

ఇందు 'తకిటతకతక'— ఆ వృత్తములు పాదమునకు నాలుగు చొప్పుననుండి కృష్ణమాచార్యుని రామనామ కీర్తనమును స్మృతికి దెచ్చుచున్నది. ఇట్లే

''పుడమిలోన మగలు గలుగుపొలతులకును దిరుగబాసె
అడవివారి నుండనియ్యడమ్మ నీ కొమారుడు.''
(అన్నమా—3—309)

'తకిటతకిట' ఆ వృత్తములు పాదమునకు నాలుగుచొప్పున గల రచన లిట్టివనేకములు కృష్ణమాచార్యుని 'నృసింహనామము' లను దలపించుచున్నవి.

పై పరిశీలనమునుబట్టి కృష్ణమాచార్యుడే మన సంకీర్తన పదవాఙ్మయమునకు పరికల్పకు డనియు, వారిమార్గము ననుసరించియే తరువాత తాళ్లపాకవారు దానికొక సమగ్ర సుస్వరూపము నావిష్కరించినా రనియు తెల్లమగుచున్నది.

కాలగమనం

శ్రీ సి. జి. శంకర్

కాలం గడిచిపోతోంది...ముందుకు నడిచిపోతోంది
కష్టసుఖాల్ని వేరుపాళ్ళలో కలిపి కషాయం కాచి
అనుభవాల అనుపానంతో అందరికీ అందిస్తూ,
పాప పుణ్యాలెరుగని బోసినోటి పసిపాపల్ని నవ్విస్తూ,
కలకాలం కాంతల కౌగిళ్ళలో కరగి పోతామనుకొని
కాలగమనం కనలేక
పగటి కలలు కనే కామాంధుల్ని కవ్విస్తూ,
కాటికి కాళ్ళు చాచుకొని
చావు కబుర్లువిని కళ్ళుచమరుస్తూ
గతాన్ని స్మరిస్తూ, భావి కని బావురుమంటూ
స్వాగతంలో విలపించే వృద్ధులను దీర్ఘనిద్రకై దీవిస్తూ
కాలం గడిచిపోతోంది...ముందుకు నడిచిపోతోంది!

కష్టాల కాసారాలు దాటి...దాటి...
వినోదాల మైదానాలలో విడిసి...విడిసి...
విషాదాల పాషాణాలపైకి ప్రాకి...మెగ్రాకి...
మర్మాల హార్మ్యాలతో, మానాభిమానాల లతలతో
నవరసాల వృక్షాలతో, వివిధ సుఖాల వికసితపుష్పాలతో
చిత్రంగా కనిపించే జీవితోద్యానంలో విహరించి...విహరించి..
కాలం గడిచిపోతోంది...వడివడిగా...ముందుకు నడిచిపోతోంది!

ఎక్కడో బయలుదేరింది...ఎక్కడికో మలిపయనం !
ఒంటిగా పోతుంటే వెంటవెళ్లాయి జీవులు
వెంటనంటి పయనిస్తూ...వెనుకపడి కలుసుకుంటూ
కాలంతో కలిసిపోలేక కడకు కళ్లుమూశాయి

కాలగమనం

పాత మిత్రులు కనుమరుగై...క్రొత్త మిత్రులు యెదురౌతుంటే
అనర్గళంగా...అనంతంగా...ఆనందంగా
కాలం గడిచిపోతోంది...ముందుకు నడిచిపోతోంది
ఎన్నో విషాద గాథలు...మరెన్నో ప్రణయగాథలు...
యింకెన్నో వీరగాథలు

విసుగూ విరామంలేకుండా వింటూ,
దూరం గడచినకొద్దీ,...ముందుకు నడిచినకొద్దీ
విజ్ఞానం సాధించిన విశేషాలు కంటూ,
దారిలో తనను కలిసి, దారిలోనే తలలువాల్చి
కనుమరుగైన వారిగూర్చి తలంచుకొంటూ—
అభివృద్ధి...వినాశం; క్షామం...క్షేమం;
విప్లవం...విశ్వశాంతి; అన్నిటినీచూచి నవ్వుకుంటూ—
ఎక్కడినుండో!... ఎక్కడికో!!... ఎందులకో...!!!
కాలప్రవాహం చరచర ముందుకు పరుగు లిడుతోంది!

విషాదాంత కావ్యాలూ - అబ్బూరి రామకృష్ణరావు గారు

డాక్టర్ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

2

ఆంధ్రంమీద ఆంగ్ల వాఙ్మయ పరిచయ ప్రభావము కట్ట మంచివారి 'ముసలమ్మ మరణం'తో ప్రారంభమైనదనిపిస్తుంది నాకు. ఆంగ్ల వాఙ్మయములోని కావ్యములను రామలింగారెడ్డిగారు అనుకరించారనికాదు. విషాదాంత కావ్యములు తెలుగులోనూ, సంస్కృతములోనూ ఎక్కువగాలేవు. ధర్మవిజయమును చిత్రించడముతో రచయిత చదువరులలో ఆదర్శాభిమానాన్ని పెంచుతాడూ, త్యాగాన్నీ బలిదానాన్నీ చిత్రించడముతో కల్మషక్షాళనము చేస్తాడు. ఇవి రెండూ రచయితకు రెండు కళ్ళు. రెండో విధపురచనలు మనకెన్నోలేవని గుర్తించి రామలింగారెడ్డిగారు 1899 వ సంవత్సరములోనే ''ముసలమ్మ మరణము'' అన్న చిన్న కావ్యమును రచించినారు. బుక్కరాయ సముద్రమనేపల్లెలో ఒకప్పుడు ఆకాశము తూటుపడిందా అన్నట్టుగా వానలు వచ్చినవి. ఆ యూరి చేరువనున్న సరస్సు కట్టనుతెంచి వూరిని కబళించునేమోయని జడిసి, వూరివారు పోలేరమ్మకు పొంగళ్ళుపెట్టి ప్రార్థించారు. ఆకాశవాణి 'బసిరెడ్డి కడకోడలు ముసలమ్మ బలిగా పోయినచో మీకు కష్టము కలుగద'ని చెప్పినది. ఈవార్తను తెలుసుకొని పాపమాబాల భర్తతోనూ, అత్తమామలతోనూ చెప్పి, బిడ్డను భర్త కప్పగించి ప్రజలను దయజూడుమని శుభమూర్తి శివునకు మ్రొక్కి చెరువునీట ప్రవేశించెనట. నాకేమో రెడ్డిగారి వంటి ఉపజ్ఞావంతులు పారంపర్యముగా మరొక రూపముతో వచ్చిన కథను ఈ రూపముతో రచించడము నచ్చలేదు. నిండిన చెఱువును చూడవచ్చినవారిలో ఒకరికి పూనకమువచ్చి 'గర్భిణి స్త్రీని బలిఇచ్చిననే గండిని పూడ్చుటకు—గండిపడినదనే కథ—సాధ్యమౌనని చెప్పినట్లున్నూ, ఆ వార్తనువిని ముసలమ్మపేరిటి చిన్నది తానే బలి కావడానికి సిద్ధమైనదనీ, ఆమెపోయి గండిలో కూర్చోగానే వూరివారందరూ రాయీ బెడ్డామట్టీ విసరి గండిని పూడ్చిపెట్టినారనీ నేను విన్నకథ. రెడ్డిగారి కథవింటే 'ఆకాశవాణికి బసిరెడ్డి కోడలుపైన అనుగ్రహము ఎందుకు కలిగింది?' అన్న ప్రశ్న, దాని వెనువెంటనే 'పాపము ముసలమ్మ బ్రదుకుతోపాటు ఆమె చేసిన ఘనత్యాగము కూడా బుక్కరాయ సముద్రము నీటిపాలైనదే' అన్న విషాదమూ ఆవరించాయి నాకు. రెడ్డి కోడలు ఘనత్యాగాన్ని రెడ్డిగారు పల్చన చేశారేమో అనిపించినది. నిజమేదయినప్పటికీ, కట్టలో అసాధారణపు వంపు-ముసలమ్మ కట్ట-తో అనంతపురవపు చెఱువుకట్ట నేటికీ ముసలమ్మ త్యాగాన్ని చూపిస్తోంది.

రెడ్డిగారు సంస్కృత సమాస జటిలమైన శైలితో, ఉత్ప్రేక్షలతో, పీన పద్యాల వర్ణనలతో, వచనాలతో 'దేవా యవధరింపవలయు' వంటి పురాణపు హెచ్చరికలతో, పాత పద్ధతిలోనే రచించినప్పటికీ, వర్ణనలు నడిపే ఉత్సాహముతో కథన చైతన్యమును జార్చివేయక, బిగువైన మాటలతో కథా ప్రకారమునకు వెలిగాని భావములతో రచించినారీ కావ్యమును. అయితే, వ్యక్తుల భావదౌర్బల్యమును తత్వ దర్శనముతో వెలిగించగల మేధావసువు ఆయన. కనుక పిచ్చి నమ్మకాల గుండెలనుచీల్చే సన్నివేశము ఈ కథలో లభించినా ఆయన ఆ సన్నివేశాన్ని, ఆ ఉద్దేశ్యముతో సానబట్టక చిరునవ్వుతో దాటుకుపోయినారు. వారి పలుకులన్నీ మానస పుత్రికలేఅయి హృదయాన్ని స్పృశించ యత్నించనేలేదు. ముసలమ్మ బిడ్డను ముద్దాడునప్పుడుమాత్రము జాలి వేస్తుంది. 'అయ్యో పాపము' అని. 'ముసలమ్మ మరణము' ఈ పేరు అనాకర్షకమౌటవల్లనో, ఇది ఇటీవలి ప్రబంధములో ఒక అశ్వాసమువలె కానవచ్చుటచేతనో, నవ్యత ఎంతో మెరవక పోవుటవల్లనో, ఎక్కువగా ప్రచారము కాలేదు. దుఃఖాంతమౌట వల్ల కాదనుకుంటాను. ఆశు కవిత్వ ప్రచారము కొంత కారణమై యుండవచ్చును.

అయితే రెడ్డిగారి శుభ ప్రారంభము విషాదాంతగాథ, కావ్య రచనలో రాయప్రోలువారి డోరా, కష్టకమల, తృణకంకణము, స్నేహలతాదేవి; అబ్బూరివారి మల్లికాంబ, నదీసుందరి: రావి రెడ్డి నలజారమ్మవంటి కావ్యములుగా రూపొంది అందగించినది.

గురజాడవారి పూర్ణమ్మా, కన్యకా విషాద సౌందర్యాన్నికాక, సందేశాలను వహించి సాగినట్టివి. పై కావ్యాలలో సందేశము చాలా చాలా గౌణము. రాయప్రోలువారి స్నేహలతాదేవీ విషాద సౌందర్య సాధనకే ఎక్కువగా రూపు దిద్దుకొన్నదంటాను. అందుకే కావ్యార్థ సూచిగా 'నిత్య సాంధ్యకుమారీమణీమతల్లి కట్టుచీర చెరంగులు కాలుపోల్కి' అని ప్రారంభించింది.

అబ్బూరి రామకృష్ణారావుగారికి రామలింగారెడ్డిగారి సాంగత్యము మైసూరులో సమకూడినది. 'ముసలమ్మ మరణము'లోని అన్యాయమునుబట్టి స్ఫురించిన వేరొక అన్యాయమును చూపుట కని వారు 'మల్లికాంబ'ను రచించినారు. రెడ్డిగారు ప్రౌఁసుదొర ప్రచురించిన 'అనంతపుర చరిత్ర'లోనుంచి ముసలమ్మకథ గ్రహిస్తే ఆంగ్లపత్రికనుండి రామకృష్ణారావుగారు 'మల్లికాంబ, కథ గ్రహించారు. అసలు కథను ఈయన మార్చినట్లున్నది. మల్లికాంబ, కమల స్నేహితులు. కమల తన ప్రియుడు వ్రాసిన ఉత్తరాలను 'కోరికలు చెడునేమో' యని మల్లికాంబకు దాచ నిచ్చెను. మల్లిక "నాదు భర్తకును గూడ దొరకని రహః ప్రదేశమందు " దాచియుంచెదనని ఆమె కభయమిచ్చెను. ఇక్కడ భర్త చూచినచో? అన్న కావ్యార్థసూచియగు అనుమానము మనకు మెరపు కొట్టుతుంది. 'మల్లికాంబ కమల ఉత్తరములను 'ఒక మోహనంపు పేటికన్ బరువెరుగని విధమున డాచెంగాని గ్రహియించెనది మల్లికాంబ భర్త! అతడా జాబులను చూచుటా, బాధపడుటా, కత్తితో భార్యను చంపనేగి భార్య సమీపమున విలపించుటా, ఆతని ఉద్యమమును గ్రహించి మల్లికాంబ 'అసువుల బాయు'టా, కొన్నాళ్లకు కమల తన జాబుల కొరకు వచ్చుటా, అతడు నిర్విణ్ణుడై 'ఎక్కడికో' పోవుట ఇదీ కథ. రెడ్డిగారి కథలోని విషాదమును ఆయనగారి నిశితమైన ఆలోచనలు పరిహరించెనంటిని. ఈ కథలోని విషాదమును, ఈయన మెత్తని రచన చక్కగా కప్పి పెట్టినది. కథలోని వారందరూ ఈ లోకపు వ్యక్తులుకారు. మరి కవితాలోకపు వ్యక్తులు. నా దృష్టి కిది 'కవిత్వపు ఓపెరా' అనిపించింది. ఓపెరాలో కథా గమనానికికంటె నృత్య గానాదుల కెక్కువ స్థానము. దీనిలో కవి ఊహా పావురపు రెక్కల చప్పుడులు కథా గమన అనుభవాన్ని మింగివేసినవి. అట్టి పెద్ద చప్పుడుకొక ఉదాహరణము 'పాడి పాడి కోయిల తన గూడు చేరె' కోయిలచేత గూడు కట్టించింది ఈయన భావనా సైరంధ్రి! ఇంకొక ఉదాహరణము: ఉత్తరాల కోసము వచ్చిన కమల "వచించునొక్క విషయమ్మునకు ఎన్నియొ వింత యర్థముల్" తోచినవట మల్లికాంబ భర్తకు! కవితావ్యక్తి మరి! వగిలేగుండెని చేతితో పట్టుకుని కవి చెప్పినట్లు వింత అర్థాలు లోపించుకోవలసినదే, కవిత్వాలూ రాయవలసిందే! రాశాడు లేఖలో! ప్రబంధ కవులు ఉత్ప్రేక్షలూ, భ్రాంతిమంతాలూ, అతిశయోక్తులూనింపి రచిస్తే ఈయన అర్థాంతరన్యాసాలూ సమాసోక్తులూ విరజిమ్మి రచించారు. కథయొక్క జాలి పలకరింపులకంటె రచనా కోలాహలము లావైపోయింది.

దువ్వూరి రామిరెడ్డిగారి 'నలజారమ్మ అగ్ని ప్రవేశము' కూడా ఈ విషాదాంత కావ్యముల లోనిదే. రామలింగారెడ్డిగారి 'ముసలమ్మ మరణము'లో రెడ్డివడుచు చేసిన ప్రాణత్యాగము రామిరెడ్డిగారిచేత అలాటిదే అయిన ఈ కథ చెప్పించింది. అయితే ముసలమ్మ మరణము కంటె నలజారమ్మ భర్తమరణము చాలా విడ్డూరముగా ఉన్నది. పక్కపొలములోని జొన్నకంకులు కోసుకున్నందుకు 'తురుష్క భూపతుల మాట లతిక్రమణంబు సేయగా జనదని'న్నీ, ఒక మానిసి చౌర్యముసల్ప గొర్తియే దవిలిన శిక్ష 'యనిన్నీ నిశ్చయిస్తే నలజారమ్మ భర్త ఆత్మహత్య చేసుకోడానికి వెళ్ళిపోతాడూ, ఆమె గుండానబడుతుంది! ఈ కావ్యములో రామిరెడ్డిగారు ప్రబంధ పద్ధతిని మురాంతక విష్ణుపతి నల్వరాణి స్తుతులూ, సత్కవిస్తుతీ, కాకవి నిరాసనమూ, గోపుర సమాశ్రిత పుర—భూసురోత్తమ, వైశ్య హాలిక—వర్ణనలూ చేస్తూనే ప్రారంభించినా, రామలింగారెడ్డిగారి వర్ణనా పద్ధతులు నచ్చడమువల్ల కాబోలు స్వాభావిక వర్ణనలు కూడా చేశారు. గాంధి మహాత్ముడు రాకముందే రాట్నము త్రిప్పించారు ఈనాటి హాలికుల కాంతలచేత. ప్రకృతి వర్ణనపట్ల ప్రబంధ రీతులవైపే వీరి మొగ్గు; ఉత్ప్రేక్షల కోలాహలము ఎక్కువైపోయినది.

రాయప్రోలువారి కావ్యాలతో అభినవ కవితామండలి స్థాపన అయింది. పత్రికలలో ఇ. వి. కృష్ణారావుగారు, చెన్నాప్రగడ భానుమూర్తిగారు, ఇతరులూ ఆంగ్ల కవుల ఖండ కావ్యాల్ని తెలుగు చేయడము ప్రారంభించారు. గురజాడవారి తేటతెలుగు భాషనుగాని, మాత్రాచ్ఛందములనుగాని, సహజ వర్ణనలనుగాని సందేశ గర్భిత కథానకములనుగాని వారి తరువాతివారనుకరించినట్టు కానరాదు. రాయప్రోలువారి పద్య ప్రవాహ మాధుర్యమూ, హ్రస్వ సంస్కృత సమాస వైవిధ్యమూ, ప్రేమ గీతోపదేశమూ, విషాదగాథాకథనమూ, కొత్త కవులను ఆకర్షించి, వారి దారిలోనికి మళ్లించినవి. రచనలు కూడా రాయప్రోలువారి పద్ధతిలోనే పెరిగినవి కథా కావ్యాలూ, ఖండకావ్యాలున్నూ.

అబ్బూరి రామకృష్ణరావుగారి 'పూర్వప్రేమ—ఊహాగానము' అన్న రచనలు ఈ నిజానికి మొదటి ఉదాహరణలు. వీరి అధ్యయనము కలకత్తా—మైసూరులలో ప్రవాసములో జరిగినది. ఈ కాలములో తెలుగునాట 'నవ్య గీతా శుభాధ్యయనమ్ముజేయు సోదర కుమారకుల' ఉత్సాహమునందుకొని వీరూ కావ్య రచన చేశారు. ఊహాగానము అన్న పద్యమంజరుల సంపుటియే వీరి తొలి యత్నమని పీఠికనుబట్టి అనిపిస్తోంది. దీనిలోని శీర్షికలు గురజాడవారి ఖండ కావ్యాలకంటె వైవిధ్యము హెచ్చుగా గలిగినవేకాని, వాటికున్న కావ్యత్వసిద్ధి వీటి కన్నిటికీలేదు.

కావ్యముయొక్క ప్రమాణము ఎంతది అయినా, దానిలోని కథకుగాని, భావానికిగాని అవిరతి ఉండాలి. చదువరి పఠనము ప్రారంభించినప్పటినుంచీ ఆ కావ్యము అపేక్ష కల్పిస్తూ, తనకు జీవమయిన భావము చదువరికి కలిగేదాకా లాగుకుపోయి ఆ భావావేశములో వదలాలి చదువరిని. గురజాడవారి ముత్యాల సరములు, లవణరాజుకల, కన్యక, డామను పిథియసు, పూర్ణమ్మా, అంగరెత్తుము, అలాటి కావ్యాలు. వాటిలో ఒక్కపద్యము తగ్గించినా చదువరి భావనిశ్రేణిలో ఒక మెట్టు తగ్గినట్టే అవుతుంది.

వాటిలో సూత్రములాగ సాగిపోయే భావమునకు విరతీ విచ్ఛేదమూ ఉండదు. కనుక చదువరి కూడా ఆ భావ స్రవంతిలో ప్రయాణించి చివ్వర తన్మయుడై సద్యఃపర నిర్వృతి చెందగలుగుతాడు. ఆంగ్ల కవులు కీట్సు, బైరను, వర్డ్సువర్తూ రచించిన ఖండ కావ్యాలు కూడా ఈ జీవము గలట్టివే. మన శతకాలలోని పద్యములకు ముఖ్యముగా కాళహస్తీశ్వర శతకములోని చాలా పద్యాలకు దేనికి దానికి చదువరికి భావము కలిగించే గుణముంటుందికాని— జండా పరుగుపందెపు వేగమువలె— ఒక భావానికి దానికంటె పై మెట్టుకుచేర్చే భావమూ, దానికి అంతకన్న పై అంతస్థులాగే భావమూ చేర్చుకుంటూ చదువరికి ఏకాగ్రతా, తన్మయతా కలిగిస్తూ తీసుకుపోయి, అతనిని భావనా ప్రపంచములో విసరగల కావ్యత్వసిద్ధి ఆ పద్యాలకు ఉండదు. చాటూక్తులకూ అంతే. వాటిలో భావాలుంటాయియూ, ఆ భావాలకు మన హృదయాలు జల్లుమంటాయి. అయితే అవి పూల గంపలు, హారములుకావు. స్వరజతులు, రాగములుకావు. స్కెచ్చిలు, సమావేశచిత్రాలు కావు. పద్యమంజరులకూ, స్వరావళులకూ రంజకత్వము ఉండవచ్చునుకాని, కళాసిద్ధిలేదు. రచయిత భావావేశాన్ని చదువరికి సంక్రమింపజేయగల వరుసతోనూ, శక్తితోనూ వెలువడు భావాలుగల రచనయే ఖండ కావ్యమౌతుందిగాని, కావ్యఖండములు కూర్చిపెట్టిన పద్య సమూహము కావ్యము కాజాలదు. చిన్నదైనప్పటికీ ద్రాక్షపండు ఫలమే. మేటెడైనా మామిడిపండ్ల ముక్కలు పండుకావు. పద్యమంజరులు, ఖండ కావ్యముగా కూడినవే వాటి చేరికకు కావ్యత్వసిద్ధి చేకూరుతుంది. లేకుంటే వాటి చేరిక సార్థకముకాదు. అవి నాలుగైనా, అయిదైనా, వంద అయినా అవి పద్యాలే అవుతాయి. కావ్యములు కాలేవు. కులకములన్నవి గుప్పెడు పద్యాలూ, దోసెడు పద్యాలూ, బుట్టెడు పద్యాలూ తట్టెడు పద్యాలూ కావడములో శోభలేదు. చిన్నదండా, పెద్దమాలా, వనమాలా కావాలి కులకములు. అప్పుడూ వాటికి కావ్యత్వసిద్ధీ, నిత్యత్వమూ సిద్ధిస్తుంది. ఎవరు ఎప్పుడు చదివినా అవి సద్యఃపరనిర్వృతి కలిగిస్తాయి.

అబ్బూరి రామకృష్ణరావుగారి 'కాపుపాట', 'సోదరస్మృతి' (మూడోపద్యములేని) 'బాల్యస్మృతి' ఖండకావ్యములనిపించాయి నాకు. సాధుగీతి "Where is thy market my song, where is thy market" అన్న రవీంద్రుని ఖండ కావ్యములో రెండు భావాల్ని వేర్పరచి ఇచ్చినట్లున్నది. 'భవతి! భిక్షాందేహి!'లో మొదటి పద్యము లేకపోతే, రెండోది జన్మభూమికి తిరిగివచ్చే తమకమును చక్కగా చూపిస్తుంది. మొదటి దానితో చేరితే దానిలోని నిస్పృహతో చేరిన రెండో పద్యము కాందిశీకుని తత్వము చూపిస్తోంది నాకు. 'తిక్కన సోమయాజి' నాలుగు పూలపూజ. 'అరవిందఘోషు' మూడు పూలపూజ. 'అప్రాప్త మనోహరి'కి అని శీర్షికను కూడా కావ్య వస్తువుతో ముడిపెట్టక ఆ 'అప్రాప్త్యము' ఎట్లు వచ్చినదో కొద్దిగా ముందు సూచించి, ఈ పద్యాలకు దారితీసే భావాలు కొద్దిగా వినిపించి, తరవాత ఈ భావాలు వినిపిస్తే ఇది ఖండకావ్యము అయియుండును. ఇప్పుడిది అలాటి ఖండకావ్యపు కొసాఖండము అనిపిస్తోంది నాకు. 'మహాకవి తిక్కన'లోని రెండో పద్యమూ, మూడోపద్యమూ, ఆరోపద్యమూలోని ప్రశ్నలు మొదటి పద్యపు 'విసుగు'ను భావశయ్యలో ప్రవహించనీయక గట్టుకొట్టేస్తున్నాయి. ఏడోపద్యములోని ఆత్మ పరీక్ష లేకపోతే నష్టమేమీలేదు సరిగదా—తిక్కనను గురించిన భావాలు ముందుకు ప్రవహించడానికి ఇప్పుడున్న అడ్డంకి తప్పుకుంటుంది. 'పుస్తక సాంగత్యము' మూడు పద్యములు దాటి తెగింది. తరవాత నాలుగు పద్యాలదీ ఇంకొక దారి.

అయితే, ఆకాలానికి తెనుగులో పద్యాల ఉపజ్ఞానిర్మితములగు ఖండకావ్యములు రాలేదు. ఇలాటివే తొలి ఖండ కావ్యములు. రామకృష్ణరావుగారు "స్ఫురించు తలంపులనెల్ల జెప్పనోపనితమి" వల్ల తన నుడులు ఉండవలసినట్లు లేవని అనుమానించినారు. నాకు చూడగా 'చెప్పనోపని తమి'వల్ల కాదేమో, దిద్దితీర్చని ప్రోలుమాలికవల్లనేమోననిపిస్తుంది. తమియుండినదేమో నిజము. 'స్వాదు కృష్ణానదీ జల స్నానములను పులక లొలయగ వినయాంజలుల ఘటించి, నవ్యగీతా శుభాధ్యయనమ్ముజేయు సోదర కుమారకు లెదురు చూచుచుందు'రని ఈయన మరలివచ్చినారు. ఆర్ద్ర హైందవ రీతులను భావపుష్పిత నవ్య శయ్యారీతులలో పాడ నుద్యమించినారు. అధ్యయనకాలములో నీయన గీర్వాణాంగనా జైత్ర విధ్వానములనాసక్తితో ఆలకించినారు. అయితే మహాకవి తిక్కన మహనీయగాన రమణీయతను వీనులగ్రోవియుంటచే వీరిలో సంస్కృత సమాస లౌల్యముకాక, భావ బంధుర రచనాసక్తి మించినది. రాయప్రోలువారి సంస్కృత సమాసపు బుటాల జిలుగు తెరనుగానీ, గురజాడవారి తేట మాటల శైలినిగానీ వీరు అవలంబించక తెలుగు పదముల మందగమనముతో శ్రోణీభారాదలసగమనయైన పలుకుబడిని అలవరుచుకున్నారు. కళ్లెములను సడలించక తనకు కావలసిన దారిలో నడిపేరు పద్యపు గుర్రాల్ని. నాటికీ, నేటికీ సొరుమాయక ధవళ గోవ్రాతపు గృహగమన సౌందర్యాన్ని నింపుకున్న వీరి శైలి నవకవుల పంక్తిలో వీరికి పీట వేసినది. ప్రవాసములోనుండి పుట్టినింటి ప్రేమను తలుచుకుని కలలుగన్న కారణముచేత కాబోలు కన్నులకూ, వీనులకూ అందిరాని సౌందర్యాన్ని భావనా సువర్ణ వాగురులచే పట్టి లాగడము వీరికి అలవాటయింది. గంభీర గంగానదీ శీతగర్భమున నడంగిన గానమూ, గాలినడగిన కోయిల కూతా, పూయని పూవులం దడగు పుప్పొడి సుగంధమూ, నడియెండల బారిపారి సోలెడు హరిణాంగనను కవుగిలించెడు నీడల చల్లదనమూ, మాతృశాదములగ్రేవన్ నల్లనై పోయి కానుపింపని రెల్లుపూల ధావళ్యమూ, పలుకలేని పూవుల మౌనమూ, సందె చీకటుల్ మూయనివేళ శ్యామల నభోమణియందలి కానరాని తారాయువదీప్తులూ వీరి భావనాబలమువల్ల నవ కవిత్వములో నిక్షిప్తములైనవి. తన దృష్టికందిన క్రొత్త అందాలు విడివిడు టోర్వజాలని నవీనమన: ప్రణయాలూ, నర్మదా శుభ్ర వీచీకణమ్ములందు నిండిన ఋషుల స్వమాతృస్తవములూ, గుమ్మడి పూవుతేనియల మాధురులూ, హిమవదుపాంతపుం బొడుపుపేళ్ళ సితాంబువులం గదల్చు హంసములూ, ఆరిపోయిన బయళ్ల నొకప్పుడు ప్రవహించిన స్రవంతీజలమూ, ఈయన మనకు చూపించారు. విశేషించి మనదృష్టికి తగలని 'తెల్లగ

నల్లగా నల్లిన ఆనందవస్త్రాలూ, కవిప్రేమ పుష్పింపగాజేయు కృష్ణా స్రవంతీ తరంగాంతరంగమూ, రాగారుణమ్మైన చింతా ఝురుల్ వారునాత్మా, కనబడని భావముల సునాసనలూ, కోరికల జిక్కువడిన మూర్ఖుల మనమ్ములలచు నార్తుల సందేశములూ, గుర్తించి చెప్పినారు. కాబట్టి "స్ఫురించుతలంపుల నెల్లా" ఈయన చెప్పనోపరన్నది నమ్మడముకష్టము. "అయితే వీరి పద్యమంజరులకు నిండు సౌందర్యమేల సమకూడలేదూ ? అన్నప్రశ్నకు "నవ్యరీతుల"లో యత్నించి పాడనుంకించిన తమకముయొక్క ప్రాలుమాలికవల్ల" నవిపిస్తున్నదినాకు.

ఊహాగానము 1918వ సంవత్సరములో వచ్చినది. అప్పటికే అందులోని పద్యములు చాలావరకూ రెండు సంవత్సరముల ప్రాయముగలవి. రాయప్రోలువారి తృణకంకణమూ, గ్రంథాలయ సర్వస్వములో దేశభక్తి పద్యాలూ, ఆంధ్ర భారతిలోని ఖండకావ్యాలూ వచ్చాయి. "పూచియు పూవకున్న సుమముల్ సుడిగాడ్పుల విచ్చుపోల్కి, స్వేచ్ఛా చలనమ్ములందు నవశమ్మగు లేతమనమ్ముతోడ, చెల్లాచెదరైన సాధనములన్ దమకమ్మున చక్కబెట్టుకోజూచి" నారు కని కుమారులు చాలా మంది. వారిలో అబ్బూరి రామకృష్ణరావుగారొకరు.

వీరి వర్ణనాపద్ధతి అటు సంస్కృత పద్ధతినీ, ఇటు ఇంగ్లీషు పద్ధతినీ తెచ్చుకుని తెలుగుతో పేనుకొన్నట్టిది. సంస్కృత కవిత్వములో అన్వయమునకు కర్త కర్మ క్రియ వరుసలంటూ విధించే నియమములేదు. "ఇవమానదండ:" చివ్వరకి తోసినా ఆక్షేపణలేదు సంస్కృతములో, రామకృష్ణ రావుగారు "మిన్నుల బాడగోకిలల్" 'గాలినడగిన కోకిలగాన మట్లు' 'కేళీలోలవై యుండగన్' 'నయవేత్తల్' 'భారతమహా హవమందలి జీవగీతులన్' అన్న తునకలను పద్యాల చివరకునెట్టి సంస్కృతాన్వయమును తెలుగులోకి దింపినారు. పావనరాగము, హృదయపదము, పలుకరానిగీతిక, పాడుచువెన్నెలతేట, (కవితా) మాధురి, పూనవ్వు, కోకిలపాట, వాహినులపాట, కవులపాట, రాగములు పుష్పింపంగ, గానముల్వెదజల్లు, లేతమనమ్ము, వెన్నెలలు రాలు (ట), ఘోరణులు చిమ్మెడు మాధురులు, వికసించిన వెన్నెల, బాధామలినమ్ములు, వంటి ఆంగ్లకవితా సంప్రదాయాన్ని ప్రవేశపెట్టి కావ్యభాషను అటూ పెంచారు.

అయితే సంస్కృత, ఆంగ్ల, ఆంధ్ర సంప్రదాయాల్ని కలిపి నవ్యరీతులలో పోతపోసే తమకములో ఖండకావ్యాలలోని భావము సహజంగా నిర్విరామంగా సద్య: పరనిర్వృతి కలిగించే టట్లు సాగిపోతోందాలేదా అని చూసుకునే చిన్నమెలకువ జారిపోయిందను కుంటున్నాను. లేకుంటే సాధుగీతి రెండు పద్యాలతో ఆఖరవదు. 'ప్రణయశాంతి' తెలిసిన తలపులతో తెలియని భావమువైపు వేలు చూపించుతూ ఉండదు. 'భవతి భిక్షాందేహి' తొడిమ లెడసేయగా రాలిపడిన పూలవలపులేవి ?' అని భావాన్ని మబ్బుల వెనక్కివిసరక, 'తొడిమలెడయ్యెనపూలెట్లు యెడదవలపు పడయనౌను భిక్షాందేహి భవతిభవతి' అనో ఇంతకంటె ఇంపైన విధంగానో రెండో భాగముతో మేళవించి యుండును. కాపుపాటలోని రెండో పద్యము "వ్రాలిన సంజలన్ మరలివచ్చెడు గోవుల పాలుతియగా తోలెడుదాక, త్రాడు లను దుత్తలు నావలబెట్టి, సిగ్గులన్ సోలెడు చిన్నదాన, యెటు చూచిన నెవ్వరులేనిచోట యుయ్యాల నెక్కియూగ మన సయ్యెడు నీవును నేను వేడుకన్" అన్నది, ఇప్పటివలె "వ్రాలిన సంజలన్" అని ప్రారంభిస్తూ అన్ని సంజలనూ పేర్కొని, 'ప్రేయసి లేచిరమ్మ' అని ఆహ్వానించిన కుమారకర్షకుని తమకమును అనవసరంగా సంజలన్నిటికీ పఱచి పల్చనచేయక వ్రాలెడు సంజలో" అని నడిచి ఆనాటి కాలవిరామాన్ని మట్టుకు పేర్కొని, మూడో పద్యములోని ఊహకు దారిచేసియుండును. 'అరవిందఘోషు'లోని మూడో పద్యము ఊరూపేరు లేని రాయచూరును కాక ఏ ఇంద్రప్రస్థమునో పేర్కొని యుండును. "మహాకవి తిక్కన" మొదటీ, మూడో, ఆరో, ఏడో, పద్యాలు విడిచిపెట్టేసి, ఇప్పటి అనవసర సంచారమును మాని తిక్కనమీదనే దృష్టిని నిలిపియుండును. 'బాల్యస్మృతి రెండో, మూడో, పద్యాలు పడవేసి రూపుతీరి నిలబడియుండును. 'మృతప్రేమ,' ప్రశ్నలను మోసినదెవరు ? అనే ప్రశ్నకు "శీర్షకనైన నేను" అని అనడానికి మాత్రమేకాకుండా కావ్య రూపములోనే తలాతోకా కనబడేటట్టు ప్రవేశించి యుండును. క్రొత్తదనము సాధించే తమకములో రచనా జాగరూకత సడలి నట్లు 'తొడిమ లెడసేయగా రాలిపడిన పూలవలపులేవి ?' అన్వయమైత్రి అందుకోని 'ధవళగోవ్రాతము, నవనవనీతము, ఒక్క 'మావి ఈడు'కు 'నీవు నేనును' అని యిద్దరిని పోల్చడమూ "సంపాదివై.... నాయెద కానందముగూర్చు లక్ష్మి విడినోయెన్" అనడమూకూడా తెలుపుతూన్నాయి.

రాయప్రోలువారి 'ప్రేమ' ప్రచారము వీరినీ లోగొన్నది. నాలుగుపద్యాలువ్రాసి వీరు "అప్రాప్తమనోహారికి"చ్చి తరువాతి కవుల అప్రాప్త మనోహారికి మూలవిరాట్టును సృష్టించారు. మృతప్రేమ, క్షణికప్రేమ, పూర్వప్రేమ, అన్నవి ప్రేమ వృక్షమునకు వీరుచేర్చిన కొత్తశాఖలు. రాయప్రోలువారి "హేయ రక్తిం దగులాని ప్రేమరుచికి వెలి" కాకూడదనే సందేశము వీరి "మోమున మోముజేర్చి నిను ముద్దిడు కోరికలేదు, నీదు వక్షోమృదుశయ్యపైని శిరసున్ గెడవాలిచి, వేలుమల్లికా దామ సువాసనామధుర తల్పరికింపగా గాంక్షలేదు, నాప్రేమకు దారిజూపగ వరించితి నాయలరించు నెచ్చెలీ"లో చిత్రమైన దారి తొక్కింది. ఏమీ అక్కరలేకపోయినా అన్నీ వున్నచోట చూచుకొని వరించినా ఈయన సృజించిన ప్రేయసుడు! అన్నాడుగదా యుగంధరుడు 'అందుచేతే పాడు పొట్టకు అన్నమే వేతామురా' అని?

రాయప్రోలువారి 'నిండారబారు' పద్యాలు వీరికి గట్టిగా తాకినవి. అందులో గోదావరీ, తుంగభద్రా ఉన్నవి. వీరు కృష్ణా స్రవంతీ తరంగాంతరంగము, కృష్ణవేణీస్తవము, స్వాదు కృష్ణానదీ జలము, కృష్ణవేణీ తరంగిణీనున్న ఝురి, పాడుబడిన కొండల (పి. డబ్ల్యు. డి. వారు కంకరకోనము కొట్టిస్తే పాడుపడిన కొండలై యుంటాయి ఇవి. ఈనాడున్నాయి ఇవి విజయవాడలో.)

సమీపమునబారు కృష్ణవేణి విషాద సంగీతగతులు వినిపించి వినిపించి కృష్ణామల తోయమందలి ప్రశాంతపు 'రాగము' (!)లు కవితా మృదువాక్యముల వ్యాఖ్యాయము చేయుటలో తిక్కనగారి మహనీయ గాన రమణీయతతో సరిపోలునని సూచించినారు. రాయప్రోలువారి 'పాడైన పెనుకోట గోడలు' కాకతి ప్రాభవమ్మునకు శయ్యలైతే వీరికి 'రాయచూరు విభవమ్ముల నిల్పిన జీర్ణ భిత్తికలు, ఉదాత్త పూర్వ కథాగాయకులైనాయి. రాయప్రోలువారి 'వృద్ధవృక్షము' హరిణపుత్రి, హిమకుమారుడు వంటి ఆంగ్ల కవితా సంప్రదాయపు ప్రయోగమ్ము శ్రీయనకు నచ్చినవి. సోదర కుమారకులు, బాల వెన్నెలలు, యువదీప్తులు, గీతాకుమారులు వంటి ప్రయోగములు చేసినారు. రాయప్రోలువారి అప్రాప్త ప్రేమ' అసంపూర్ణప్రేమ' లకు వీరు పూర్వ ప్రేమలో ఈ జన్మానికి సంబంధించని పూర్వ జన్మమునాటి ప్రేమను కలిపేరు.

'పూర్వప్రేమ' అన్నది ఒక కావ్యఖండము. దీనిలో పూర్వ కథా అనంతర కథా విడువబడినవి. లక్ష్మీన్ద్రుని వేహుళ వివాహమాడి, అతనిని తొలిసారి కలుసుకున్న రాత్రిలోనే అతడు మనసాదేవి శాపమువల్ల సర్పదష్టుడై మరణించినాడు. ఆమె సావిత్రిని మించిన సాధ్వీశీలముతో అతనిని పునర్జీవితునిచేయ నుద్యమించి, ఈ కష్టమునకు కారణమైన మనసాదేవినిస్తుతించినది. ఇదీ కథ. దీనిని వేహుళయొక్క పూర్వ ప్రేమనుచూపే ఉద్దేశ్యముతోనే ఖండముగా రచించారనిపిస్తుంది. లక్ష్మీంద్రుని తండ్రి కులక్రమాగతమైన మనసాదేవ్యారాధనమునుమాని ఎన్ని బాధలు పెట్టినా మారకపోవడమువల్ల మనసాదేవి లక్ష్మీంద్ర కుమారుడు శోభనవేళ రాత్రి సర్పదష్టుడై మరణించునని శపించిన కథా, శాపమును తప్పించుటకని లక్ష్మీంద్రునికి ఇనుపమేడ నిర్మించుటా, మనసాదేవి దానిలో ఒకరంధ్రమును కల్పించుటా కవిగారు 'పూర్వకథ'గా చెప్పేశానన్నారుకాని, కావ్యములో చెప్పలేదు. వేహుళ మనస్తాపమును ప్రారంభించినట్లు చూపినారుకాని, అనంతరగాథను చెప్పలేదు. కనుక కేవలము వేహుళ పూర్వప్రేమను చూపడమే ఆయన ఉద్దేశ్యమని తెల్లము.

ఈ కథా రచనలో అపేక్షను పోషిస్తూ, చక్కగా తీసుకు పోతారీయన చదువరిని. రాయప్రోలు కథనములో ఆయన అభిప్రాయాలు అడపా దడపా ప్రవేశించి కథా సాంద్రతను పలచన చేస్తాయి. రామలింగారెడ్డిగారి కథనములో పాత్రలు ఆయనగారి మేధాశక్తిని సూచించే మాటలు—తమ నైజమును దాటి నుదూరము దాటిపోయినట్టివి—పలికి, రచయితని జ్ఞాపకము చేస్తాయి. పూర్వ ప్రేమలో వీరి కథనము సూటిగా సాగిపోతుంది. పూర్వ కథను కావ్యరూపంగా చెప్పకపోవడమువల్ల కానలేముకాని, తన శాపాన్ని తప్పించడానికి కట్టిన ఇనుపమేడ గదికి మనసాదేవి ఒక రంధ్రము కల్పించెననే సంగతి "రంధ్రము నొకదానినుండి కిరణ మొక్కక డా గదిలోని నేలపై తేమలుచునుండె"నన్న సూచనా వాక్యమునుబట్టి మనకి స్ఫురించి బాధపెట్టుతుంది. 'పాండువయి తెల్లని సర్పము ప్రాకుపోలికన్' అన్న తరువాతి వాక్యము, ఆ రంధ్రమునుండి సర్పము ప్రవేశించగలదని సూచించి విధిబలీయతను ధ్వనిస్తుంది.

(గురజాడవారు కన్యక కథలో 'నాడు గుడిలో మండె గుండం మంట మిరిటెని ముట్టియాడగ' నన్న వాక్యంతో జరగబోయే ఘోరత్వాగాన్ని సూచిస్తారు. రాయప్రోలువారు స్నేహలతాదేవిలో "నిత్య సాంధ్యకుమారి కట్టుచీర చెరంగు కాలుపోల్కి" వల్ల ముందే ఇదేదో 'విషాద కథనము' అని సూచించారు. అంతకన్న ఇక్కడలాగ కథలో నిమిడ్చిననే కావ్యార్థసూచి ఉత్కంఠను పోషించగలదు. రాయప్రోలు 'కష్టకమలలో' ఒడ్డాణము ఉరిత్రాడులాగ కనబడిందన్న వాక్యానికి హఠాత్సంభవమైన కమల జడ ఉరికి సూచన కాగలిగిన శక్తిలేదు) రాత్రి ఒక జాము గడవగానే వేహుళ లక్ష్మీంద్రుని విడాహాశమనము చెయ్యడానికి పానకము వండితెస్తూ, ఆ కిరణము మాయుచు కావడము గుర్తించి, పైకి చూచి, "మే నొదిగి యొదింగివచ్చు మలినోరగముంగ" నెనట. 'మలినో'రగము గొప్ప వ్యంజకశక్తిగల పదము. జరగబోయే విపరీతమును గురించిన కవిభావమూ, మన తిరుగుబాటూ కూడా "మలిన" అన్న పదములో—విత్తనములో చెట్టులాగ గింజుకుంటాయి ఆ 'మలినోరగము'ను గని! విషోరగమునుకాదు. పానకము నానెడువేళ వేహుళ గుడ్డపేలికలు పేనిన తాట కరాళ దర్వీకర కంఠగోళమును బిగించినదట! గొంతుక్కాయ బిగించేశింది. దేనిగొంతుకాయనూ? పాము గొంతుక్కాయను! ఇక్కడ కవి యుత్కంఠనూ, మన యుత్కంఠనూ చక్కగా పోషిస్తోంది 'కంఠగోళము'న్నమాట. కంఠనాళము అనవచ్చునుగదా? 'గోళము' అనడములో భావోద్వేగ రచనాశక్తి ద్యోతకమౌతున్నది. వీరు వృత్తాలను అమోఘముగా నడపగలరు గాని, వీరి రచనా చైతన్యానికి వృత్తముకాక, ద్విపదయే అనుకూలమేమోనని వేహుళ గంగాప్రయాణ ఘట్టము చదివితే నా కనిపించింది. వారు ఆ కథను ద్విపదలోనే పూర్తి చేయలేదేమని నేను బాధపడ్డాను. వారలాగ పూర్తిచేసివుంటే కళకాలమూ నిలిచే కావ్యమొకటి తెలుగునాటి కావ్యాలకు చేరియుండేది. ఇప్పటి భాగమేనా. వజ్రపు తునుక, రామకృష్ణారావుగారి రచనలకు జయపతాక.

చైనా దురాక్రమణ గాథ

పోతే కమ్యూనిస్టు చైనా భారతదేశానికి మరొక చిక్కు కూడా తెచ్చిపెట్టింది. యుద్ధ విరమణ నెపంతో భారత దేశానిదే పూర్తిగా తప్పు అనే ప్రచారాన్ని ప్రారంభించింది. ఆఫ్రికా, ఆసియా రాజ్యాలను తన విష ప్రచారంద్వారా తన వైపుకు తిప్పుకోవాలని ప్రయత్నించింది. తద్వారా ఆసియా ఖండంలో భారతదేశాన్ని ఏకాకిగా చేయాలని ప్రయత్నించింది. కొలంబోలో ఆరు ఆసియా రాజ్యాల సభను ప్రోత్సహించింది. ఈ రకమైన ప్రయత్నాన్ని నిరోధించడానికి కూడా భారత ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకున్నది. మంత్రి శ్రీమతి లక్ష్మీమీనన్‌ను బర్మా, కంబోడియా, ఇండోనేసియా, కొలంబో లకు, మంత్రి శ్రీ అశోక్‌సేన్‌ను అరబ్ రిపబ్లిక్, ఘనాలకు పంపించి, భారత ప్రభుత్వ వాదనను వివరించింది. పన్నెండు సంవత్సరాలుగా చైనా కొనసాగించిన దురాక్రమణను బట్టబయలు చేసింది. అనిథంగా ఆఫ్రికా—ఆసియా రాజ్యాల సుహృద్భావాన్ని భారతదేశం సంపాదించింది. యుద్ధం ఆరంభమైనప్పుడు అరబ్ రిపబ్లిక్ అధ్యక్షుడు శ్రీ నాసర్ చేసిన ప్రతిపాదనల ప్రకారం 1962 సెప్టెంబరు 8కి పూర్వంఉన్న స్థావరాలకు చైనాసైన్యాలు వెనక్కు తగ్గాలన్న ప్రతిపాదనకు బలం హెచ్చింది.

అయితే 1962 సెప్టెంబరు 8కి పూర్వంవున్న స్థావరాలకు తిరోగమించడానికి కమ్యూనిస్టుచైనా అంగీకరించలేదు. పైగా 1959 నవంబరు 7నాటి "వాస్తవిక కంట్రోలుహద్దు" వరకు ఉభయులు తిరోగమించాలని ఎదురుప్రతిపాదనచేసింది. ఈ ప్రతిపాదన పైచూపులకు చైనా మంచితనాన్ని బయట పెట్టేదిగావుంది. కేవలం తేదీల దృష్ట్యాచూస్తే భారతదేశం ప్రతిపాదించిన 1962 సెప్టెంబరు 8 కంటే 1959 నవంబరు 7వ తేదీ ఇంకావెనకటిదని, పాత తేదీనాటి హద్దులకు తిరోగమించాలనడం సహేతుకమని పైచూపులకు అనిపిస్తుంది. కాని ఈ తేదీలనాటికి సరిహద్దులలో ఎవరు ఎంత ఆక్రమించారనేది పరిశీలిస్తేకాని ఈ ప్రతిపాదనలోని మోసం బయటపడదు.

తూర్పురంగంలో అంటే నీఫాలో 1962 సెప్టెంబరు 8 వరకు చైనాసైన్యాలు మెక్‌మాహన్ రేఖకు అవతల వున్నాయి. అయితే మెక్‌మాహన్‌రేఖ ఉనికిని గురించి వివాదంవుంది. తాగ్లా కనుమకు ఎగువగా చిరకాలంగావున్న ఈ రేఖ "అక్రమమైనదని" అది తాగ్లాకనుమకు దిగువగా వుండాలని చైనా వాదిస్తున్నది. ఈ తాగ్లా కొండమీద భారతగస్తీ స్థావరంవుంది. దాని వల్లనే 1962 సెప్టెంబరు 8న కమ్యూనిస్టుచైనా ప్రారంభించిన దాడిసంగతి తెలియవచ్చింది. తాగ్లా కొండనుంచి 1962 సెప్టెంబరు 8న ప్రారంభమైన దాడిలో నవంబరు 21 నాటికి బొమిడిలా కనుమవరకు అంటే దాదాపు 200 మైళ్ళవరకు చైనా సైనాలు చొచ్చుకువచ్చాయి. ఈ మార్గంలోనే జాంగ్, తవాంగ్, సీలాకనుమలు వున్నాయి. ఇక నీఫాలోనే అస్సాం సరిహద్దులవైపున లోహిత్ డివిజనులో వలాంగ్‌వరకు అంటే సుమారు 100 మైళ్ళు చొచ్చుకువచ్చాయి. నీఫాలోనే మధ్య రంగంలో లోంగ్జూ ప్రాంతంలో 30 నుంచి 50 మైళ్ళవరకు ముందుకుసాగాయి. ఇది 1962 నవంబరు 30వ తేదీనాటికి వున్న "వాస్తవిక కంట్రోలుహద్దు. : ఈ హద్దునుంచి 1962 సెప్టెంబ 8కి పూర్వమున్న స్థావరాలకు అంటే మెక్‌మాహన్ రేఖను, తాగ్లాస్థావరాన్నికూడాదాటి వెనక్కువెళ్ళాలని భారత ప్రతిపాదన సారాంశంగా వుంది. ఈ హద్దునుంచి 1959 నవంబరు 7కు తాము అర్థంచెప్పుకుంటున్న మెక్‌మాహన్ రేఖ అంటే తాంగ్లాకొండకు ఈవలవరకువున్న రేఖవరకు వెనక్కు తగ్గగలమనేది చైనా ప్రతిపాదనల సారాంశం గావుంది. అందువల్ల వాస్తవిక కంట్రోలుహద్దు అంటే ఏమిటి అన్న అనుమానం బయలుదేరి, దానికి సంబంధించిన నిర్వచనం అవసరమైంది.

పశ్చిమ్మాన లడక్ రంగంలో 1959 నవంబరు 7 నాటికి కమ్యూనిస్టు చైనా దాదాపు 14,000 చదరపు మైళ్ళు ఆక్రమించింది. స్పాంగూర్, కుర్నక్ కోట, కోంగ్ కాలా, అక్సాయ్‌చిన్ రోడ్డుల వెంట తన గస్తీ స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. 1962 సెప్టెంబరు 8 నాటికి మరొక నూరుమైళ్ళు ముందుకు చొచ్చుకు వచ్చారు. ఉత్తరదిక్కున ఉన్న దౌలత్‌బేగ్ వోల్డీకి దిగువగా బయలుదేరి చిప్‌చాప్ లోయ వెంట గల్వాన్ నదికి ఆవలనుంచి పెంగాంగ్, స్పాంగూర్ సరస్సు వరకు రోడ్లు వగైరాలు నిర్మించి స్థిరపడ్డారు. అయితే భారతప్రభుత్వం వీరిని నిరోధించే ఏర్పాట్లు చేసింది. కొత్తగా 43 గస్తీ స్థావరాలను నెలకొల్పి, సుమారు 2,500 మైళ్ళు పునరాక్రమణ చేసింది. ఈ స్థావరాలు ఉన్నందునే 1962 సెప్టెంబరు 7 న కమ్యూనిస్టు చైనా ఉవ్వెత్తు దాడి సంగతి తెలియవచ్చింది. 1962 నవంబరు 30 నాటికి సైనిక చర్యలద్వారా సుమారు 2000 చదరపు మైళ్లను కమ్యూనిస్టు సైనికులు ఆక్రమించారు. ఇవి లడక్‌లో ఉన్న వాస్తవిక ఆక్రమణ సరిహద్దులు.

చైనా చేసిన యుద్ధ విరమణ ప్రతిపాదనల ప్రకారం 1959 నవంబరు 7 నాటికి కమ్యూనిస్టు సైన్యాలు అక్సాయ్ చిన్‌రోడ్డు సమీపం వరకు తిరోగమించాలి. ఈ అర్థమే నిజమైతే భారత ప్రభుత్వం కోరుతున్నట్లు 1962 సెప్టెంబరు 8 కి పూర్వం ఉన్న స్థావరాలకు చైనా సైన్యాలు మళ్ళవలసి ఉంటుంది. కాని కమ్యూనిస్టు చైనా చెప్పుకొనే అర్థం ఇదికాదు. లడక్ రంగంలో వాస్తవిక కంట్రోలు హద్దు అంటే 1962 నవంబరు 21 నాటికి తనకింద ఉన్న భాగాలన్నీ అనే అర్థాన్ని చైనా చెబుతున్నది. అందువల్లనే ఇక్కడ వాస్తవిక కంట్రోలు హద్దు అంటే ఏమిటో చైనా నుంచి వివరణ అవసరమైంది.

ఇలా విభిన్నమైన నిర్వచనాలకు అవకాశమిచ్చే పద జాలంతో 1962 నవంబరు 21 వ తేదీన కమ్యూనిస్టు చైనా ప్రతిపాదనలు భారత ప్రజలనే కాక, ప్రపంచ ప్రజానీకాన్ని కూడా తికమక పరచాయి. అందువల్లనే ఇందుకు

సంబంధించిన వివరణలు కావాలని భారతప్రభుత్వం చైనాను కోరింది. 1962 డిశంబరు 30 వరకు స్పష్టమైన సమాధానం రాలేదు. పైగా ఇంకా తికమక పరచే వివరాలు అందాయి.

వీటినిబట్టి చూడగా కమ్యూనిస్టు చైనా చేసిన ఏకపక్ష యుద్ధ విరమణ ప్రతిపాదనల సారాంశం ఇది :—

నీఫా రంగంలో బొమిదిలా, వలాంగ్‌ల వద్ద కమ్యూనిస్టు చైనా తనకు తానై యుద్ధవిరమణ చేసింది. అక్కడ నుంచి తాను అర్థం చెప్పుకుంటున్న మెక్‌మాహన్ రేఖ వరకు ఆతర్వాత 12½ మైళ్ల వరకు తన సేనలను ఉపసంహరిస్తుంది. బొమిదిలా, వలాంగ్‌ల నుంచి మెక్‌మాహన్ రేఖ వరకు తన ఆక్రమణ క్రింద ఉన్న ప్రాంతంలో సివిల్ పోలీసు స్థావరాలను ఏర్పాటు చేస్తుంది. అలాగే లడక్ రంగంలో కూడా తాను ఆక్రమించుకున్న ప్రాంతమంతా తన వాస్తవిక కంట్రోలు హద్దుగా పరిగణిస్తుంది. యుద్ధవిరమణద్వారా సైన్యాన్ని ఉపసంహరించే ప్రాంతాలలో సివిల్ పోలీసు స్థావరాలను ఏర్పాటు చేస్తుంది. ఈ ఏర్పాట్లు డిశంబరు ఒకటవ తేదీనుంచి ప్రారంభ మవుతాయి.

ఈ సందర్భాలలో భారత సైన్యాలు కూడా వాస్తవిక కంట్రోలు హద్దు నుంచి 12½ మైళ్లు వెనక్కు తగ్గాలి. కోల్పోయిన స్థావరాల పునరాక్రమణ చేయకూడదు. అందుకు ప్రయత్నించినా, ఎదురు దాడులు చేసినా ఆత్మసంరక్షణార్థం కమ్యూనిస్టు చైనా తిరిగి యుద్ధాన్ని ప్రారంభిస్తుంది.

ఈ ప్రకారం జరిగితే నీఫా రంగంలో భారతదేశానికి సింహద్వారా లనదగిన దక్షిణ కొసలో ఉన్న కొండ కనుమలను భారతదేశం కోల్పోతుంది. అక్కడ భారత సైనిక స్థావరాలు ఉండవు. కమ్యూనిస్టు చైనా ఎప్పుడు తలుచుకుంటే అప్పుడు నిరాఘాటంగా ముందుకు చొచ్చుకు రాగల అవకాశం ఉంటుంది. లడక్‌లో "వాస్తవిక ఆక్రమణ హద్దు" అంటే ఏదో కచ్చితంగా తెలియదు. కాని వారు ఉపసంహరించిన స్థావరాలకు తిరిగి సులభంగా రాగల పరిస్థితుల్లో వారు ఉండిపోగల మాట నిజం. అంటే తనకు అనుకూలమైన స్థావరాలకు కమ్యూనిస్టు సైన్యాలు వెనక్కు తగ్గుతున్నాయి. తాము కోరుకున్న సుమారు 50,000 చదరపుమైళ్లను ఏదో ఒక విధంగా తమకింద ఉంచుకున్నాయి.

ఇక భారతప్రభుత్వం ప్రతిపాదనల సారాంశం ఇది :—

1962 సెప్టెంబరు 8 కి పూర్వం సరిహద్దుల్లో ఉన్న స్థితిని కనీసం పునరుద్ధరించాలి. అంటే నీఫాలో మెక్ మాహన్ రేఖ వరకు వెనక్కు తగ్గాలి. లడక్ రంగంలో అక్సాయ్‌చిన్ సమీప ప్రాంతాల వరకు తిరోగమించాలి. అలా చైనా సైన్యాలు కాళీచేసిన స్థావరాలు భారతప్రభుత్వ అధీనం కావాలి. ఆ తర్వాతనే సరిహద్దుల సర్దుబాట్లకు సంబంధించిన చర్యలు జరగాలి. అంటే చైనా సాయుధబలంతో దురాక్రమణ చేసిన సరిహద్దు ప్రాంతాలను కమ్యూనిస్టు చైనా కాళీచేసి భారతదేశానికి అప్పగింత పెట్టాలి.

ఇందుకు కమ్యూనిస్టు చైనా అంగీకరించలేదు. 1962 నవంబరు 21 వ తేదీన ఏకపక్ష యుద్ధ విరమణ ప్రకటన చేసింది. ఆ మరునాటి నుంచి సరిహద్దుల్లో యుద్ధవిరమణ చేసింది. నవంబరు 30 వ తేదీ వరకు సరిహద్దుల్లో యుద్ధం సాగిన వార్తలు లేవు. అక్కడితో ఒక ఘట్టం ముగిసింది.

1962 డిశంబరు ఒకట వ తేదీ నుంచి కమ్యూనిస్టు చైనా సైన్యాల ఉపసంహరణ ప్రారంభం కావడంతో రెండవ ఘట్టం ప్రారంభమైంది. నీఫాలో తాంబియాపాణి, పెంచియుంగ్, తాయ్‌చూ కనుమ, గెల్లింగ్, మెచూకాల వరకు, లడక్‌లో చిప్‌చాప్ లోయలోని నాలుగు స్థావరాల నుంచి, కరకష్‌నదీ ప్రాంతంలోని రెండు స్థావరాల నుంచి, పరిగస్ ప్రాంతంలోని కరగొచాంగ్ కనుమ నుంచి తన సైన్యాలను ఉపసంహరిస్తున్నట్టు ప్రకటించింది. 1959 నవంబరు 7 నాటి "వాస్తవిక కంట్రోలు హద్దు" కు ఆవల 12½ మైళ్ల దూరంలో ఈ స్థావరాలు కలవని వివరించింది. ఈ స్థావరాలకు చైనా సైన్యాల ఉపసంహరణ ఎప్పటికి పూర్తి కాగలదో తెలియదు. ఆ తర్వాత ఎప్పటికి సివిల్ పోలీసు స్థావరాలు ఏర్పాటు చేస్తారో అర్థంకాదు.

1962 డిశంబరు ఒకటవ తేదీకి స్పష్టంకాని అంశాలు ఇవి :—

కమ్యూనిస్టు చైనా తనకు తానుగా చేసిన ప్రతిపాదనల ప్రకారం ఏకపక్షంగా యుద్ధవిరమణ చేసింది. తాను పెట్టుకున్న హద్దుల వరకు తన సైన్యాలను ఉపసంహరిస్తున్నది. ఇక భారత ప్రభుత్వం ఏమి చేస్తుంది ? తన ప్రతిపాదనల ప్రకారం 1962 సెప్టెంబరుకి పూర్వం తన కింద ఉన్న స్థావరాలను తిరిగి ఆక్రమించుకొనడానికి ప్రయత్నిస్తుందా ? ఉపసంహరించిన ప్రాంతాలలో చైనా సివిల్ పోలీసు స్థావరాలను నెలకొల్పినప్పుడు భారతప్రభుత్వం ఏమి చేస్తుంది.? అసలు చైనా యుద్ధవిరమణ ప్రతిపాదనలను భారతప్రభుత్వం అంగీకరించినట్టా ? నిరాకరించినట్టా ? ఈ ప్రశ్నలే డిశంబరు ఒకటవ తేదీకి సర్వత్రా వినవస్తున్నవి. కాని భారత ప్రభుత్వం మాత్రం ఏ సమాధానం చెప్పడం లేదు. దాని సందిగ్ధ స్థితి, ఊగిసలాటయింపు ప్రజలను స్తబ్దతలో ముంచి వేసింది.

'విశ్వగుణాదర్శ చంపువు' నాఁటి తెలుఁగుదేశము

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

సంస్కృత వాఙ్మయము ఒక మహా సాగరము వంటిది. అన్వేషించినకొలఁది ఆ మహాసముద్రంలో ఎన్నో రత్నములు అమూల్యములు మనకు లభింపఁగలవు. కాళిదాస, భవభూతి, బాణభట్టాది మహాకవులు వ్రాసిన రఘువంశ—మాలతీమాధవ— కాదంబర్యాదులు రసిక జనులకు వినోద జనకములగుచున్నవి. వానిలోనున్న వ్యంగ్యములు—ధ్వనులు— రసము— గుణాలంకారములు, ఇట్టివి ఎన్నో విశేషములను మమ్మటాదులు నిరూపించి లక్షణ గ్రంథములుగా చిత్రించిరి. సహృదయ హృదయాహ్లాద జనకమే కావ్యమన్నది సంక్షిప్త లక్షణముగా చెప్పవచ్చును. కేవల పద్య రూపము—కేవల గద్యరూపము—గద్య పద్య మిశ్రము అని కావ్యము మూఁడు విధములు. అందును దృశ్యము—శ్రవ్యము అని మరొక విభాగము. అభిజ్ఞాన శాకుంతలము దృశ్యము. రఘువంశము శ్రవ్యము. గద్య పద్యాత్మకమైన శ్రవ్యమును చంపూ కావ్యమందురు. రామాయణ చంపువు— భారత చంపువు—విశ్వగుణాదర్శచంపువు, ఈ శ్రేణిలోఁజేరిన మహా కావ్యములు. చంపూ కావ్య విశిష్టతనుగూర్చి ప్రకృత విశ్వగుణాదర్శకర్త ఇట్లని మెచ్చుకొనెను:—

శా. పద్యం యద్యపి విద్యతే బహుసతాం హృద్యం విగద్యంనతత్
గద్యంచ ప్రతిపద్యతే న విజహత్పద్యం బుధాస్వాద్యతామ్
ఆధత్తేహి తయోః ప్రయోగ ఉభయో రామోదభూమోదయం
సంగః కస్యహి నస్యదేత మనసో మార్ద్వీక మృద్వీ కయోః'

కేవల పద్య కావ్యముకన్న కేవల గద్యకావ్యముకన్న చంపూ కావ్యమే తేనెలోఁ గలసిన ద్రాక్షారసమువోలె హృద్యమైయుండునని దీని సారాంశము. అదేమి విచిత్రమోగాని, ఈ ధోరణి అక్షరాల పాటించినవారు ఆంధ్ర మహా కవులన్నమాట మనము మరువరాదు.

విశ్వగుణాదర్శ చంపువును వ్రాసినది వేంకటాధ్వరి మహాకవి. ఈ కావ్యములోని యంశములు ఎంత విశిష్టములో ఈ మహాకవి చరిత్రయు అంత విశిష్టమైనది. ఈతఁడు రామానుజ మతానుయాయి; శ్రీ మహాలక్ష్మి భక్తుఁడును—అని పేర్పొందెను. ఇతనిది కాంచీమండలము. ఈతని తండ్రి పేరు రఘునాథ దీక్షితులు. ఆయన తండ్రిపేరు అప్పయ గురువులు. అప్పయ గురువుల మేనమామ తాతాచార్యులు. తాతాచార్యులవా రనఁగానే రాయలవారి జ్ఞప్తికి వత్తురు. అనఁగా సాహితీ సమరాంగణ సార్వభౌములైన కృష్ణదేవరాయలవారికి వంచ సంస్కార గురువై – మఖియై దిగంతకాంతకీర్తిని గడించెనని యర్థము. ఆయనకు ఈడు జోడు అయినవాఁడే మేనల్లుఁడు అప్పయగురువును. అప్పయ గురువునే అప్పయ దీక్షితులుగా కొందరు భ్రాంతి పడ వచ్చును. కువలయానంద—చిత్రమీమాంసాది గ్రంథకర్తయైన అప్పయ దీక్షితులు అద్వైతమత పక్షపాతియై పరమ శైవ భక్తుఁడై, వైష్ణవమత ఖండనము చేసిన ద్రవిడ జాతీయుడని ప్రసిద్ధి. ఈ 'అప్పయ గురువు' తాతాచార్యులవారి కోవలోనివాఁడు. ఈ కోవలో తాతనుమించిన మనుమఁడు వేంకటాధ్వరి. తన్నుఁగూర్చి తానే చెప్పుకొన్న ఇదిగో ఈ శ్లోకము వినుఁడు:—

శ్లో. తత్సుతస్తర్క వేదాంత తన్త్ర వ్యాకృతి చిన్తకః
వ్యక్తం విశ్వగుణాదర్శం విధత్తే వేఙ్కటాధ్వరీ.'

అనఁగా ఈ మహాకవి తర్క వ్యాకరణములు—తన్త్రవేదాంతము లక్షణ్ణముగా అభ్యసించిన విద్వన్మణియని చెప్పవచ్చును. ఈ గురు పరంపరనుబట్టిగాని ఈతఁడే వ్రాసిన ఈ కావ్యములోని

శ్లో. మూఢాః కరుణాహీనాః తృణవత్ బ్రాహ్మణగణం నగణయన్తి
తేషాం దోషః పాఠేనాచాం యేనా చరన్తి శౌచమపి'

అన్న శ్లోకమునుబట్టి, ఈ మహాకవి మూఁడువందల ఇరువది యేండ్లకుమున్ను ఉండెనని పెద్దలు నిర్ణయించిరి. అనఁగా మూఁడు వందలయేండ్లకుమున్ను ఈ భారతదేశము ఎట్లున్నదో కొంత వరకు ఈ కావ్యమువలన మనము గుర్తింపవచ్చును.

రసమయదృష్టిలో 'మాఘ—మేఘా'దులు ఒక నడకలో నడచి అందచందములు కూర్పఁగా, ఈ చంపువు ఇంకొక తీరులో నడచి ఎన్నో విశేషాంశములను చిత్రించినదనవచ్చును. అనేకత్వములో ఏకత్వమును వ్యక్తపరచుచు యావద్భారతదేశ

వైచిత్రిని చంపూ కావ్యముగా ఈ మహాకవి ప్రదర్శించెనన్నది పండితార్థము.

ఈ కావ్యములో వేంకటాధ్వరికవి ఇద్దరు గంధర్వులను సృష్టించెను. వారిర్వురు విశ్వావలోకన కుతూహలముచే విమాన మెక్కి గగన సంచారము చేసెదరు. వారిలో ఒకఁడు కేవలము దోషైక దృక్కు. అనఁగా జల్లెడవలె మేలు సరుకును బోనాడి, పెబ్బరను మాత్రమెత్తి చూపును. అతనిపేరు కృశానువు. రెండవ యాతఁడు విశ్వావసువు. ఇతఁడు విశ్వగుణ గ్రహణకౌతుకి. చేట వోలె చెడ్డవి చెరిగివైచి మంచినే గ్రహింపవలెనని ఎంచుతత్త్వము గల వ్యక్తి. ఒకే వస్తువు ఇర్వురును జూతురు. ఆ ఘట్టములో ఒకఁడు నందియని యానందింపఁగా రెండవ యతఁడు పందియని ఈసడించును. ఇరువురు హేతువాదములే చూపెదరు. అందు సనాతన ధర్మముతోపాటు సంస్కారదృష్టియు గర్భితము కావచ్చును. అందువలన— ఈ గ్రంథము స్తుతినిందాత్మకముగా పరిణమించినదనియు, విశిష్య—దేవతాప్రకోపమువలన ఈ మహాకవికి అంధ్యము సిద్ధించినదనియు, ఆవల నీతఁడు 'లక్ష్మీ సహస్రము' వ్రాసి జగజ్జననీస్తోత్రముచేసి కన్నులు తెప్పించుకొనెననియు కథలు విందుము.

ఏది ఏమైనను సంస్కృత సాహిత్య ప్రపంచములో వేంకటాధ్వరి ఒక మహాకవియనియు, ఈతఁడు వ్రాసిన ఈ కావ్యము అద్భుతమైన చరిత్రాంశములతోను పవిత్రమైన ఆధ్యాత్మిక భావములతోను ఒప్పుచున్న ఒక మహా కావ్యమనియు మనము తప్పక చెప్పవచ్చును.

ఆర్యావర్తములో హద్దులు—ఆ యా ప్రదేశములందలి విశేషములు మేఘ సందేశములో మహాకవి కాళిదాసు మనకుఁ జూపినట్లు ఈ చంపూ కావ్యములో వేంకటాధ్వరి మహాకవి ఎన్నో విశేషాంశములను జిత్రించెను. మూఁడు నాలుగు వందల యేండ్లకు మున్ను కాశ్మీరమునుండి కన్యాకుమారివరకు ఆ యా ప్రాంతములలో వ్యవహారము లెట్లుండెనో వారి వారి యాచారము లెట్లు నడచినవో భిన్నత్వములో అఖిల భారతీయమైన ఏకత్వము ఏ యే ఘట్టములలో ఎట్టెట్లు స్ఫురించుచున్నదో పట్టణ ప్రాభవములు—నదీ నదములు—క్షేత్ర మహాత్మ్యములు—తీర్థ మహిమలు—దేశపరిస్థితులు—అరణ్యప్రాంతములు—అప్రాచ్యుల దండయాత్రలు—మత ప్రవక్తల మహోపదేశములు—పర్వత పరిసరములు—మత ప్రమేయములు—శాస్త్ర నిర్ణయములు—సంప్రదాయ ప్రభావములు—ఆచారకాండలు—శాస్త్రవేత్తల వైఖరులు—రాజసేవకలక్షణములు—ఐతిహాసిక ఘట్టములు—కవీశ్వర ప్రస్తావములు—కళారంగములు—పూర్వ రాజర్షి వృత్తాంతములు—సూర్య చంద్ర గ్రహణములు, ఇట్టివి ఎన్నెన్నో చక్కఁగా మనకీ కావ్యము బోధించుచున్నది. ప్రయాణ సౌకర్యములు బొత్తిగాలేని ఆరోజులలో ఇట్టి విశేషాంశములను కనిపెట్టి స్వయముగా చూచినట్లు వర్ణించుట సామాన్యముకాదు. ఈ వర్ణనములవలన ఈ మహాకవి గడించిన ఆధ్యాత్మిక సంపదయే గాక, లౌకిక జ్ఞానము కూడ మనము గుర్తింపవచ్చును. ప్రాచీన భారతీయ కవులకు వర్ణనలమీఁద ఉన్న మక్కువ చరిత్రాంశములు చిత్రించుటలో కానరాదన్న అపవాదమునకు ఈ రచన అపవాద మాత్రమనవచ్చును. తరచి, లోఁతులు తడవి చూచినచో పురాతన సంస్కృత వాఙ్మయములో భారతీయ చరిత్ర చక్కఁగా వ్యక్తము చేయు ఘట్టము లనేకము లున్నవి. ఆ చూపుతో మనము పరిశీలించితిమేని ఎన్నెన్నో అంశములను మనము వెల్లడింపవచ్చును. ప్రకృతము ఈ విశ్వగుణాదర్శములోని ఒక్క ఘట్టమును మాత్రము దిక్సూచిగా చూతము:—

విమానమెక్కి సంచారమునకు ప్రయాణమైన గంధర్వులిద్దరకు మున్ముందు సూర్యభగవానుఁ డెదురగును. 'ఛాందసజ్యోతిషేనమః'—అని జ్యోతిర్మయ స్వరూపుఁడగు సూర్యునకు విశ్వావసువు నమస్కరింపగా—సర్వ భువన సంశోషకారియైన ఈ సూర్యునకు నమస్కార మెందులకయ్యా! అని కృశానువు ఈసడింపుతో కావ్యము ప్రారంభమగును. జగద్బంధువైన సూర్యభగవానునకు ఎందుల కభివందనము చేయవలసియున్నదో ఆ కారణములన్నియు చక్కఁగా విశ్వావసువు నిరూపించును. ఆవల—చూడవలసిన ఘట్టములన్నియు జూతురు. బదరికాశ్రమము—అయోధ్యానగరము—కాశీ పట్టణము—జగన్నాథ క్షేత్రము—ఘూర్జర దేశము—మహారాష్ట్ర ప్రాంతము, విమానము పోయి పోయి ఆంధ్రదేశమునకు వచ్చినది.

అక్కడ విమానమాపి ఆ యిర్వురు గంధర్వు లిట్లని ముచ్చటించుకొందురు. ఇది మూఁడు వందల ఏండ్లనాఁటి కథ యని మనము మరువరాదు.

విశ్వా:—ఏమోయి మిత్రమా! ఇదేనోయి ఆంధ్రదేశము.

శ్లో. సుశోభన క్రమకరైః సేవితో జీవనార్థిభిః
మధ్యస్థ బాడబోరాజ 'త్యాంధ్రదేశోనదేశవత్'

ఇక్కడ న—దేశవత్, నదీశవత్ అని రెండు పాఠములు. ఆంధ్రదేశము 'దేశవత్=అన్యదేశవత్ న రాజతి, అపితు సర్వోత్తమతయా రాజతి'అని అర్థాంతరము. నదీశవత్ సముద్రవత్ రాజతి శోభతే—శ్లేషాలంకారము నీటిని గోరుచున్న మొసళ్లు మున్నగు జలచరములు, బడబాగ్ని, సముద్రములో ఉండునని శ్లేష.

'విశ్వగుణాదర్శచంపువు నాఁటి తెలుఁగుదేశము'

మంచి జీవనము గలిగి ఆచారకాండలో పేరుమోసిన బ్రాహ్మణ్యము ఉన్న దేశమయ్యా ఇది—అని విశ్వావసువు భావము.

చాలు చాలు, కట్టిపెట్టవయ్యా కట్టిపెట్టు. మర్యాద మన్ననలేలేని ఈయాంధ్రదేశమునుగూర్చి వట్టి కోఁతలు కోయకు. అదిగో చూడు!!

శ్లో. గ్రామే గ్రామే నివసతి చిరాత్స్వామి భావేన శూద్రో
భృత్యో భూత్వావసతి గణనాం బ్రాహ్మణ స్తస్యపార్శ్వే .
వేదాధ్యాయీ సరఇవ మరౌక్వాపి కశ్చిద్యదిస్యాత్
అత్రాప్యత్ర ప్రకరకరణే వర్తతేఽసౌ నియుక్తః'

ఏ గ్రామములో జూచినను శూద్రునిదే పెత్తనమాయె. అతని పడిపంచలో రేయుంబవళ్లు పడియుండి వేచివేచి అతని సన్నిధిలో అనారతము నిలువుగాళ్ళ నిలిచి నిలిచి లెక్కలు డొక్కలు బ్రాహ్మణుఁడే వ్రాసి వినిపింపవలసి వచ్చెను. అథవా అదృష్టము పండి ఎక్కడనేని ఒక్కఁడు చవిటిపఱ్ఱలోని సరస్సువోలె వేదాధ్యాయి ఉన్నాఁడనుకో—అతని మొగాన అక్షరాల నిప్పులు అంట్లు తోముటయే వ్రాసిపెట్టియుండును. లెక్కలు డొక్కలు—అనఁగా వూరి వ్యవహారములు. మునిసిపులవద్ద కరణాలు లెక్కలు వ్రాయుచు ఉందురన్నది ఆనాఁటి చరిత్ర. ఇది రెండవ గంధర్వుని నోట వచ్చినమాట. విశ్వా:—అదేమిటోయ్! అట్లనవద్దు. ఈ యాంధ్రదేశములో వీరందరు యాగములు చేయరనుకో. వేదాలు వల్లింపరేయనుకో. అయినను, ఆ దేవతాభక్తి—ఆ బ్రాహ్మణాను రక్తి—ఆ సంభావనలు, సంతర్పణలు చాలవయ్యా వారి సర్వపాప పరిహారార్థము.

అదిగో చూడవయ్యా బాబూ! వాంఛ అంద చందాలు—రూపురేఖలు ఎట్టివో. ముద్దులొలుకు ముత్యాల హారాలు దాలిచి గుత్తముగా ఒత్తుకొని, చిత్తము నాకర్షించు ఆ చను కట్టులతో అట్టే మనస్సు నాకట్టు ఆ కట్టుబొట్టులతో—జవ్వనపు మవ్వముచే మిసమిసలాడు ఆంధ్ర పురంధ్రీమణులు ఎంత ముచ్చటగా గన్పించుచున్నారో చూచితివయ్యా మిత్రమా!

కల్పతరువు కల్పతరువని ఏదేదో ఘోషింతురుగాని, ఆ కల్పవృక్షములోని గొప్పతన మేమున్నది గనుక! దాని సారములాగవలెనని దగ్గఱిఁజేరు బంభరములను సంబరముగా నెత్తికెక్కించుకొని ఆ తరువు వూరేఁగునే! ఇఁక కర్ణుఁడున్నాఁడు. మహాదాతయఁట. కావచ్చుఁగాక. లాభమేమి? అర్జునుని కీర్తి ఎట్లు పడిపోవునా యని 'అస్తమానము' అతని కదే 'రంధి' యాయె. ఇంకొకటి కాలమేఘమున్నదయ్యా! అది యుఱుములు ఉఱిమిగానీ, ఆ గ్రుక్కెఁడు నీరు మన కియ్యదాయె. ఇఁక—చూచుకో. ఆంధ్రదేశాన రాజులు మహారాజులు కావించు దానధర్మములు ఆ తీరులో ఉండవు. వారి నోట ఒకమాట వచ్చెనా దానికిఁ దిరుగేలేదు.

మిత్రమా! చూడవయ్యా ఆ గోదావరీతీరాన భూదేవతల పరమశివ పరిచర్యాధుర్యతను. పవిత్రమైన ఆ తీర్థములో చక్కఁగా స్నానముచేసి, సైకతలింగములు స్థాపించుకొని భక్తి ప్రపత్తులు చూపుచు, తిలాక్షతలతో, పువ్వులతో, బిల్వపత్రములతో పూజలు చేయుచున్నారే!

'నమామి గిరినందినీ రమణ పూజా హృతా
మితాఘనికరాన్ కరాంచిత వరాక్షమాలాన్ సదా
అమూ నమలచేతస శ్శమదమాది యోగా వహాన్
శ్రుతేద్గుణ నికా నికామ పరిపూత వక్త్రాంబుజాన్'

పార్వతీపతి పాదార విందములకు, పూజలుచేయుచు సర్వ పాపదూరులై అక్షమాల త్రిప్పుచు, వేదాధ్యయనము చేయుచు కలకలలాడు మొగములతో శమదమాది యోగములు కలిగి పవిత్రత ఉట్టిపడుచున్న ఈ గోదావరీతీరవాసులకు చేయెత్తి నమస్కరింపవలెనయ్యా.

ఆహా! కృష్ణా గోదావరీ మధ్య ప్రదేశములో కాపురమున్న ఈ వైదిక బృందముయొక్క సంప్రదాయశుద్ధి ఎంతయని వర్ణింతునయ్యా! ఇక్కడి బ్రాహ్మణ్యమునకు వేదోచ్చారణములో మంచి పేరు ప్రతిష్ఠలున్నవయ్యా! ఈ ప్రాంతములో శాస్త్రజ్ఞులకు తరుగేలేదు.ఏఁటేఁట వసంతకాలములో యజ్ఞములు చేయుచు నారాయణ పరాయణులై హాయిగా కాలము గడపుచున్నారు.

అదేకాదుసుమా! అధికార వ్యాపార నిరతులలో సైతము కావలసినన్ని మంచి కట్టుపాటు లున్నవి. రాజుల నాశ్రయింతురు. ధన ధాన్యము లార్జింతురు. ఆపై, తామును దాన ధర్మముల్కావించి దశ దిశలలో పేరు ప్రతిష్ఠలు నిలుపుకొనుచున్నారు.

ఇది విని కృశానువు ఇట్లని వెక్కిరించును:—అయ్యయ్యో! ఎంత ఘోర కలిరా బాబు! ఈ యాంధ్రదేశములో ఎక్కడ జూచినను తురకలే తిరుగుచున్నారే! ఇదేమి కర్మమ్మఁటు!

'అవనా వతీత పవనాశ్వశోభినో
భవనాగశాయి భవనావమర్దినః
సవనాది ధర్మలవనాయ దీక్షితా
యవనాశ్చరన్తి భువనాతి భీషణాః'

వాయువేగ మనోవేగములచే పరువులుత్తోలు పందెపు గుఱ్ఱాలనెక్కి సవారులు తీయుచు, గుళ్ళగోపురాలు పడఁగొట్టుచు, ఆఁడువాండ్రను జెరబట్టుచు, అల్లరియాగాలు చేయుచు, యజ్ఞ

యాగాలు ధ్వంసము గావించుటయే వాండ్ర పనిగా ఉన్నదే! ఈ మ్లేచ్ఛజాతులు ఈ దేశములో పుడమి ఈనినట్లు పుట్టుకొని వచ్చి వర్ణాశ్రమ ధర్మములను పొట్టనబెట్టుకొనుచున్నారే! దీని కేమందువయ్యా!!

విశ్వా:—అవునవును. నీ వన్నది అక్షరాల నిజమే. కాని, వాండ్రలో సైతము ఉన్నట్టి సుగుణములను గూడఁ జూడవయ్యా బాబు! అనన్య సామాన్యమైన పరాక్రమ క్రమములో ఈ జాతికి పెట్టినది పేరు. లక్షలకొలఁది ప్రతిపక్షులు కత్తులు, కటారులు కేలబట్టి కదనరంగములో దూఁకనీ, వాండ్రనందరను ఢీకొనవలెనన్న— ఒక్క తురక చాలు. వాని చేతిలో కత్తియేయుండి, తానెక్కిన గుర్రమును ఒక్కయుదుటున ఉవ్వెత్తుగ దూఁకించెనా, ఎక్కడివా రక్కడ చిక్కులలోఁబడి బిక్కమొగములు వైచి, 'బరాబరులు' చేయవలసినదే. గడ్డి నోటఁ గరచుకొని, కాందిశీకులు కావలసినదే.

శ్లో. పిబంతు మదిరామమీ, పరితుదంతు దేశానహో !
హరంతు పరసుందరీ, రపలపంతు వేదానపి,
తథాపిచ మృథాంగణే తృణవదేవ ముక్త్వాతనుం
హఠాద్విదధతేమరుత్పుర కపాటికోద్ఘాటనమ్'

అలవాటనుబట్టి—ఈ జాతి కల్లుత్రావి కైపెక్కి తందనాలాడుచు. పరదార వ్యవహారములో ప్రవర్తింపనీ, దేశ దేశాలు కొల్లగొట్టనీ, వేదాలను ధిక్కరించుచు, వైదికులను దూషింపనీ. కాని, యుద్ధమే వచ్చెనా, వాండ్రదేహాలు వాండ్రవికావు. అప్పుడు వాండ్రకవి వట్టి గడ్డిపరకలక్రింద లెక్క. అలవోకగా త్రుటిలో వానిని ఉజ్జగించి 'హతోవాప్రాప్స్యసే స్వర్గ'మన్న ధోరణిలో ఆ జాతి పరవళ్లు త్రొక్కును.

ఇది ఆనాఁటి ఆంధ్రదేశములోని కథ. ఈ ఘట్టములో మనము వూహింపఁదగిన అంశములు మూఁడేమూఁడు. నాఁటి తెలుఁగు గడ్డలోని పరిస్థితినిబట్టి ఈనాఁటి వ్యవహారము తఱుగో మెఱుఁగో పరిశీలించుట. మన బ్రదుకులనుగూర్చి ఇరుగు పొరుగువారు ఏమని భావించి సంభావించిరో గుర్తించుట. మూఁడవది—ఒకే పదార్థములో లేదా—ఒకే వస్తువులో నిలిచియున్న మంచి సెబ్బరలను ఇరువురు వేఱు వేఱుగా వూహించుటలోని మానసిక ప్రవృత్తిని పరిగణించుట.

"ప్రమాదో ధీమతా మపి"

శ్రీ రావూరి మృత్యుంజయరావు

ఏతచ్ఛీర్షికారూప సూక్తి లక్ష్యలగు శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు 1962 సం. అక్టోబరు భారతి సంచికలో "అర్థిఁజేసి"—"అర్థిచేసి" అను శీర్షికతో శ్రీ ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులుగారికి సమాధాన మొసంగియున్నారు. ఆ సమాధానమునం దొకానొక సందర్భమునందు "శ. ప. క్రియలలో అరసున్నలు—ద్రుతకార్యములు ఉండవు" అని వ్రాసియున్నారు. ఆ వాక్యము ప్రమాద పతితము. ఏలయన నాంధ్రవాఙ్మయమునం దెల్లెడను కనుఁగొను, ఏఁగుదెంచు, అరుగుదెంచు, చనుదెంచు, అరుగుదేరన్, చనుదేరన్, అగుదెంచు, అరుదెంచు, కప్పుదెంచు మున్నగు క్రియ లెన్నియో యరసున్నలు గలవియు ద్రుతకార్యములు చేయుబడినవియు నగు శబ్ద పల్లవ క్రియ లెన్నేఁ గాన్పించుచున్నవి. ఉదాహరణమునకుఁ గొన్నింటికి మహా కవి ప్రయోగములు జూపెద.

గేలిగొను :-

" ..... వీనికెన యన్యులు లేరని గేలిగొంట .... "
—(కేతన) విజ్ఞా. ఆచారకాండ.

గనుపుగొట్టు :-

"గనుపుగొట్టె ననంగను దనరు నూచ, ముట్టుగా ...."
—ఆంధ్రభాషార్ణవము. 3 కాం. 129 ప.

ఏఁగుదెంచు :-

(i) " .... పరాశరనందనుఁ డేఁగుదెంచె .... "
భార. ఆది. 6 ఆ.

(ii) "నరపతియున్ రథావతరణం బొనరిం చెదురేఁగుదెంచినన్'
—జై. భా. 5 ఆ. 96 ప.

(iii) "అర్జునుం డాత డిందులకేఁగుదెంచె."
—జై. భా. 5 ఆ. 129 ప.

(iv) "ఎవ్వఁడే నొక్క మాయావి యేఁగుదెంచె."
—శృం. నై. 3 ఆ. 96 ప.

(v) " ..... అనురాగ మెలర్పఁగ నేఁగుదెంచె."
—శృం. నై. 4 ఆ. 105 ప.

(vi) " .... ఏఁగుదెంచి పూర్వ పరిచయంబున .... "
—శృం. నై. 4 ఆ. 106.

(vii) "అని ప్రస్తుతించుచుండ ఘంటాపథంబున నేఁగుదెంచి .... "
—శృం. నై. 5—17.

అరుగుదెంచు :-

(i) "అభ్రవాహినియును బోలె నరుగుదెంచె."
—శృం. నై. 5—88.

(ii) " ..... " ..... వే డ్క నరుగుదెంచినం గడఁగా..."
—జై. భా. 5—179.

(iii) " .... దనుజ పురోహితవర్యు డచటి
కరుగుదెంచిన యజ్ఞవాహంబుఁ జూచి."
—జై. భా. 5—129.

(iv) " .... రణ దోహలియై యరుగుదెంచె దోర్గర్వమునన్"

అరుదెంచు :

"అంత సరోరుహాప్తుఁ డుదయం బరుదెంచె .... "
—నిర్వచనోత్తర రామాయణము. 6 ఆ.

అగుదెంచు :-

"తడవగుదెంచె జమ్మికిఁ బ్రదక్షిణ వృత్తిగ .... "
భార. విరా. 4—171.

చనుదెంచు :-

(i) "చనుదెంచి నారలేమే
వినఁబడియెనె .... "
—జై. భా. 6—24.

(ii) "చేరఁ జనుదెంచి యంతంత తేరుడిగ్గె."
—శృం. నై. 3—44.

(iii) ' " .... చిత్రముగాఁ జనుదెంచె నెంద్రుకల్."
—కాళ. మాహా. 1—56.

(iv) " .... చేరఁ జనుదెంచె సింగవుఁ దేరిజోదు."
—కాళ. మాహా. 2—36.

(v) " .... సర్వజ్ఞా ! చనుదెంచినారము జగత్స్వామీ !
కటాక్షింపవే"
—మడికి సింగన—పద్మ పురాణోత్తరఖండము. 6 ఆ.

పాఱుదెంచు :-

"పాఱుదెంచి కీరంబులు పండ్లు గరవ."
—శృం. నై. 1—95.

ఉదిరిగొను :-

"ఇట్లు హృదయంబునం గదిరిన మదనానలంబుచే నుదిరిగొని."
—ఉ. హరి. 5 ఆ.

అడ్డుకొను :-

"అడ్డగొని సోఁకు దొరకుఁ బ్రహ్మాస్త్రుఁ డనియె."

—అచ్చ. రా. యు. కాం.

ఉజ్జగొను ;

"లజ్జాభిమానంబులు (జ్జ) గొనఁడు."

—రుక్మాంగద చరిత్రము 5. ఆ.

ఎరగొను :

(పరవశముగు)

"మృణాళంబులాహారంబులుగ వసంగి యెరగొని సుఖించు రాజహంసంబులుం గల పులిన స్థలంబుల వలనను ..... "

వై. రా. 2 ఆ.

ఎరగొను :-

(మ్రింగు)

"ఉరగము నెరగొను గరుడుని
వెరవున నరు నణఁతునని దివికి నెసఁ దాఁటెన్."

ఉ. హరి. 5—261.

కప్పుదెంచు :-

" .... అతిముత్తిఁ గప్పుదెంచు విలయాభ్రము చాడ్పున"

భార. ద్రోణ. 1—89.

కడగట్టు :-

"మునుమున్నకాదె యార్యులు
వినుత నిజ జ్ఞానదృష్టి విధిఁదిరముగఁగ
న్గొని కడగట్టిన వారీ
తని యీ దృశభావ చేష్టితము లఖిలములున్.

—హరి. పూ. 8 ఆ.

ఇంతవఱకును సరళాదేశము చేయఁబడి ప్రయోగింపఁబడిన శబ్దపల్లవ క్రియలు దిఙ్మాత్రముగ ప్రదర్శితము లైనవి.

ఇఁక అరసున్నలు గల శబ్ద పల్లవములు గూర్చి వ్రాయ వలసి యున్నది.

కనుఁగొను :

(i) "కనుఁగొనెఁ దిలకించెఁ గాంచెఁ జూచెనుగనె
సనఁగను గనియె నంచనఁ జెలంగు."

—ఆంధ్ర భాషార్ణవము. 3 కా. 122ప.

(ii) "తనుఁ గనుఁగొని యలరి నా ధనంబు ఋణముగా .... "

—జై. భా. 1—23.

(iii) "అన విని వేదవ్యాసుని
కనుఁగొని . . . . "

—జై. భా. 6—62.

(iv) "కనుఁగొని నన్ను నాహవ ముఖంబున మార్కొని."

—జై. భా. 5—116.

(v) "కనుఁగొని పార్థుఁ డగ్రకటకంబది యెవ్వనిదన్న .... "

—జై. భా. 5—150

(vi) "కనుఁగొని ప్రద్యుమ్నుఁడు ...... "

—జై. భా. 5—189.

(vii) "కనుఁగొని యీ ప్రొద్దు మత్సకాశంబునకున్."

—జై. భా. 6—24.

(viii) "కన్నులు చల్లగాఁ గనుఁగొందు నేను."

—శృం. నై. 2—86.

(ix) "మునులు తమ తమ మొగములు కనుఁగొనంగ."

కాళ. మాహా. 2—10.

(x) " . . . . మర్మముల్
గనుఁగొనుచుండగా వలయు . . . . ".

(మడికి సింగన) కామందకము. 374

ఇంక ననేక స్థలములలో "కనుఁగొను" అనునది యర సున్నతోఁ గూడ ననేక ప్రతులలో ముద్రింపఁబడి యున్నది.

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు 1962 జూలై నెల భారతిలో ప్రకటించిన "కాళహస్తి మాహాత్మ్య పాఠపరామర్శము" అను వ్యాసమును జూచి, వారెట్టి పాఠముల నైనను సవరింపఁ బ్రయత్నించుటకు సమర్థులే యని తెలిసి పై పాఠములను మార్పఁ బ్రయత్నింపఁ గల్గినను, ఈ క్రింది శబ్ద పల్లవ క్రియల యందలి సరళాదేశామును మార్పఁ బ్రయత్నింపలేరని విన్నవించుకొనుచున్నాను. అవి యేవియన—

1. "అని శపియించి నంగడు భయంబునఁ గంపము నొందు చండఁగ
న్గొని ముని శాంత చిత్తుఁడయి . . . . . "

—జై. భా. 4—102.

2. " . . . . సుధన్వుండు గ
న్గొని కాదీతఁడు శక్రసూతి పడగన్ గోరాజు వర్తిం చుటన్."

—జై. భా. 5—8.

3. " . . . . విధిఁ దిరముగఁ గ
న్గొని కడ గట్టివా రీ
తని యీ దృశభావ చేష్టితము లఖిలములున్."

—హరి. పూ. 8 ఆ.

4. "అనిలజుఁడు జాంబవంతుఁడు గన్గొనుచు నల్ల .... "

—జై. భా. 6—233.

5. " . . నిజంబుగాఁ దనువు నీడకు మూర్ఖముగానరాదు క
న్గొనఁగ నరిష్ట లక్షణము కోరిక నా కెఱింగింపు నావుడున్

—జై. భా. 8—96.

6. " .... అతనిఁ గన్గొని భీమ కర్ణాత్మభవులు."

—జై. భా. 2—30.

7. " . . . . నిన్నుఁగ
న్గొనిన జనంబులెల్ల నఘముల్ మును చేసిన ..... "

—జై. భా. 3—18.

8. "అవుగా మీరిటమున్ను గన్గొనని చాయల్లేవుగా నాటు నుం
డి విశేషంబులు కొన్ని మిమ్ము నడుగన్ వేడ్కయ్యెడున్ నాకు నె
య్యవి గన్గొంటిరి . . . . ''
విజ. 2—162.

9. "తొయ్యలివంకఁ గన్గొని వధూమణి ..... ''
విజ. 1—143.

10. "అని కన్గొంటి విశారదా యనిన ...... ''
—విజ. 1—200.

పై వానిలోని సరళాదేశముతోఁ బాటుగ నీ క్రింది స్థలములలోని బిందువును గూడ సవరింపఁ బ్రయత్నింప లేరని తలఁతును. పూర్ణ బిందువులున్న యీ క్రియలలో నరసున్న యుండుట నిరాక్షేపమని విన్నవించుచున్నాను.

1. "నావుడుఁ దమ్మి చూలి గగనంబు గనుంగొనఁగా సువర్ణ
శోభు విభవంబుతో . . . . . . ''
—కాళహస్తి మాహాత్మ్యము. 1—140.

2. "అని పలికి పలుకుఁ బోటి వరాజకన్యకం గనుంగొని ....''
—శృం. నై. 5—158.

3. "ఈవు మనంబునన్ మఱచితే సభలోఁ దన చీరయొల్చుకో
గా విడిపింప నందరును గల్గియు నిర్దయులై కనుం
గొనన్.''
—జై. భా. 1—115.

4. " ..... హంసకేతను బ్రోల వాఁడది గనుంగొ
ని దళమగు పుత్రశోకంబు నివ్వటిలగ.''
—జై. భా. 5—45.

5. ".... మనంబులఁ బొదల నంతరిక్షంబునుం గనుంగొను
చుండిరా సమయంబున...... ''
—జై. భా. 5—42.

6, "తప్పదు నా కల నీ సఖు
నొప్పి పరిహరించి దయఁ గనుంగొను మనినన్.''
—జై. భా. 7—117.

7. "...... దేవకియున్ యశోదయును నిన్నుఁ గనుంగొని''
—జై. భా. 7—121.

8. " . . . . గాం
డీవియు నట్లు దేలుసుతు నెమ్మి గనుంగొనెఁ దల్లి ....''
—జై. భా. 7—127.

9. "మొరసెన సంఖ్య శంఖరవముల్ దివిఁ బువ్వులవాన సోనఁ
గాఁగురిసెఁ బునః ప్రజాతసుతఁ గుంతిఁ గనుంగొన వేడ్క
వాహినుల్ ....'' —జై. భా. 7—128.

10. " .... వేములు శ్రీహరిం దలఁచు వీని గనుంగొని విష్ణు
భక్తునిన్ .... '' —జై. భా. 8—64.

పై జూపఁబడిన ప్రయోగములలోని పూర్ణబిందువును, ఇతఃపూర్వము ప్రదర్శితములగువాని యందలిళా సరదేశమును "శ. ప. క్రియలలో, అరసున్నలు—ద్రుత కార్యములు ఉండవు.'' అను శ్రీ దీపాల వారి వాక్యమును వారు సవరించుకొనునట్లు చేయఁగలవని భావించుచున్నాను.

ఇంతవఱకుఁ బ్రదర్శితములైన క్రియలే కాక యాంధ్ర వాఙ్మయమునందు ఒడఁబడు, ఒడంబడు, ఒడగూర్చు, కాలుద్రొక్కు, క్రచ్చు గదలు, కావిగొను అను క్రియలును, నుఙ్యంతమగు తెచ్చు ధాతువుయొక్క రూపమగు "తేరన్'' అనునది యనుప్రయుక్తమగుటచే నేర్పడిన శబ్ద పల్లవ ధాతువు లనేకములు కవియు దేరన్, క్రమ్మ దేరన్, అరుగు దేరన్, అగుదేరన్, చనుదేరన్, ఏగుదేరుల వంటివి సరళాదేశము చేయఁబడియే మహాకవులందరిచేతను బ్రయోగింపబడి యున్నవి.

ఇంతవరకుఁ జెప్పఁబడిన దానినిబట్టి శబ్ద పల్లవ క్రియలలో అరసున్నలు ద్రుతకార్యములు నుండునని తెలియుచున్నది. అంతమాత్రమున శబ్ద పల్లవ క్రియలలో అరసున్నలు ద్రుతకార్యములు నుండితీరవలయునను నియమమేదియు లేదు. ఈ విషయమును శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారే తెలిపి యొక ప్రయోగముఁ జూపియున్నారు. కాని యది యతిస్థానమందలిది యగుటచే నంత బలీయము గానేరదని భావించి ప్రాసస్థానమందు ద్రుతకార్యము చేయఁబడని ప్రయోగము నొకదానిని చూపుచున్నాను.

"అపు డుద్దాలకుఁ డాగ్రహించి నిజభార్యం జూచి నిర్భాగ్యురాల! పవిత్రంబగు పార్వణంబు నవలీలం బెంటపై వైచి కుంటుపడం జేసి తిశ్రాద్ధకర్మమని . . . . ''

అర్జునుని శరీరవర్ణ మెట్టిది?

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి

శ్రీ వంగిపూడి కృష్ణమూర్తిగారు—1962 సెప్టెంబరు భారతిలో—పై శీర్షికతో, ఈ క్రింధివిధముగా ఆక్షేపము తెలిపియున్నారు.

"పూజ్యులు శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు 'ధనంజయ ప్రవరకరమ్ము' అను వ్యాసమునందు ప్రసంగవశమున, అర్జునుడు నీలవర్ణశరీరు డని సెలవిచ్చిరి. దానికి సమాధానముగా శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు,— అర్జును డనగా తెలుపు వర్ణముగలవా డనియు, అతని శరీరవర్ణము నీలము కాదనియు తమ అభిప్రాయమును వెల్లడించిరి.—"అర్జును డనగా తెల్లని వాడని యర్థము. ఆపేరు వచ్చుటకు కారణముగా చెప్పబడినది 'అవదాత'వర్ణము. ఆ వర్ణము 'నీల' మగునేని 'అర్జును'డని పేరు వచ్చునా ?''— అనీవారికి గలిగిన సందేహము. వారి యభిప్రాయమేమనగా— అర్జునుడు తెల్లవాడని. శ్రీ శాస్త్రిగారి అభిప్రాయము సరియైనది కాదనియు, శ్రీ శర్మగారు సెలవిచ్చినదే సరియైనదనియు నా అభిప్రాయము.''

ఈ ప్రసంగము కేవల మసంబద్ధము. నా విమర్శలో అర్జునునిమేనిరంగు— నలుపా ? తెలుపా ? అన్న చర్చయే లేదు. 'అవదాతము' నీలవర్ణ మగునా ? అన్నది అందలి విషయము. దానికి సమాధానముగా మంగిపూడివారు "అర్జునుడు నల్లనివాడే" అని వ్రాయుట, "ఏవూరు బ్రాహ్మణా ? అంటే, ఏరు రొమ్ముల లోతు" అన్న ట్లున్నది.

అసలు విషయ మేమనగా : శ్రీ శర్మగారు,—

"ధరణి దుర్లభమగు నవదాతవర్ణ
మారఁ గల్గుట నర్జునుఁ డండ్రు నన్ను"
(విరాట. 4—145)

అను పద్యము నుదాహరించి,— "అతని దేహము నలుపు. కాని (?) అంత పరిశుద్ధమైన నీలవర్ణము ఇంకెవరికిని పృథివిలో లేదు గనుక అర్జునుడను పేరు వచ్చినదట !"—అని అర్థము వివరించారు.

నేను,— "అర్జును డనగా తెల్లవాడని యర్థము. ఆపేరు వచ్చుటకు కారణముగా చెప్పబడినది అవదాతవర్ణము. ఆవర్ణము 'నీల' మగునేని 'అర్జును'డను పేరు వచ్చునా ?" అన్నాను.

"కరోమి కర్మ శుక్లం చ తేన మా మర్జునం విదుః"
(44—21)

అను మూలమును చూపి, ఇందలి 'శుక్ల'మే, పద్యములోని 'అవదాతము', కాబట్టి 'అవదాతము నీలము' అనుట సరిపడ దన్నాను.

ఇందులో అర్జునుడు నల్లనివాడా ? తెల్లనివాడా ?— అన్న చర్చ ఎక్కడున్నది ? శర్మగారు 'అర్జునుడు నల్లనివా' డన్న ట్లును, 'కాదు కాదు, తెల్లనివా' డని నే నన్నట్లును శ్రీ కృష్ణమూర్తిగారు కలగని, "శ్రీ శర్మగారు సెలవిచ్చినదే సరి, శాస్త్రిగారి యభిప్రాయము సరియైనదికా" దని కలవరించినట్లున్నది. 'అర్జునుడు నల్లనివాడే' ననుటకు వారు, కొన్ని శ్లోకాలను— పద్యాలనూ ఏకరువుగూడా పెట్టినారు. అది యొక అకాండతాండవము.

ఇక వారు చేసిన అర్థవిచారణ విషయము.—

నేను, 'అర్జునుడు'—అను పదమునకు 'తెల్లనివా'డని యర్థ మన్నాను. వారు, "ఆ యర్థము తప్పు, 'నల్లనివాడు' అని చెప్పవలె" నంటారు. చూడండి :

(1) "శాస్త్రిగారి యభిప్రాయ మేమనగా— అర్జునుడు తెల్లనివాడని" అన్నారు.

ఆ యభిప్రాయము నాది కాదు, తిక్కన సోమయాజి గారిది. నే నాయన రచన కర్థము చెప్పినాను. అర్జున— శబ్దమునకు నేనే కాదు, సాహిత్యజ్ఞానముగలవా రెవరయినను "తెల్లవా" డనియే అర్థము చెప్పుదురు.

విరాటపర్వమునకు టీకా తాత్పర్యములు వ్రాసిన పండితులు శ్రీ చదలవాడ సుందరరామశాస్త్రిగారు, దండిగుంట సూర్యనారాయణశాస్త్రిగారును,—

"అవదాతవర్ణము తెల్లని రంగు. అర్జునుఁడు తెల్లనివాఁడు" అని టీక వ్రాసి,— "భూమిలో నెవ్వరికినిలేని తెల్లని రంగు నాకుఁ గలుగుటవలన నాకు అర్జునుఁ డను పేరుగలిగెను" అని తాత్పర్యము వ్రాసియున్నారు.

మరి మంగిపూడివారు, "ఆర్జునుడు నల్లనివాడు' అని చెప్పవలెనంటారేమి ? అది అర్థజ్ఞానముగలవా రనదగిన మాటయేనా ? వారు, నేను చెప్పిన అర్థము తప్పనుట ఒప్పదగినదేనా ?

(2) నేను,—"కరోమి కర్మ శుక్లం చ తేన మా మర్జునం విదుః" అన్న మూలమునకు,— 'శుక్ల (పవిత్రములైన) కర్మలను చేయువాడను, శుక్ల (తెల్లని) వర్ణము గలవాడను అగుటచేత, నాకు 'అర్జును'డనుపేరు వచ్చినది'—అని యర్థమన్నాను.

వారు — "మూలశ్లోకములో అర్జునుని శరీరవర్ణమేదో పేర్కొన బడలేదన్నారు. నేను తప్పర్థము చెప్పినా నని వారి ఆక్షేపము.

(i) ఆక్షేప మనాలోచితము. 'భారతమును యథామూలముగా తెలుగుచేసిన శ్రీపాదవారు,—

"అమలిన వర్ణము గలిగియు
నమలిన కర్మమును గలిగి యలరెడు దానన్
క్ష్మలోన నర్జునాహ్వయ
మమరించిరి నాకు విబుధు లమలవిచారా !"

అని శ్లోకార్థమును వివరించియున్నారు. మరియు, భారతమును వచనముగా అనువదించిన శ్రీ కల్లి సోంబమూర్తి శాస్త్రిగారు,—

"చతురంత పరీత భూవలయంబున దుర్లభంబగు శుక్ల వర్ణంబు గలవాఁడనగుట నర్జునుండును.... అను నామంబులం బ్రఖ్యాతి నొందియుండుదు" (విరా. పుట. 70)

అని వ్రాసియున్నారు. కనుక నేను చెప్పిన అర్థము తప్పుగాదు. వారి ఆక్షేపమే తప్పు.

శ్లోకములో ఉన్న తెల్లనివర్ణము కనబడకపోవుటయు, పద్యములో లేని నల్లవర్ణము కనబడుటయు దృష్టిదోషముగాని మరేమియు గాదు.

సంస్కృత శ్లోకానికీ, తెలుగుపద్యానికీ తాము తప్పర్థము చేసికొని, వారు నా యర్థమును—నా యభిప్రాయమును ఆక్షేపించినా రన్నది ఇక్కడ సారాంశము.

శ్లోకములోని 'శుక్ల' శబ్దమునకు గాని, పద్యములోని 'అవదాత' శబ్దమునకు గాని 'అర్జున' శబ్దమునకు గాని 'నీల' మను అర్థములేదు. ఆ శబ్దముల కన్నిటికిని 'తెలు' పనియే అర్థము.

"శుక్ల శుభ్ర శుచి శ్వేత విశద శ్యేత పాండరాః
అవదాత స్సితో గౌరో వళక్షో ధవళోఽర్జునః"
(అమరము).

అర్జున శబ్దమునకుగల నానార్థములలోను నలుపు చెప్పబడలేదు. తెలుపే చెప్పబడినది.

"పార్థే ఽర్జునః కేకిని కార్తవీర్యే
నేత్రామయేఽప్యేకసుతే చ మాతుః,
వర్ణే ద్రుమే చాథ సితే త్రిలింగః."
(నానార్థ రత్నమాల)

భగవద్గీతలో,— "అకీర్తికర మర్జున !" (౨. ౨.) అన్నచోట, శంకరభాష్యములో,— "హే అర్జున— స్వచ్ఛ స్వభావ, తవ నైత ద్యుక్త మితి భావః" అని వ్యాఖ్యాతమైనది. అర్జున శబ్దమునకుగల 'స్వచ్ఛము (తెలుపు) అను అర్థము, ఆ భావోత్పాదన కవలంబము. 'అర్జున నీలము' అగునేని, ఆ భావము— అభావ మగును. కాబట్టి,—అర్జునుడు = నల్లనివాడు— అని చెప్పవలె" అననువాదము విపరీతవాదము.

(ii) మరియు, అర్జునునకు 'కృష్ణుడు(= నల్లనివాడు) అను మరియొక నామము, ఆ నామము వచ్చుటకు కారణము, మూలములో— ప్రత్యేకముగా— వేరొక శ్లోకమున చెప్పబడి యున్నది. తిక్కన రచనలోను—అట్లే వేరుగా చెప్పబడియున్నది. కృష్ణ శబ్దార్థమే, అర్జున శబ్దమునకు చెప్పినచో, కృష్ణుడను నామము పునరుక్త మగును. కాబట్టి, ఆవిధముగను వారి వాదము అసద్వాదమే యగుచున్నది.

(iii) అది యట్లుండగా, అర్జును డన్నను, కృష్ణు డన్నను— నల్లనివాడనియే అర్థ—మను పక్షమున, అర్జును డనునది ప్రత్యేకనామము కాకపోవుటయు, తన్మూలమున, అర్జునున కింతకుముం దున్న పదకొండు పేరులలో ఒకటి లోపించి— పదే యగుటయు తటస్థించును.

ఇది, భారతకథకు— అందును ముఖ్యముగా, అర్జునునకు మంగిపూడివారి అపూర్వసిద్ధాంతమువలన జరుగుచున్న మహాపకారము.

భారతము ననువదించిన కవులు, టీకలు వ్రాసిన పండితులు, గీతాభాష్యకర్తలు, నిఘంటువులు— అర్జునుడు తెల్లని వాడనియు, అవదాత మనగా తెలు పనియు— ఘంటా ఘోషముగా— చెప్పుచుండగా, మంగిపూడివారు,— అర్జునుడు నల్లని వాడనియు, అవదాత మనగా నలు పనియు వాదించుట,— "ఊరంతా ఉత్తరం చూస్తే దాసరి పుల్లయ్య దక్షిణం చూస్తా" డన్న సామెతగా ఉన్నదిగాని, సబబుగా ఉన్నదా ?

అర్జునుడు నల్లనివాడే—అగుగాక, అందువలన అవదాత వర్ణము— నల్లరంగు కాదు. అర్జున శబ్దమునకు నల్లనివాడని అర్థమును కాదు. ఆయర్థము మూలశ్లోకమునను, తిక్కన పద్యమునను గూడా సరిపడదు.

కనుక ఈ సందర్భమున 'అర్జునుడు నల్లనివాడే' నని రాద్ధాంతము చేయుట ప్రయోజనమువాలిన పని,— "అవదాతవర్ణము నీలవర్ణమగునా ?" అన్న నా ప్రశ్నకది సమాధానము కాదు గనుక, అసంగత ప్రసంగము.

ఈ సంగతి గుర్తింపక మంగిపూడివారు, అర్జునుని శరీర వర్ణము నలుపని తెలుపు శ్లోకాలు— పద్యాలూ పది పోగుచేసి ఉదాహరించినారు : నే నా పద్యముల నెరుగక పొరపాటు చేసినట్లును, తా మా పద్యములను చూపి నాపొరపాటును సరిదిద్దిరిట్లును సిద్ధాంతము చేసికొని, ఈ క్రిందివిధముగా నాకు హెచ్చరికయు నిచ్చినారు.

"మహాభారత మహార్ణవమును మథించిన దిట్టలలో శ్రీ శాస్త్రిగారొక సిద్ధహస్తులు. వారివలన ఎన్నో నూతన విషయాలను తెలుసుకొనుటకు నావంటివారు ఉవ్విళ్లూరు చుందురు. వారివంటి పండితులే తొందరపాటుతో పొరపాటులు చేయుచుండుట విచారకరమైన విషయము. నా వ్యాసమునందలి ఔచిత్యమును పరిశీలించి శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు అర్జునుని దేహవర్ణమును గురించి తమ అభిప్రాయమును సరిదిద్దుకొనినచో కృతకృత్యుడ నయ్యెదను." ఇదీ వారి హెచ్చరిక!

పొరపాటు నిజ మగునేని, నాయభిప్రాయమును సరిదిద్దుకొనుటకు నేను సంకోచింపను. శ్రీ కృష్ణమూర్తిగారు విమర్శ దృష్టిలేక తాము పొరపాటు సిద్ధాంతములు చేసి, అభిప్రాయ

మును పరిదిద్దుకొనవలసినదిగా నన్ను మందలించినారు. వారి యీ వ్రాతలోని ఔచిత్య మెట్టిదో పాఠకులే విచారింతురుగాక.

ఈతెరగు విమర్శలు తరచు వెలువడుటయు, బదులు వ్రాయవలసివచ్చుటయు మిక్కిలి శోచనీయమైన విషయము. అనవసరములును— అనుచితములును నైన ఆక్షేపములకు సమాధానములు చెప్పుటలో మనసుకు క్లేశము తప్ప మరి వేరు ప్రయోజన మేముండును ?

ఆ సెప్టెంబరు భారతిలోనే, రావూరి మృత్యుంజయ రావు అనువారి— 'పరామర్శ కొక పరామర్శ'— అను ఇంకొక విమర్శకూడా వచ్చినది. అదియు నిట్టిదే. అందు, కాళహస్తి మాహాత్మ్యములోని పాఠములకు నేను సూచించిన సవరణలలో ఒక అయిదు— సరియైనవికావని ఆక్షేపములు తెలుపబడినవి.

శ్రీరావుగారికి కావ్యభాషతోడి పరిచయము తక్కువ. అందువలన నా సవరణలలోని గుణము గుర్తుపడక ఆక్షేపించినారు. ఏ భాషా సంప్రదాయజ్ఞు నడిగియున్నను— ఆ సవరణల తత్త్వము తెలిసియుండెడిదే. వా రా పని చేయక, తొందరపడి పత్రికలో ప్రకటించినారు. అది పొరపాటు.

ఇప్పుడైనను వా రా విషయమును పండితులవలన తెలిసికొనుటే సులభమైన మార్గము. పత్రికాచర్చ వృథాశ్రమ హేతువు.

ఏ విషయము నైనను, మనము ముందు తలస్పర్శముగా విచారించి, అటు పిమ్మట పత్రిక కెక్కించుట సమంజస మని శ్రీ రావుగారికిని, శ్రీ కృష్ణమూర్తిగారికిని నా విజ్ఞాపనము.

విషమసీస లక్షణము

శ్రీ రావూరి దొరసామిశర్మ

సీస భేదములలో విషమసీసమొకటి. ఇది జాత్యుప జాతి సమ్మేళనముగల పద్యవిశేషము. ఉత్సాహతో గీతము కలిపిన విషమ సీసమగునని ఛందఃకర్తలు లక్షణము రచించిరి.

అప్ప కవీయములోని లక్షణము :

అంచితముగ భీమునకు సహాయమేగుదెంచి తా
నించుకెదిరి దురముసేయు నేయు నంకుశంబుతాఁ
కించుకొనక కినుకవలనఁ గెరలి నరకపుత్త్రు మ
ర్దించినట్టి సవ్యసాచి తేరిఘోట కావళిం
దోలు కృష్ణుయంచుఁ దొరంపు టుత్సాహ
మీఁద గీత మొకఁడు మేళవింప
విషమ సీసమనఁగ వెలయుఁగా మెపలీశ
జమ్మి చెంతనున్న చతురవచన. (4—343)

ఇందుగీత మనఁగానేది ? తేటగీతియా ? ఆటవెలఁదియా? యను సందేహము కొందఱికుఁగలదు. ఆటవెలఁదికిఁ దేటగీతికి రెంటికి గీతమని సామాన్య వ్యవహారము. ఛందఃకర్తల మతమున గీతమనఁగా రెండు కావచ్చును.

'వాసి చరణములు నాలుగుచేసి తుదినిగీత మొకటి
చెప్పఁగనయ్యెన్, సీసము' (అప్పకవీయము)

లక్షణప్రకారము విషమసీసములో గీతద్వయములోనే దేనినుండ వచ్చుఁగాని మనకునేఁడు గానవచ్చు ఛందోగ్రంథము లందెల్ల విషమసీస లక్ష్యమునఁదుదలో ఆటవెలఁదియే యున్నది.

తుదనుగీతి పరఁగ విషమసీసంబగు (కవిజనాశ్రయము)
ఉత్సాహ వృత్తమయ్యె, దీని తుదగీతి యొకఁడు సంధింప
విషమ, సీసనిత్తెఱఁ గెఱుఁగుట చెలువుమతికి
(కావ్యాలంకారచూడామణి—8—32)

కవిజనాశ్రయ చూడామణిలో గీతియని లక్ష్యమును బేర్కొనఁ బడినదిగాని అనంతుని ఛందమునఁ దాని ననుసరించిన చిత్రకవి పెద్దన ప్రణీతలక్షణసార సంగ్రహమును ఆటవెలఁది కూర్పఁబడునని క్రింది విధముగా స్పష్టము చేయుచున్నది :

ప్రాసములును వదులు భాసురంబుగ నిట్లు
విలసితముగ నాటవెలఁది యందు
నుత్సుకత నొనర్చి యుత్సాహ మదినిల్ప
విషమసీస మమరు విషధిశయన (అనంత—3—35)
ఉత్సాహమయ్యె విషమసీస సంజ్ఞనిది వహింపఁగా,
దీన నాటవెలఁది దీకొనఁ గొనసుంచి
యిటులు ప్రొలువళ్ల నెసఁగఁజేయ
విషమసీస మనఁగ వెలయుఁ గావ్యంబుల
(లక్షణసారసంగ్రహము—2 ఆ)

ఈ విషమసీసమునే ఉత్సాహవేదండ విషమసీసమను పేర లక్షణ శిరోమణి యిచ్చినది. అందును ఆటవెలఁదియే చెప్పఁ బడినది. (గ్రంథము అముద్రితము)

'ఆటవెలఁదిగీత మమర నిలుప, నుర్వియందుఁగృతుల
నుత్సాహవేదండ, విషమసీసమనఁగ వెలయుఁగృష్ణ?

ఈ పై లక్ష్య లక్షణములఁబట్టి విషమసీసము తుదలో ఆటవెలఁదియే యుండునని చెప్పవలసివచ్చెడు.

క ల గూ ర గ ం ప

ప్రాచీనకాలములో సామాన్యముగా సీసపద్యముల తుదలో ఆటవెలఁది గూర్చుట తఱచుగాఁ గానవచ్చెడు. నన్నయ భారత భాగమున 251 సీసములలో 26 పద్యములందు మాత్రమే తేటగీతులున్నవి. నన్నయకుఁ బూర్వమునను సమకాలముననుఁ వెలసిన శాసనములలోని సీసపద్యముల తుదలో ఆటవెలఁదులే యున్నవి. (చూ. ధర్మవరశాసము, దీర్ఘాసి శాసనము). ప్రాచీన మగు కవిజనాశ్రయ విషమ సీసములో ఆటవెలఁది గూర్పఁ బడుటచేఁ దర్వాతి లాక్షిణికు లొకరినునసరించి యొకరాట వెలఁదియే వ్రాసిరి. అనంతాదులు ఒకమెట్టుమీఁదికివెళ్లి ఆట వెలఁదియేఁకూర్పఁజనునని నియమించిరి.

తేటగీతిని సైతము విషమసీసములోఁ గూర్చుట లక్షణ విరుద్ధముగాదు.

1962— నవంబరు భారతిలో లేఖలక్రింద 'కావ్యాలం కార చూడామణి' అనుశీర్షికతో నొకవిమర్శ వ్యాసము ప్రకటింప బడినది. అందు ఇదేభారతిలోఁ బ్రచురితమయిన 'కావ్యాలంకార చూడామణి — కొన్ని అసమన్విత పదములు' అను పూర్వవ్యాస మును విమర్శించుచు 'విషమసీసమున కనుబంధముగా నాట వెలఁదియే యుండవలెనను విషయము గోచరించుచున్నది.... లక్ష్యములందు తేటగీతి మృగ్యము !' అని వ్రాసిరి శ్రీ బండి నాగరాజుగారు. (పుట 90)

ఛందో గ్రంథములలోని విషమసీసములలో తేటగీతి మృగ్యము గానవచ్చునేమోకాని తేటగీతి తుదఁగల విషమసీసములఁ నా పరిశీలనలోఁ గానవచ్చినవి.

చెళ్లపిళ్ల నరసకవి యామినీపూర్ణతిలకావిలాసములో రెండు విషమసీసములు గలవు. ఆ రెండిటియందును దుదలో తేటగీతియే కూర్పఁబడినది. (చూ—2—165, 3—115)

'అందఅప్పు డొప్పుమీఱ నందముల్ సెలంగ మే
ల్కుందనంపు బొమ్మలట్ల గుల్కరించి యొండొరుల్
పొందుఁజెంది సొమ్ములన్నిపూని కావివల్వలిం
పొందఁగట్టినట్టి ప్రాయమున్న కన్నెమిన్నలా
నందమొందిరి కల్వపూవిందుముద్దు
టల్లునకుఁగూర్మిఁగ్గైసేసి యలరుటదను
సాహిణి యొయ్యారములఁదీర్చి సంతరించి
కొన్కదెచ్చిన సొంబ్రాణి గములనంగ' (3—115)

సుప్రసిద్ధ లాక్షణికుఁడగు గణపవరపు వేంకటకవి రచించిన ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసములో విషమసీస మొకటియున్నది. అందుదానికి విషమసీసమను పేరునకు మాఱుగా 'ఉత్సాహయుక్తగీతి' అను పేరిడఁబడియున్నది. అది విషమసీసమే యగును. దానితుదలోఁ దేటగీతిగలదు.

'అందమైన కీలుఁగొప్పులందుఁ బూలు తేనియల్
చిందనీక యుంచి నిగ్గు చెంగలించు జాళువా
నంది దండ ఉంగరాలు సన్నబన్న సరులు హొ
న్నందొలంగ డెంబులచ్చు హారముల్ తురాలు క్రొం
బసిఁడి గంటల మొలనూళ్లు బాహుపురులు
సరిపెణలు ముత్తియంపు ముంగరలు తాళి
పతకములు దాల్చి పన్నీట పదనుమించు
చందన మలంది రంతట సంతసమున' (273—)

ఈ లక్ష్యములఁబట్టి విషమసీసము తుదలో ఆటవెలఁది గాని తేటగీతిగాని యుండనగునని స్పష్టమైనది.

గ్రంథ విమర్శనము

రవీంద్ర వ్యాసావళి
(ద్వితీయ సంపుటము)

(రవీంద్రుని వ్యాసములకు, లేఖలకు తెనుగు అనువాదం. అనువాదకులు : రాయప్రోలు సుబ్బారావుగారు. ప్రచురణ ; సాహిత్య అకాదెమీ, న్యూఢిల్లీ. డెమ్మీ 1/8 సైజు, 489 పుటలు, మరొక్క 50 పుటలు అవతరణిక, భూమిక మొదలయినవి. వెల: తొమ్మిది రూపాయలు. సోల్ డిస్ట్రిబ్యూటర్స్: వేంకటరావు అండ్ కంపెనీ, విజయవాడ.)

రవీంద్ర శత వార్షిక జయంతిని పురస్కరించుకొని సాహిత్య అకాదెమీ వివిధ భారతీయ భాషలలో రవీంద్ర గ్రంథావళి పది సంపుటాలుగా ప్రచురించాలని తలపెట్టారు. తెనుగులో కూడ పది సంపుటాలుగా రవీంద్రుని రచనలు అకాదెమీ పక్షమున అనువాదం చేయించి, ప్రకటించే కార్యక్రమంలో రవీంద్ర వ్యాసావళి రెండు సంపుటములుగా ముద్రించారు. వానిలో ఇది రెండవ సంపుటం. రవీంద్రుడు మహాకవి. వంగ భాషలో ఆయన రచించిన పద్య కవితలు, పద కవితలు మనోహరంగా ఉంటాయి. కాని పద్య రచనలో ఆరితేరిన కవి గద్య రచనలో అంతటి సమర్థతను చూపగలడా అనేది కొంత అనుమానం కలిగిస్తున్నది. ఈ విషయమే, ఈ గ్రంథానికి విపుల పీఠిక వ్రాసిన బుద్ధదేవ బోసు—'రవీంద్రనాథుని ప్రబంధాలు, అందలి గద్య శిల్పాలు,' అనే వ్యాసంలో చర్చించారు. ప్రబంధము అంటే వంగ భాషలో వ్యాసము అని అర్థము. ఈ సంపుటంలో చేర్చినవి అన్నీ వ్యాసములుకావు. కొన్ని రవీంద్రుని చరిత్రకు సంబంధించినవి, కొన్ని ఆయన దేశ యాత్రలు వర్ణించే ముచ్చటలు, డైరీలనుండి, లేఖలనుండి సంగ్రహించినవి. మరికొన్ని కేవలము, సాహిత్య ప్రసంగములు, ఉపన్యాసములు. వీనినే ఫ్రెంచి భాషలో (Bells Lettres) (బెల్సు లెట్రీస్) అంటారు. ఇవన్నీచేర్చి ఈ దీర్ఘ సంపుటముగా ప్రచురించారు. ఇందులో రవీంద్రుడు తన 70 వ జన్మ దినోత్సవమునాడు ప్రచురించిన అభినందవ గ్రంథమునకు స్వయంగా వ్రాసిన అవతరణిక యున్నది. ఏబదియేండ్లు సాగిన తన సాహిత్య ప్రయాసను సంపూర్ణ ఆకారముతో భద్రపరచడానికి విశ్వభారతి ప్రచురణ సంస్థవారు చేసిన ప్రయత్నాన్ని ఆశీర్వదిస్తూ వ్రాసిన భూమిక కూడ చేర్చారు. ఈ సంకలనం గురించి పర్యావలోకనం చేసేముందు కవి రవీంద్రుడన్న మాటలు ఉదాహరించడం అప్రస్తుతం కాదేమో!

"ఈనాడు నా రచనలకు స్థాయి రూపము సంఘటించడానికి సిద్ధపడుతున్నవారు తమ అభిరుచి ప్రకారం, తమ సంస్కృతి సంమితంగా వాటిని సంకలితము చేశారు. మనుష్యుడు స్వీయమైన ఉపలబ్ధిని నమ్ముకొని, గట్టి కట్టడాలు కట్టడానికి పూనుకొంటాడు. పొరపాటు జరగవచ్చు. పొరపాటు రాకుండా జాగ్రత్తపడే మనుష్యుని అపేక్షావిశేషము అమూల్యమైనది. ఇప్పుడు ఈ ఉద్యమ కర్తల విషయములో ఇదే నేను చెప్పవలసిన మాట. నా విషయమంటారా, నేను మునుపు చెప్పిన ఉపదేశమే అంగీకరిస్తాను. 'నాతి సంవేత మరణం, నాతి జీవితం, పోయింది పొల్లు, ఉన్నదిగింజ— కనుక మిథ్యాభినయము నభినయించడు. రవీంద్రుడే ఇట్టి సంకలనమును అంగీకరించినపుడు, దీనిలోని విషయ వైవిధ్యముగూర్చి విమర్శ అనవసరము. ఈ వ్యాసావళిలో అయిదు భాగము లున్నవి—అవి "ఆత్మ పరిచయము", "పత్రధార", "భ్రమణం", 'భాషా—సాహిత్యమూ', "విచిత్ర వ్యాసావళి" అను శీర్షికలతో సంపాదకులు పొందుపరచినారు. "ఆత్మ పరిచయము" అను భాగములో రవీంద్రుని స్వీయ చరిత్రకు సంబంధించిన విషయము లున్నవి. దీనిలో మూడు అధ్యాయములు. మొదటిది 'ఆత్మ పరిచయము' చిన్న వ్యాసము. మిగిలిన రెండును, రెండు చిన్న పుస్తకములు. "ఛేలేబేళా" (చిన్నప్పుడు) ఇంగ్లీషులో My Boyhood అనే పేరుతో వచ్చినది. దీనితోపాటు 'జీవన స్మృతి' Reminiscenses చేర్చినారు. ఇవన్నీ వంగ భాషలోను, ఇంగ్లీషులోను చిన్న చిన్న పిల్లలకి కూడ అర్థమయ్యే సరళ భాషలో చమత్కారంగా చెప్పిన కథలు, గాథలు, జ్ఞాపకాలు. తెనుగులో భాషాంతరం పొందేటప్పటికి దానికి మూలంలోలేని ప్రాగల్భ్యం వచ్చింది. ఇంక రెండవ భాగములో 'పత్రధార' శీర్షికను 'ఉత్తరాలు' సేకరించి ప్రకటించారు. ఇవి నాలుగు చీలికలుగా, 'చిన్న పత్రాలు', 'భాను సింహ పత్రావళి', 'పథమూ, పథ ప్రాంతమూ', 'చీటీ పత్రికలు' అనే పేరులతో పొందుపరచియుంచారు. 'పత్రావళి' ఉత్తరాలకి బెంగాలీలో పేరు. తెలుగులో ఆ యర్థంలేదు. పైగా వాటిని అనువాదకులు 'చీటీ పత్రికలు' అని కూడ అన్నారు. 'పత్రికలు' అంటే తెనుగులో 'ఉత్తరాలు' అనే అర్థం వాడుకలో ఉన్నట్టులేదు. ఈ లేఖలలో—రవీంద్రుడు భానుసింహుడనే ప్రచ్ఛన్న నామంతో ప్రకటించిన లేఖలు కూడ ఉన్నవి. రవీంద్రుడు తన చిన్నతనంలో వైష్ణవ పద కవులయిన 'విద్యాపతి' 'చండీదాస్' ఇట్టివారిని అనుకరించి 'భాను సింహేర్ పదావళి' అని వైష్ణవ కీర్తనలు రచించి, భానుసింహుని పేర ప్రకటించాడు. ఆ ప్రచ్ఛన్న నామంతోనే కొన్ని లేఖలు వ్రాశాడు. అవి ఈ విభా

గ్రంథవిమర్శనము

గంలో చేర్చారు. ఇంక మూడవ భాగానికి 'భ్రమణం' అని పేరు పెట్టారు. 'భ్రమణ్ కాహినీ' అంటే బెంగాలీలో యాత్రా కథలని. రవీంద్రుడు దేశ విదేశాలలో చాల చోట్ల సంచారంచేసి, ఉపన్యాసాలిచ్చాడు. ఉత్తరాలు వ్రాశాడు. డైరీలో యాత్రా విశేషాలు గురించి వ్రాశాడు. వాటిని ఈ మూడవ విభాగంలో చేర్చి 'భ్రమణం' అన్నారు. తెనుగులో ఆ శీర్షిక ఎంత సముచితమో మరి. ఇంక నాలుగవ భాగంలో భాష గురించి సాహిత్యము గురించి రవీంద్రుడు వెలిపుచ్చిన అభిప్రాయాలు సంకలనంచేసి ఏడు ఖండికలలో చేర్చారు. ఈ వ్యాసాలు వేరు వేరు పుస్తకాలుగా ఇదివరకే వెలువడినవి. దీనిలో భాషగురించి, ప్రాచీన సాహిత్యం గురించి, ఆధునిక సాహిత్యం గురించి, సాహిత్య స్వరూపమును గురించి మనోహరమైన చర్చ లున్నవి. ప్రాచీన సాహిత్యంలో, 'కావ్యాలలో ఉపేక్షితలు' అను పేరున ఊర్మిళాదేవిని గురించి రవీంద్రుడు వ్రాసిన వ్యాసం చదువుతూఉంటే— ఈ నాయికనుగూర్చి అజ్ఞాతాంధ్ర జానపదకవి అతి మధురంగా గానం చేసిన పాట జ్ఞాపకం వస్తుంది. ఊర్మిళ చిర వధువు— నిర్వాసకుంఠిత—నిశ్శబ్దచారిణి, అయోధ్యను అంధకారంలోముంచి కిశోర రాజభ్రాత లిద్దరూ సీతాదేవిని వెంట పెట్టుకొని తాపస వేషాలతో బయలుదేరిపోయినప్పుడు వధువు ఊర్మిళ హర్మ్యములో ఏ నిభృతశయనాగారము ధూళిలోపడి వృంతచ్యుత పుష్పములాగ పడి పోతున్నదో—ఎవరికైనా తెలుసునా?" ఊర్మిళ తనకంటే అధికమైన తన ఆత్మ స్వామినే యావజ్జీవం దానము చేసింది. ఈ మాటలోకం మరచింది. కావ్యం పలకడంలేదు. సీత కన్నీళ్ళతో ఊర్మిళ కొట్టుకొనిపోయింది" అని వ్రాసి ఆమెనుగూర్చి ఒక ఖండ కావ్యం కవి రచించాడు. తరువాత ఇదే చాల కవులకు కావ్య వస్తువయింది. "సాకేత" కావ్యకర్త మైథిలీ శరణ్ గుప్త ఈ యంశమునే మనోహర కావ్యంగా రచించాడు. సాహిత్యవ్యాసావళిలో ఇట్టి చక్కని విషయాలెన్నో ఉన్నవి. ఇంక చివరిభాగమునకు "విచిత్రవ్యాసావళి" అని పేరు పెట్టారు. తెనుగులో వింత' అనే అర్థంరావచ్చు. బెంగాలీలో 'విచిత్ర' అంటే కదంబం, కలగూరగంప అనే అర్థంలో వాడతారు. దానినే ఇంగ్లీషులో **Miscellany** అనవచ్చును. ఈ విభాగంలో— ఏ శీర్షికలోనూ చేరని విభిన్న వ్యాసాలు, 'పంచ భూతాలు' శీర్షికను రవీంద్రుడు రచించిన ఆలోచనాత్మక విజ్ఞాన చర్చ ప్రకటించారు. ఇవి యీ గ్రంథములో పొందుపర్చిన విషయములు. "గద్యమ్ కవీనాం నికషం వదంతి" అనే ప్రవచనం అడుగడుగునా యీ 'వ్యాసావళి' రచనలో నిరూపితమవుతుంది.

ఇంక దీనిని అనువాదంచేసినపద్ధతి— రాయప్రోలు సుబ్బారావుగారు అభినవ కవిపండితులు. గద్యరచనలోకంటే పద్య రచనలోనే చేయితిరిగినవారు. పద్యరచనలోకంటే గద్యానువాదములో గల కష్టము గుర్తించి వారిట్లు చెప్పుకున్నారు.

"స్వతంత్ర రచనకంటే అనువాదకార్యం క్లిష్టమూ కష్టమూ అని చెప్పుకోవాలి. అందులోనూ ఛందో బద్ధమయినది కొంత సులభమేమో ? ఎందుకంటే పద్యములలో శబ్దాలు గణబంధములో ఒదిగి, మెదిగి ఆ మూసలో ఇష్టరూపము పొందుతవి. శార్దూలమునో, ఆటవెలదినో నిలబెట్టవచ్చు. కురులు కుటిలములైనా జడలో పాయలై కుదురుకొనవా ? వచన భణితిలో ఆ ఉపాయం సహకరించదు. పలుకులకు స్థితీ, స్థిమితమూ పొత్తూ— పొంకమూ కుదరాలి, అప్పుడే వాక్యానికి 'గతిగమకాలు సమకొని, అది చదవడానికి సరళంగా వినడానికి ముచ్చట అవుతుంది.

"రవీంద్రుని రచన అపూర్వంగా ఉంటుంది. ఆయన శైలిలో భావనా— భావమూ, భాషాభణతీ అపూర్వంగా భాసిస్తవి. ప్రజ్ఞా ప్రతిభా నర్తనంచేస్తవి. సృజనా— కల్పనా ఎంత సమీడంగా ఉంటవో రచన అంతనిరంకుశకుశలంగా ప్రవహిస్తుంది. పైగా ఎక్కడపట్టినా, దరహాస పరిహాసములు చెమ్మచెక్కలాడుతున్నట్లు హాస్యలాలన భ్రమిస్తుంది. ఈ నిర్వహణ కోసం ఆయన సమకాల సజీవమైన సమాజ భాషితమును జంకు గొంకులులేకుండా వాడుకొన్నాడు. 'నియతి కృతనియమ రహితాం' అనే నిర్వచనం రవీంద్ర సాహిత్యానికి చక్కగా సరిపోతుంది."

ఏవంవిధ లక్షణములుగల రవీంద్ర వ్యాసావళి తెనుగులోనికి అనువాదం చేయుటలో రాయప్రోలువారు— 'లోకసిద్ధిగల సామాజిక భాషను ఆశ్రయించాను; పలుకుబడికి ప్రదక్షిణించి లిఖించాను. అయితే ఇందుకు అంతరాయములు లేకపోలేదు. భాషలు ముందు భాషింపబడి పిమ్మట లిఖించబడిన మాటతథ్యమే— ఇంకాపలుకుబడికి ఏ వారాలేని లిపిసంకేతం ఏభాషలోనూ కుదిరినట్లు లే' దన్నారు. ఈ యనువాదంలో 'మహాకవి రచనలోని సంస్కృతపదాలు అలాగే నిలిపాను' అని చెప్పి శబ్దార్థ వ్యంజనమును శయ్యాగృహ కవాటంతో పోల్చారు. 'ఎందుకంటే వాక్యగతమైన శబ్దంచేతనంవలె వ్యవహరిస్తుంది. చల్లగాలి వీచిందంటే తలుపు తెరుస్తుంది. చలిగాలి అంటే మూసివేస్తుంది. రచనలో భావము ముత్యములో నీరంలాగ ఇష్టార్థ లావణ్యముతో తొణికిసలాడుతూ వుంటుంది. కేవలం భావప్రకటనచేస్తే మీగడతీసినపెరుగు అవుతుంది. తాత్పర్యం వ్రాస్తే పారిగింటి మజ్జిగలాగా పలచబడుతుంది. రచనలో శిల్పమనే కర్మకౌశలం వున్నదిగదా ! అందువల్ల అనువాదములో పదబంధమూ, వాక్యరీతినీకూడ వీలయినంతవరకూ సంగ్రహించడం ఆవశ్యకమనిపించింది' అలాగే చేశారు. అనువాదంలో తుడుపులూ, దిద్దుబాటులూ ఎక్కువై చిత్తు మరింత చిత్తుగా తయారయి అడవిలోఉన్న రచనను సాపుతేల్చేపని శ్రీ పురిపండా అప్పలస్వామిగారి కప్పగించ్చారు. ఆ అడవిని వారు చక్కచేశారు. రాయప్రోలు సుబ్బారావుగారు శాంతినికేతనంలో గురుదేవుని సన్నిధిలో కొంతకాలముండి, వారిముఖతః వంగభాష విన్నారు. 'వంగీయుల 'జీవితసరళి స్వయంగా కన్నవారు. సంస్కృతము, ఇంగ్లీషు భాషలలో పాండిత్యము సంపాదించినవారు. రవీంద్రసాహిత్యము పట్ల అమిత గౌరవము గలవారు. అందుచేత వారి యనువాదము చక్కగా నడచిన దనుటలో సందేహములేదు. రవీంద్ర రచనావళి తెనుగు అనువాదాలలో ఇది మిన్నయనక తప్పదు. స్వతహాగా కవియగుటచేత, గద్యములోకంటే పద్యానువాదంలో వారి యనువాదం వృదు మధురంగా భాసించింది.

నూత్నచ్ఛందము అబంధముగా
నిండువేడ్కతో నిలువకపరుగిడె
నూతన వేదన నూత్నరాగమై
సాగెను మ్రోగెను నూత్న భంగులను
భావించని బహుపదములు జతగొను
ఊహించని వ్యధలేవో రేగును
ఎవరివార్త యిది ఎందుకు తెచ్చితి
ఎవరికి వినుపించుటకో !

పద్యానువాదం ఇంత నల్లేరుమీద బండిలాగనడిచిందా— మఱిగద్యానువాదం ధోరణిచూడండి. ఇదియొక మచ్చుతునక.

"పగటి వెలుతురులో తప్తమై కల్మషాంధకారం పవన నిర్మలమవుతుంది. అంధకారరాత్రి సముద్రమువంటిది. అంజ నంలాగా నల్లనిది. అయినా అది నిరంజనము. ఇక పగలు నది వం టిది. అదినల్లనిదికాదు. కాని పంకిలం. నిశీధిని ఆవరించిన ఆ అతల స్పర్శాంధకార మేనాడు ఖిద్దర్‌పూరురేవు జెట్టీమీద కూడా మలినమైనట్లు చూపట్టింది. దేవత స్వయంగా తన హ్రావము మలినముచేసికొన్నదో అనిపించింది."

అనువాదకులు కృతజ్ఞత తెలుపుతూ 'గురుదేవుల ఋణం ఈ రూపంగా లవలేశమైనా తీరితే కృతార్థుడను అనిచెప్పి "ఆంధ్ర సారస్వత చక్రంలో మరొకమారు మధుమాప మంగళశ్రుతి వినిపిస్తుంది" అని ఆకాంక్షించారు. తమ 'నివే దన' యీ మంగళముతో ముగించారు.

నీనామ రూపములకును
గాన సవిత్రికి— కవిత్వ గాయత్రికి—బ్ర
హ్మానంద సాధనాభి
జ్ఞాన గిరాంజలికి— నిత్యజయమంగళముల్......

ఆంగ్ల, వంగభాషలో రవీంద్రవ్యాసావళిచదువని తెలుగు వారికీ సంపుటము ఉత్తమమైనది.

మా తాతయ్యా కొక ఏనుగుండేది

(రచన : వైకం మహమ్మద్ బషీర్. తమిళంనుండి తెనుగు సేత : చల్లా రాధాకృష్ణశర్మ. ప్రచురణ : సాహిత్య అకాడెమీపక్ష మున దిఓరియన్‌ట్ పబ్లిషింగ్ కంపెనీ (రిజిస్టర్డు), తెనాలి. మంచి అట్టబయిండుతో $\frac{1}{8}$ క్రౌను సైజున 95 పుటలు. వెల: రు 1—50 న. పై)

మళయాళంలో ఆధునికసాహిత్యం మౌలికరచనలతో విల సిల్లుతూ ఉన్నది. ఆ భాషలో చదువను వ్రాయును తెలిసినవారి సంఖ్య నూటికి నలభైదాకా ఉందనవచ్చును. వారిసంఘము— మన స్వాతంత్ర్యానంతరం చాలావిధాలుగా మారిపోయింది. అక్కడ ఉండేది మరీపేదవారు, లేకపోతే మరీ ధనవంతులుంటారు. ఈ వ్యత్యాసాలు భరించలేకనే అక్కడ సామ్యవాదమూ, స్వమత ప్రచారమూ సమృద్ధిగా పెరుగుతూవచ్చాయి. ఉన్నమతాలలో హిందూ మతస్థుల సంఖ్యే చిన్నది. క్రిష్టియన్లు, ముస్లిములు, మాప్లాలు చాలామంది ఉన్నారు. మతములమధ్య అడ్డుగోడలు ఒకేమతంలో శాఖలు, చీలికలు పెట్టడంలోకూడ యథాశక్తి పనిచేశాయి. ఈ మతాచారాల రాగద్వేషాలమధ్య, మానవుల ప్రాథ మిక భావనలయిన దయాదాక్షిణ్యము, జాలి సానుభూతి, మనిషి మనిషినీ ఎలాగ బాధించేదీ నిరూపించే నవల యీ మళయాళం ముస్లింరచయిత రచించిన కథ. వైకం మహమ్మద్‌బషీర్ అభ్యుదయ రచయితలలో ఒకడు. కేరళదేశంలో క్రిందిరకం మనుషుల జీవితాన్ని జాలితోచూచి చదువరుల కన్నీరుకరగే టట్టు చేయగల ప్రకృతికృపణుడు. "బతికి చెడ్డముస్లిం కుటుంబాన్ని కళ్లకు కట్టినట్టుగా ఈ నవలలో శ్రీ బషీర్ వర్ణించాడు. మళయాళంలో ఈనవలపేరు "ఎన్నుప్పాప్పా క్కొఒరు ఆనై ఉండార్ను" అంటే "మా తాతయ్యకి ఒక ఏనుగు ఉండేది" అని అర్థం. అదిముస్లిముల పరిభాషలోనే.

బ్రతికిచెడ్డ ఒక ముస్లిం కుటుంబంలో పెరిగిన "కుంజు ఫాతిమా' అనే అమ్మాయి ఏనుగునుగూర్చి కలలుకంటూ పెరి గింది. ఆమెతో ఎప్పుడూ బాబయ్యకి (తండ్రికి) ఒక ఏనుగు ఉండేది అని కుంజు తాచ్చుమా (తల్లి) చెప్తూ ఉండేది. వాళ్లకి లోకంలో రెండేజాతులున్నట్లు తెలుసు. ఒక్కళ్లు ఇస్లాం మత స్థులు— మరొకళ్లు కాఫిర్లు. ఆ కాఫిర్లనుచూచి ఎప్పుడూ కంటగించుకోవడమే తెలుసు. వాళ్లపొరుగింటిలో ఒక అమ్మాయి ఉంటుంది. ఆమె కాలేజీలో చదువుకొంటున్నది. ఆపిల్లపేరు 'ఆయిషా'. ఆ పిల్లతో జతకడుతుంది కుంజుఫాతిమా—నిసార్ అహమ్మద్ ఆ అమ్మాయిఅన్న. ఒక అడవిని మంచితోటగా మార్చి వ్యవసాయంచేసి, పండ్లుఫలాలు పండిస్తాడు. ముస్లిము లైనవాళ్ల ఆచార్య వ్యవహారాలనుబట్టి కాఫిర్లుగా భావించిన ఫాతిమా కుటుంబం మచ్చిక అయినతర్వాత వాళ్లలో మంచికని పెట్టారు. కయ్యంతో మొదలుపెట్టిన సంబంధం వియ్యంతో బలపడుతుంది. వాళ్లబాబయ్యకున్న 'కొమ్ము ఏనుగు' కుమ్మరి పురుగు అని తేలుతుంది. దానితో వాళ్లగొప్ప, తండ్రితాతల నాటి గర్వం కూలిపోతుంది.

తీవ్రభావాలుకలిగిన యీ అమాయక పాత్రలలోవచ్చిన పరివర్తన చాలచక్కగా, చమత్కారంగా రచయిత తన చిన్న నవలలో చెప్పాడు. ఈరకం ముస్లింకుటుంబాలలో వాడేపరిభాష వాడి, ఆ వింతజీవనాన్ని కన్నులకు కట్టినట్లు చిత్రించాడు. అది ముందు తమిళంలోకి, తరువాత తెలుగులోకి రావడంలో, కార్బన్‌కాగితం తిరగపడితే వచ్చిన తెల్లకాగితపు కాడీలాగవచ్చింది. తెనుగురచనబట్టి ఇంకోలాగ ఉండవచ్చునని ఊహించుకో వచ్చును. అనువాదం వ్యావహారిక భాషలోనే ఉన్నప్పటికీ గ్రాం థిక భాషలోకంటే జటిలంగా ఉన్నది. భగవంతుని క్షమార్పణ కోరుకునే 'తోబా' (ప్రార్థన) వినండి.

"మాపాలిటి భగవంతుడా! మేమందరమూ మహత్తరమైన నీ మహిమాన్ని అర్థిస్తున్నాము. మేముచేసిన అన్నితప్పులూ—చిన్నవి పెద్దవి, పరోక్షంగాను, అపరోక్షంగానూ చేసినవి అన్నిటిని

గ్రంథవిమర్శనము

క్షమించమని అర్థిస్తూ భయభక్తులతో తోబాచేస్తున్నాము. చేసినతప్పులు తలుచుకొని చింతిస్తున్నాము''—

ఇది చదువురాని వాళ్లు కితాబ్ చదువుతూ చేసిన ప్రార్థన. ఈ నవలలో ఏ చెడ్డజరిగినా అది 'యిబిలీస్' కుట్ర అంటారు. యిబిలీస్— యీ ముస్లిముల నమ్మకంలో శనిదేవత వంటిది. 'కుట్ర' అంటే 'కీడు'—తమిళంలో అదేఅర్థం. తెనుగులో 'కుట్ర' అనేది మరొక అర్థంలో 'కుతంత్రం' అనే అర్థంలో వాడుతాము. అనువాదమంతా ఇదే ధోరణిలో నడచింది. అయినా మాతృకలో కథమంచిది, అందు కోసమైనా ఇది అదవాలి.

విచిత్ర జీవులు

(రచన: హితశ్రీ, ప్రచురణ: తెలుగువిద్యార్థి ప్రచురణలు, మచిలీపట్నం. క్రౌను క్వో సైజులో 176 పుటలు, వెల: 2 రూపాయలు.)

రచయిత ముందుమాటలో చెప్పినట్లు 1958లో ఈ 'విచిత్రజీవులు' నాటకంవ్రాశారు. అదే సంవత్సరం 'భారతి'లో ప్రచురించారు. అప్పుడే ఈ నాటకానికి మంచిపేరు వచ్చింది. కొన్నినాటక సమాజాలు దీన్ని రంగస్థలంమీద ప్రదర్శించి బహుమతులుకూడా సంపాదించినట్లు విన్నాం. ఇప్పుడిది పుస్తక రూపంలో రావడం ముదావహం.

రచయిత — వ్యక్తితో సంఘం పురోగమిస్తుందనే ఆశావాది. కాని ''మనసంఘవృక్షం కుక్కమూతి పిందెల్ని వేస్తోంది, చూడండి వేరుపురుగు. ఆ వేరుపురుగును సమూలంగా నాశనంచెయ్యాలి. అందుకోసం యథాశక్తినితోడ్పడే ప్రయత్నమే యీ నాటకం'' అని తన నివేదన. 'ఇందులోని విచిత్రజీవులు సంఘంలో వ్యాపించిన వెకిలితత్వాలకి మానవ రూపాలు. ఈ తత్వాలమీద దాడి జరపడమే సంభాషణలలోని ముఖ్యోద్దేశం. విలువలకీ స్వార్థప్రయోజనాలకీ జరిగే నిత్య సంఘర్షణ నాటకీయంగా వ్యంగ్యధోరణిలో చిత్రించడానికి ప్రయత్నించాను' అని రచయిత చెప్పుకున్నారు. ఈ ప్రయత్నం పూర్తిగా నెరవేరింది. మంచి ఉత్కంఠ కలిగించే కథాసంవిధానం, దానిలో గబగబ త్రోసుకునివచ్చే సంఘటనలు, ఆ సంఘటనలతో ఊపిరి సలపకుండా తబ్బిబ్బయ్యే పాత్రలూ, ఆ పాత్రలవలికే సంభాషణలూ ఎంతో చమత్కారంగా ఉంటాయి. రంగస్థలంమీద ప్రదర్శిస్తే, అయిదు రంగాలలో అనువుగా ఉండి రెండు స్త్రీ పాత్రలతోను ఏడెనిమిది పురుషపాత్రలతోను బాగా రక్తికడుతుంది. దృశ్యరూపంగా చూడటానికేకాక చదువుకోవడానికికూడా రసవంతమైన నాటకం. ఇందలి కళ్యాణి, విద్యాపతి, సుందరరావు, ధర్మారావు, కూర్మావతారంవంటి పాత్రలు మనకు రోజారోజూ నిత్యజీవితంలో ఎదురుపడుతూనే ఉంటాయి. ఇలాంటి వాస్తవికపాత్రలు, నాటకంలో ప్రత్యక్షమయ్యేసరికి విచిత్రజీవులుగా గోచరిస్తారు. వాళ్ళకష్టసుఖాలు, ఏడ్పు నవ్వులూ మనకి వినోదం కల్గిస్తాయి. హితశ్రీ— కథలు వ్రాయడంలోనేకాక నాటక రచనలోకూడ సిద్ధహస్తులని యిలాంటి నాటకంవల్ల నిరూపించుకున్నారు. ఇదిపుస్తకంగా ప్రచురించడం బాగ్లానే ఉన్నదికాని అట్టమీదవేసిన నీలి పసుపు రంగుల ముఖచిత్రం దిష్టిబొమ్మలాగుంది. ప్రతిపుస్తకానికీ సచిత్రముఖపత్రం వేసితీరాలనే ఛాదస్తం పొందిన విపర్యయానికి ఇది మచ్చుతునక.

ఉదయించని ఉదయాలు

(కేశవరావ్ రచించిన వచన గీతికల సంపుటము. డెమ్మీ క్వో సైజున 96 పుటలు. ప్రచురణ: అనిలా ప్రచురణలు, హైదరాబాదు. వెల: రెండురూపాయలు, ప్రాప్తిస్థానము: జయ భారత్ బుక్‌డిపో, సుల్తాన్‌బజార్, హైదరాబాదు.)

వచన గీతికలో వెలువడిన యీ కవితా సంపుటానికి, ఈ పద్ధతి రచనలో కృషిచేసిన ఆరుద్ర, 'ఒప్పోతప్పో— ఇది నా మెప్పు' అని ఉపోద్ఘాతంవ్రాశారు. అందులో వారంటారూ: ''ఈ తరంకవులు విరహగీతాలు రాస్తే ఎందుకో అందరూ ఎబ్బెట్టుగా చూస్తారు. అభ్యుదయ కవులధర్మమా అని వర్గ చైతన్యం గురించి పాడితేనేతప్ప మిగతాది కవిత్వం కాదేమోనన్న అపోహ ఆంధ్రదేశంలో అనవసరంగా ఊపిరి పీలుస్తోంది. వచనపద్యాలకి సరిపోయే కావ్యవస్తువులు వేరేవున్నాయనుకొంటారు— కవిత్వం లిక్విడ్‌లాంటిది. ఏ ఆకారంగల సీసాలోనైనా దాన్ని పొయ్యొచ్చు. కేశవరావ్‌గారు నిర్భయంగా వచనపద్యాల్లో విరహం గురించి పాడినందుకు వారిని మెచ్చుకుంటున్నాను. తిరుగుబాటుదారులపైన తిరుగుబాటుకూడా ఒకప్పుడవసరం' అని ఆరుద్ర మెచ్చుకున్నారు.

మొగలు మేల్కొంటున్నప్పుడు అర్థరాత్రితో ఇలాంటి విరహ సంగీతం వినిపించాడీకవి.

''అపుడు అర్థరాత్రి అయినట్లు నాకు తెలిసింది
అతని విశాలలోచనాలలో అందమైన అరణ్యాలు కనిపించాయి
అతని పాదాలసవ్వడిలో జీవనసంగీతాలు చిత్రంగా ధ్వనించాయి.'

వచన కవిత్వంచెప్పే అభ్యుదయకవి కంఠంలాగలేదు— రవీంద్రుని భావలహరిలోన ఓలలాడిన ప్రణయకవి పలుకుచున్నాడు. 'అంతేకాదు, ఈ వచనగీతికలు పాడే ముక్తచ్ఛందోవరులు చెప్పినట్లు ఇంగ్లీషుమాటల చెరిశింపులుకాని, ఆకలికేకల అల్లార్పులుకాని కనిపించవు, వినిపించవు. నిరాశతో నిస్పృహపడే నిరుద్యోగుల ఆక్రందనాలుకూడ లేవు. ఈ కవి ఆశావాది. స్నేహంమీద నమ్మకం కలవాడు.

ఆమెను కలిసినప్పుడు తెలిసింది
స్నేహానికి అర్థం,
ఆమె నవ్వులకాంతిలో తడిసినప్పుడు
ఆమె నిట్టూర్పుల నడిలో నావునికి కదిలినప్పుడు
ఆమె ఓదార్పుల్లో అనంతకాలాన్ని మరచినప్పుడు
నాకు జీవితంపై కొత్తవిశ్వాసం కలిగింది,
నా గుండెకింద కొత్తపువ్వు పూసింది.

అని ఆరోగ్యంగా జీవితాన్ని ఆనందిస్తాడు.

''భవిష్యత్తులోకి తొంగిచూస్తే
ఘోషిస్తున్న ఉదయాలు కనుపించనకమానవు''

అని ఆశాగీతం వినిపిస్తాడు. ఉదయించని ఉదయాలు చూచి ప్రస్తుత నిరుత్సాహంతో ఓదార్పు పొందుతాడు. 'ఈ జీవితానికి అవతలిబడ్డ మసరక్తంలో రేపటి సూర్యుడు ఉదయిస్తున్నాడుచూడు'' అని వైతాళిక గీతములు పాడుతున్నాడీయువకవి. 'నూతిలో గొంతుకలు' 'భువనఘోష ''రక్తాశ్రువులు'' మాత్రం వినిపించిన అభ్యుదయకవితా ప్రపంచంలో నూతన కంఠం. తప్పక గుర్తుపెట్టుకోవలసిన గొంతుక.

జ గ న్మో హి ని

(కన్నడమూలం : కొరటి శ్రీనివాసరావు. తెనుగు సేత: డా. యస్. శేషాచార్యులు, శ్రీనివాసపురం రామాచార్యులు, డా. శ్రీనివాసపురం నరసింహాచార్యులు —ప్రచురణ: శ్రీనివాస పబ్లిషింగ్‌హౌస్, బకింగ్‌హామ్‌పేట పోస్టు — విజయవాడ—2. (కౌను $\frac{1}{8}$ సైజులో 251 పుటలు. వెల: నాలుగు రూపాయలు).

విద్యానగర చారిత్రిక నవలాగుచ్ఛము అనుపేరున— 20 భాగములుగా కన్నడములో కొరటి శ్రీనివాసరావుగారు శ్రీ కృష్ణదేవరాయుల చరిత్ర మొదలైనవి రచించారు. వానిని శుభశ్రీ, రమ్యశ్రీ, సింహశ్రీ అనుమారుపేరులుగల ఆచార్య త్రయం తెనుగులోకి అనువదిస్తున్నారు. ఈ యనువాదము లలో ఇరవై సంపుటములుగా విద్యానగరచరిత్ర కథలుగా చెప్ప వలెనని వీరిసంకల్పము. ఈ నవలలోకథ తెలుగుపాఠకులకు పరిచితమైన గజపతికుమార్తె చిన్నమ్మదేవికథ. ఈమె తుక్కారమణి, చిన్నాదేవి, వరదరాజమ్మ, అన్నపూర్ణాదేవి, రుచాదేవియును నానార్థాంతరములతో తెనుగుదేశంలో ప్రసిద్ధికెక్కినదే. ఇందులో ఈమెపేరు ''జగన్మోహిని''— ప్రతాపరుద్ర గజపతి కుమార్తె. కృష్ణరాయలు గజపతిని ఓడించి పొట్నూరికి సమీపమున తనదిగ్విజయ స్తంభాన్ని స్థాపించి, గజపతి పుత్రి అయిన జగన్మోహినిని పెండ్లాడిన కథలోనే ఆమెతండ్రి పంపున రాయల వారిని చంపడానికి కుట్రచేయడం, చివరికి ఆమెను రాయలు వదిలివేయడం ఇందలిఇతివృత్తం. తదనంతరం ఆమె కంభంగ్రామంలో అజ్ఞాతవాసం చేస్తుండేదని, ఆ గ్రామవాసులు నీటికోసం పడేపాట్లు చూడలేక మంచినీటి చెఱువు త్రవ్వించినదనీ ఆ చెఱువు 'కంభం'లో ఇప్పటికీ ఉన్నదనీ ఆ పల్లెవాసులు చెప్పుకొంటారు.

ఈ నవల అనువాదంలో— ఎక్కడా నెట్టకుండా తెనుగులోనే స్వతంత్రంగా వ్రాసినట్లు చకచక నడచిపోయింది. ముగ్గురుకలిసి వ్రాసినాకాని ఏక కంఠంగా పలికినట్లే ఉంది. వ్యావహారిక భాషలోనే వ్రాసినప్పటికీ చారిత్రక నవలకు కావలసిన గాంభీర్యమూ కథనశైలీ ఉదాత్తతా ఎక్కడా చెడలేదు. విజయనగర రాజుల చరిత్రను కన్నడరచయిత పరిశీలించిన వైఖరి తెలిసికోవడానికి ఈ నవల ఉపయోగిస్తుంది.

—శ్రీవాత్సవ.

అడుగుజాడ గురజాడదా?

('అడుగుజాడ గురజాడది' అన్న పేరుతో శ్రీ కె. వి. రమణారెడ్డిగారు నూటికిమించిన ఆధునిక గేయరచనలనూ లయగంధి వచనాలనూ కూర్చిన సంపుటమిది. కావలి సాధన సమితివారి ప్రచురణ, 142 పుటలు, వెల రెండురూపాయలు.)

పద్యాలుగా కాకుండా మరేలాగువచ్చినా కవితారచనలైనా సరే గురజాడ అడుగుజాడలలోనివే అని వీరి అభిప్రాయము. అందువల్లనే వ్యావహారికములోగాని, గ్రాంథికములోగాని,

గ్రంథ విమర్శనము

ఎవూస గర్భితములుగా గాని, తేటమాటల రచనలుగా గాని, వచనంలోకాని, వరసల్లోకాని, ఉన్న రచనలను స్వీకరించారు. "ఏనాడు గురజాడ కొత్త ఛందస్సును నిర్మించుకొని.... తట్టాడో ఆనాడే తప్పనిసరిగా వ్యావహారికం, వచన ప్రాబల్యం కావ్యసీమలోకి చొరబడివచ్చాయి" అన్నారు. పరిచయములో. గురజాడ మరణించినది 1915లో. సుమారు 1935 తర్వాత అనేక పరిస్థితుల ప్రాబల్యంవల్ల వచ్చినవచనగేయాలు గురజాడ అడుగుజాడలని నిర్ణయించడము సత్యానికి దూరముకాదా అనిపిస్తున్నది. గురజాడ వచనగేయాలు రాయలేదూ, మాత్రా బద్ధ రచనలే చేశారు. పద్య ఛందస్సును ఆయన వదిలేశారు, అందరూ వదిలేయాలనే ఆయన ఆశయము కావచ్చును. అయితే "ఏదోరీతిని స్వేచ్ఛగా వ్రాసేయండి" అని ఆయన ప్రబోధం కానేకాదు. వచనంలోనే నియమముతో వ్రాయాలని ఆయన బోధ. "గ్రాంధికభాష కత్తిమీద నడక. ఏ బ్రహ్మయ్యశాస్త్రులు గారివంటి పదిమందికోగాని సాధ్యముకాదు. కనుక సామాన్య రచయితలందరూ పుస్తకాలభాషకీ మాట్లాడుకునే భాషకీ సగటుగా వుండేటట్టు చక్కని కావ్యభాషనీ, వచనభాషనీ నిర్మించుకుని వ్రాయవలసినది" అనే వారిఅభిప్రాయము. ఈ అభిప్రాయాన్నే ఛందస్సువైపు ప్రసరించిచూస్తే" వృత్తాది ఛందస్సులకు నియమాలే ప్రధానం. ఆ నియమాలలో ఇరికి భావస్రవంతి సన్నమై, బడబడలే ఎక్కువౌతాయి. వృత్తాది పద్య ఛందస్సులూ, లయప్రధానాలైన గేయఛందస్సులూ వదిలి ఈ రెండింటికీ సగటుగా తేలే, బంధప్రాయము కానటువంటి, సరళ ఛందస్సులో కవులు పలకవలసినది" అనే ఆయన అభిప్రాయమేమో ననిపిస్తుంది. వారు ఎంచుకున్న ముత్యాలసరాలూ, చతురశ్రగతి వరుసా ఈ అభిప్రాయాన్నే వ్యక్తము చెయ్యడములేదా అని అడుగుతున్నాను. వారుదారితీసినది— భాషలోనూ ఛందస్సులోనూ— సారళ్యమువైపు, విప్లవము వైపుకాదు. వారు మూడుమూర్తులా సంస్కారి, విప్లవకారుడు కారు. వచనగేయ రచయితలు విప్లవకారులు,సంస్కారాభిమానులు కారు—ఆలోచించండి.వీరి ఈవిప్లవము గిడుగు రామమూర్తిపంతులు గారి ఉద్యమముతో బయలుదేరినట్టిది. వారు రచయితలుకాక పోయిరి. వారిభాషావాదములో "నిర్మించుకోవాలి" అన్న సూత్రమే వినబడక, "ఆ ప్రయోగము తప్పుకాదు. పండితులూ వ్యాకరణమూ నిషేధించే శబ్దములను కవులు ప్రయోగిస్తూనే ఉండినారు. ఈ గ్రాంథికవాదుల రాతలలోనే వారు తప్పులనేటివి కొల్లలుగా వున్నాయి" అన్న విప్లవభావమే గట్టిగా వినబడి నియమ విచ్ఛేదానికి దారిచూపింది. రచయితలు వ్యాకరణపు గట్లు కొట్టేశారూ, రచనాప్రవాహము అన్నిపొలాల్ని నింపివేసి పొంగిపొర్లింది. సుమారు ఈ కాలానికే స్వాతంత్ర్యోద్యమము కూడా విజృంభించింది. 'మాకొద్దీ తెల్లదొరతనము,' 'దండాలు దండాలు భారతమాత,' 'కొల్లాయిగట్టితేనేమి,' 'జైలు అది వున్నదే మనకొకమైలు' వంటి పాటలు విరివిగా వ్యాపించాయి. ఆధునిక కవిత్వములోని ఈపాటలు తరుణములోవచ్చాయి. రాజకీయసంకెళ్ళు తెంపమని ప్రబోధించలేకపోయినా, వ్యాకరణపు సంకెళ్ళమాత్రము తెంపిపారేశారు రచయితలు. సాహితి, కవికొండలా బాపిరాజుల రచనలూ, మొంకిపాటలూ, పాటలను ప్రచారముచేశాయి. పాటలలో, కవిత్వానికి విజాతీయమైన సమలయా, రాగమూ అదనపుటందాలు. గురజాడకవి ఈ అందాలున్న తనరచనలకు 'నీలగిరిపాటలు' అన్నపేరుపెట్టి వాగ్గేయకారుల పాటలకువలెనే వాటికి 'అప్పకవి' అన్న మకుటమును చేర్చి ప్రచురించారు. ఆయన ముత్యాలసరముల రచనలలో గతి సౌందర్యముకాని, రాగ సౌందర్యముకాని ఆ రచనల భుజాల మీదకు ఎక్కి చదువరుల మనస్సులలోనికి తొంగిచూడదు. ఆధునిక కవుల పాటలన్నిటిలోనూ ఆ తొంగిచూపులు కనిపిస్తూనే వుంటాయి. కాబట్టి ఈ పాటలు ఆయనకవితకు అనుసరణములు కావంటున్నాను. వీటిని వ్రాసినప్పుడు రచయితలకు గురజాడ స్ఫురణే లేదంటున్నాను.

భావకవిత్వపు ప్రేమవాగురులలో చిరకాలము కొట్టుమిట్టాడిన తర్వాతనైనా కవులదృష్టి గురజాడపద్ధతివైపు మళ్ళలేదు. ఆయనకవిత వ్యావహారికములోనికీ, మాత్రాచ్ఛందస్సులలోనికీ మళ్ళిందన్న బాహ్యదృశ్యమునే ఎవరేనా చూచారు కాని తేటమాటలతో, రసనంతముగా, సూటిగా శక్తివంతముగా (రవీంద్రుని రచనా పద్ధతిలో) సాగిందని చూచారుకాదు. గురజాడ రచనలవంటివి తెలుగులో చాలా కొంచెము. చింతాదీక్షితుల గారి "మక్కలు తిరిగే హిమాద్రిమీదా" అన్నరచన ఒకటి చాలావరకు గురజాడవారి పద్ధతిలో వచ్చినది. రాయప్రోలు "దేశ గర్వము దీప్తిచెందగ" అన్నదే దారిమళ్ళిపోయింది ! బసవరాజు "కవిత్వాన్ని అనేస్తాడు, రచించడు" అన్నారు కృష్ణశాస్త్రి గారు. అలాగ అనేయడములో ఏ ఒకటో రెండో గురజాడదారిలో పడ్డాయి. అంతమాత్రమే. కవులు మాత్రా చ్ఛందస్సులనూ వ్యావహారిక భాషనూ స్వీకరించలేదా అంటే గురజాడ స్వరూపము ఆ రెండింటిలో వున్నదంటారా ? అని అడుగుతాను. గురజాడయే మొట్టమొదట ఆ రెండింటినీ ప్రవేశపెట్టారుకదా అని, వ్యావహారికములోగాని మాత్రాచ్ఛందస్సులలోకాని రచించిన వారందరూ గురజాడ ననుసరించినట్లేనా ? (గురజాడ కావ్యభాష వ్యావహారికముకాదు, దయచేసి పరిశీలించండి. వ్యావ

హారికమే అని నిర్ణయించినా) వారికట్టో చెప్పుల్లా సంగ్రహించిన మాత్రాన వారి కవితాకువారి సరళసుందర గమనము— ఇదే వారిరచనల జీవము— అలవడినట్లేనా ? "ఎక్కడనో ఒక చెట్టుమాటున ఒక్కకోకిల పలుకసాగెను; లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా; నీవు పట్టమేలే రాజవు సెట్టి కూతుర నెటకుపోనేర్తున్; నాళ్లనడుమను నట్టివీధిని పట్టబోరే జారచోరులు; విద్దెలందున మాయమర్మము దిద్దిచెప్పెంద బలయొక్కతె; పట్టమేలేరాజు అయితే రాజునేలే దైవముండడో; పరువునిలపను పౌరుషము మీకేల కలగదొకో ?; మంచిచెడ్డల మనుజులందున ఎంచిచూడగ రెండెకులములు; మంచి అన్నది మాలయైతే మాలనే అగుదున్; తాడివనములు తూర్పుకొండను గొడుగులెత్తెను; కన్నుల బలబల కన్నీరొలికెను పుత్తడిబొమ్మకు పూర్ణమకు; కన్నులు తుడుచుకు కలకలనవ్వెను పుత్తడిబొమ్మా పూర్ణమ్మా"అని వ్యావహారికమూ, ముత్యాలసరాలూ రచించినవారు శక్తివంతంగా, అతి సరళంగా, సూటిగా ఎవరనగలిగేరూ? మరిగురజాడ అడుగులజాడ అనగా ఇంకేమిటి ? గురజాడ రచనలు కోమలులు. స్త్రీలపాత్రలలోని రసమూ జానపథ గాథలలోని సౌందర్య దృష్టి పండితుల ఎంపికా కనబడతాయి ఆ రచనలలో. కావ్య రచనకు ఉపక్రమించి, చెప్పేవస్తువునూ చెప్పేరీతిని సంస్కరించుకుని రచించారాయన. వారిరచనకు జీవమేది ? వారి ఉద్యమము ఏమిటి ? అన్నవి వదలిపెట్టి వారి రచనలకు బాహ్యలక్షణాలు జన వ్యావహారికభాషనీ ముత్యాలసరాల ఛందస్సునీ విడదీసి ఈ రెండే గురజాడ తెలుగువారికి చూపించాడనుకోవడము సులువైతే అవుతుందిగాని సత్యముకాదు.

గురజాడ అడుగుజాడల్లోనే తెలుగుకవిత్వము సాగిఉంటే రవీంద్రుని కవిత్వపుసొంపు తెలుగులోకి ప్రవేశించి ఉండును. తెలుగుకవులు గురజాడనువలెనే రవీంద్రుని కవితనూ ఉపేక్షించారు. గురజాడకు రవీంద్రునితో పరిచయము ఉండినదట. ఆయన రవీంద్రునంతటి కవి కాకపోయినా ఇద్దరిరచనలలోనూ నిండివున్న సరళ సౌందర్యము తెలుగుకవులను దాటిపోవడము మన దురదృష్టము. గురజాడఅంటే వ్యావహారికములో ముత్యాల సరాలు వ్రాసిన కవిమాత్రమేకాదు, మరి రామడోళ్ళ భాష మర్పాలూ, వృత్తాల అతితొందరా, శబ్దపుమువ్వల గలగలలూ, వ్యాకరణపు పావకోళ్ళూ, అలంకారాల బరువూవదిలి సహజ కోమలమైన భావసౌందర్యాన్ని పట్టితీర్చినకవి. అలాటికవులు భావకవులూకారూ, వచనపద్య కవులూకారు. ఆ మూల బెళ్ళూరి శ్రీనివాసమూర్తీ, నడిగడ్డమీద జాషువా, ఈమూల రామిరెడ్డి సరళ భావసౌందర్యాన్నిపట్టి గ్రాంథికభాషలో ఇచ్చారు తెలుగు వారికి. వారి కవిత్వానికీ అదేజీవము. వీరంతా వృత్తాల్లో వ్రాశారూ ఆయనముత్యాల్లో రాశారు.

గురజాడకూ రవీంద్రునికీగల మరొక్క పోలిక మనవి చేస్తాను. ఇద్దరికీ ప్రకృతి చైతన్యవంతమైన రంగము. "విరులు కన్నులు విచ్చిచూసెను; కొసరెనో అన గాలివీచెను; తాడివనములు తూర్పుకొండను గొడుగులెత్తెను; తాడివనమున నాగి చంద్రుడు తాను చెవియొగ్గన్; క్రీడావిస్మయంబులు ఆననంబున పొరగ; తాళవనమునువెడలి చంద్రుడు ఫక్కునను నవ్వెన్; తదియ చందురు డబ్బిసోకెను; అదునుకాంచిన రిక్కమూకలు అంతటను ప్రబలెన్; ఆమని రాగా దుర్గకొలనులో కలకల నవ్వెను తామరలు;" గురజాడకవి అల్లినవి అన్నికథలు అనిజ్ఞాపకము చేసుకుంటే ఇంత్వమాత్రపు ప్రకృతివర్ణన హెచ్చేలని తట్టుతుంది. రవీంద్రకవికివలెనే గురజాడకవికి ప్రకృతి సర్వమూ చైతన్యమయము. ఎటుచూచినా పలకరింతే చూస్తారు ఇద్దరూ. ఆధుని కాంధ్రకవులకు ఈ సౌందర్యము గట్టిగా తాకలేదు.

గురజాడనూ— ఛందస్సునూ భాషనూ మార్చినకారణంచేత— విప్లవకారునిగా జమకట్టి పద్యాలనడుములేకాక మాత్రాచ్ఛందస్సుల రూపాలూ, విరగదన్నిన విప్లవకారుల్ని చాలామందిని ఈ సంపుటంలో సమావేశపరిచారు. గురజాడకు ఇంచుమించు వ్యతిరేక ధ్రువమువంటి రాయప్రోలుకీ, లోకంలో తానేఅయి పలికిన కృష్ణశాస్త్రికీ, దువ్వూరిపాటకీ అడుగుజాడ గురజాడదేనని తీర్మానించారు. అన్నిరకాల విప్లవానికీ చోటు కల్పించారీ సంపుటములో. ప్రాసక్రీడలతో పసందుగా విన్పించే 'అడుగుజాడ గురజాడది' అనకుండా ఇంకొకపేరుపెట్టియుంటే బాగుండునేమో అనుకుంటాను.

ఈ రకపు కావ్యసంకలనాలు ఉదయఘంటలు, కల్పన అన్నవి రెండు నేనెరుగుదును. ఇదిమూడోది. రమణారెడ్డిగారు జ్వాలాసన్నిభులు. వారి "పరిచయము"కూడా ఈ సంకలనములోని వచనకావ్యముల వలెనే బల్లగుద్దుతూ, ఆగ్రహిస్తూ, వెక్కిరిస్తూ, ప్రాసక్రీడలుచేస్తూ ఒకసారి మనచెయ్యి పట్టుకుని చెవుతూ ఇంకోసారి చిన్ముద్రపట్టి 'ఉవాచ'చేస్తూ, మరోమారు 'కామ్రేడ్స్, మార్చిఆన్' అని ఆజ్ఞాపిస్తూ సాగిపోతోంది.

అయితే ఇలాటి సంపుటాలకు చాలా విలువఉంది. పూర్వకాలంలో కవిత్వం చెప్పేవారు రాజసభల్లో, అందరూ వినేవారు. వ్రాసుకునేవారిక్కికూడా పుణ్యం ఆశపెట్టుతూ కవులు చెప్పిన ఫలశ్రుతి విన్నతర్వాతైనా కొందరుప్రతులు వ్రాసుకునేవారు తాటాకులమీద. అచ్చుకూటములువచ్చి, అందరికీ చేరగలిగే అవకాశం కవిత్వానికి అలవడినప్పుడు, జ్ఞాపకముండడానికి సహాయపడే గతియతిప్రాసలు లోపించిన ఈ రచనలు సభలలో

గ్రంథ విమర్శనము

కూడా వినబడలేని పరిస్థితులలో, పుస్తకాలూ సంపుటాలూ లేకపోతే ఇవి పత్రికాపుటలతోపాటు పాట్నాలలోనికి దూరిపోతాయి. ఇవి ముఖ్యంగా పత్రికాపుత్రికలుగానే వస్తాయి. చదువరులకే వీటి సంబోధన ముఖ్యంగా. కాబట్టి ఏపాటి చైతన్యంకల రచననైనా ఒకసంపుటములో నిమిడ్చి ఉంచడము వీటికీ ప్రగతి వాఙ్మయానికీ కూడా మహోపకారము.

ఈ వచనపద్యాల వాఙ్మయముయొక్క విలువలనూ తారతమ్యములనూ నిర్ణయించుట ఈనాడు సులువుకాదు. రచయితలుకూడా మా రచనలమీద చెయ్యివేసి మలినం చెయ్యకండి అనేట్టివారే. కనుక వాటిని అలా వుంచేయడమే శ్రేయము. నియమమ్మంటూ ఒకటి— భావం ఉండాలనో, కవికి ఉద్దేశముండాలనో,—ఉంటే దానినిబట్టి మంచీచెడ్డా అని చెప్పవచ్చు. రాంబొందుల రెక్కలచప్పుడూ, పొగగొట్టపు భూంకారధ్వని, ఫ్యాక్టరి కూలీల నివాదాలూ, కమ్యూనిస్టు కొత్తారులసరకూ ఎదురుగాపెట్టితే హాయిగా చూడడమే కర్తవ్యము. కాలోహ్యయం నిరవధిః—

గురజాడ శతవార్షిక జయంతి సంచిక

(ఇది హైదరాబాదు, గురజాడ శతవార్షిక జయంతి సంఘమువారి ప్రచురణము. 120 పుటలు. వెల: రెండు రూపాయలు).

గురజాడవారి బహుముఖ ప్రతిభాసంపదను పరిచయము చేయునుద్దేశ్యముతో నీ సంచికను సిద్ధముచేసితిమని ఆముఖమందు వివరించినారు. ఆంధ్రప్రముఖులు పలువురు, బహుముఖ ప్రజ్ఞావంతులు దీన వ్యాసములు వెలయించినారు.

గురజాడ అప్పారావుగారి జీవితవిశేషములను డా. గిడుగు సీతాపతి, ఖండవల్లి లక్ష్మీరంజనము, గురజాడ రామదాసుగార్లు వివరించినారు. వారిసమకాలపు పరిస్థితులను, సమకాలికులను, తాపీ ధర్మారావు, వసంతరావు, బ్రహ్మాజీరావుగార్లు పరిచయము చేసినారు. గురజాడవా రుపయోగించనెంచిన వ్యావహారిక భాషను గురించి తెలికిచర్ల వెంకటరత్నముగారు రచించిన వ్యాసము బరువైన వ్యాసము. నిడదవోలువారి "కన్యాశుల్కపుభాష" అప్పారావుగారి పేరును పరిశీలించుటతో మొట్టమొదటనే వంకదారినవలంబించుచున్నను, 'గంట'ను గురించిన కథనములో అప్పచ్చు పు'పద ప్రయోగముతో పసహ్యముగాను, గోచ ఉంచినప్పటికిని మిగిలిన భాగములో అప్రస్తుత ప్రశంసను విడిచి ఏడు సూత్రములనుతీసి చూపుచున్నది. నాటి పసప్పాకమువారి మాటలేమి, నేటి వెంకటరావుగారి పదముల అసహ్యపు అర్థముము ఏమరుటు వినోదకరమేగదా ?

అబ్బూరివారు వ్యాసముగ వ్రాయదగిన 'పూర్వోత్తర ప్రతులపరిశీలనా' వస్తువును ముక్కలుగ ఇచ్చినారు. దీనినిచదివినప్పుడు కన్యాశుల్కపు మొదటిప్రతి కథనైనను ఈ సంచికలో ముద్రించలేదేమన్న కించ మిగిలిపోవుచున్నది. రామకృష్ణరావుగారిచ్చిన తునుకలు చెఱకుతునుకలు. "రుచిని మీరే గ్రహించండి" అనికాబోలు వారిఉద్దేశము. దాశరథివారు అప్పారావుగారి కథానికలను పరామర్శించినట్టిది విమర్శనా వ్యాసము. అప్పారావుగారు వెలయించిన సొగసులకు దాశరథివారు శ్రద్ధగా వ్యాఖ్యానము చేసినారు. ఆరుద్రగారి కన్యాశుల్క వ్యాసము ఆ నాటకము మెడలోని వనమాలకు ఇంకొకపువ్వు. పద్మశ్రీవారి 'మధురవాణి' వేషపు అనుభవాలు ముసలివారు పడుచువారి సమ్మర్దములో ఉటంకించు దంపతీహాస్యములవలె వినోదకరములు. కృష్ణకుమారి "గురజాడ స్త్రీ పాత్రలు" ఆమెతిప్పిన సెర్చిలైటు.' కూలంకషమైన ఇట్టిపరిశీలనలు రావలసియున్నది' తెలుగులో. డి. రామలింగంగారిది 'గురజాడ నాటక రచనాప్రతిభ' మంచియత్నము. యత్నమని ఏలనంటివి ? అందురా ? ఆ శీర్షికపై వ్రాసిన దేదయినను యత్నముగా మాత్రమే నిలుచును గనుక.

ఈ సంచికలో గురజాడవారి కవిత్వమును గురించిన వ్యాసముగాని ఆయన యుగపురుషులన్న వ్యాసముగాని లేకపోవడము చిత్రముగనే యున్నది. గానిదానికి కారణము చిత్రతరము! తెలుగు రచయితలకు వాక్స్థానమందు బృహస్పతియేకాని క్రియాస్థానమునందు కుంభకర్ణుడు! అందుకేకాబోలు 'ముందుమాటలో" గురజాడ.... ప్రతిభాసంపదను స్థాలీ పులాకముగ" నన్నారు పాపము !

గురజాడ హాస్యరచన, పాత్రరచన, ఇతివృత్తరచన, గురజాడ అనుకరణము, (లేదా అనుసరణము) గురజాడ కుహావా శిష్యవర్గమువంటి ఇతర ప్రధానాంశములతోపాటు ఈ సంచిక చదువుచున్నప్పుడు, గురజాడ రచనాకాశమునుండి మెరిసెడి నక్షత్రములెన్నియో స్ఫురించుచున్నవి. కన్యాశుల్క నాటకమును గురించి వచ్చినంత విమర్శనావస్తువు ఇకయే ఒక్క నాటకమును గురించియు రాలేదు. హాయిగా నవ్వుకొనుటను ఆంధ్రులకు మొదటనేర్పినది అప్పారావుగారు. వీరేశలింగముగారు ఆంగ్లమునుండి అనువదించగా అప్పారావుగారు స్వంత

రచనలు చేసినారు. ఠాగూరు కవిచంద్రుడు, బంగాళీభాషలో వలె అప్పారావుగారు 'చల్తీభాష'లోనే కవనము చెప్పినారు. (ఠాగూరు నోబెలుబహుమానమును గ్రహించకపూర్వమే ఠాగూరును గురజాడవారు గొప్పకవిగా గుర్తించినారు). నారదుడు పాడినను నాలుగుడబ్బులివ్వరని తెలుగు దేశములో ధూమకేతువు వలెనే గురజాడవారు పుట్టి గిట్టినారు. రామదాసుగారన్నట్లుగా గురజాడను గుర్తించుటకు తెలుగువారికి పక్షము సంవత్సరములు పట్టినది. ఇద్దైనను ఎంతకాదు ?

—సుధా.

హరివంశ పురాణము

గ్రంథకర్త :—శ్రీ విశ్వనాథ నరసింహముగారు. ప్రతులకు : శ్రీ విశ్వనాథ నరసింహము ఎం. ఏ. బి. ఇడి. రిటైర్డు తెలుగు లెక్చరర్, పార్వతీపురం (శ్రీకాకుళం జిల్లా), వెల : రు. 10. పుటలు : 384.

కవిశేఖర విద్వత్కవిభూషణ శ్రీ విశ్వనాథ నరసింహము గారి హరివంశ పురాణములో ప్రథమ భాగము ముద్రింపబడినది. ఇది సంస్కృత హరివంశములో ఏబదియారు అధ్యాయములలో నున్న హరివంశ పర్వమునకు ఆంధ్రీకరణము. శ్రీ కవిగారు తమ అనువాదము యథామూలకమని తెలిపినారు. యథామూలకమనగా వా రనుసరించిన ప్రతికి సరియైన తెలుగు సేతయని మనము అనుకొనవలెను. ఏలన మనకు లభించుచున్న ప్రతులలో చాలా వైవిధ్య మున్నది. అసలు మూలమేదో 'వ్యాస ఏవ వేద' అనవలసినదే. శ్రీ కవిగారు తా మనుసరించిన ప్రతి ఏదో తెలుపకపోవుట అనర్థదాయకము కావచ్చును.

ఎర్రన హరివంశమున లేనివి యిందు కొన్ని కలవు. కార్తవీర్యుని కథ యిందు కొంత విస్తరముగా నున్నది. ఈ విషయములు పీఠికవల్లనే తెలియుచున్నవి. కార్తవీర్యుని కథలోని రచన ప్రౌఢమై అతని యుదాత్తతకు తగినదిగా నున్నది.

శ్రీ కవిగారు ఈ గ్రంథమున వృత్తౌచిత్యమును చక్కగా పాటించుట ప్రశంసార్హముగా నున్నది. శ్యమంతకోపాఖ్యానములో దాది జాంబవత్పుత్రుని వోదార్చుటకు జోల పాడిన సందర్భమున వ్రాయబడిన మంజరీ ద్విపద యిందుకు ప్రథమోదాహరణము. "ఆదికాలపు కవులు పాటించిన సీస ద్విపద గీత పద్యములు కొంచెము మార్పులు చెందియు చెందకయు కూడ స్త్రీ బాల పామరాదులు పాడు పాటలలో పదాలలో కానవచ్చుచున్నవి." (శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి 'తెలుగు మెఱుగులు'). కాన జోలపాటకు మంజరీ ద్విపదను వాడుట ఔచితీ రుచిరము.

ఈ గ్రంథమునందలి కొన్ని పద్యములు శ్రీ నరసింహముగారి 'పూర్వ కవీశ్వర వాక్ప్రయోగదక్షత'ను విశదీకరించుచున్నవి.' 'ఏయే రీతుల వంశవర్ధనులునై' అను పద్యము, 'ఓ మునిలోక వంశ కలశోదధి పూర్ణశశాంక' అను సంబోధనము మనుచరిత్రానుసృతులు. 'సరివచ్చు ననవచ్చు శంపాలతికతోడ' అను పద్యము 'సరివచ్చు ననవచ్చు శతమన్యు వీటికి' అను శ్రీనాథుని పద్యమున కనుసరణము. ఈ పద్యమున శ్రీ కవిగారు వాడిన "సరివచ్చు ననవచ్చు, ఎనవచ్చు, ననవచ్చు, ప్రతివచ్చు ననవచ్చు'—అన్నవి శ్రీనాథుని నుండి గ్రహింపబడెను. 'దొరవచ్చు ననవచ్చు' అనుదానికి బదులు 'తులవచ్చు ననవచ్చు' అనునది స్వతంత్రముగా చేర్చబడెను.

ఇట్టి యనుసరణములను చూపుట అనావశ్యకమని కొందరు తలంతురు. కాని అది సరికాదు. వీటివలన ఆయా కవుల పూర్వ కవీశ్వర వాక్ప్రయోగ దక్షత, సముచిత పద ప్రయోగ నైపుణ్యము స్పష్టపడును. ఆయా రచనలకు తగిన వెలలనే కట్టుటకు వీలుపడును. స్వోపజ్ఞమైన రచనకు, తదనుసరణమునకు ఒకే విలువ నిచ్చుట పొసగదుగదా !

శ్రీ నరసింహముగారిది సహజముగా పురాణశైలి. కొన్నిచోట్ల వీరి పద్యములు ప్రబంధములలోని సుకుమార పద్యములను తలపించునట్లుండును. చిన్న చిన్న శబ్దాలంకారములతో ఈ క్రింది పద్యము చూడుడు ఎంత శిరీష కుసుమ పేశలముగా నున్నదో.

చ. లలిత వసంత నూతన విలాస సమంచిత పల్లవాగ్ర కో
మల సహకార వారముల మందసమీర సుగంధ బంధురో
జ్జ్వల కలకంఠగాన విలసత్కమనీయ నికుంజ పుంజ సం
కుల వనవాటి బోటి తనుఁ గూడి చరింపఁగ బ్రహ్మ
దత్తుఁడున్.

ఈ గ్రంథమును చదువు పాఠకులు ఒక విషయమును మాత్రము గమనింపవలెను. ఏమన ఈ గ్రంథము చాలావరకు ఆయా వంశ చరిత్రలతో నిండియున్నది. వంశచరిత్రలు జనాభా లెక్కల వంటివి. ఇవి కవితా వస్తువులు కావు. పోనీ, కొన్ని ఉపాఖ్యానము లున్నవి గదా ! అనుకొన్నచో అవి విభావాది సామగ్రీమంతములు కావు. రామాయణ కథను కట్టె—కొట్టె—తెచ్చె అని మూడు మాటలలో త్రెంచివేసినట్లున్నవి యీ

యుపాఖ్యానములు. కాన ఈ గ్రంథము నీరసముగా నుండుట తప్పనిసరి యైనది. యథామూలకముగా ఆ వంశ చరిత్రలు మున్నగునవి తెలుపబడెనని సంతృప్తి చెందవలసి యున్నది.

ఈ గ్రంథమున కొన్ని అనన్విత పద్యము లున్నవి. కొన్నింట వివక్షితార్థస్ఫూర్తి లోపించినది. "కాయిక వాచిక మానస, మాయాపాపంబులెల్ల"—కాయికములు, వాచికములు, మానసికములు అగు ఆయా పాపంబులెల్ల, అని వివక్షితార్థము, "యాఽభి ప్రత్యాహరే కామాన్ సర్వశోఽంగాని కూర్మవత్" (30—40) అను దానిని "కామ సుఖంబులఁ దవులక ...., వర్తింతురు, నీ మహిఁ గూర్మంబు భాతి" (199 పు) అని అనువదించిరి. కూర్మముతోడి సామ్యము ఈ అనువాదమున కుదురు పడలేదు. "అంగములు కూర్మ మెట్లు ప్రత్యాహరించు, నట్లు కామముఁ దమయందయడఁపఁజాలు, ధన్యచిత్తులు" అని ఎఱ్ఱన చక్కగా తెనిగించెను. (3—61) "జజ్ఞే యస్య ప్రసూతస్య దుందుభ్యః ప్రాణదన్ దివి; (34—18), 'ఆనకానాంచ సంహ్రాదః సుమహానభవద్దివి (34—19) అని మూలములో నుండగా "దుందుభి మ్రోవంగాఁ జేసిరి, ఆనక దుందుభి నామము, వా నొందెను" అని అనువదించిరి. దుందుభులను మాత్రమే మ్రోయించిన యెడల ఆనక దుందుభి యనఁ పేరెట్లు వచ్చును? వట్టి 'దుందుభి' అను పేరే రావలసి యుండునుకదా! "ఆనక దుందుభిధ్వనితమై కురిసెం గుసుమ ప్రవర్షమున్, దానవచేసి .... ఆనక దుందుభి స్ఫుట సమాఖ్య వహించె" (3.157) అని యెఱ్ఱన సరిగానే చెప్పియున్నాడు.

ఈ గ్రంథములో ఛందో వ్యాకరణాది దోషములు గోచరించుచున్నవి. విమర్శక ధర్మమును పురస్కరించుకొని వాటి నిట చూపుచున్నాను.

I గణభంగములు.

1. అనుభవింపు మమిత తేజ యత్యంతంబున్ (75 పు)
2. పుత్రశతముతోడ భూరిబలుఁడు తరలె (87 పు)
3. సీ. పులహవంశ జన్ము లలఘులు సుస్వాధ (121 పు)
4. లలిఁ బొంది నిశఠుపుత్రు లలితునిఁ గనియెన్. (239 పు)
5. భో, రన వచియించు శ్రీధరా! వనజాక్షా (346 పు)
6. సీ.ఆ యరిష్టదైత్యుఁడతులుఁడై ధేనువ(367పు)

ఇంకను మరికొన్ని యున్నవి. అవి ముద్రణ స్ఖాలిత్యము లని కానగును. (20 పు—1, 29—5, 70—2, 74—1, 81—3, 126—5, 287—2, 348—3, 350—4.)

II యతిభ్రంశములు.

1. అందు సుతులను గాంచె నరిష్టనేమి (32 పు)
2. పిదప దండసేనుడను వీరవర్యుండు (127 పు)
3. రీ, తిని గుర్తింతు వటంచు నే నెఱిఁగియుంటిన్. (152 పు)
4. దాన, వులను ప్రీతాత్ములై వేడుకొనఁగఁ జనిరి. (178 పు)
5. సురేదంతావళ దివ్య వాహనము తేజస్స్ఫూర్తి. (306 పు)
6. ఒకపరి కశ్యపుండు నను గూడి ఘనంబగు గోష్ఠి నుండఁగన్ (354 పు)
7. రంగంబున ననుచుఁ బలికినంత నతండున్(355పు)
8. దురితదూర సురాధిప నుత్యతోష (374 పు)
9. రో, దొంతరమెల్లఁ జల్లఁదన మొందె (256 పు)
10. సం, తతి కౌరవ్యులు పాండవుల్గలిగి యన్యోన్యంబు రాజ్యార్థులై (357)
11. వచ్చుచుం, డిన గతి కేమి కారణము దివ్యరుచుల్ విలసిల్లెనంచు (257)
12. క్షితిరంబున మృగస్త్రీతిని రూపొంది సరగ చక్రాంగ ముల్ జని వహియించి (151)
13. ధ్యానించి పరమాత్ము నర్చించి భక్తిఁ దనరుచు నమృతిగల్గి తనువుల వీడి (151)

తుది రెండు తరువోజ పాదములలో యతి నియతిభ్రష్ట మయినది. "194పు—1, 2; 213 పు—1; 322 పు—3"— పద్యములలోని యతిభంగములు ముద్రణ స్ఖాలిత్యములు కావచ్చును.

III వ్యాకరణ దోషములు.

'ప్రజ్ఞాయామోదములు (73 పు)—పితాఖ్య, (113 పు)— దేవవంతోపదేవ— (252పు) —అంగిర సోగయులు, (20)—అంగి రసోగోత్రుడు (38 పు)— తేజోవంతులు (19 పు)— తపోవంతులు (27 పు) పునఃయోజించి (27 పు)—భర్త్స్వనాగమము (175 పు)—షవికాక హాక్య మధ్యమున చేయబడిన విసంధి దోషములును గలవు. గజడదబాదేశాది గ్రాంధికభాషా నియమములు సరిగా పాటింపబడలేదు. సర్వసురలు —(154 ము.) భాస్వంత సౌధాగ్రము (219) మిత్రవరుణులు (77) కృష్ణవర్మ్మ హృషికేశ కీర్తితుండు (309) మున్నగు సమాస గత దోషము లున్నవి. 'శ్వపాకర శ్శిరోగ్ర (154)— శీర్షశ్శోభిత (224)—అనుచో అకారాంత శబ ములు సకా

రాంతములను భ్రాంతితో ప్రయోగింప బడినవి. జాగ్రత (340) శోంభానము (267, 269, 312 పు: శ. ర. ఈ శబ్దమును చూపుట ప్రామాదికము.)—మరువమి—బలురు—బలశాలురు—అశ్వినులు మున్నగు అపశబ్దములు గలవు. సంస్కృత సంబోధనాదు లనుచితముగా వాడబడినవి. "హేలోకవంద్య (225) ప్రభో (273) పునరపి జన్మంబు (279) మొదలైనవి. కొన్ని చోట్ల 'విభక్తి ప్రత్యయములు వ్యత్యస్తముగా వాడబడినవి. (50—4, 108—6, 357—2)

శ్రీ నరసింహముగారు ఛందో వ్యాకరణాది విషయము లందు తగు శ్రద్ధ తీసుకొని ఉత్తర భాగమును త్వరలో రచించి ప్రకటింతురని ఆకాంక్ష.

—ఆర్. కె.

చిన్నయసూరి జీవితము

హిందూధర్మశాస్త్ర సంగ్రహము

ఆవిష్కర్త:—శ్రీ నిడదవోలు వేంకటరావు, పుటలు—103+136. వెల: 3 రూపాయలు. పబ్లిషర్: నిడదవోలు వేంకటరావు, 81-కార్నేశ్వర్ కోయిల్ స్ట్రీట్; మైలాపూరు—మద్రాసు—4.)

19 వ శతాబ్దియందలి యాంధ్ర పండిత లోకమున శ్రీ పరవస్తు చిన్నయసూరిగా రగ్రగణ్యులు. నీతిచంద్రికా బాల వ్యాకరణముల ద్వారమున వీ రాంధ్ర పాఠక లోకమునకు సుపరిచితులు.

వీరి జీవితాంశములను గొన్నింటిని అభిజ్ఞుల ద్వారమున సంపాదించి, యాంధ్ర సాహిత్య పరిషత్కార్యాలయమువారు తమ పత్రికలో (10, 20 సంపుటములు) ప్రకటించియుండిరి. అవి సూరిగారి బాల్యము, విద్యాభ్యాసము, ఉద్యోగము మున్నగు విషయములను క్లుప్తముగా నావిష్కరించుచున్నవి.

తరువాత మరికొందరు సూరిగారి బాలవ్యాకరణము నందలి యంశములనుగూర్చి వివిధములగు వ్యాసములు వ్రాయుచు, ఆ పండితుని వ్యాకరణ రచనా విశేషములనుగూర్చి చర్చించుచు వచ్చిరి.

వీనినన్నిటిని సేకరించి ఇటీవల శ్రీ నిడదవోలు వేంకటరావుగారు సూరి జీవితమునకు సంబంధించిన యనేక నూతనాంశములు చేర్చి, "శ్రీ పరవస్తు చిన్నయసూరి జీవితము" అను నొక చిన్న గ్రంథమును 1953 లో ప్రకటించియుండిరి.

అది సూరి జననము, విద్యాభ్యాసము, పాండిత్య ప్రకర్ష, ఉద్యోగ ప్రయత్నములు, పచ్చయప్ప కళాశాలా పండితపదవి, రాజధానీ కళాశాలా ప్రవేశము, వచన రచన, వ్యాకరణ రచన, బాల వ్యాకరణము, చిన్నయసూరి నిఘంటువు, కృత్యంతరములు, పద్యరచన, సాహిత్య విద్యా ప్రచారము, శిష్యవర్గము అను శీర్షికలు గలిగి సూరిగారికి సంబంధించిన యనేకములగు నపూర్వ విషయము లను వివరింపజాలియున్నది.

చిన్నయసూరినిగూర్చియు, నాతని పాండితీ ప్రతిభాదుల రీతినిగూర్చియు, విపులముగను విశదముగను దెలియఁగోరువారికీ గ్రంథము మిక్కిలి యుపయోగింపఁగలదు.

ఈ విషయమున ఇన్ని విశేషాంశములు క్రోడీకరింపబడిన గ్రంథాంతరము కానరాదు.

సూరిగారు నీతిచంద్రికనేగాక, హిందూ ధర్మశాస్త్ర సంగ్రహమును గూడ వచనములో రచించినటులు ప్రతీతి గలదు. కాని యా గ్రంథ మాంధ్రదేశమున నెచ్చటను లభింపకుండెను.

దీనికయి శ్రీ వేంకటరావుగారు వెదకి వెదకి మన దేశమున జాడ గానక, తుదికి లండను బ్రిటిషు మ్యూజియమున దాని యునికి గుర్తించి, అసాధారణమగు నాసక్తితో వ్యయ ప్రయాసములు గణింపక, దాని ప్రథమ ముద్రణ ప్రతిబింబము (Photostat copy) తీయించి, తెప్పించి, దానినిగూడ సూరి జీవితముతో గలిపి ప్రకటించుట యందరము నభినందింపఁదగిన యంశము.

ఇంతవరకు నీతిచంద్రికదప్ప, నితరమును సూరి వచన రచనము నెరుంగని యాంధ్ర పాఠక లోకమున కిది మరియొక పాఠ్యమయి యానందము గొలుపఁగలదు.

థామస్ లుమిసిడన్ స్ట్రేంజి దొరగారు ('A Manual of Hindu Law') అను గ్రంథమును ఆంగ్లమున రచించెను. సూరిగారి 'హిందూ ధర్మ శాస్త్ర సంగ్రహము'పయి దానికి ననువాదము.

ఇందు శాస్త్రముల యుత్పత్తిక్రమము, వివాహము, పుత్రస్వీకారము, రక్షకత్వము, సొమ్ము, వినియోగము, ఉయిళ్ళు, సొమ్ములోఁ జేయవలసిన్య వ్యయములు, దాయానర్హత, దాయ భాగము, దాయాధికారము, బంగాళశాస్త్ర సంప్రదాయము, మళయాళ దేశశాస్త్రము, క్రయ విక్రయాది వ్యవహారము అను పదునాలుగు ప్రకరణములు గలవు. ప్రతి ప్రకరణమందును ఉపశీర్షికలతో వివిధ విషయములు సూత్రప్రాయముగా నుగ్గడింపబడినవి.

శాస్త్రీయ విషయములను, కేవల వ్యావహారిక భాషలో నిర్దుష్టముగఁ జెప్పవలనుపడదను తలంపుతో సూరి దీనిని సులభమగు గ్రాంథిక భాషలోనే వ్రాసి, శాస్త్రీయ సాంకేతికములకు వివరణము వ్రాయుచు బోధన సౌకర్యము కలిగించుట ప్రశంసనీయము.

ఆంగ్లేయ భాషలోని గ్రంథమును ఆంధ్రమున ననువదింప మొదలిడినవారిలో సూరి ప్రథముడని చెప్పవచ్చును.

రాజకీయముగా స్వాతంత్ర్యమునొందిన మన దేశమున ప్రభుత్వ వ్యవహారములెల్ల నాంధ్రభాషలోనే సాగించుకొనవలయు

వము ఈనాటి మన యాశయమును సూరి నూరేండ్లకుముందే గుర్తించి, ఆంగ్లమునుండి యాంధ్రమునకు ననువాద పథకము నారంభించిన దీర్ఘదర్శి.

ఈ గ్రంథమున నుగ్గడింపఁబడిన విచారణ రీతులు, తీర్పుల పద్ధతులును, ఈనాటికి జాలభాగము ప్రాతవడియుండ వచ్చును. ఇప్పటి వ్యవహారరీతులకు నవి యుపకరింపకపోవచ్చును. కాని, యనువాదరీతికి నాదర్శముగను, పురాతన సంప్రదాయము లకు ప్రబోధకముగను ఈ గ్రంథము మెప్పులందక తప్పదు.

సూరిగారి యద్వితీయ వచన రచనలో ద్వితీయమగు యీ గ్రంథమును విద్వల్లోక మాదరించుఁగాక.

మూడు నాటికలు

(రచన:—రెండు చింతల లక్ష్మీనరసింహశాస్త్రి, ప్రచురణ : కళాకల్లోలిని గ్రంథమాల, గొల్లపల్లి; కృష్ణాజిల్లా. క్రౌను 1/8 సైజున 84 పుటలు. వెల: రూపాయన్నర.)

ఇది మూడు నాటికల సంపుటము. మూడు నాటికల లోను మొదటిది కొంచెము పెద్దది—48 పుటలు ఆక్రమించు కున్నది. అది కాశ్మీరరాజ్ఞి 'డిద్ద' చేసిన రాజతంత్రమువలన ఆ రాజ్యమునెట్లు చేజిక్కించుకొన్నదియు చిత్రించు కథ. ఈ నాటికలో 22 రు పురుషపాత్రలు, 4 గురు స్త్రీపాత్రలు. కథాకల్పనకొరకుతప్ప, రంగస్థల ప్రదర్శనమున కుద్దేశించి నట్లు తోచదు. నాలుగు అంకములు, 15 రంగములు,మధ్య మధ్య పాటలు, స్వగతములు, తెరలో కలకలములుపెట్టి సంస్కృత నాటక పద్ధతిని రచించినట్లు తోచుచున్నది. ఇన్ని పాత్రలచే ఇన్ని రంగములలో ఇన్ని తంత్రములుగల కథను నడపుటచేత అంత స్పష్టముగా తెలియునట్లు లేదు—ఇంక రెండవ నాటిక వేములవాడ భీమకవి బాల్యమునుగూర్చిన ఏకాంక నాటిక. అయిదు దృశ్యములు. భీమకవిని తండ్రిలేని పిల్లవాడని హేళన చేయుట, పంక్తిబాహ్యుని చేయుట, సంతర్పణలో ఆతనిని రానీయనందున ఆతనిమాటచేత అన్నము సున్నముగుట, అప్పాలు కప్పలగుట వర్ణితమైనవి. ఇట్టివి రంగస్థలముపైన చూపుటకు వీలున్నదియును, లేనిదియును గమనించకయే—కొన్ని విచిత్ర సంఘటనలీ నాటకములో దృశ్యమానములుగా చిత్రించినారు. భీమన్నతల్లితో కూడ ఏడుగురు పాత్రలుగల ఈ చిన్న నాటిక కూడ ప్రదర్శనకు అంత అనువుగా లేదు. ఇంక మూడవది, 'వెండిదీపాలు'—అయిదు పాత్రలుకల చిన్న నాటిక. ఇది రంగస్థలముపైన ప్రదర్శించుటకు వీలుగా నున్నది. అయితే రెండు స్త్రీ పాత్రలు కూడా లేకపోలేదు. రాముడు అనే ఖైదీ విడుదలపొందిరాగా, ఆతనికి నిత్యానంద స్వామి ఒక రాత్రికి ఆశ్రయమిచ్చెను. ఆతడు అలవాటు ప్రకారము అక్కడ ఉంచిన వెండికుందెలను అపహరించును. అది చూచి స్వామిజీ తానే స్వయముగా వానిని నేరగానికి బహుమతిగా ఇచ్చును. దీనితో నేరస్థుని మనస్సులో పరివర్తనము కలుగును. ఈ నాటిక సుప్రసిద్ధమైన 'బిషప్స్‌కేండిల్‌స్టిక్స్' అనే ఆంగ్లనాటికకు అనుసరణ. ఆ సంగతి గ్రంథకర్త చెప్పుకొనవలసినది. దీనిని తెనుగు వాతావరణములో తెచ్చుటకు ఎంత ప్రయత్నించినను— కొన్నిచోట్ల గ్రంథ చౌర్యము తెలిసిపోవుచున్నది. 'బిడ్డా! ఈ కుటీరానికి వెనుక వైపునఉన్న అడవుల్లోంచి పారిస్‌కు దారిఉంది.' స్వామిజీ అన్న మాటలలో బిషప్ పలుకుచున్నాడు.

భాష—కొంత గ్రాంథికముగాను, కొంత వ్యావహారిక శైలిలోను నడచి ఎగుడు దిగుడుగా నున్నది. 'దుర్నడతలు' వంటి ప్రయోగములు అచ్చటచ్చట కన్పించుచున్నవి. ఈ మూడు నాటికలు ప్రదర్శనకంటె పఠించుటకు యోగ్యమైనవని చెప్ప వచ్చును.

ఉదయించని ఉదయాలు

వచన గీతికల కవితా సంపుటి: రచన: కేశవరావ్, ప్రచురణ: అనిలా ప్రచురణలు, హైదరాబాద్. డెమ్మీ 1/8 సైజున 96 పుటలు, వెల: రెండు రూపాయ.

వచనగీతికారంగములో నూతనంగా ప్రవేశించిన ఈ రచయిత నూతన కవి సమయాలతో వినూతనంగా వినిపిస్తున్నాడు. 'ఒప్పో, తప్పో, ఇది నా మెప్పు' అని పరిచయం వ్రాసిన 'ఆరుద్ర'-'కవిత్వం' లిక్విడ్ లాంటిది. ఏ ఆకారంగల సీసాలోనైనా దాన్ని పొయ్యెచ్చు. కేశవరావ్‌గారు నిర్భయంగా వచన పద్యాల్లో విరహం గురించి కూడ పాడినందుకు వారిని మెచ్చుకుంటున్నాను' అన్నారు.

ఛందో బందోబస్తులు త్రెంచివేస్తే ఆకలికేకలువేసే అభ్యుదయ కవిత్వంమాత్రం వస్తుందని కొందరి అపోహ. ఈ కవి అలాగ కాకుండగా, ప్రకృతిని గురించి పరవశ గీతికలు పాడాడు. ప్రణయంలో తన్మయం పొందాడు. ఈ రకం కవుల లాగ ఇంగ్లీషు మాటలతో గారడీ చేయకుండా తెనుగు మాటల తోనే జిలుగు వెలుగుల చిలికించడం ఈ నవ కవిలో మరో విశేషం. ఇతడు ఆశావాది. విశిలోంచి నిజంలోకి పోతాడు. ప్రతి హృదయంలో ఇంద్ర ధనుస్సుల్ని వెలిగించి—

"మనిషిలోని మరికొన్ని కొత్త గోళాలలోకి
వెలుగు సందేశాలు ముక్కున కరుచుకుపోతున్నాయి
నేటిమనిషి ఆలోచనల పావురాళ్ళు" అంటాడు.

భావరుగ్మతలేని ఈ ఆరోగ్యవంతుని ఆలోచనలు చదువరులకి ఆహ్లాదం కలిగిస్తాయి. "జీవితాన్ని నిర్వచించకు—దోసిట్నిండా నింపబడిన ఈ జీవితాన్ని గటగటా తాగనియ్యి" అంటూ జీవితానికి అవతలిఒడ్డున మన రక్తంలో రేపటి సూర్యుడు ఉదయిస్తున్నాడు చూడు—అని ఉదయించని ఉదయాలు చూస్తాడు. జ్ఞాపకం పెట్టుకోదగిన నవకవి కేశవరావ్.

—దువ్వూరి వెంకటరమణశాస్త్రి

లేఖలు

"శరణార్థిచేయు" శబ్దపల్లవమా?

"భారతి" సంపాదకులకు :

అయ్యా,

శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు "ఆగష్టు" నెలలోఁ బ్రకటితమైన నా లేఖను చూచి, దానికి సమాధానముగా నొక లేఖను "అక్టోబరు" భారతిలోఁ బ్రకటించినారు. జూలై భారతిలో శ్రీ శాస్త్రిగారు వ్రాసిన వ్రాత లేవియో ముందే వివరించియున్నారు. దాని నిట నుదహరించుచున్నాను. "అర్థిం జేసి" అనుట సరికాదు. "అర్థిసేయు" అని క్రియ. ఇట్లు వ్రాసియుండుటచేతనే "శరణ" పదముతో సమసించదని నే వ్రాయుట జరిగినది. ఇప్పటి వ్రాతయే శ్రీ శాస్త్రిగా రప్పుడు వ్రాసియున్న నా యీ లేఖల ప్రసక్తియే యుండెడిది కాదేమో!

ఇది ఇట్లుండ శ్రీ పిచ్చయ్యశాస్త్రిగా రీసారి తమ లేఖలో "శరణార్థిచేయు" అనునది శబ్దపల్లవమని మరియొక క్రొత్త యెత్తు నెత్తినారు. శబ్దపల్లవముల తీరుతెన్నులను గూర్చియు, వాని పూర్వ ప్రయోగములఁ గూర్చియు, బోధ పరచుకొనుటలో నా బుద్ధి మాంద్యమును గూర్చి బహుధా విలిఖించినారు. ఈ క్రింది మాటలు నేను వారి కొరకు గాకున్నను, లోకము కొరకైనను, వ్రాయు టవసరమని తోఁచుచున్నది. "క్రియాః ప్రసిద్ధాః బహవశ్శబ్ద పల్లవ సంజ్ఞికాః" అను మూలమును చిన్నయసూరి "ధాత్వాదులకు ధాతువు లను ప్రయుక్తంబులై విలక్షణార్థాభిధాయకంబులగు నీయవి శబ్ద పల్లవంబులు నాఁబడు" నని సూత్రీకరించినాఁడు. కూరుచుండు, ఆఁకొను, విజయంచేయు, వంటి వాని నుదాహరించినాడు. ఈ యన్నింటను, ధాతువునకు, ధాతువుగాని, విశేష్యమునకు ధాతువుగాని, రెండును వ్యస్త పదములుగ నుండియే యనుప్రయుక్తంబు లగుటచే "శబ్ద పల్లవంబుల" గుట తటస్థించినది. కాని శ్రీ శాస్త్రిగారు నుడివినట్లు "శరణ+అర్థి+చేయు" అందలి "శరణ+అర్థి" అను రెండు పదములు గలసిన విశేష్యముఁ బూర్వ పదముగాఁ గలిగినట్టి దానిని గూడ శబ్దపల్లవ మనవచ్చునని యింతదనుక నెవ్వరికినిఁ దెలియని రహస్యముగాబోలు! ఆంధ్ర వైయాకరణులలోఁ బ్రామాణికులుగ నెంచఁబడుచున్న వారిలో చిన్నయసూరి ప్రౌఢ వ్యాకర్తలు, ముఖ్యులు.

వా రిర్వురు శబ్ద పల్లవమును గూర్చి వివరించుటలో నిట్టి లక్షణమును దెలుపలేదు. తాము తొలుత వ్రాసిన వ్రాతను సమర్థించుకొనుటకు, శ్రీ శాస్త్రిగారు త్రొక్కిన క్రొత్త పుంత ఇది. "శరణార్థి చేయు" శబ్దపల్లవ మనియు, నందు "శరణార్థి" యను విశేష్యమునకు "చేయు" యను క్రియ యనుప్రయుక్తమైనదనియు, వట్లగుట శబ్ద పల్లవ లక్షణమనియు సిద్ధాంతీకరించుట శ్రీ శాస్త్రిగారి సాహసమో! నా యజ్ఞతయో! పాఠకులే యూహించుకొందురుగాక! "శరణార్థిచేయు" యను దానిలో "అర్థిచేయు" అనునదియే శబ్ద పల్లవ మగును. అనగా "అర్థించు" అని యర్థము. ఇదే యర్థమున "అర్థిసేయు" అను దానిని శబ్ద పల్లవముగా "కోరు" నను నర్థముతో నన్నెచోడుఁడు కుమారసంభవమున "తపముసేయ నర్థి సేయకు మొండేమి యైనఁ జేయు" (7 ఆ. 891 ప. కు) అను పద్యమున వ్రాసి యుండినాఁడు. ఇట్టి పూర్వ కవుల ప్రయోగముల నైపాకసారి దృష్టి సారించిన శ్రీ శాస్త్రిగారికిఁ గూడ నీ విషయ మర్థము గాకపోదు.

దీనినిబట్టి "అర్థిచేసి" యనునది మాత్రమే శబ్ద పల్లవ మగును గాని "శరణార్థిచేసి" యనునది శబ్ద పల్లవము గాదని తేటతెల్లము. అది శబ్దపల్లవము కాదు గనుకనే "శరణార్థిఁజేసి"—శరణమును గోరి (శరణముయొక్క అర్థిని జేసి) అను నర్థము పొసగును. అర్థినిఁజేసి యనునప్పు డర్థానుస్వార ముండుట యుచితమే గదా! "శరణార్థి యొనర్చి" యను చోటను "శరణార్థి నొనర్చి" యనుకొనవచ్చును. ఈ "డొంకతిరుగుళ్లు" అవసరమే యుండదు.

—ఎస్. టి. పి. వి. రామానుజాచార్యులు

"భారతి" సంపాదకులకు:

అయ్యా,

1962 అక్టోబరు "భారతి" లో పై శీర్షిక క్రింద "శరణార్థి చేసి" పదప్రయోగము యొక్క విమర్శన చదివితిని. అందు పూజ్యులు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు శరణార్థిచేసి—శరణుకోరి—అని యర్థమగును అని వ్రాసినారు. కాని కర్ణాటక దేశములో కొన్ని ప్రాంతములలో "శరణార్థి" అంటే "నమస్కారము" అని వ్యావహారికముగా అర్థము కలదు. కనుక "శరణార్థి" అనునది బహుశా కన్నడ పదము కావచ్చును.

కర్ణాటక దేశములో సమానులను కాని, తమకంటె గొప్పవారిని కాని కలిసికొనినప్పుడు "శరణార్థి" అని అంటారు. ఇది వ్యవహార ప్రసిద్ధము.

"శరణార్థి — నమస్కారము.
"శరణార్థిరి" — నమస్కారమండీ.
"శరణార్థి ధణి" — గొప్పవారికి నమస్కారము.
"శరణార్థిగౌడ" — రెడ్డిగారికి నమస్కారము.

"శరణార్థి" అను పదము పై విధముగా వ్యవహారములో వాడుతారు. కనుక పద్యములో పేర్కొనినట్లు "భక్తిన్ శరణార్థిం జేసి" అన్నగా వేశ్యలు భక్తిపురస్కరంగా ఆ దొంగ జంగములకు నమస్కరించిరి. అని అర్థమగుచున్నది. ఇది సందర్భోచితముగా కూడ కలదు.

శ్రీ శాస్త్రిగారు ఉదహరించిన ధూర్జటి పద్యములో కూడ "భక్తిపూర్వక మతిన్ శరణార్థి యొనర్చి" అని యున్నది. అచ్చట కూడ భక్తిపూర్వకముగా నమస్కారము యొనర్చి అని అర్థము చేసికొనిన సందర్భోచితముగా నుండును.

పై విషయమై పెద్దలు కర్నాటక పండితులను సంప్రదించి వివరంగా వ్రాయుదురని ఆశిస్తాను.

—విర్జాల చంద్రశేఖరయ్య.

కాకతీయులు వేల్పుకొండవారా?

అయ్యా!

అన్న నా (ఆగస్టు భారతి) వ్యాసాన్ని విమర్శిస్తూ కె. హెచ్. వి. శర్మగారు నవంబరు భారతిలో వ్రాసినవ్యాసము పూర్తిగా చదివేను, మళ్లీ చదివేను. వస్తుతుగాని ధోరణిగాని జవాబునకు అర్హమైనదిగా తోచలేదు. వ్రాయను. కావలసినవారికి నా వ్యాసమూ వారివ్యాసమూ చక్కగా చదవండి అని మనవి.

—శ్రీపాద గోపాలకృష్ణమూర్తి.

(ఇంతటితో యీ విషయము పై చర్చను విరమిస్తున్నాము—సం. భా.)

విజయవాడ కల్పితము!
విజయవాటి(క)—(రాయలు)

"భారతి" సంపాదకులకు:

అయ్యా,

అద్దంకి శాసన తరువోజలోకూడ 'బెజవాడ' వేంగి నాటి రాజధానిగా పోల్చబడినది.

— వేంగి నాణ్టెం గొఱ్ఱిల్లియ
త్రిభువనాంకుశ బాణనిల్పి, కట్టేపు దుర్గ కొంబుగడు
బయల్పే సి కణ్డుకుబ్బెన్ బెజవాడ
గాలిక్షేప మెచ్చి,
పణ్డరంగు పరను మహేశ్వరుణ్డు.....'

క్రీ. శ. 9 శతాబ్దమునాటి గుణగ విజయాదిత్యుని సేనాని విజయము: కందుకూరును మెచ్చి బెజవాడవలె రాజధానిని కావించె ననుట పాతపోలిక చరిత్ర.

దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డి.

"భారతి" సంపాదకులకు:

అయ్యా!

ఆంధ్రమున శాసన పరిభాషలోను బెజవాడ నామమే కన్పట్టుచున్నది.

"వరగంగ బెజవాడ కొమరుసామికి భక్తుడై గుడియు
నిరుపమమతి నృపధాము డెత్తిచ్చె"—
—యుద్ధమల్లుని బెజవాడ శాసనము.

"స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహనశక వరుషంబుల్ 1382 అగునేంటి విక్రృతి సంవత్సర శ్రావణ శు 11 రఘువంశం రాజ బెజవాడ పాడి గడించిన"—తమ్మ భూపాలుని శాసనము.

"స్వస్తి శ్రీ జయాభ్యుదయ శాలివాహన శక వర్షంబులు 1440 అగు నేటి బహుధాన్య సంవత్సర వైశాఖ శు 15 .... బెజవాడ దుర్గానరప్రసాదులైన."—సింగయ శాసనము.

"ఇది శ్రీ మదంధ్ర కవితా పితామహ సర్వమాన్యంగాను కృష్ణాతీర మందునను, బెజవాడ మల్లికార్జున దేవుని సన్నిధిని"
—కోకట గ్రామాగ్రహార శాసనము.

ఇత్యాదులు.

మీదు మిక్కిలి కవి ప్రయోగములందును బెజవాడ నామమే కలదు.

"పేదబాలునకుగా ప్రియసతి మోహంబు
పట్టక బెజవాడ పాడి నిలిపి."
(నాసికేతూపాఖ్యానము).

మీ తాత గురియించె మెరసి మాధవ వర్మ
గరిమచే బెజవాడ కనకవృష్టి."
(రణరంగ విజయము).

ఈవిధముగ బెజవాడకే ప్రాచుర్యము కన్పించుచున్నను 'వేల్పు లెవ్వరు నీ సాటి విజయవాటి మల్లికార్జున లింగయుమా ప్రసంగ" యని బొడ్డపాటి పేరయ మల్లికార్జున లిం

శతకమున విజయవాటి శబ్దము కన్పట్టుచున్నది. కాని యీ గ్రంథ మిపుడు వ్యగ్యము, రామాప్రగడ జగ్గకవి సేకరించిన ప్రబంధ రత్నాకరమున నిది యుదహరింపఁబడినది కాన 1560కి పూర్వమని చెప్ప నొప్పును. కాని అట్టి ప్రయోగము లరుదు. కావున బెజవాడకే ప్రాధాన్యము కలదని చెప్పవచ్చును.

— ఎమ్. వి. రమణరావు

అర్జునుని శరీరవర్ణం

"భారతి" సంపాదకులకు:

అయ్యా,

అర్జునుడు అంటే తెల్లనివాడనిఅర్థము. కాని అర్జునుడు నల్లనివాడు. నల్లనివాళ్లకు, తెల్లనివాడని అర్థమువచ్చే పేరులుంటాయి. కురూపులకు సుందరయ్య, సుందరమ్మ అనిఉన్నట్లు. ఎఱ్ఱగా ఉన్నవారికి, కృష్ణమూర్తి, కృష్ణవేణి అని ఉన్నట్లు.

చిక్కు ఎక్కడ వస్తున్నదంటే నేను అవదాత వర్ణము కలవాడిని కాబట్టి అర్జునుడు అన్నపేరు వచ్చిందిదని తిక్కనగారి అర్జునుడు ఉత్తరునితో అనటంవల్ల. కాని ఇతరులంతా—'చివరికి ద్రౌపదికూడా అర్జునుణ్ణి నల్లనివాడనే అన్నది. "గాండీవమను నొకవిల్లెపుడును వహించు కఱ్ఱిక్రమంబుఁ గాల్పనే.

(ఉద్యోగపర్వము. తృతీయాశ్వాసము.)

అంతేకాదు ఆశ్రమవాసంలో ఉన్న ధృతరాష్ట్రుని, పాండవులు, ఇతర బంధువర్గం చూడటానికి వస్తారు. వారందరు అక్కడ ఉండగా మునులు చూడటానికి వెళుతారు. అపుడు మునులను "సవినయ ప్రమాణంబుల ప్రీతులంజేసి, పాండవు లలరు మొగంబులతో, ధృతరాష్ట్రుని బరివేష్టించి యుండిరి. వనితాజనంబులు నొక్కవలన నిలిచి రుచితాసనంబుల నున్న యమ్మునులు, సంజయు నాలోకించి ధృతరాష్ట్ర బంధుజనంబుల నందరు వేరువేరనేర్పడ, నాకెఱింగింపవే యని యడిగిన నతండువారల కిట్లనియె.

జాంబూన దచ్ఛాయ చందంబు వర్ణంబుఁ
గలిగిన పలుచని గనవమేను
నుచిత దీర్ఘత్వస మున్నతఘ్రాణంబు,
నిడుదలైన విశాల నేత్రములును
గంఠీరవంబురే ఖయునొప్ప జాడ్కికి
నెంతయు వ్రేఁగైన యితఁడుధర్మ
తనయుఁ డెఱ్ఱదనంబుఁ దనరినమూఁపులు
నాయతస్ఫీతంబు లైనబాహు
వులును వెడఁదయురంబునై పొలుచునితఁడు
భీముఁ డుజ్జ్వలసుందర శ్యామతనువు
వారణింద్రుకైవడియును వారిజముల
యట్టికనుదోయిఁ గలయితం డర్జునుండు.

(ఆశ్రమవాస పర్వము ద్వి. ఆశ్వాసము)

'శ్యామతనువు' వాడు 'అర్జునుఁడు' అన్నాడు.

మరి అర్జునుఁడు, తను తెల్లవాడినని ఎందుకు చెప్పుకున్నాడో! అవదాత వర్ణమంటే నలుపుఅని అర్థంకూడా ఉన్నదా ? పండితులు పరిశోధించాలి. కాకపోతే ఒకస్థితిలో నలుపుకు తెలుపుకు భేదం లేదేమో?

అసలు అతనికి అర్జునుఁడని నామకరణం ఎలాజరిగింది, నన్నయగారి భారతంలో నిలా వివరింపబడినది. అతను పుట్టినపుడు, "వీడు కార్తవీర్యుకంటెను వీరుడగుట నర్జున నామ మీతండ యొసరదాల్పు." అని దివ్యవాణి గగనవీధినుండి వినబడింది. (ఆది. పం. ఆశ్వాసము) కాబట్టి అతనిరంగుకు పేరుకు సంబంధంలేదు. రెండూవేరు. రెంటికిముడిపెట్టి చర్చించడం వృథాశ్రమ.

—ఒక పాఠకుడు]

Printed & Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna, at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras—1. Editor: S. Sambhu Prasad.